
AL ISLAM (Telugu)

# ఇస్లామ్ దర్శిని



మౌలానా వహీదుద్దీన్ ఖాన్

మక్తబా అల్ - రిసాలా, న్యూఢిల్లీ

**AL ISLAM**
**(Telugu)**

# ఇస్లామ్ దర్శిని

మౌలానా వహీదుద్దీన్ ఖాన్

మక్తబా అల్ - రిసాలా, న్యూ ఢిల్లీ

**AL ISLAM**

(Telugu)

**ఇస్లామ్ దర్శిని**

No prior permission is required from the
publisher for translation of this book and
publication of its translation into any language

First Edition : 2022
1, Nizamuddin West Market
New Delhi - 110 013
email : info@goodwordbooks.com
printed in India
Published by :
**Goodword Books**
Hyder Manzil, G. Floor,
H.No.12-2-717/1/31/8,
Sapthagiri Colony,
Pillar No.84, Mehdipatnam,
Hyderabad - 500 028
Ph :+91-7032641415, 9246294664
E-mail : hyd.goodword@gmail.com
**Contact : 9394003049, 9573522690**
see our complete catalogue at
Web : www.goodwordbooks.com

# విషయసూచిక


| | | |
|---|---|---|
| **ముందుమాట** | **.......** | **05** |
| **దీన్ వాస్తవికత** | **.......** | **09** |
| ఆరాధన (దాస్యం) | ....... | 09 |
| ఇబాదత్ వాంఛించేది | ....... | 15 |
| సత్యసాక్ష్యం | ....... | 22 |
| **నాలుగు మూలస్తంభాలు (అర్కానె అరబా)** | **.......** | **31** |
| రోజా | ....... | 32 |
| నమాజ్ | ....... | 38 |
| జకాత్ | ....... | 46 |
| హజ్జ్ | ....... | 56 |
| **రుజుమార్గం** | **.......** | **67** |
| ఏది రుజుమార్గం? | ....... | 67 |
| వ్యక్తిగత రుజుమార్గం | ....... | 71 |
| సామూహిక రుజుమార్గం | ....... | 77 |
| సహాయానికి నోచుకునే సూత్రం | ....... | 84 |
| **ఇస్లామ్ పరిచయ విధానం** | **.......** | **89** |
| దీన్ – షరీఅత్‌ల మధ్యన గల వ్యత్యాసం | ....... | 91 |
| దీన్‌ను (ధర్మాన్ని) పరిపూర్ణం చేయటమంటే ఏమిటి? | ....... | 96 |
| అమీర్ హమ్దానీ ఉపమానం | ....... | 97 |
| కశ్మీర్‌లో ఇస్లామ్ | ....... | 99 |
| సారాంశం | ....... | 101 |
| **ప్రవక్త (స) చరితము : ఒక ఉద్యమంగా** | **.......** | **104** |
| సందేశ భాష | ....... | 111 |
| అరబ్బుల ప్రతిభ | ....... | 113 |
| సందేశం సర్వతోముఖం | ....... | 117 |
| సందేశ ప్రయోజనాలు | ....... | 121 |
| సందేశ ప్రతిక్రియ | ....... | 125 |

| | | |
|---|---|---|
| తెగ నుండి బహిష్కరణ | ....... | 132 |
| హిజ్రత్ (వలస) | ....... | 138 |
| ఇస్లామ్ విజయం | ....... | 144 |
| **నేటి ఇస్లామీయ ఉద్యమాలు** | **.......** | **153** |
| ఆరంభ స్థానం | ....... | 154 |
| పంథా | ....... | 158 |
| వినూత్న విషయం | ....... | 160 |
| **మిల్లత్ నిర్మాణం** | **.......** | **167** |
| **అల్లాహ్ వైపునకు పిలుపు** | **.......** | **178** |
| సందేశకార్యం ప్రాముఖ్యత | ....... | 178 |
| సందేశ విషయం | ....... | 184 |
| ఇస్లామీయ కేంద్రం | ....... | 189 |
| **సరికొత్త అవకాశాలు** | **.......** | **205** |
| **చివరి మాట** | **.......** | **217** |

*అపార కరుణామయుడు పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో*

# ముందు మాట

దక్షిణాఫ్రికాకు చెందిన నవలా రచయిత వోలియో షీనర్ (1855 – 1920), 'ఒక ఆఫ్రికన్ ఫారమ్ కథ' అనే పుస్తకం వ్రాశాడు.

Story of an African Farm

అందులో ఆగంతకుడైన బాటసారి ఒక రైతు బిడ్డకు ఒక వేటగాడి కథను వినిపిస్తాడు – ఆ వేటగాడు సత్యమనే అందమైన పిచ్చుక అన్వేషణలో ఉంటాడు. ఆ దృశ్యాన్ని అతను ఒక సెలయేరు ప్రక్కన చూచాయగా దర్శిస్తాడు. అతను తన భావాలు భావనల పంజరంలో ఆ పిచ్చుకను పట్టుకోవాలనుకున్నాడు. కాని సత్యాన్ని సత్యం ద్వారానే పొందగలనని అతనికి అర్ధమయింది. అంతే, అతను మూఢనమ్మకాల లోయను వదలి సత్యమనే పర్వతాన్ని అధిరోహించటం మొదలెట్టాడు. అతనలా పర్వతం ఎక్కుతూ ఉండగా ఒక ఎత్తయిన శిఖరం అతనికి ఎదురుపడింది. అతను ఆ శిఖరాన్ని చెక్కి మెట్లు తయారుచేయటం మొదలెట్టాడు. ఏండ్ల తరబడి అతను మెట్లు తయారుచేసే, పర్వతాన్ని అధిరోహించే ప్రయత్నంలో మునిగి ఉన్నాడు. చివరకు అతను వృద్ధాప్యానికి చేరుకున్న సమయంలో పర్వత శిఖరంపైకెక్కాడు. తీరా ఆ శిఖరాన్ని అధిరోహించిన తరువాత అతనికి తెలిసింది – తన ఎదుట మరొక శిఖరం ఉందనీ, అది మొదటి దానికన్నా ఎత్తయినదని. కాని అప్పటికే అతని జీవన వ్యవధి ముగిసింది. అతను చచ్చిపోతాడు. అయితే మరణ సమయంలో పైనుండి ఒక తెల్లని రెక్క వచ్చి అతనివద్ద పడుతుంది. తనకు కావలసిన పిచ్చుక తన ముందున్న శిఖరంపై ఉందని అతనికి బోధపడింది. అతను స్వయంగా సత్యమనే పిచ్చుక వరకూ చేరుకోలేక పోయినప్పటికీ, నా తరువాత రాబోయే వానికి వెనుకటి మెట్లు నిర్మించాల్సిన ప్రయాస ఉండదన్న సంతృప్తితో, ఆ రెక్కను తన చేతిలోకి తీసుకుని ఈ విధంగా పలుకుతూ ప్రాణం విడుస్తాడు –

> Where I be down, worn out, other men will stand, young and fresh. By the steps that I have cut they will climb. They will never know the name of the man who

made them ... But they will mount and on my work. They will climb and by my stair. They will find truth and through me.

- Olive Schreiner, *Story of an African Farm*

ఎక్కడైతే ఈ రోజు నేను ముసలివాణ్ణి అయి, నీరసించి పడిపోయానో అక్కణ్ణుంచి ఇతరులు నిలబడతారు, వారు యువకులు, ప్రఫుల్ల వదనులై ఉంటారు. నేను చెక్కి సిద్ధంగా ఉంచిన మెట్లను వారు ఎక్కుతారు. మెట్లు తయారుచేసి ఉంచిన వాని పేరేమిటో వారు ఎన్నటికీ తెలుసుకోరు. కాని వారు మెట్లు ఎక్కుతూ ఉంటారు. ఎట్టకేలకు సత్యాన్ని కనుగొంటారు.

మీ ముందున్న ఈ పుస్తక రచయిత 1925 జనవరి ఒకటిన పుట్టాడు. నేను ఐదేళ్ళ వయసులో ఉండగానే మా నాన్న గారు 1925 డిసెంబర్ 30వ తేదీన మరణించారు. ఆ తరువాత నా పోషణ ఆజంగఢ్‌లోని సాంప్రదాయిక ధార్మిక వాతావరణంలో జరిగింది. ప్రతి విషయాన్ని తరచి చూసేలా పరిస్థితులు నన్ను పురికొల్పాయి. లోకజ్ఞానం అబ్బిన తరువాత నాకు అవగతమయినదేమంటే 'ప్రాచీన యుగం'లో వెయ్యేండ్ల వరకు మానవ భావనా జగతిని అప్రతిహతంగా ఏలిన మత ధర్మం (ఇస్లామ్) ఆధునిక యుగంలో అన్ని విధాలా పరాధీనతకు లోనైంది. ఎందుకిలా? ఈ విషయాన్ని శోధించాలన్న జిజ్ఞాస నాలో రేకెత్తింది. ఈ దిశలో అధ్యయనం చేయసాగాను.

నేను యూనివర్సిటీలో చదివి ఉంటానని చాలామంది అనుకుంటూ ఉంటారు. కాని వాస్తవానికి నా విద్యాశిక్షణ అంతా అరబీ మదర్సాలోనే జరిగింది. అరబీ విద్యాలయంలో చదువు పూర్తయిన తరువాత, నా అంతట నేనుగా ఇంగ్లీషు నేర్చుకున్నాను. ఆ తరువాత ఇంగ్లీషు పుస్తకాలను నిరంతరం అధ్యయనం చేస్తూ ఉండటం వల్ల నా రచనా శైలిపై ఆధునిక ఉరవడి ప్రాబల్యం వహించింది. అందుకే చాలామందికి అపోహ కలిగింది. కాని నేను వాస్తవానికి భారతీయ విద్యా పరిభాషలో పూర్తిగా ఒక 'మౌల్వీ'ని.

విద్యావిషయికంగా నా ఈ నేపథ్యం నాకు ఇస్లామ్ యొక్క కనీస పరిజ్ఞానాన్ని ప్రసాదించింది. అయితే ఆధునిక యుగం దృక్కోణం నుంచి ఇస్లామ్‌ను అవగాహన చేసుకోవడానికి ఈ పరిజ్ఞానం చాలదని అనిపించింది. అందుకే నేను 1948లో

ఒక నిర్ణయానికి వచ్చాను – ఒక వైపున నేను ఆధునిక సిద్ధాంతాలను వాటి మూలగ్రంథాల ద్వారా అర్థం చేసుకునేందుకు యత్నించాను. మరోవైపున ఇస్లామ్‌ను తిరిగి అవగాహన చేసుకునేందుకు ఖుర్‌ఆన్ హదీసులను, వాటితో సంబంధం ఉన్న ఇతర విద్యలను అధ్యయనం చేయటం మొదలెట్టాను. నా జీవితంలోని మొదటి పాతికేళ్ళు విద్యాలయాల నుంచి విద్యార్జనలో గడిచిపోతే, తరువాతి పాతికేళ్ళు పరిశోధనాత్మక అధ్యయనంలో గడిచాయి. ఇప్పుడు నాకు యాభయ్యేళ్ళు నిండాక నేను ఈ పుస్తకాన్ని మీ ముందు సమర్పించగలిగే అదృష్టానికి నోచుకుంటున్నాను. ఒకవిధంగా ఇది నా సుదీర్ఘ అన్వేషణకు సమాధానం. నేను బహుశా సైద్ధాంతిక పర్వత శిఖరాన్ని చెక్కి మెట్లు సిద్ధం చేశాక, మరో పర్వత శిఖరం నాకు ఎదురయింది. ఇప్పుడు నేను పరిశీలించి, పరిశోధించి తెలుసుకున్న యథార్థాల వెలుగులో ఇస్లామ్‌ను క్రియాత్మకంగా ముందుకు నడపవలసిన ఆవశ్యకత ఉందనిపించింది.

కాని నాలోని శక్తి ఉడిగిపోయిందని నాకు అనిపిస్తోంది. గతంలో నేను చేసిన కఠోర పరిశ్రమ నన్ను సమయానికి ముందే వృద్ధుణ్ణి చేసేసింది. 'సిద్ధాంత పరమైన మెట్లను' చెక్కడంలోనే నేను నా సమయాన్ని పూర్తిగా వెచ్చించాను. ఇప్పుడు 'క్రియాత్మక మెట్లు' ఎలా చెక్కేది? అయితే నాకు తృప్తిని మిగిల్చిన విషయమేమిటంటే నేను సత్యాన్ని కనీసం సిద్ధాంతపరంగానయినా కనుగొన్నాను. "నా తరువాత రాబోయే వారికి వెనుకటి మెట్లు నిర్మించాల్సిన ప్రయాస ఉండదు" అని చెప్పుకుంటూ బహుశా తనువు చాలించగలను.

**– వహీదుద్దీన్ ఖాన్**

1975 డిసెంబర్

*అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో*

# దీన్ వాస్తవికత

## ఆరాధన (దాస్యం)

దైవానికి తన దాసుల నుండి కావలసిన అసలు వస్తువు దాస్యం (ఆరాధన):

"నేను జిన్నులను, మనుషులను సృష్టించినది కేవలం నన్ను సేవించ టానికే." *(అజ్ జారియాత్ : 56)*

దివ్య ఖుర్ఆన్‌లోని ఎన్నో ఆయత్‌ల ద్వారా మనకు అవగతమయ్యేదేమిటంటే మనుషుల బాధ్యతల్ని గుర్తు చేయటానికి దైవప్రవక్తలు పంపబడ్డారు (అన్ నహ్ల్ : 36). ఈ విషయం ఎంత ముఖ్యమైనదంటే ఒకవేళ మనిషికి తన దైవాన్ని ఆరాధించే అవకాశం దొరక్కపోతే, అతను ఆ ప్రదేశాన్ని వదలి వేరే చోటికి వెళ్ళిపోవాలని ఆదేశించటం జరిగింది. (అన్ నిసా : 97)

నిఘంటువు ప్రకారం ఆరాధన లేక దాస్యం యొక్క అసలు అర్థం మనిషి తనను తాను ఎవరి ముందయినా ఆత్మ సమర్పణ చేసుకోవటం, తల వంచటం, తన అశక్తతను, నిస్సహాయతను వ్యక్తపరచటం. షరీఅత్‌లో కూడా దాదాపు దీని భావం యిదే. అబుల్ హయ్యాన్ అందలూసీ ఇలా అంటారు :

"ఆరాధన (ఇబాదత్) అంటే అశక్తత, అణకువ అని అర్థం. జమ్‌హూరీ విద్వాంసులు చెప్పేది కూడా యిదే."

*(అల్ బహ్రుల్ ముహీత్, సం.1, పుట : 23)*

అందుకే దివ్య ఖుర్ఆన్‌లో ఆరాధనకు వ్యతిరేక ధోరణిని 'గర్వం, అహంకారం'గా పేర్కొనడం జరిగింది.

"నా ఆరాధన పట్ల అహంకారం ప్రదర్శించేవారు, అతి త్వరలోనే అవమానితులై నరకంలో ప్రవేశిస్తారు." *(అల్ ము'మిన్ : 60)*

ఆరాధన కొరకు అణకువ, అశక్తత, వినయం లాంటి పదాలను ప్రయోగించి

నప్పటికీ దేవుని కొరకు దీనిని పలికేటప్పుడు అందులో ప్రేమభావన కూడా అంతర్లీనమైపోతుంది. ఇబ్నె కసీర్ ఇలా అంటారు :

"ఆరాధన యొక్క నిఘంటువు అర్థం అణకువను ప్రదర్శించటం. అందుకే ...షరీఅత్ విషయానికి వచ్చేసరికి ఇందులో ప్రేమాతి శయంతో పాటు అశక్తత, భయం కూడా చేరి ఉంటుంది."

*(తఫ్సీరుల్ ఖుర్ఆన్ – సం. 1, పేజీ – 25)*

ఇమామ్ ఇబ్నె తైమియ్యా ఇలా అంటారు :

"అత్యంత అణకువ ప్రేమాతిశయం యొక్క సమాహారమే దైవదాస్యం."

*(రిసాలా అబూదియ్య – పేజీ : 28)*

హాఫిజ్ ఇబ్నె ఖయ్యిమ్ ఇలా వ్రాశారు :

"ఆరాధన (ఇబాదత్) లో రెండు భాగాలున్నాయి – (1) అత్యధిక ప్రేమ, భక్తి పారవశ్యం, (2) అశక్తత, అణకువ".

*(తఫ్సీర్ ఇబ్నె ఖయ్యిమ్, పేజీ – 65)*

ఆరాధన లేక దాస్యం అంటే అర్థం దేవుని సన్నిధానంలో అణకువను, దీనావస్థను ప్రదర్శించటం, దీనిని ఖుర్ఆన్ ఖఫియ్యత్, తజర్రూ, అఖ్బాత్, అనాబత్, ఖుషూ, ఖుజూ, ఖునూత్‌గా అభివర్ణించింది. దైవారాధన చేయటమంటే దైవసన్నిధిలో మనిషి తనను తాను పూర్తిగా అర్పించుకోవటమే. ఇక ఈ ఆత్మసమర్పణ చేసుకునే శక్తి ఎటువంటిది? అది దౌర్జన్యభరితమైనది గానీ, బలాత్కరించేది గానీ కాదు. ఆ శక్తి ఎంతో ప్రేమమయమైనది, దాసుల పట్ల ఎంతో వాత్సల్యం కలది. మనపై ఆ శక్తి మేళ్లు అగణ్యం – అందుకే ఆయన ముందు అణకువను, వినమ్రతను ప్రదర్శించే మనసు ప్రేమాతిశయంతో పొంగి పొర్లుతుంది. దాసునికి – దైవానికి మధ్యగల ఆ సంబంధం అనిర్వచనీయమైనది. ఆ సమయంలో దాసుడు దైవభీతితో కంపించి పోతాడు. భక్తి పారవశ్యంతో దాసుని కంట కన్నీరొలికే సమయంలో అతడు ఎంతో ఉత్సుకతలో దేవుని వైపునకు ఆకర్షితుడవుతాడు. అనిర్వచనీయమైన అనుభూతికి లోనవుతాడు. దేవుని సన్నిధిలో అతని ద్వారా అభివ్యక్తమయ్యే వినయ వినమ్రతలకు ప్రధాన కారణం అతనిలోని భయం మాత్రమే. అయితే ఆ భయం స్వచ్ఛందమైనది. అది భయకంపితుడైన కారణంగా కలిగిన భీతి కాదు. ఆ భీతిని గురించి ఒకట్రెండు మాటల్లో వర్ణించటం సాధ్యం కూడా కాదు. అది ప్రేమకు పరాకాష్ఠ! భీతికి ఆఖరి

అంచు. ఆ రెండింటిలో ఏది ఎక్కువో, ఏది తక్కువో దాసుడు తేల్చుకోలేని పరిస్థితి! మనిషి తాను భయపడే శక్తిమంతుని వైపునకే పరుగిడుతాడు. తన నుండి లాక్కుంటాడని భయపడుతున్న వాని నుండే పొందాలని ఆశపడతాడు. ఆ ఉత్కంఠ స్థితిలోనే నిలువెల్లా నెమ్మది ఉంది. ఆ నెమ్మదిలోనే నఖశిఖపర్యంతం ఉత్కంఠ మిశ్రమమై ఉంది.

ఆరాధన అనేది తన వాస్తవికత రీత్యా అంతరంగంలో ముడివడినది. మనిషి మనోమయ స్థితికి మరో పేరే తఖ్వా (దైవభీతి) అని హదీసులో ఉంది. (అత్తఖ్వా హాహూనా). తఖ్వా (దైవభీతి)కి ఆరాధనా సారంగా పేర్కొంటుంది ఖుర్ఆన్.

> "ప్రజలారా! మిమ్మల్నీ, మీ పూర్వీకుల్ని సృష్టించిన మీ ప్రభువును ఆరాధించండి. తద్వారా మీలో భయభక్తులు జనించే అవకాశం ఉన్నది." *(అల్ బఖరా : 21)*

బాహ్య దృష్టితో చూసినప్పుడు తన ప్రభువు సన్నిధిలో వంగటమే ఆరాధన. అయితే అంతర్గత వాస్తవికత రీత్యా దైవాన్ని తెలుసుకుని, ఆయనతో ప్రగాఢమయిన సంబంధం ఏర్పరచుకోవటమే ఆరాధన. దాసుడు ఈ స్థితికి చేరుకున్నప్పుడు, దేవుని ఎదుట నిలబడి ఉన్నట్లే అనుభూతి చెందుతాడు :

> "మీరు దైవాన్ని మీ ఎదుట చూస్తున్నట్లుగానే ఆయన్ని ఆరాధించండి." (ఇహ్సాన్ అంటే యిదే). *(బుఖారీ – విశ్వాస ప్రకరణం)*

దైవప్రవక్త (స.అ.సమ్) వారి ఈ ప్రవచనం ప్రకారం దాసుడు దైవనామ స్మరణలో, ఆయన ధ్యానంలో పూర్తిగా లీనమైపోవాలి, ఆయన్ని అత్యంత సమీపం నుండి చూస్తున్నట్లుగా ఫీలవ్వాలి. అదే ఆరాధన! ఈ భావనే దైవ సామీప్యానికి, ఆరాధనకు పరాకాష్ఠ! ఏ వ్యక్తి అయినా ఈ భావనకు లోనవకుండా, బాహ్యంలో తాను దైవారాధన చేశానని వాదిస్తే అతను తన వాదనలో సత్యవంతుడు కాడు. ఎందుకంటే ఆ అనుభూతి లేకుండా ఎవరిలో కూడా ఆరాధనా (ఇబాదత్) ప్రభావం ఉండదు. మనకు కానరాని ప్రత్యేక ఆత్మకు మరో పేరే మానవుడు. అయితే మానవ శరీరం లేకుండా ఈ లోకంలో అతని ఉనికిని ఎవరూ ఊహించనయినా లేరన్నది కూడా యథార్థమే.

ఒక విధంగా ఆరాధన (ఇబాదత్) అనే పదం యావత్ షరీఅత్‌ను పరివేష్టించి ఉంది. ఎందుకంటే దాసుడు తన ఆరాధ్య దైవాన్ని ప్రసన్నుణ్ణి చేయడానికి, ఆయన

ఆజ్ఞలకు బద్ధుడవడానికి అతడు చేసే పనులన్నింటికీ ప్రేరణ ఆరాధనే. అయితే దాసునికి – దైవానికి మధ్యన ఉండే ప్రత్యేక ప్రక్రియకు మరో పేరే నిజానికి ఆరాధన. మనిషికీ – మనిషికీ మధ్య ఉండే మంచి వ్యవహార శైలి ఆరాధన వాంఛించేదైతే మనిషికీ – దైవానికి మధ్యన ఉండే క్రియ స్వతహాగా ఆరాధన. మనిషి నమాజ్ చేస్తున్నప్పుడు ప్రత్యక్షంగా దైవారాధనలో నిమగ్నుడై ఉంటాడు. అతను దైవ సన్నిధిలో ఏ విధంగా ప్రణమిల్లుతాడంటే తనకూ దైవానికి మధ్య మూడో వ్యక్తి ఎవరూ ఉండడు. దీనికి భిన్నంగా అతను నీతీనడవడికల్లో, వ్యవహారాలలో దైవాజ్ఞలను శిరసావహిస్తున్నప్పుడు, ఆరాధన వాంఛించే వాటన్నింటికీ కట్టుబడి ఉంటాడు. శిరసావహింపు రీత్యా ఆరాధనలోని ప్రత్యేక క్రియలు ఎటువంటివో ఇవీ అటువంటివే. కాకపోతే వాటి తీరుతెన్నుల్లోని వ్యత్యాసాన్ని దృష్టిలో పెట్టుకోవలసిన అవసరం ఉంది. అన్యథా దీన్‌కు (ధర్మానికి) సంబంధించిన సిసలైన భావన మనసులో ఉండదు.

ఉదాహరణకు – "ముస్లిం అయినందున ఒక వ్యక్తి వారసత్వ ఆస్తిని దైవాజ్ఞకు బద్ధుడై పంచిపెట్టాలి" అని అంటే, ప్రతి మనిషి ఖచ్చితంగా దానికి కట్టుబడాల్సిందే. అన్యథా అతని విశ్వాసం (ఈమాన్) పరిపూర్ణం కాజాలదు అన్నది దాని భావం కాదు. తనకు వారసత్వంగా ఆస్తి లభించినప్పుడే ఆ వ్యక్తి షరీఅత్ ఆజ్ఞలకు బద్ధుడై ఆస్తి పంపకం చేయగలడు. లేకపోతే ఈ ఆజ్ఞ అతనికి వర్తించదు. అంటే దైవారాధన (ఉదా : నమాజ్) మాదిరిగా ఇతరత్రా విషయాలన్నీ అతనికి వర్తించవు.

దైవం పట్ల గల ప్రేమ, భయం మనిషి క్రియాత్మక జీవితానికి ప్రాతిపదిక మాత్రమే కాదు, అసలు జీవితం అంటేనే దాస్యం లేక ఆరాధన. దానిని మనిషి ఈ ప్రాపంచిక జీవితంలో తనివితీరా ఆస్వాదించాలి. వేరే మాటల్లో చెప్పాలంటే మనకూ – దైవానికి మధ్యన ప్రత్యక్ష సంబంధం నెలకొనాలి. దైవదాస్యం అనేది బాహ్యంలో ఆజ్ఞాపాలనగా గోచరిస్తుంది. కాని వాస్తవికత దృష్ట్యా మనిషి తనను తాను దాస్యం యొక్క అత్యున్నత స్థానానికి చేర్చాలి. అక్కడ అతను దైవంతో భేటి అవ్వాలి. అక్కడ అతను తన నిజ ఆరాధ్య దైవంతో గుసగుసలాడాలి. ఆయన సన్నిధానంలో దీనాతిదీనంగా విలపించాలి. అతను దైవంతో మమేకం అవ్వాలి. తనను తాను దేవుని పదసన్నిధిలో సమర్పించుకున్నానన్న అనుభూతికి లోనవ్వాలి – ఈ విధంగా ప్రాపంచిక జీవితంలో దైవాన్ని పొందటం, ఇదే దీన్ (ధర్మం) యొక్క అత్యున్నత యధార్థం. సమస్త ఆదేశాల, ఆదాబుల పరమార్థం ఇదే – దాసుణ్ణి ఆ స్థాయికి

చేర్చటం! ఎవరయితే ఈ విధంగా ప్రపంచంలో తన ప్రభువును పొందాడో అతను పరలోకంలో తన ప్రభువును పొందుతాడు. ఎవరయితే ప్రపంచంలో ఈ 'ఎరుక'కు నోచుకోకుండా పోతాడో, అతడు పరలోకంలో కూడా ప్రభువు దర్శన భాగ్యానికి నోచుకుంటానన్న ఆశ పెట్టుకోకూడదు.

'దీన్' యొక్క ఈ భాగ్యం ప్రాప్తించిందనడానికి నిదర్శనం ఏమిటి? దీనికి నిదర్శనం ఏమిటంటే మనిషికి 'ప్రభువు జీవనోపాధి' లభిస్తూ ఉండాలి (తాహా - 131). దైవాజ్ఞాపాలనలో మీరు బాహ్యంలో చేసేవన్నీ మీ వశంలో ఉండేవే. మీరు కోరితే చేస్తారు, లేకుంటే లేదు. అయితే ఈ కార్యాచరణ సమయంలో మీ అంతరంగంలో జనించే భావాలు భావనలు మీ నియంత్రణలో ఉండవు. మీ అంతట మీరుగా వాటిని సృజించుకోలేరు. మరలాంటప్పుడు ఈ భావాలు భావనలు ఎక్కణ్ణుంచి వచ్చినట్టు? వాస్తవానికి అవి దేవుని తరపున ప్రేరేపించబడ్డాయి. అది విశ్వాసి ఆహారం (ఉపాధి). అది లేకుండా అతనిలోని ఈమాన్ సజీవంగా ఉండజాలదు. ఇదే ఆచరణకి, జ్ఞానానికి సంబంధించిన 'జీవనోపాధి'. హజ్రత్ మర్యమ్ (అ) వద్దనున్న ఈ 'ఉపాధి'ని గమనించి ఆ కాలపు దైవప్రవక్త ఆమెను అడిగేవారు - 'ఇవి నీ దగ్గరకు ఎక్కణ్ణుంచి వస్తున్నాయి?' అని. దానికి ఆమె 'అల్లాహ్ వద్ద నుంచి' అని సమాధానమిచ్చేది (ఆలి ఇమ్రాన్ - 37).

మీ నిరంతర కృషే మీ ఆచరణ. ఇక అంతరంగాన మెదిలే అనుభూతులు దైవ ప్రసాదితం. మీ సదాచరణ మూలంగా అవి మీకు వొసగబడతాయి. అల్లాహ్ తన అపురూపమైన బహుమానాన్ని అరువుగా ఉంచలేదు, దానిని నగదు రూపేణా ఉంచాడు. విశ్వాసి అయిన వ్యక్తి దాని అర్హతను పొందగానే, అప్పటికప్పుడే ఆ బహుమతిని పొందుతాడు. మన యజమాని మనం చేసిన ఏదేని సత్కార్యానికి ఆమోదముద్ర వేసినప్పుడు, ఆశ్చర్యకరమయిన రీతిలో ఊర్ధ్వలోకాల నుండి అనిర్వచనీయమైన అనుభూతి మనకు కలుగుతుంది. అల్లాహ్ సజ్జనులైన తన దాసులకు చేసిన స్వర్గ వాగ్దాన పరిచయమిది! ఆ స్వర్గ వనంలోని సువాసనను విశ్వాసులు ప్రపంచంలో ఆఘ్రాణిస్తారు. ఆ మధురిమను ప్రపంచంలోని ఏ వస్తువుతోనూ పోల్చలేము. విశ్వాసులకు లభించబోయే స్వర్గం, వారి కొరకు 'తెలిసిన ఉపాధి' అయి ఉంటుంది (సాఫ్ఫాత్ - 41). అది వారికి తెలియని వస్తువేమీ కాదు. పైగా అది వారెరిగినదై ఉంటుంది. దానిని వారు ప్రాపంచిక జీవితంలో చవిచూసి ఉన్నారు.

"అల్లాహ్ వారిని, వారికి పరిచయం చేసివున్న స్వర్గంలో ప్రవేశం కల్పిస్తాడు." *(ముహమ్మద్ – 6)*

అబూ సయీద్ ఖుద్రీ ఉల్లేఖనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ఇలా ప్రవచించారు :

"ప్రపంచంలో ఒక వ్యక్తి తన నివాస గృహాన్ని కనుగొన్నట్లే స్వర్గానికి పోయే వ్యక్తి, అక్కడ తన నివాస గృహాన్ని కనుగొంటాడు." *(బుఖారీ)*

మనిషికి దానం చేయాలన్న సద్బుద్ధి కలిగినప్పుడు, దైవమార్గంలో ఇవ్వగలిగినది ఇస్తూ కూడా, తాను తన ప్రభువు వద్దకు మరలిపోవలసి ఉందనే ఆలోచనతో అతని హృదయం వణుకుతూ ఉండాలి (మోమినూన్ : 60 ఆధారంగా). అతనికి ఖుర్ఆన్ పారాయణం చేసే అదృష్టం కలిగినప్పుడు అతని కళ్లు దైవభీతితో వర్షించాలి. అతను దేవుని పట్ల భక్తీ పారవశ్యంతో రాత్రి గడిపినప్పుడు "వారి వీపులు వారి పడకల నుండి వేరై ఉంటాయి" (32. అస్ సజ్దహ్ : 16) అన్న దైవ వచనం అతని మదిలో మెదలుతూ ఉండాలి. అతనిపై ఆవేదనాభరితమైన ఘడియలు వచ్చినప్పుడు ...... అతనికి విశ్వాసం (ఈమాన్)లోని మధురిమ తెలిసివచ్చినప్పుడు, కనుమరుగై ఉన్న వాస్తవాల తెర అతనిపై నుండి తొలగించబడు తుంది. అతను కలత చెందిన హృదయంతో, వణికే పెదవులతో తన స్వామిని అనూహ్యమైన వాక్యాలతో మొరపెట్టుకుంటూ ఉన్నప్పుడు, అది దేవుని నుండి లభించే ఆహారం అయి ఉంటుంది. అతని ప్రభువు, అతని కొరకు దాచిపెట్టిన పండు రుచిని చూసినప్పుడు ... ప్రపంచంలో ఇలాంటి పండ్లు దొరికేవి అన్న అనుభూతి, ఇక పరలోకంలో అవి స్వర్గ బహుమతుల రూపంలో మనకు లభిస్తాయి.

"ఆ స్వర్గవనాలలోని పండ్లు వారికి తినటానికి ఇవ్వబడినప్పుడల్లా ఇలాంటివే ఇంతకు ముందు కూడా మాకు ఇవ్వబడేవి అని వారంటారు." *(అల్ బఖరా : 25)*

పరలోకంలో స్వర్గవాసులకు ఏదైతే లభించనున్నదో అది ప్రాపంచిక వస్తువును పోలినదే. అది విశ్వాసికి తెలిసిన వస్తువే. ఒకవేళ ఎవరయినా ఈ ప్రపంచంలో తానెరుగని రుచులను పరలోకంలో పొందుతానని అనుకుంటే అది అతని అవివేకమే. ఈ ప్రపంచంలోని అన్ని వస్తువులకన్నా ఎక్కువగా మీ ప్రభువు మీకు సమీపంలో ఉన్నట్లు మీకు అనుభూతి కలగకపోతే పరలోకంలో మీకు దైవ సామీప్యం ఎలా

లభిస్తుంది? నిశ్చయంగా నమాజ్ ఎంత గొప్ప ప్రతిఫలానికి ప్రతిరూపమంటే, దానిని చూసుకున్నప్పుడు పరలోకంలో నమాజీల కళ్లకు చలువ ప్రాప్తమవుతుంది. కాని ఈ భాగ్యం అందరికీ లభించదు. "నమాజ్ నా కంటి చలువ" (నసాయి) అన్న దైవప్రవక్త (స) ప్రవచనాన్ని ప్రపంచంలో పుణికిపుచ్చుకున్న వారికే ఈ భాగ్యం వరిస్తుంది.

## ఇబాదత్ వాంఛించేది

దాసుడు తన ఎదుట అశక్తతను, అణకువను వ్యక్తపరచాలని దేవుడు కోరుకుంటాడు. దీని పేరే ఇబాదత్ (ఆరాధన). మనిషి అంతరిక్షంలో పుట్టించబడలేదు. అతను సంఘటనలతో, కారకాలతో నిండివున్న లోకంలోనే ఉంచబడ్డాడు. అందుకే అన్ని కోణాలలో అతనిలో దైవదాస్య భావన తొణికిసలాడాలి.

1. వాటిలో ఒక కోణం అతని స్వయానికి సంబంధించినది. దైనందిన జీవితంలో – ప్రతిసారీ – అతని కార్యకలాపాలలో రెండింటిలో ఏదో ఒక దానిని ఎంపిక చేసుకునే స్వేచ్ఛాధికారం ఉంటుంది. 1. దైవమార్గం. 2. మనోవాంఛల మార్గం, మిథ్యా దైవాల మార్గం. ఆ సమయంలో అతనిలోని నైజం ఇతరత్రా కాలి బాటలను వదలి తన ప్రభువు మార్గాన్ని ఎన్నుకోవాలని ప్రేరేపిస్తుంది. ఇదే "విధేయత". ఈ విధేయతను కనబరిచే సందర్భం తన ఇంట్లో, కార్యాలయంలో, కార్ఖానాలో, మార్కెట్లో, పార్లమెంటులో – అన్ని చోట్లా ఎదురవుతుంది. అలాంటి సందర్భాలలో విశ్వాసి (మోమిన్)లో, తాను దైవమార్గాన్ని ఎన్నుకోవాలా? లేక దైవేతర మార్గాన్ని ఎన్నుకోవాలా? అన్న ప్రశ్న జనిస్తుంది. ఇది అతని వ్యక్తిగత విషయం.

2. రెండవ కోణం బయటి ప్రపంచం. వేరే మాటల్లో చెప్పాలంటే అది ముస్లిమేతరులతో ముడివడినది. ఈ ప్రపంచంలో నివసించే వారిలో ఎవరయితే ఇప్పటి వరకు తమ ప్రభువుతో సంబంధం ఏర్పరచుకోలేదో, ఈ కారణంగా ఎవరయితే భయంకరమయిన పరిణామం వైపునకు సాగిపోతున్నారో వారిని దైవదాస్య మార్గం వైపునకు తీసుకురావటానికి 'విశ్వాసి' అయిన దాసుడు ప్రయత్నించాలి. తాను స్వయంగా నమ్మినడుచుకునే సన్మార్గం పైకి వారిని కూడా తీసుకురావాలి. ఇదే షహాదత్ (సాక్ష్యం) లేదా తబ్లీగ్ (చేరవేయటం) అనబడుతుంది. విధేయత (దైవాజ్ఞాపాలన) విశ్వాసుల వ్యక్తిగత విషయమైతే, ముస్లిమేతరుల వరకు సత్యాన్ని చేరవేయటం 'తబ్లీగ్'. ఈ బాధ్యత విశ్వాసులైన దాసులపై మోపబడింది.

ఇప్పుడు ఆరాధన (ఇబాదత్)కు సంబంధించి మొదటి దానిని (విధేయతను) తీసుకోండి – అది రెండు రకాలు. ఒకటి : వ్యక్తిగతమైనది. రెండవది : సామూహికమైనది. వ్యక్తిగత విధేయత అంటే, విశ్వాసులు తమ వ్యక్తిగత వ్యవహారాలలో దైవాజ్ఞలకు కట్టుబడి ఉండటం. ఇందులో నైతికతతో, వ్యవహారాలతో ముడివడిన అంశాలన్నీ వచ్చేస్తాయి. ఉదాహరణకు : సత్యం పలకటం, వాగ్దానాన్ని నెరవేర్చటం, అప్పగింతలలో నమ్మక ద్రోహానికి పాల్పడకుండా ఉండటం, న్యాయబద్ధంగా వ్యవహరించటం, వినయంగా మెలగటం, కొలతలు తూనికలలో మోసం చేయకుండా ఉండటం, ఎవరి హక్కును వారికి ఇవ్వటం, ఒకరిపట్ల శ్రేయోభిలాషతో మసలుకోవటం – ఇలాంటివన్నీ ఒక మనిషికి వ్యక్తిగతంగా ఎదురయ్యేవే. ఈ విషయాలన్నింటిలో మనిషి తన స్వయం నిర్ణయంతో ఏదో ఒక మార్గాన్ని ఎన్నుకుంటాడు. వీటన్నింటిలో దైవ నిర్దేశాలను అవలంబించడమే వ్యక్తిగత విధేయత. ఒక ముస్లింకు ఏ విషయంలోనయినా దైవాదేశం ఏమిటో తెలిసి ఉన్నప్పుడు, దానిని పాటించటంలో విముఖత కనబరచటం అతనికి ఎంతమాత్రం సమ్మతం కాదు.

> "ఏదేని వ్యవహారంలో దైవం మరియు దైవప్రవక్త ఒక నిర్ణయం గైకొన్నప్పుడు విశ్వాసి అయిన పురుషునికి గానీ, విశ్వసించిన స్త్రీకి గానీ ఆ వ్యవహారంలో స్వీయ నిర్ణయం తీసుకునే అధికారం మిగిలి ఉండదు. ఒకవేళ ఎవరయినా దైవాన్ని, ఆయన ప్రవక్తను ఎదిరిస్తే, అతను స్పష్టమైన మార్గభ్రష్టత్వంలో పడిపోయినట్లే."
>
> *(అల్ అహ్‌జాబ్ : 36)*

ఈ వ్యక్తిగత విధేయతకు ప్రతి విశ్వాసి విధిగా కట్టుబడి ఉండాల్సిందే. ఒకవేళ ఎవరయినా తన క్రియాత్మక జీవితంలో ఈ ఆదేశాలను పాటించకపోతే అతను దైవ సన్నిధిలో దాసుడుగా పరిగణించబడడు. దాస్యం లేక ఆరాధన (ఇబాదత్) అనేది ఆత్మ సమర్పణకు ప్రతిరూపమైతే, బాహ్యపరంగా అది మనిషి తనను తాను దైవ విధేయతకు బద్ధుడైన వానిగా నిరూపించుకోవడానికి మారుపేరు, అతని బాహ్య జీవితమంతా దేవుడు చూపిన ఆదేశాలు, నిర్దేశాలకు లోబడి ఉండాలి. ప్రతి ముస్లిం పురుషుడు, ప్రతి ముస్లిం స్త్రీ దైనందిన జీవితంలో తనకు ఎదురయ్యే సమస్త వ్యవహారాలలో సంపూర్ణంగా దైవ విధేయతకు కట్టుబడి మసలుకోవాలి. ఇతర మార్గాలను, పద్ధతులను అనుసరించటాన్ని విడనాడాలి.

"ఓ విశ్వాసులారా! ఇస్లామ్‌లో (విధేయతా మార్గంలో) పూర్తిగా ప్రవేశించండి. షైతాన్ అడుగులకు మడుగులొత్తకండి. వాడు మీకు బహిరంగ శత్రువు." *(అల్ బఖరా : 208)*

ఏ ఆదేశాల సమాహారాన్ని మేము 'విధేయత' అని నామకరణం చేశామో, దాని రెండవ రకాన్ని సాముదాయిక ఆదేశాలని పేర్కొనవచ్చు. ఈ ఆదేశాల పాలన ఏ ఒక్క విశ్వాసి ఇష్టాయిష్టాలపై ఆధారపడి ఉండదు. మొత్తం సమాజం వాటిని ఆచరణలో పెట్టడానికి సమాయత్తమైనప్పుడే అవి అమల్లోకి వస్తాయి. ఈ కారణంగానే విశ్వాసులు తమ మధ్యన రాజకీయ వ్యవస్థను నెలకొల్పుకున్నప్పుడే ఈ ఆదేశాలు అవతరించాయి. షరీఅత్‌కు సంబంధించిన సామూహిక శాసనాలనేసరికి ముస్లింలంతా అందులోకి వచ్చేస్తారు. అవి ఎవరో కొద్దిమంది విశ్వాసులకు సంబంధించినవి కావు.

బనీ ఇస్రాయీల్ చరిత్రలో మనం చూస్తాము – ఇస్రాయీల్ సంతతివారు ఈజిప్టులో ఖిబ్తీల ఏలుబడిలో ఉన్నంతకాలం వారికి తౌరాతులోని శాసనపరమయిన ఆదేశాలు విధితం కాలేదు. అయితే వారు ఈజిప్టును వదలి సినాయ్ ఎడారికి చేరుకున్నప్పుడు, వారికి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లభించినప్పుడు దేవుని వద్ద నుండి శాసనాలు పంపబడ్డాయి (నిర్గమ కాండము – 15 : 25). అరేబియాలో కూడా సరిగ్గా ఇదే విధానం అవలంబించబడినది. మక్కాలో ముస్లింలు అల్పసంఖ్యలో ఉన్నప్పుడు షరీఅత్‌లోని వ్యక్తిగత ఆదేశాలు అవతరించాయి. వాటిని అమలుపరచటానికి అధికారం అవసరం లేదు. ప్రతి ముస్లిం తన స్వయం నిర్ణయంతో తన వ్యక్తిగత జీవితంలో వాటిని పాటించగలడు. ఆ తరువాత మిగిలిన ఆదేశాలు పరిస్థితులను బట్టి పంపబడ్డాయి. సామూహిక జీవితానికి సంబంధించిన ఆదేశాలు మదీనాలో ముస్లిములకు అధికారం లభించిన తరువాతే అవతరించాయి.

ఆజ్ఞల ఈ అవతరణా క్రమం తెలిపేదేమిటంటే, అధికారానికి ముందు విశ్వాసులపై ధర్మాదేశాలన్నీ – పూర్తిగా – విధితమై ఉండవు. అధికారం లభించిన మీదట ప్రభుత్వ పర్యవేక్షణలో వారు షరీఅత్ ఆదేశాలన్నింటికీ కట్టుబడి ఉండటం అనివార్యం అవుతుంది. పరిమిత అధికారాల పరిధిలో ఉన్నప్పుడు సమాజ, దేశస్థాయిలో ధర్మాదేశాలను ప్రవేశపెట్టే ఆజ్ఞ విశ్వాసులకు ఇవ్వబడలేదు. "అల్లాహ్ ఏ ప్రాణిపైనా దాని శక్తికి మించిన భారం మోపడు" (అల్ బఖరా : 286). శక్తీ

స్థోమతలను బట్టే బాధ్యతాభావం ఉంటుంది. శక్తికి మించిన భారం వేయటం దైవ విధానం కానేకాదు. ఏదేని ఆజ్ఞను అమలుపరిచే తాహతు లేనప్పుడు విశ్వాసులపై ఆ కార్యభారం ఎలా మోపబడుతుంది? ఒకవేళ ఎవరయినా ఒక వ్యక్తి ధర్మాదేశాలన్నింటినీ విడమరచి, ఎట్టి పరిస్థితిలోనూ వాటన్నింటినీ రాజ్యంలో అమలుపరచవలసిందేనని వాదిస్తే అది విపరీతమనిపించుకుంటుంది.

ధర్మాదేశాలు తమ స్వరూపం రీత్యా ఒక్కటే (సమానమే). కాని ఆ ఆదేశాలతో మనకు గల సంబంధం సమానమైనది కాదు. "నమాజును స్థాపించండి" అన్నది ఖుర్ఆన్ ఆదేశం. దాంతోపాటు "జకాత్‌ను ఇవ్వండి" అనేది మరో ఆదేశం. ఈ రెండు ఆదేశాలు కూడా బాహ్యంలో ఒక్కటిగానే ఉన్నాయి. ఈ రెండింటిలో ఆజ్ఞ ఉంది. కాని ఆ ఆజ్ఞలు మనకు సమానంగా వర్తించవు. నమాజును ప్రతి విశ్వాసి ఖచ్చితంగా చేయాల్సిందే. ఇందులో ఎటువంటి మినహాయింపు లేదు. కాని జకాత్ ఆజ్ఞ స్థోమతతో ముడిపడి ఉంది. జకాత్ చెల్లించే స్థితికి చేరుకున్న వ్యక్తికే ఈ ఆజ్ఞ వర్తిస్తుంది. ఆర్థిక స్థోమత లేని వ్యక్తిని జకాత్ చెల్లించాలని ఎవరూ ఆజ్ఞాపించలేరు.

దీనినిబట్టి విదితమయ్యేదేమిటంటే 'దీన్' కోరే కూలంకషమయిన వాంఛలన్నీ ఖచ్చితంగా విధితం కావు. పరిస్థితుల స్వరూపాన్ని బట్టి అవి విధితం అవుతాయి. విశ్వాసుల (మోమినీన్‌ల) పరిధి ఏ మేరకు విస్తరిస్తుందో ఆ మేరకే దీన్ వాంఛించేవి కూడా విస్తారమవుతుంటాయి. ఒకచోట ఒకే వ్యక్తి విశ్వాసి (మోమిన్)గా ఉన్నప్పుడు, ఆ వ్యక్తికి సంబంధించినంత వరకే దీన్‌లోని భాగం అతనిపై ఫర్జ్ (విధి) అవుతుంది. విశ్వాసులు ఒకటి లేదా అంతకన్నా ఎక్కువ పరివారాలుగా ఏర్పడినప్పుడు ఆ పరివారాలు తమ పరిధిని బట్టి ధర్మాదేశాలకు కట్టుబడి ఉంటాయి. ఇక విశ్వాసుల ఏ వర్గమయినా ఒక సమాజంగా రూపొందినప్పుడు, దేవుని తరఫు నుండి ఆ సామాజిక వ్యవహారాలకు సంబంధించి ఇవ్వబడిన ఆదేశాలన్నింటికీ అది విధిగా కట్టుబడాల్సి ఉంటుంది. ఎందుకంటే అధికారం లేకుండా సమాజ స్థాయిలో ఆదేశాలను అమలుపరచటం సాధ్యం కాదు. అందుచేత విశ్వాసుల వర్గం ఈ స్థాయికి చేరినప్పుడు, అది తనపై ఒక రాజకీయ నాయకుణ్ణి (అమీర్‌ను), అతని సారథ్యంలో సామాజిక జీవితాన్ని రూపొందించి, షరీఅత్ శాసనాలన్నింటినీ ప్రవేశపెట్టాలి.

ఇస్లాంలోని ఆదేశాలన్నీ మనిషిలోని మనసుతో ముడిపడినవి. విశ్వాసం మానవ మనోక్షేత్రంలో నాటుకున్నప్పుడు, మనోమయ భావాలపై దాని ప్రభావం మొదలవుతుంది. అది బాహ్య జీవితంపై పడసాగుతుంది. కాకపోతే బాహ్య

పరిస్థితులు వాటితో సమరసం చెందటాన్ని బట్టి ఆ ప్రభావం వ్యక్తమవుతుంది. విశ్వాసుల పరస్పర సంబంధాల వ్యవహారం కూడా ఇటువంటిదే. వీటి దశలను విభజించటం సాధ్యం కాదు. కాని విషయావగాహన నిమిత్తం వీటిని స్థూలంగా మూడు దశలుగా విభజించవచ్చు.

దీని మొదటి దశ **'ఉపదేశం'.** దీనికి 'మూలం' ఏదంటే ప్రతి ముస్లిం హృదయంలో తోటి ముస్లిం యెడల శ్రేయోభిలాష ఉండాలి. బైబిల్ మాటల్లో అతను తన సోదరునిపై కావలివానిగా ఉండాలి (ఆది కాండము – 4 : 9).

> హజ్రత్ జరీర్ మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) వద్దకు వచ్చినప్పుడు, "జరీర్! నీ చేతిని ముందుకు చాపు" అన్నారు. 'దేని కొరకు' అని జరీర్ అడగ్గా, "నీవు అల్లాహ్ వైపునకు ఏకోన్ముఖుడవై ఉంటానని, ప్రతి ముస్లిం యెడల శ్రేయోభిలాషిగా వ్యవహరిస్తానని మాటివ్వు" అన్నారు మహాప్రవక్త (స).
>
> *(కన్జుల్ అమాల్ – సం. 1, పేజీ : 82)*

అంటే పరస్పర వ్యవహారాలలో నీవు నీ తోటి సోదరుని పట్ల వ్యవహరించే తీరు ప్రాపంచికంగా, పారలౌకికంగా అతనికి లాభం చేకూర్చేదిగా ఉండాలి. ముస్లిం సోదరుల మధ్య విభేదాలను సృష్టించి, వారిని విచ్ఛిన్నపరచే ప్రతి చేష్టకు నీవు దూరంగా ఉండాలి.

ఈ ఆచరణనే సూరతుల్ అస్ర్‌లో **"తవాసవ్ బిల్ హఖ్, తవాసవ్ బిస్సబ్ర్"**గా పేర్కొనటం జరిగింది. తోటి ముస్లింల పట్ల విశ్వాసి అయిన ఒక దాసునిలో వ్యక్తమయ్యే ఈ గుణాన్ని దేవుడు "పరస్పర సత్యోపదేశం, సహనబోధ"గా పేర్కొని ఈమాన్ వాంఛించే వాటిలోని రెండు కోణాలను ప్రస్ఫుటం చేశాడు. ఈ ప్రక్రియలోని ఒక కోణం ఏదంటే, దేవుడు తన దాసుల నుండి కోరేవాటిని నెరవేర్చమని విశ్వాసులైన దైవదాసులను ప్రేరేపిస్తూ ఉండాలి. రెండు : దైవ ప్రసన్నతను చూరగొనే నిమిత్తం ఈ ఉపదేశ మార్గంలో – ప్రాపంచికంగా – ఎదురయ్యే కష్టనష్టాలపై, అవరోధాలపై మొక్కవోని ఓరిమిని, సాహసాన్ని చూపాలి. కష్టాలు ఎదురైనప్పటికీ ఈ మార్గంలో స్థిరంగా ఉండాలి.

రెండవ దశ సంస్థాగతమైనది. అంటే ముస్లింలు ఎవరికి వారే యమునాతీరే అన్నట్లుగా చెల్లాచెదురుగా ఉండకూడదు. సాధ్యమైనంత వరకు వారు తమ మధ్యన

సంస్థను స్థాపించుకుని, సలహా సంప్రతింపుల నియమాన్ననుసరించి తమ సామూహిక వ్యవహారాలను నిర్ణయించుకోవాలి. ఈ నియమానికి బద్ధులయ్యే ఒక స్వరూపం ఏమిటంటే, దైవప్రవక్త మహనీయ మూసా (అ) సినాయ్ ఎడారికి చేరుకున్న పిదప ఇస్రాయీల్ సంతతివారిని 12 తెగలుగా విభజించి, వారిపై 12 మంది పర్యవేక్షకులను నియమించారు. మక్కాలోని తొలి కాలంలో అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స) వ్యక్తిత్వం చుట్టూ కూడా ఇలాంటి వ్యవస్థే ఉండేది. **'దార్ అర్ఖమ్'** దానికి కేంద్రం. హిజ్రత్‌కు పూర్వం మదీనా అన్సార్ల విషయంలో కూడా ఇదే విధానం అవలంబించబడింది. రెండవది బైఅతె అఖబా (623) సందర్భంగా మదీనాకు చెందిన 75 మంది (73 మంది పురుషులు, ఇద్దరు స్త్రీలు) దైవప్రవక్త సన్నిధిలో హాజరై ఇస్లామ్ స్వీకరించినప్పుడు, "మీరు మీపైన 12 మంది పర్యవేక్షకులను నియమించుకోండి" అని ఆయన (స) చెప్పారు. (అల్ బిదాయ వన్నిహాయ – సం.3, పేజీ : 160). అందువల్ల వారు తమపై 12 మంది పర్యవేక్షకులను ఎన్నుకున్నారు. వారిలో ముగ్గురు ఔస్ తెగవారు, తొమ్మండుగురు ఖజ్రజ్ తెగవారు. ఆ తర్వాత దైవప్రవక్త (స) వారిని ఉద్దేశించి ఇలా అన్నారు :

> "మీరు మదీనాలోని విశ్వాసులకు కావలివారు, వారిని కనిపెట్టుకుని ఉండేవారు." *(జర్ఖానీ – సం.1, పేజీ : 382)*

అబీసీనియా దేశానికి వలసపోయిన ముహాజిర్లపైన బాధ్యునిగా ఎన్నుకోబడిన హజ్రత్ జాఫర్ (రజి) సారథ్యం కూడా ఇటువంటిదే (సీరత్ ఇబ్నె హిషామ్). ఇదేవిధంగా దారుల్ ఇస్లామ్ నుండి బయలుదేరిన ముస్లింలంతా బయటి ప్రపంచంలో – ప్రతి చోటా – ఇదే పద్ధతిలో తమ సంస్థాగత వ్యవహారాన్ని నిర్వహించేందుకు ప్రయత్నించారు. వారు స్వయంగా ఇస్లామ్ ఆజ్ఞలకు కట్టుబడి జీవించటమే గాక, ఇతరులను కూడా ఇస్లామ్ వైపునకు పిలుపు ఇచ్చారు. ముఖ్యంగా వారు తమ మధ్యన సంస్థాగత వ్యవహారాలు చెక్కుచెదరకుండా ఉండేలా జాగ్రత్త వహించారు. ఒక నాయకునికి లోబడి తమ షరీఅత్‌పరమైన విధులను నిర్వర్తించారు.

ఇస్లామీయ సామూహికతకు సంబంధించిన చిట్టచివరి దశ రాజకీయ వ్యవస్థను రూపొందించుకోవటం. దీనిని ఇస్లామీయ పరిభాషలో 'నస్బె ఇమామత్' అంటారు. అంటే ముస్లింల రాజకీయ, సాముదాయిక వ్యవహారాల నాయకుణ్ణి ఎంపిక చేసుకోవటం. ఇది అవశ్యం.

"ముస్లింలు తమపైన నాయకుణ్ణి (ఇమామ్‌ను) ఎంపిక చేసుకోవటం మా దృష్టిలో అనివార్యం." *(షరహ్ మవాఫిఖ్)*

"ముస్లింలకు, వారికంటూ ఒక నాయకుడు ఉండటం తప్పనిసరి."

*(షరహ్ మఖాసిద్)*

"ముస్లింల కొరకు ఒక నాయకుడు అవశ్యం."

*(అల్ మలల్ వన్నహల్ – పేజీ : 72)*

ఈ విషయం ఎంత కీలకమైనదంటే విశ్వాసాలకు, ఫికహ్‌కు సంబంధించిన ఏ పుస్తకం కూడా దీని ప్రస్తావన లేకుండా లేదు, ఒక్క ఖారిజీలకు చెందిన ధూత్కార వర్గం 'నజాత్' తప్ప వేరెవరూ దీంతో విభేదించలేదు. ఇబ్నె హజమ్ ఇలా అంటారు :

"అహ్లె సున్నత్ వల్ జమాఅత్‌వారు, మర్‌హబా వర్గీయులు, షియా వర్గీయులు – ఒక్క నజాద్ కూటమి తప్ప మిగతా ఖారిజీ వర్గీయులు – అందరూ ఇమామత్ (నాయకత్వం) తప్పనిసరి అనే దానిపై ఏకాభిప్రాయం కలిగి ఉన్నారు."

*(అల్ మలల్ వన్నహల్ – పేజీ : 72)*

పైన పేర్కొనబడిన విషయం, విశ్వాసులపై ఆజ్ఞల షరతు రీత్యా వర్తిస్తుంది. అయితే దీంతోపాటు ఆదేశాలు అంచెలవారీగా వర్తింపజేయాలనేది యుక్తితో కూడుకున్నది. ఈ రకంగా చూసినప్పుడు ముస్లిమేతర జనులు అధిక సంఖ్యలో ఉన్నచోట, అల్పసంఖ్యాకులైన ముస్లింలు ఇస్లాం ఆదేశాలను ప్రవేశపెట్టే ఉద్యమాన్ని తొలి దశలోనే ప్రారంభించటం విజ్ఞత కాదు, అది వారి బాధ్యత కూడా కాదు. అలాగే చెడులు ప్రబలిన ముస్లిం సమాజంలో ఒకవేళ కొంతమందికి ఇస్లామ్ చైతన్యం కలిగి, వారు ఉద్యమాన్ని చేపట్టేమాటైతే, వారు ఆరంభంలోనే షరీఅత్ శాసనాలను ప్రవేశపెట్టమంటూ నినదించటం సమంజసం కాదు. ఈ రకమైన ఉద్యమం చేపట్టడమంటే అది ఇస్లామ్ అంచెలవారీ విధానం పట్ల వైముఖ్యం చూపటం వంటిదే.

సరైన పద్ధతి ఏమిటంటే ధర్మం (దీన్) యొక్క మౌలిక ఆదేశాలను, దానికి సంబంధించిన సూత్రప్రాయమైన ప్రబోధనలను వ్యాపింపజేయటంతో పని మొదలెట్టాలి. తొలుత సంస్కరణా కార్యం చేపట్టి, ప్రజలలో న్యాయశాసనాలను,

సామూహిక చట్టాలను స్వాగతించే చైతన్యాన్ని మేల్కొలపాలి. ప్రజా బాహుళ్యంలో స్వీకృత గుణం జనించిందన్న నమ్మకం కుదిరిన తర్వాత ఇస్లామ్‌లోని ఆ ఆదేశాలను ప్రవేశపెట్టే ఉద్యమం చేపట్టాలి.

ఈ సందర్భంగా అమ్మ ఆయిషా (ర.అ) గారి సుప్రసిద్ధ ఉల్లేఖనం గమనార్హం – దీని ప్రకారం అల్లాహ్ దృష్టిలో అంచెలవారీ పద్ధతికి గల ప్రాముఖ్యత ఎనలేనిది – "ఇస్లామ్ స్వీకరించిన వారికి కావలసిన ఆదేశాలన్నీ ఒక్కసారిగా అవతరించలేదు. పైగా ఎన్నో ఆజ్ఞలు కిస్తులవారీగా అవతరించాయి." ఒకవేళ ప్రతి ఆదేశం మొదటిసారే – పూర్తి స్థాయిలో – అవతరింపజేయబడి ఉంటే కొన్ని ఆదేశాల రద్దుకు ఆస్కారమే ఉండేది కాదు. మహనీయ హుజైఫా ఉల్లేఖనం ప్రకారం నిషేధాజ్ఞల పూర్వాపరాలను గురించి ఏమాత్రం తెలియని వ్యక్తికి ఉపదేశించటం, ఖుర్ఆన్ తఫ్సీర్‌ను విశదపరచటం ధర్మసమ్మతం కాదు.

## సత్యసాక్ష్యం

ముస్లిమేతర సోదరుల విషయంలో మనపై గల బాధ్యత సత్యసాక్ష్యం లేదా ఇస్లాం వైపునకు పిలుపు. అంటే దైవ సందేశాన్ని దైవదాసులకు సమగ్రంగా చేరవేయటం. సత్యం ఏమిటో మాకు తెలీదు అని ఎవరూ పరలోకంలో వాదించకుండా ఉండటానికి ఈ కర్తవ్యాన్ని ముస్లింలు నెరవేర్చటం అవశ్యం.

పరీక్షించే నిమిత్తమే మనిషిని ఈ ప్రపంచంలో వసింపజేయటం జరిగింది. ఖుర్ఆన్‌లో ఈ విధంగా సెలవీయబడింది :

> "మీలో సదాచరణ చేసేవారెవరో పరీక్షించటానికి దేవుడు జీవన్మరణాల వ్యవస్థను సృష్టించాడు." *(అల్ ముల్క్ : 2)*

ఇది ఎంతో సంక్లిష్టమైన పరిస్థితి. ఎందుకంటే ఈ ప్రపంచంలో మనిషి అవలంబించే వైఖరిని బట్టే పరలోకంలో అతని పరిణామ స్వరూపం ఉంటుంది – అంటే శాశ్వతమైన స్వర్గం లేదా శాశ్వతమైన నరకం. పరిస్థితుల ఈ స్వరూపం రీత్యా దేవుడు మానవుణ్ణి సావధానపరచటానికి రెండు ప్రత్యేక ఏర్పాట్లు చేశాడు. వాటిలో ఒకటేమంటే ఆయన ప్రతి మనిషిలో మంచీ చెడులను పరికించే చైతన్యాన్ని పొందుపరిచాడు :

> "మరి ఆయనే అతనికి చెడును పరికించే విచక్షణా జ్ఞానాన్ని, దాని నుండి తనను కాపాడుకునే అంతఃప్రేరణనూ నూరిపోశాడు." *(అష్ షమ్స్ : 8)*

సత్యానికి సంబంధించిన ఈ చైతన్యాన్ని పుట్టుకతోనే అతనిలో నాటడం జరిగింది :

> నీ ప్రభువు ఆదమ్ సంతతి వీపుల నుండి వారి సంతానాన్ని తీసి, స్వయంగా వారినే వారికి సాక్షులుగా పెట్టి, "నేను మీ ప్రభువును కానా?" అని అడిగినప్పుడు, 'అవును. దీనిని మేము అంగీకరిస్తున్నాము' అని వారన్నారు. ఇలా ఎందుకు అడగటం జరిగిందంటే, ప్రళయదినాన 'ఏమో! దీని గురించి మాకేమీ తెలీదు' అని మీరు అనకూడదని. *(అల్ ఆరాఫ్ : 172)*

మరి, ఈ సహజ ప్రేరణ తర్వాత జరిగిన రెండవ ఏర్పాటు దైవదౌత్య పరంపర. ప్రతి మనిషికి ప్రత్యక్షంగా సత్యాన్ని విడమరచి చెప్పటానికి దైవప్రవక్తలు పంపబడ్డారు.

> దేవుడు తన ప్రవక్తలను శుభవార్తల్ని వినిపించేవారుగా, భయబోధ చేసేవారుగా చేసి పంపాడు. ఈ ప్రవక్తల తరువాత ప్రజల వద్ద దైవానికి వ్యతిరేకంగా వాదించటానికి ఏ ఆధారమూ మిగులకూడదని. *(అన్ నిసా : 165)*

ప్రపంచంలో మానవ జీవితం మొదలైనప్పటి నుండే ఈ దైవదౌత్య పరంపర మొదలయింది. మహనీయ ఆదమ్ (అలైహిస్సలామ్) కేవలం మొదటి మానవుడే కారు, మొదటి ప్రవక్త కూడా. క్రీ.శ. 7వ శతాబ్దిలో ఈ దైవదౌత్య పరంపర సమాప్తం కావాలని దైవ నిర్ణయం జరిగింది. ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లమ్ (570-632) దేవుడు ప్రభవింపజేసిన చిట్టచివరి ప్రవక్త. అయితే దైవసందేశాన్ని మానవాళికి చేరవేసే ప్రక్రియ ఇప్పటికీ కొనసాగుతోంది. ఈ పని కోసం ముహమ్మద్ (స) అనుచర సమాజాన్ని ఎన్నుకోవటం జరిగింది (అల్ హజ్జ్ : 78). మన చివరి ప్రవక్త (స) మనపైన సంపూర్ణ సాక్ష్యం ఇచ్చేశారు. ఇక మనపై మోపబడిన ప్రధాన బాధ్యత ఏమిటంటే – దైవప్రవక్త అనుసరణలో మనం ప్రళయం వరకూ ప్రపంచ జాతులన్నింటిపై సత్యసాక్ష్యం ఇస్తూ ఉండాలి.

> "తద్వారా ప్రవక్త మీపై సాక్షిగా ఉండాలని! మీరేమో మానవాళిపై సాక్షులుగా ఉండాలని." *(అల్ హజ్జ్ : 78)*

ఇదేదో పాక్షికమైన పనో, అనుబంధ కార్యమో కాదు. పైగా ఇది ముస్లిం సముదాయం యొక్క నిజ ధ్యేయం. ఖుర్ఆన్ ప్రకారం ఇది దైవప్రవక్త ముఖ్య

విధుల్లోనిది. అంతిమ దైవప్రవక్త (స) గనక ఈ పనిని చేయకపోతే, ఆయన దైవదౌత్య కార్యం అసంపూర్ణంగా ఉండిపోయేది –

> ఓ ప్రవక్తా! నీ ప్రభువు వద్ద నుండి నీపై అవతరించిన దానినంతటినీ (జనులకు) చేరవెయ్యి. ఒకవేళ నీవుగాని అలా చెయ్యకపోతే, నీవు దైవ సందేశాన్ని అందజెయ్యలేదన్నమాటే. *(అల్ మాయిద : 67)*

> దైవప్రవక్తపై గల ఈ బాధ్యత ఆయన అనుయాయులపై కూడా ఉంటుంది.

> (ప్రవక్తా!) వారికి చెప్పు : "ఇది నా మార్గం. నా దార్శనికత ఆధారంగా నేను దేవుని వైపునకు పిలుస్తున్నాను. నా వెంట ఉన్న సహచరులు కూడా (అదే పని చేస్తున్నారు). *(యూసుఫ్ : 108)*

దైవ సందేశహరుని నియామకమే సందేశ పరిచయం కొరకు జరిగింది. కాబట్టి సందేశాన్ని మానవాళికి అందజేయవలసిన విధ్యుక్త ధర్మం దైవ సందేశహరునిది. అలాగే ముహమ్మద్ (స) అనుచరులు "ఉమ్మతె ముహమ్మదీ" గా ఖరారయ్యారంటే ప్రవక్త తదనంతరం ఆ సందేశాన్ని మనుజ జాతికి చేరవేస్తూ ఉండవలసిన బాధ్యత వారిపై ఉంది. ఇస్లామ్ తప్ప వేరొక జీవన విధానంపై మనం మృతి చెందటమంటే మనల్ని మనం అగ్నికి ఆహుతి చేసుకునే ప్రమాదాన్ని కొనితెచ్చుకోవటమే.

ఇబ్నె అబ్దుల్ బర్ గారు ముఆవియా ఇబ్నె హైదరా ఖుషైరీ ద్వారా సంగ్రహించిన దాని ప్రకారం దైవప్రవక్త (సఅసమ్) ఆయనకు సందేశం చేరవేసినప్పుడు ఈ విధంగా కూడా ఉపదేశించారు :

> "నేను నీ నడుము పట్టుకుని నిన్ను అగ్ని నుండి ఆపవలసిన అవసరం ఏమొచ్చింది? ఇలా ఎందుకు చేస్తున్నానంటే నా ప్రభువు నన్ను పిలిచి, ఖచ్చితంగా నన్ను నిలదీసి అడుగుతాడు, "నీవు నా దాసుల వరకు సందేశాన్ని చేరవేశావా? లేదా?' అని. అప్పుడు నేను, 'ప్రభూ! నేను చేరవేశాను' అని జవాబు చెప్పుకోగలగాలి. 'వినండి! మీలో ఇక్కడ ఉన్నవారు ఇక్కడ లేనివారికి (ఈ సందేశాన్ని) చేరవేయాలి."
>
> *(అల్ ఇస్తీయాబ్)*

ఉమ్మతె ముస్లిమా యొక్క ఈ బాధ్యత ఎంత ముఖ్యమైనదంటే, వారు తమలోని

ప్రతి విభేదాన్ని రూపుమాపి ఈ పనిని చేయాలి. తిబ్రానీ మిస్వర్ బిన్ మఖ్రమా ద్వారా ఇలా ఉటంకించారు :

> దైవప్రవక్త (సఅసమ్) తన సహచరుల వద్దకు విచ్చేసి, "అల్లాహ్ నన్ను సమస్త మానవుల కొరకు కారుణ్యంగా చేసి పంపాడు. కాబట్టి అల్లాహ్ మీపై దయజూపుగాక! నా తరఫున ఈ విధిని నిర్వర్తించండి. ఈసా (అలైహిస్సలామ్) హవారీలు విభేదించుకున్నట్లుగా మీరు విభేదించుకోకండి" అని ఉపదేశించారు.

ఏ విధంగానయితే దైవ సందేశహరుడు ఒక ధ్యేయం కొరకు ప్రభవింపజేయ బడతాడో అదేవిధంగా అతని ఉమ్మత్ కూడా ఆ ధ్యేయం కొరకు ప్రభవింపజేయ బడుతుంది. ఈ ప్రభవనం శాశ్వత ప్రాతిపదిక కలది. ద్వితీయ ఖలీఫా కాలంలో రబీ బిన్ ఆమిర్ పారసీక నాయకుల దర్బారులోకి ఇస్లాం రాయబారిగా వెళ్ళినప్పుడు జరిగిన సంభాషణలోని ఒక భాగం యిది –

> "మీరు ఇక్కడికి ఎందుకు వచ్చినట్లు?" అని పారసీక నాయకులు అడిగినప్పుడు ఆమిర్ ఇచ్చిన జవాబు ఇది : "అల్లాహ్ మమ్మల్ని పంపించాడు – తాను కోరిన వారిని మనుషుల దాస్యం నుండి విముక్తి కల్పించి దైవదాస్యంలోనికి తీసుకు రావటానికి, ప్రపంచపు సంకుచిత కుహరాల నుండి వెలికి తీసి దాని సువిశాల క్షేత్రాల్లోకి వారిని రప్పించటానికి, మతాల అతివాదం నుండి ఇస్లామ్ యొక్క సమత్వం, సమతూకం వైపునకు తీసుకురావటానికి అల్లాహ్ మమ్మల్ని తన ధర్మం (దీన్)తో పాటు పంపించాడు. మేము మానవాళిని ఆ నిజ ధర్మం వైపునకు పిలవటానికి (పంపాడు).
>
> *(అల్ బిదాయ వన్నిహాయ)*

ప్రవక్త ప్రియసహచరుల దృష్టిలో ఈ బాధ్యత చాలా ప్రస్ఫుటంగా ఉండేది. మహనీయ ఉమర్ ఫారూఖ్ ఖిలాఫత్ హయాంలో అమ్ర్ బిన్ ఆస్ ఈజిప్టుకు చెందిన మతాధికారుల సమక్షంలో ఇస్లామ్ ధర్మాన్ని పరిచయం చేస్తూ ఇలా అన్నారు : "మా ప్రవక్తకు దేవుడు మానవత పేరిట ఒక సందేశం ఇచ్చి పంపాడు. ఆయన (స) తన కర్తవ్యాన్ని సంపూర్తిగా నిర్వర్తించారు. తన తదనంతరం మా కొరకు ఒక స్పష్టమయిన విధానాన్ని వదలి వెళ్ళారు. దానిని అనుసరిస్తూ మేము ప్రపంచ

మానవాళికి ఈ దివ్య సందేశాన్ని అందజేస్తూ వస్తున్నాము.” (ఇబ్నె జరీర్ – సం. 4; పేజీ – 227)

దైవప్రవక్తలను పంపటంలోని ప్రప్రథమ లక్ష్యం, వారు ప్రజలకు బహిరంగం గానూ, రహస్యంగానూ సత్య సందేశాన్ని చేరవేయటం (నూహ్ : 9). ఇది దేవుని తరఫున సావధానపరిచే, సందేశాన్ని అందజేసే పని. ఈ పని ఎందుకు చేయబడుతుం దంటే ఈ విశ్వం ఏ ప్రణాళిక ననుసరించి నిర్మించబడిందో, దీని పరిణామ స్వరూపం ఎలా ఉండబోతుందో ప్రజలకు ముందుగానే తెలియాలి. అగోచరంగా ఉన్న వ్యవస్థ గురించి ప్రజలు ముందుగానే తెలుసుకోవాలి. ఈ ప్రపంచం తలక్రిందులుగా చేయబడినప్పుడు, అగోచరంగా ఉన్న పరలోక వ్యవస్థ గోచరమైనప్పుడు జరిగే దాని గురించి మానవాళికి ఎరుకపరచటం మన బాధ్యత. ఆ సమయంలో ఒకే దేవుని దాసులైన ప్రజలంతా ఆ విశ్వసామ్రాట్టు సమక్షంలో నిలబడి, తాము తమ జీవితంలో చేసుకున్న దాని గురించి లెక్క ఇచ్చుకోవలసి ఉందన్న విషయాన్ని మనం అందరికీ విడమరచి చెప్పవలసి ఉంది.

సంబోధన, సంవాదనలకు సంబంధించిన విజ్ఞత, యుక్తి వాంఛించేదేమిటంటే, ముస్లిమేతరుల ముందు ఇస్లాంను పరిచయం చేస్తున్నప్పుడు, దానిని “ఒక అత్యుత్తమమైన జీవన వ్యవస్థ”గా పరిచయం చేయాలి. అయితే ఈ విషయం సంవాదనా ఆవశ్యకత మేరకే సరైనది. ఒకవేళ కేవలం దానినే ఇస్లామ్ సర్వస్వంగా ఖరారు చేస్తే పప్పులో కాలు వేసినట్లే. ఎందుకంటే ఇస్లామ్‌ను గనక కేవలం ఒక మంచి ప్రాపంచిక జీవన విధానంగా పరిచయం చేస్తూ ఉంటే, అట్టి పరిస్థితుల్లో సంబోధితుడు ఇస్లామ్ యొక్క పరిమిత భావనను మాత్రమే గ్రహిస్తాడు. దానిని కేవలం ప్రపంచ సమస్యలను పరిష్కరించే సిద్ధాంతంగా తలపోస్తాడు. వేరే మాటల్లో చెప్పాలంటే అది ఆర్థిక, రాజకీయ చిక్కుల నుండి విముక్తిని ఇచ్చే సిద్ధాంతం మాత్రమే. కాని దైవప్రవక్తలు వచ్చినది ఇందుకొరకు కాదు, మానవాళికి ఆకాశంలో ఎదురయ్యే శిక్ష నుండి తప్పించుకునే మార్గం చూపటానికి దైవప్రవక్తలు వచ్చారు.

> దేవుడు తన దాసులలో తాను కోరిన వారిపై ‘వహీ’ (దైవవాణి)ని అవతరింపజేస్తాడు – తద్వారా అతను సమావేశం కానున్న దినం గురించి భయబోధ చేయాలని. *(అల్ మూ’మిన్)*

సందేశ ప్రదాత (దాయి) అనేవాడు తన మాటను స్పష్టంగా చేరవేసేందుకు

ప్రయత్నిస్తాడు. వాస్తవాన్ని ప్రజలకు బాగా అర్థమయ్యేలా విశదపరుస్తాడు. ఆ తరువాత సంబోధితుల నుండి ఎలాంటి నిందలు నిష్ఠూరాలకు తావు ఏర్పడకుండా ఉండాలని కోరుకుంటాడు. దైవప్రవక్తలకు చెప్పబడినది కూడా యిదే. తమకు ఇచ్చి పంపబడిన సందేశాన్ని హెచ్చుతగ్గులు లేకుండా యథాతథంగా ప్రజలకు చేరవేయాలని వారితో అనబడింది. అంతవరకే వారి బాధ్యత. దివ్య ఖుర్ఆన్‌లో ప్రస్తావించబడిన అనేకమంది ప్రవక్తల జీవిత గాధలను, వారి జాతి ప్రజల దోరణిని అధ్యయనం చేసినప్పుడు అవగతమయ్యేదేమిటంటే, వారు ప్రవక్తల సందేశాన్ని స్వీకరించలేదు. ప్రవక్తలను అబద్ధీకరించారు, పరిహసించారు. తత్కారణంగా వారు దైవశిక్షకు పాత్రులయ్యారు. దైవప్రవక్తలు తమ ప్రసంగాల ద్వారా, హితబోధల ద్వారా వారిని దారికి రప్పించే ప్రయత్నం చేశారు. విషయాన్ని చేరవేయటం తప్ప వారైనా చేయగలిగిందేమీ లేదు. ఈ కారణంగానే ఖుర్ఆన్ ఈ ఆజ్ఞకు సంబంధించిన వివిధ పదజాలాలను ప్రయోగించింది – అవన్నీ విషయాన్ని చేరవేసే, సావధానపరిచే అర్థంలోనే ఉన్నాయి. ఉదాహరణకు : "నీకు ఆదేశించబడిన వారికి విడమరచి చెప్పు" (అల్ హిజ్ర్ : 94), "మేము నీపైన ఈ జ్ఞాపికను అవతరింపజేశాము" (అన్ నహ్ల్ : 44), "చాలా స్పష్టంగా సావధానపరిచాను" (అల్ అంబియా : 109), "నేను మీకు నా ప్రభువు సందేశాన్ని చేరవేశాను" (అల్ ఆరాఫ్ : 79), "నా వచనాలను వినిపించే ప్రవక్తలు వచ్చినప్పుడు ... " (అల్ ఆరాఫ్ : 35), "మేము నీపై అవతరింపజేసిన గ్రంథం వారికి చదివి వినిపించబడుతోంది" (అల్ అన్ కబూత్ : 51), "ప్రవక్తా! మేము నిన్ను సమస్త మానవులకు శుభవార్త నిచ్చేవానిగా, హెచ్చరిక చేసేవానిగా పంపాము" (సబా : 28), పిలిచే వాడొకడు "మీ ప్రభువును విశ్వసించండి" అని పిలిచాడు (ఆలి ఇమ్రాన్ : 193), "ఇస్లామ్ వైపునకు పిలుపు ఇస్తున్నప్పటికీ ... (సఫ్ : 7), "నీ ప్రభువు నుండి నీపై అవతరించిన దానిని చేరవెయ్యి" (అల్ మాయిదా : 67).

ఒకరోజు దైవప్రవక్త (స) అబూ జహ్లుకు దైవ సందేశం వినిపించినప్పుడు అతనిలా అన్నాడు :

> "ఓ ముహమ్మద్ (స)! నీవు మా ఆరాధ్య దైవాలను తూలనాడటం మానుకుంటావా? నీవు విషయాన్ని చేరవేశానని మేము సాక్ష్యం ఇవ్వాలనే కదా నీవు కోరుకునేది? అయితే విను – నీవు విషయాన్ని చేరవేశావని మేము సాక్ష్యమిస్తున్నాము." *(బైహఖీ–ముగీరా బిన్ షూబ)*

తాను తన సందేశాన్ని సంపూర్తిగా అందజేసినట్లు తన ప్రియసహచరుల నుండి ఆయన (స) పలుమార్లు సాక్ష్యం తీసుకున్నారు. ఒకసారి ఆయన (స) ప్రసంగించడానికి నిలబడి, దైవస్తోత్రం చేసిన తరువాత ఇలా అన్నారు :

> "ప్రజలారా! నేను మిమ్మల్ని దేవుని మీద ఒట్టేసి అడుగుతున్నాను – నేను గనక దైవ సందేశాన్ని మీకు చేరవేయటంలో ఏదన్నా లోటు కనబరచినట్లు మీకు తెలిసివుంటే నిస్సంకోచంగా మీరు నాకు చెప్పండి". అప్పుడు వారు లేచి నిలబడి, 'మీరు మీ ప్రభువు సందేశాలని చేరవేశారని, మా శ్రేయాన్ని అభిలషించడంలో ఏమాత్రం లోటు కనబరచలేదని, మీపై మోపబడిన బాధ్యతను పూర్తిగా నెరవేర్చారని మేము సాక్ష్యమిస్తున్నాము."

*(ఇమామ్ అహ్మద్ – సాలబా బిన్ ఉబాదా)*

సందేశ ప్రదాత ఈ స్ఫూర్తితోనే తన సందేశ కార్యక్రమాన్ని ప్రారంభిస్తాడు. అతను యుక్తిని, శ్రేయోభిలాషను దృష్టిలో పెట్టుకుని తన మాటను ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా వినిపించగోర్తాడు. ఆ తర్వాత ఈ కార్యక్రమం సందర్భంగా ఎదురయ్యే సంఘటనలన్నింటి సంబంధం వాస్తవానికి కార్యక్రమం తీరుతో ముడిపడి ఉండదు, సందేశం చేరవేయబడిన ప్రజలతో ఉంటుంది. ఈ కారణంగానే దానికి సంబంధించిన ఒక నిర్ధారిత స్పందనా స్వరూపాన్ని ఊహించటం కష్టం. ఈ మార్గంలో సందేశప్రదాత పిలుపు ఇస్తూ ఇస్తూ తనువు చాలించవచ్చు. ఆ కాలపు కొంతమంది ప్రముఖులు ఇస్లామ్ స్వీకరించటం, ఆ ప్రభావం వల్ల దైవధర్మం అకస్మాత్తుగా ఒక ప్రదేశంలో వేగంగా వ్యాప్తి చెందటం కూడా సంభవమే. లేదా సంబోధితుల ద్వారా ఘర్షణ జరగటం కూడా సంభవమే. వారు ఏలినవారితో కలసి ఆ ఉద్యమాన్ని రూపుమాపేందుకు కుట్ర పన్నటం కూడా జరగవచ్చు. లేదా ఆ సందేశ ప్రదాత తన శిష్యులతో కలసి దేశాధికారంపై పట్టు బిగించటం కూడా జరగవచ్చు – అధికారాన్ని కైవసం చేసుకునే స్వరూపం కూడా విభిన్నంగా ఉంటుంది – అది కేవలం ఒక రాజకీయ ప్రాబల్యం కావచ్చు. లేదా ఆ ఉద్యమం విస్తృత స్థాయిలో తన సానుభూతిపరుల, సంబోధితుల సహకారంతో అక్కడ ఇస్లామ్ పునాదులపై ఒక సొసైటీని ఉనికిలోకి తీసుకురావటం కూడా సంభవమే. ఇవన్నీ సంభవమే. వీటిలో ప్రతి ఒక్కటీ పూర్వం జరిగినట్లుగా దైవప్రవక్తల చరిత్ర ద్వారా రూఢీ

అవుతోంది. అయితే వీటిలో ఏ ఒక్కటి కూడా సత్యసాక్ష్యం చేరవేసే ప్రక్రియలో ప్రమాణ నికషం కాదు. సత్యసాక్ష్యం లేదా దైవ సందేశాన్ని చేరవేసే కార్యక్రమంలోని అసలు సిసలు విషయం 'శ్రేయోభిలాష' (అల్ ఆరాఫ్ : 68). సంబోధితుల శ్రేయాన్ని అభిలషిస్తూ, వారిని నరకాగ్ని నుండి కాపాడేందుకు చిత్తశుద్ధితో విషయాన్ని చేరవేయాలి. విషయం సంబోధితుల హృదయాలలో నాటుకునేలా వారితో మాట్లాడాలి (అన్ నిసా : 63). ఈ సందేశాన్ని చేరవేసే ప్రక్రియలో ఎటువంటి అడ్డంకులు ఎదురయినా, వాటిని ప్రతిఘటిస్తూ ముందుకు సాగిపోవాలి. ఆ తర్వాత జరగబోయే దానితో సందేశ ప్రదాతకు సంబంధం లేదు. అతని పనల్లా చిత్తశుద్ధితో విషయాన్ని పూర్తిగా అందజేయటమే. మిగిలినవన్నీ సంబోధితుల నుండి ప్రతిక్రియగా ఎదురయ్యేవే.

ఈ సందర్భంగా గమనించవలసిన రెండవ విషయం ఏమిటంటే; ముస్లిమేతరులకు ఇస్లామ్ ధర్మాన్ని పరిచయం చేస్తున్నప్పుడు విషయమంతా ఒకేసారి చెప్పాల్సిన అవసరం లేదు. మొదట ధర్మానికి సంబంధించిన మౌలిక సూత్రాలు వారికి తెలియపరచాలి. దేవుని ఏకత్వ భావన, దైవదౌత్యం, పరలోక భావన – ఇవి మౌలిక విషయాలు. వీటిని మొదటి దశలోనే ముస్లిమేతరులకు ఎరుక పరచాలి. నిరంతరం వీటిని సోదాహరణంగా వారి ముందు పునరావృతం చేస్తూ ఉండాలి. వారు గనక సూత్రప్రాయంగా వీటితో ఏకీభవిస్తే, అప్పుడు దేవుడు విశ్వాసులైన తన దాసులకు నిర్ధారించిన ధర్మాదేశాల గురించి ఉపదేశించాలి. దైవప్రవక్త (సఅసమ్) హిజ్రీ 10వ సంవత్సరంలో మహనీయ ముఆజ్ బిన్ జబల్ (రజి)ను సందేశ కార్యక్రమంపై యమన్ ప్రదేశానికి పంపిస్తూ, నీవు గ్రంథం కల ప్రజలలోని ఒక వర్గాన్ని కలుసుకున్నప్పుడు, మొదట వారిని 'కలిమయె తౌహీద్' వైపునకు పిలుపు నివ్వు. వారు గనక దానికి అంగీకరిస్తే దశలవారీగా నమాజ్ గురించి, ఇతర షరీఅత్ ఆదేశాల గురించి వివరించు అని తాకీదు చేశారు.

> అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి) ఇలా వివరించారు :
>
> దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లమ్) ముఆజ్ బిన్ జబల్ (రజి)ను యమన్ ప్రదేశానికి పంపిస్తూ ఇలా ఉద్బోధించారు : "నీవు గ్రంథం కల జాతివద్దకు వెళుతున్నావు. నీవు వారి వద్దకు చేరుకున్నప్పుడు వారిని సాక్ష్య వచనం వైపునకు పిలుపు ఇవ్వు – అల్లాహ్ తప్ప మరో నిజ ఆరాధ్య దైవం లేదని, ముహమ్మద్ (స) దైవ సందేశహరుడని

సాక్ష్యం ఇవ్వవలసిందిగా వారికి చెప్పు. వారు గనక దీనికి ఒప్పుకుంటే, అల్లాహ్ వారిపై రేయింబవళ్ళలో ఐదు పూటల నమాజులను విధితం చేశాడని చెప్పు. వారు గనక దీనికి కూడా అంగీకరిస్తే, అల్లాహ్ వారిపై 'సదఖా'ను తప్పనిసరిగా విధించాడని, అది వారి ధనవంతుల నుండి స్వీకరించి, వారిలోని పేదల మధ్యన పంపిణీ చేయబడుతుందని చెప్పు. వారు దీనికి కూడా అంగీకరిస్తే, నీవు వారిలోని మేలైన సంపదను తీసుకోకు." (బుఖారీ)

ఈ కారణంగానే దైవప్రవక్తలకు మొదటి సందేశ దశలో కేవలం మౌలిక ప్రబోధనలే ఇవ్వబడేవి. వారు ఒక సుదీర్ఘ కాలం వరకూ ఆ విషయాలనే ప్రచారం చేసేవారు. ఆ తరువాత క్రియాత్మకంగా ఏర్పడిన పరిస్థితులకు అనుగుణంగా సవివరమైన ఆదేశాలు అవతరించేవి. ఏ ప్రవక్త అయినా తన జాతి ప్రజల వద్దకు వచ్చినప్పుడు మొదటి దశలోనే యావత్ సామాజిక, సాంస్కృతిక వ్యవస్థను రూపొందించి ప్రజల ముందు సమర్పించిన దాఖలా ఏదీ లేదు. అలాగే ఇస్లామీయ రాజ్యాన్ని స్థాపించి, జీవితపు అన్ని విభాగాలలో శాసనాలన్నింటినీ అమలుపరచాలని చెప్పినట్లూ ఎక్కడా లేదు.

పైన పొందుపరచబడిన హదీసులో ప్రస్తావనకు వచ్చిన ఆదేశాన్నీ ఆ సమయానికి అవతరించినవే. అయితే వాటన్నింటినీ ఒకేసారి ఆ ప్రజలకు విధించమని దైవప్రవక్త (స) తాను పంపిన సందేశప్రదాతకు సూచించలేదు. పైగా సంబోధితుల పరిస్థితులను బట్టి అంచెలవారీగా వాటిని వారి ముందుకు తీసుకురావాలని బోధించారు. దీనిని బట్టి బోధపడేదేమంటే దైవాదేశాలు ఏ విధంగా అంచెలవారీగా అవతరించాయో అదేవిధంగా – అవతరించిన మీదట – ప్రజల నుండి వాంఛించ బడ్డాయి.

# నాలుగు మూలస్తంభాలు
## (అర్కానె అరబా)

విశ్వాసం (ఈమాన్) తరువాత ఇస్లామీయ వ్యవస్థలో నాలుగు విషయాలకు 'మూలస్తంభాల' (అర్కాన్) స్థాయి ప్రాప్తమయింది – నమాజ్, రోజా, జకాత్, హజ్జ్‌లే ఈ అర్కాన్. ఈ నాలుగు విషయాలు తమ వాస్తవికత రీత్యా ఎంత ముఖ్యమైనవంటే, ఈ నాలుగు భాగాలు కలిసిన మీదటే 'ఇస్లామ్' అనే కట్టడం ఉనికిలోనికి వస్తుంది. భౌతిక స్థితి నుండి మనిషిని పైకి లేపేదే రోజా (ఉపవాసం). అది మనిషిని దైవానికి చేరువ చేస్తుంది. నమాజ్ దైవ నామస్మరణకు, దైవదాస్యానికి ప్రతిరూపం. త్యాగానికి నిదర్శనం జకాత్. ఇస్లామ్ యొక్క ఈ భాగాన్ని నైతికతతో, వ్యవహారాలతో, మానవ హక్కులతో పోల్చవచ్చు. ఇక హజ్జ్ విషయానికి వస్తే త్యాగమూర్తి మహనీయ ఇబ్రాహీమ్ (అలైహిస్సలాం) గారి సందేశ ప్రధానమైన జీవితపు పునరుజ్జీవనానికి సంబంధించిన ప్రతిజ్ఞ అది. ఈ నాలుగు 'అర్కాన్' ఒక విధంగా ఇస్లామ్ సమాహారం నుండి నాలుగు విడి భాగాలు. మరోవిధంగా చెప్పాలంటే ఈ నాలుగు ముఖ్యాంశాలు మనిషిని ఇస్లామీయ జీవితం గడపటానికి సమాయత్తం చేస్తాయి.

ఇస్లామ్‌లోని ప్రతి ఆరాధన తనదైన ప్రత్యేక ఆధ్యాత్మికత కలిగి ఉన్నప్పటికీ, ఆరాధనల క్రమబద్ధీకరణ మనిషిలో ఓ విశిష్ట నడవడికి ప్రాతిపదిక అవుతుంది. సిసలయిన లక్ష్యసాధనతో పాటు అనుబంధ ఉద్దేశాలు, ఆశయాలు కూడా వీటి ద్వారా నెరవేరాలి. ఈ విషయంలో ఇస్లామ్ ఉపమానం మానవ శరీరం వంటిది. మన శరీరంలోని ప్రతి అవయవం తనదైన ప్రత్యేకతను కలిగి ఉన్నప్పటికీ, అది పూర్తి శరీరాన్ని పెనవేసుకుని ఉంటుంది. ఈ అవయవాలను ఒండొక దాని నుండి వేరుపరచలేము.

1. దీని ఒక పార్శ్వం ఏమిటంటే శక్తిసామర్థ్యాల వ్యత్యాసంతో పాటు ప్రతి దాని నుండి ఎంతో కొంత భాగం పొందాలి. ఉదాహరణకు : ఒకరి నమాజ్, రోజాలు వారిన 'సామీప్య స్థానానికి' (అల్ అలఖ్ : 19) చేర్చలేకపోయినప్పటికీ

కనీసం భయభక్తుల స్థానానికయినా చేర్చాలి. నమాజ్ అతన్ని నీతిమాలిన పనుల నుండి, చెడు చేష్టల నుండి ఆపాలి (అల్ అన్ కబూత్ : 45). 'రోజా' (ఉపవాసం) హదీసు మాటల్లో దుర్భాష నుండి, పాపకార్యాల నుండి ఆపటంలో మహత్తర సాధనంగా నిరూపించుకోవాలి. పైశాచిక శక్తుల దాడి నుండి రక్షణ పొందటానికి అది అతని పాలిట 'డాలు'గా ఉపయోగపడాలి.

2. ప్రతి ఆరాధనా వ్యవస్థ ఏ విధంగా రూపొందించబడిందంటే అది తన ప్రత్యేక – విలక్షణ – లక్ష్యాన్ని నెరవేర్చటంతో పాటు ఇతర ఆరాధనలతో కూడా సంబంధం కలిగి ఉంటుంది. ఉదాహరణకు : హజ్జ్ అసలు ఉద్దేశం మనిషిని సందేశ ప్రధానమైన జీవితానికి సన్నద్ధుణ్ణి చేయటం. అయితే ఈ హజ్జ్ సందర్భంగా మనిషి పవిత్ర స్థలాలను సందర్శిస్తాడు. కొన్ని నిర్ణీత హజ్జ్ క్రియలు ఆచరిస్తాడు. అప్పుడు అతనిలో దేవుని యెడల ప్రేమభావం పెరుగుతుంది. పరలోక భీతి జనిస్తుంది. ఈ 'విధి'ని నెరవేర్చిన తరువాత అతను పరిశుద్ధుడై మరలుతాడు. శేష జీవితాన్ని పవిత్రంగా గడపాలని దృఢ నిశ్చయం చేసుకుంటాడు.

3. ప్రతి ఆరాధన మనిషిని ఏదో ఒక విధంగా దైవంతో కలపటానికే ఉంది. అయితే అది రూపొందించబడిన తీరు ఎలా ఉందంటే జీవితపు ఇతరత్రా అవసరాలు కూడా దాని మూలంగా తీరుతాయి. ఉదాహరణకు : సామూహిక నమాజ్ ద్వారా, హజ్జ్ విశ్వజనీన సమ్మేళనం ద్వారా ముస్లిములలో సంఘీభావం పెంపొందుతుంది. అలాగే ఉపవాసాల ద్వారా మనిషిలో భయభక్తులు జనించటంతో పాటు ఆరోగ్య ప్రయోజనాలు కూడా చేకూరుతాయి. జకాత్ ద్వారా ఆర్థిక వ్యవస్థను సంస్కరించుకునే అవకాశం లభ్యమవుతుంది.

## రోజా

రోజా అంటే ఆగటం, ఆపటం అని అర్థం. అరబీలో 'సౌమ్' అంటే ఇదే. వేరొకచోట దీని కొరకు, అన్నింటి నుండీ వేరై దైవంతో సంబంధం ఏర్పరచుకోవటం (ముజ్జమ్మిల్ – 8) అనే వాక్యం వచ్చింది. ఇస్లామ్‌లోని ఎన్నో ఆదేశాల మాదిరిగా 'రోజా' కూడా మదనీ యుగంలో – హిజ్రీ 2వ సంవత్సరంలో – 'విధి'గా చేయబడింది. కాకపోతే ఈ ఉపవాసం అంతకు ముందు కూడా ఏదో ఒక రూపంలో ఉండేది. "ఖురైషీలు ఆషూరా దినాన ఉపవాసం ఉండేవారనీ, దైవప్రవక్త (స) కూడా ఆ రోజు ఉపవాసం పాటించేవారని" హజ్రత్ ఆయిషా (ర.అ) తెలిపారు (సహీహ్

ముస్లిమ్). దైవదౌత్యం అందకముందు 'హిరా' గుహలో దైవప్రవక్త (సఅసమ్) ధ్యానంలో గడిపిన దినాలను చూస్తే ఒక విధంగా అవి కూడా ఇస్లామీయ జీవన వ్యవస్థలో ఉపవాసాలకు నాంది వంటివే.

దైవప్రవక్త హ్రజత్ మూసా (అలైహిస్సలామ్)కు దైవగ్రంథం వొసగాలని దేవుడు నిర్ణయించుకున్నప్పుడు తూరు పర్వతంపైకి వెళ్ళి, జనుల నుండి వేరై ఆరాధనల్లో, ఉపవాసాలలో లీనమైపోవాలని ఆజ్ఞాపించటం జరిగింది. ఆయన నిరంతరం 40 రోజుల పాటు ఆ స్థితిలో పర్వతంపై గడిపారు. ఆ తర్వాతే దేవుడు ఆయనతో సంభాషించే దశ వచ్చింది –

> "మేము నిర్ధారించిన సమయానికి మూసా వచ్చినప్పుడు, అతని ప్రభువు అతనితో సంభాషించాడు." *(అల్ ఆరాఫ్ : 143)*

మహనీయ మసీహ్ (ఏసుక్రీస్తు) కూడా తన దైవదౌత్యం మొదలవటానికి పూర్వం 40 రోజుల వరకు ఉపవాసం పాటించారు. ఆ తరువాతే దైవవాణి అందింది. అది 'పర్వత ప్రబోధనం' రూపంలో ఇంజీలులో ఉంది. అలాగే అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స) దైవదౌత్యం అందక మునుపు మక్కాకు సమీపంలోనున్న ఒక గుహ (హిరా)లోకి వెళ్ళేవారు. అక్కడ ఆయన (స) రోజా పాటించేవారు. ఏకాంత జీవితం గడిపేవారు. ధ్యాన సముద్రంలో మునిగి ఉండేవారు. ఈ విధంగా సుదీర్ఘకాలం యోచనలో, చింతనలో గడిపిన మీదట దైవదూత ప్రత్యక్షమై దైవవాక్కును ఆయనకు చేరవేశాడు.

రోజా కొరకు షరీఅత్‌లో 'సౌమ్' అనే పదం ప్రయోగించబడింది. ఇక్కడ సౌమ్ అంటే 'ఆగిపోవటం' అని అసలు అర్థం. రమజాన్ మాసాన్ని హదీసులో 'షహ్రు సబ్ర్' అనటం జరిగింది. అంటే నిగ్రహం, సంయమనం పాటించే మాసం. హారిస్ బిన్ మాలిక్ దైవప్రవక్త (స)కు తాను పాటించే రోజా గురించి చెబుతూ, 'నేను ప్రపంచం నుండి వేరైపోయాను, పగలంతా దాహంతో గడిపాను' అని అన్నారు. రోజా తన బాహ్య స్వరూపం దృష్ట్యా ఉదయం నుండి సాయంత్రం వరకు అన్నపానీయాలను పరిత్యజించడానికి మారుపేరు. కాని తన వాస్తవికత రీత్యా రోజా (ఉపవాసం) అంటే అర్థం మనిషి ప్రాపంచిక జంఝాటాల నుండి తనను తాను వేరుపరచుకోవటం. భౌతికంగా ఈ ప్రపంచంలో సాధారణంగా మనిషికి అవసరమయ్యే ప్రతి దానిని అతను తగ్గించుకోవాలి. మాట్లాడటం, నడయాడటం,

ప్రజలను కలుసుకోవటం, నిద్రించటం, మానవ సహజమైన అవసరాలను తీర్చుకోవటం – ఇలా అన్ని విధాలుగా తన దైనందిన వ్యవహారాలను తగ్గించుకోవాలి. రమజాన్ చివరి దశకంలో 'ఏతెకాఫ్' వ్రతం పాటించి ఈ దైనందిన వ్యవహారాలకు పూర్తిగా దూరమవ్వాలి. ఏతెకాఫ్ వ్రతం ద్వారా దాసుడు మనుషుల నుండి దాదాపు వేరైపోతాడు. తద్వారా దైవసామీప్యం పొందగోర్తాడు. ఈ వైఖరి ఒక విశ్వాసి నుండి సదా వాంఛించబడుతుంది. హదీసులో దీనిని 'జుహ్ద్' (ఐహిక అనాసక్తత) అంటారు. మరి రమజాన్ మాసంలో ఈ రకమైన ఉపవాసం విధి (ఫర్జ్)గా చేయబడింది. రమజాన్ చివరి దినాలలోనైతే 'ఏతెకాఫ్' ద్వారా మనిషిని ప్రపంచం నుండి తెగత్రెంపులు చేయించి, దైవంతో దృఢ సంబంధం ఏర్పరచుకోమని ప్రబోధించటం జరిగింది.

ఈ ఉపవాసాల ద్వారా ఆశించబడే ప్రయోజనం ఏమిటి? ఒక్క మాటలో చెప్పాలంటే ఇది మానవుని భౌతిక పార్శ్వాన్ని బలహీనపరుస్తుంది. అతనిలోని ఆధ్యాత్మికతను పెంపొందిస్తుంది. తద్వారా పవిత్ర లోకంతో అతని సంబంధం కనెక్ట్ అవుతుంది. శరీరానికి కావలసిన భౌతిక పదార్థానికి ప్రతిగా ఆత్మకు ఆహారం ప్రసాదించటం రోజా పరమార్థం. మానవుడు ఏక కాలంలో రెండు వస్తువుల సమాహారం. ఒకటి : భౌతికత, రెండు : ఆధ్యాత్మికత (లేక ఆత్మ), దీనినే ప్రస్తుత కాలంలో మనస్తత్వవేత్తలు మస్తిష్కం (Mind) గా అభివర్ణిస్తున్నారు. మానవ ఉనికి యొక్క భౌతిక భాగం అతని ముఖ్యావసరం. ఎందుకంటే అది లేకుండా అతను ఈ ప్రపంచంలో తన విధులను నిర్వర్తించలేడు. అయితే దాంతోపాటే అతని ఆత్మ – లేదా ఆధునిక మానసిక పరిభాషలో అతని మేధస్సు – కూడా తన విశిష్టతను సురక్షితంగా ఉంచుకోవాలి.

మనిషి తనను తాను భౌతిక ప్రపంచం నుండి పైకి లేపుకుని, ఆధ్యాత్మిక ప్రపంచంతో అనుసంధానమైనప్పుడు 'వాస్తవిక జ్ఞానం' యొక్క ద్వారం తన కొరకు తెరచుకున్న అనుభూతికి లోనవుతాడు. భౌతిక తెరతో కప్పబడిన కారణంగా ఇంతకాలంగా తనకు కనిపించని సంఘటనలు ఇప్పుడు అతనికి కనిపించసాగుతాయి. అతను మానవుని ఉన్నతికి ఆఖరి మజిలీగా ఉన్న స్థానానికి చేరుకుంటాడు :

> "ఏ దాసుడైనా ఈ ప్రపంచం పట్ల అనాసక్తతను కనబరచినప్పుడు అల్లాహ్ అతని హృదయంలో ఔచితీ విజ్ఞతలను సృజిస్తాడు. అతని నోటి ద్వారా వివేకవంతమైన పలుకులు జాలువారుతాయి. అతనికి

ఈ ప్రపంచంలోని లోపం, దాని చికిత్స గోచరిస్తాయి. అతనిలోని విజ్ఞత అతన్ని శాంతి నిలయంలోనికి ప్రవేశింపజేస్తుంది." *(మిష్కాత్)*

ఈ మార్గంలోని మరొక చోటు ఏదంటే, మనిషి భౌతిక ముసుగును తొలగించుకుని ముందుకు సాగిపోయినప్పుడు వాస్తవాల లోకం అతనికి మరింత స్పష్టంగా గోచరిస్తుంది –

"మీరు దైవాన్ని ప్రత్యక్షంగా చూస్తున్నట్లే దైవారాధన చేయండి."

*(బుఖారీ)*

ఈ పురోగమనంలోని ఆఖరి హద్దు దైవదౌత్యం. ఒక సాధారణ మనిషికి కూడా తన ఆత్మను వికసింపజేసినప్పుడు ఈ ఉన్నతి లభిస్తుంది. కాకపోతే రెండింటిలో వ్యత్యాసం ఉంది. ప్రవక్త దేవుని తరఫున ఎన్నుకోబడినవాడై ఉంటాడు. అతని కొరకు పవిత్ర లోకంలోని విషయాలపై గల తెరలన్నీ తొలగించబడతాయి. ప్రవక్త "నాకు తెలుసు అని నేనంటున్నాను కదా" అంటాడు. కాగా; సామాన్య మానవుడు దేవుని తరఫున ఎన్నుకోబడినవాడై ఉంటాడు. అందువల్ల అతను ఆ ఉన్నత స్థానానికి చేరుకోలేడు. పవిత్ర లోకంతో అతనికి ప్రత్యక్ష సంపర్కం ఉండదు.

రోజాలోని పరమార్థం యిదే. ఖుర్ఆన్‌లో రోజా ఆదేశాలకు సంబంధించిన ఆయత్‌లు వచ్చినప్పుడు మధ్యలో ఒక ఆయత్ ఇది :

"నా దాసులు నా గురించి నిన్ను అడిగినప్పుడు, నేను వారికి చాలా సమీపంలో ఉన్నాననీ, పిలిచేవాడు నన్ను పిలిచినప్పుడు, అతని పిలుపునకు సమాధానం ఇస్తానని (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు."

*(అల్ బఖరా : 186)*

దైవప్రవక్త ప్రత్యేకంగా ఎన్నుకోబడిన వాడైనందున దైవదూత ద్వారా ప్రత్యక్షంగా దైవంతో సంబంధం కలిగి ఉంటాడు. ఇతర మానవులకు దివ్య ఖుర్ఆన్ దైవదూత జిబ్రీల్‌కు ప్రత్యామ్నాయం వంటిది. ప్రవక్తలు ఉపవాసాలు ఉండి తమ ఆత్మను (లేదా ప్రస్తుత మానసిక పరిభాషలో మస్తిష్కాన్ని) భౌతిక కాలుష్యాల నుండి పరిశుద్ధంగా ఉంచుకున్నప్పుడు దైవదూత వారిపై అవతరించాడు. అతడు దైవవాక్కును ప్రత్యక్షంగా వారికి వినిపించాడు. కాగా, ఇతర మనుషులు పరోక్షంగా – ఖుర్ఆన్ ద్వారా – దైవాన్ని పొందుతారు. వారికి కూడా ఖుర్ఆన్‌ను పొందడానికి ఉపవాస వ్రతాలతో కూడిన జీవితం అవసరం.

ఖుర్ఆన్ అవతరించిన నెలలో ఉపవాసాలు విధిగా చేయబడటం (అల్ బఖరా : 185) లోని ఔచిత్యం ఏమిటంటే, ఉపవాసం మనిషిని ఖుర్ఆన్ గ్రంథవహునిగా చేయాలి. ఏ విధంగానైతే దైవప్రవక్త (స) గ్రంథవాహకుడు అవడానికి హిరా పర్వత గుహలోని ఏకాంతంలో ఉపవాసకునిగా గడిపారో అదేవిధంగా ఖుర్ఆన్ గ్రంథాన్ని విశ్వసించే విశ్వాసులు కూడా దానిని తనివితీరా ఆస్వాదించాలి, లేకపోతే పశువుల మాదిరిగా ఖుర్ఆన్ ప్రతులను తమ వీపులపై మోసే వారవుతారు (అల్ జుముఅ – 15). అంటే ఖుర్ఆన్ వారి మనోక్షేత్రంలోనికి దిగదు. ఖుర్ఆన్‌లోని ఈ విశ్వ శాసనం – ప్రకృతి వాంఛించే విషయం. ఎవరయినా గాని పూర్తిగా దాని లోతుల్లోకి దిగినట్లయితే తన హృదయంలోని పుటలలో ఖుర్ఆన్‌ను చదవటం మొదలెడతాడు. జగతిలోని అణువణువులో అతనికి ఖుర్ఆన్ నిశ్శబ్ద శబ్దం వినిపిస్తుంది. చివరికి ఒక దశ వస్తుంది. అప్పుడు ఖుర్ఆన్ మరియు ప్రకృతి పరస్పరం సమన్వయం చెందుతాయి.

> "యథార్థానికి ఇవి స్పష్టమయిన వచనాలు. జ్ఞానమొసగబడిన వారి ఆంతర్యాలలో ఇవి పదిలంగా ఉంటాయి." *(అల్ అన్‌కబూత్ : 49)*

ఖుర్ఆన్ అవతరించిన మాసంలో రోజాల ఆదేశమిస్తూ ఈ విధంగా సెలవీయటం జరిగింది –

> "అల్లాహ్ మీకు సౌలభ్యం కలుగుజెయ్యాలనే అభిలషిస్తాడు. మిమ్మల్ని కష్టపెట్టాలనే తలంపు ఆయనకు లేదు." *(అల్ బఖరా : 185)*

మానవునికి అన్నిటికన్నా మొట్టమొదటి అవసరం, చాలా ముఖ్యమయిన అవసరం అన్నపానీయాల సేవనం. కాబట్టి అతన్ని అన్నపానీయాలకు దూరంగా ఉంచటం భావ్యం కాదు. అన్నపానీయాలకు దూరంగా ఉంచినట్లయితే అతన్ని కష్టాల్లో పడవేసినట్లే. అల్లాహ్ మీకు సాఫల్యం కలుగజేయదలిచాడని, కష్టాల్లో పడవేయటం ఆయన విధానం కాదని దేవుడు స్వయంగా సెలవీయటం గమనార్హం. కాబట్టి బాహ్యంలో అర్థమయ్యేదేమంటే రోజా పాటించటం వల్ల మనిషికి కష్టం కలగకుండా ఉండదు. మరలాంటప్పుడు దేవుడు మీకు వెసులుబాటు కల్పించాలనుకుంటున్నాడని అనంటంలో గల ఔచిత్యం ఏమిటి?

అరబీ మూలంలో 'యుస్ర్' అనే పదం వచ్చింది. **యుస్ర్** అంటే సౌలభ్యం, వెసులుబాటు అని అర్థం. దీని అర్థం ఏమిటంటే ఏదేని ఒక కార్యం కొరకు మనిషిని

తయారు చేసి, అది అతనికి సులభతరం అయ్యేలా చేయాలి. సైనిక శిక్షణ కూడా అటువంటిదే. ఖుర్‌ఆన్‌లోని పై ఆయత్‌కు అర్థం ఏమిటంటే ఉపవాసం (రోజా) మీకు పైకి కష్టతరంగానే అనిపిస్తుంది. కాని మిమ్మల్ని కష్టంలో పడవేయటం వల్ల దైవానికి కలిగే ప్రయోజనం ఏమీ లేదు. అసలు విషయం ఏమిటంటే, మిమ్మల్ని ఏ ఔచిత్యంతో పాటు సృష్టించటం జరిగిందో దాని ననుసరించి భౌతిక అవసరాలతో పాటు సృష్టించవలసిన ఆవశ్యకత ఉండింది. కాని దైవవాక్కును దాని నిజభావంలో ఆకళింపు చేసుకోవటానికి కనీసం కొన్ని నిర్ణీత దినాలలోనయినా సరే, మిమ్మల్ని మీరు కట్టడి చేసుకోవలసిన, సాధ్యమైనంత వరకు భౌతిక అవసరాలకు దూరంగా ఉంచుకోవలసిన ఆవశ్యకత కూడా ఉంది. మీ ఆధ్యాత్మిక స్థాయిని పెంపొందించుకుని, భౌతిక అవసరాల నుండి వెలికి వచ్చి దైవవాక్కును గ్రహించగలిగే యోగ్యతను సృజించుకోవలసిన అవసరం ఉంది. ఉపవాసాలకు – ఖుర్‌ఆన్‌కు మధ్య గల సంబంధం ఇదే. ఈ కారణంగానే ఖుర్‌ఆన్ అవతరించిన మాసాన్ని ఉపవాసాల జీవితం (మాసం) గా ఖరారు చేయటం జరిగింది.

కేవలం పగలంతా ఆకలిదప్పులతో బాధపడటం, ప్రతిరోజూ ఒకసారి ఖుర్‌ఆన్ పఠనం పూర్తి చేయటం ఉపవాసాల ఉద్దేశం కాదు. ఈ రకమయిన అతివాదం ఇస్లామీయ ఆరాధనలను క్రైస్తవుల సన్యాసత్వం వైపునకు తీసుకుపోయే అవకాశం ఉంది. రోజా అసలు ఉద్దేశం ఏమిటంటే మనిషి నిర్ణీత వేళల్లో మితంగా భుజించాలి. ఇతరత్రా భౌతిక అవసరాలను సాధ్యమైనంత వరకు తగ్గించుకోవాలి. వృథా కాలక్షేపాలు, అధిక ప్రసంగాలు మానుకుని, గలాటాలకు దూరంగా ఉండి నిర్ధారిత సమయంలో నిశ్శబ్దంగా గడపాలి. ఉపవాస సమయంలో దైవ నామాన్ని స్మరించాలి. ఖుర్‌ఆన్ పారాయణం చేయాలి. ఉపవాస సమయంలో అన్నపానీయాలను త్యజించాలన్న నియమం సూచించేదేమిటంటే, అతను నిషిద్ధ పదార్థాలకు జీవితాంతం దూరంగా ఉండటంతో పాటు, ధర్మసమ్మతమైన ఆహార పదార్థాలను కూడా మితంగా తీసుకుని దైవసామీప్యం పొందడానికి ప్రయత్నం చేయాలి.

'రోజా' అనేది ఏడాదిలో ఒకసారి (ఒక మాసం) మాత్రమే విశ్వాసి నుండి వాంఛించబడుతుంది. కాని ఈ రోజా సృజించే ఆధ్యాత్మికత, నైతికత ఏడాది కాలమంతా అతనిలో తొణికిసలాడుతూ ఉండాలి. విశ్వాసం (ఈమాన్) యొక్క అత్యంత ఉన్నత స్థితి ఏమిటంటే, మనిషి ఏ వ్యాపకంలో ఉన్నా మానసికంగా అతను తన ప్రభువు వైపునకు మరలి ఉండాలి. అతను శాశ్వత ప్రాతిపదికపై

తనను తాను 'ఆధ్యాత్మిక ఏతికాఫ్'లో నిమగ్నం చేసుకోవాలి. ఈ వాస్తవికతను సరిగ్గా అర్థం చేసుకోని కారణంగానే జనులు కొండల్లో కోనల్లో జీవించడాన్ని పరిపూర్ణ విశ్వాసంగా తలపోశారు. నిజానికి మనిషి ప్రాపంచిక కార్యకలాపాలలో తలమునకలై ఉంటూనే తన మనసును దైవ స్మరణలో లగ్నం చేయటమే సిసలైన విశ్వాసం.

> ఇబ్నె మస్ఊద్ (రజి) తన కాలపు జనులనుద్దేశించి, 'ఏమిటి, మీరు ప్రవక్త సహచరమాన్యుల కంటే ఎక్కువగా ఉపవాసాలు ఉంటున్నారా? వారికన్నా ఎక్కువగా నమాజులు చేస్తున్నారా? వారికన్నా ఎక్కువ సాధన చేస్తున్నారా? కాని మీరెంత చేసినా వారు మీకన్నా గొప్పవారు' అని చెప్పారు. 'ఎందుచేత ఓ అబూ అబ్దుర్రహ్మాన్!?' అని జనులు అడగ్గా, 'ఎందుకంటే వారు ఈ ప్రపంచం పట్ల అనాసక్తత కనబరిచేవారు, పరలోకాన్ని అత్యధికంగా ఆశించేవారు' అని ఆయన సమాధానమిచ్చారు.

## నమాజ్

నమాజు అసలు ధ్యేయం దైవనామ స్మరణ (తాహా – 14). అంటే 'జిక్ర్'. జిక్ర్ అంటే జ్ఞాపకం అని అర్థం. తన దాసులు తనను జ్ఞాపకం ఉంచుకోవాలని దేవుడు కోరుకుంటున్నాడు. దాసునికి దేవుని ఘనత్వం, ఆయన వివేకం, ఆయన సృష్టికార్యం, ఆయన యాజమాన్యం పదే పదే జ్ఞాపకం వస్తూ ఉండాలి. ఈ భావనను సృజించటానికే నమాజ్ విధి (ఫర్జ్)గా చేయబడింది.

విశ్వంలో ఉన్నవన్నీ విరామం లేకుండా సృష్టికర్త పవిత్రతను కొనియాడు తున్నాయని (అంబియా – 20) ఖుర్ఆన్ అంటోంది. ఖిలాఫత్ స్థానంలో ఆదమ్ నియుక్తులయ్యారు. ఆదమ్‌కు సాష్టాంగ ప్రణామం చేయమని దైవదూతలకు ఆజ్ఞాపించబడినప్పుడు, '(ప్రభూ!) మేము నీ పవిత్రతను కొనియాడుతున్నాము కదా!' (అల్ బఖరా – 30) అని దైవదూతలు విన్నవించుకున్నారు. దీనినిబట్టి విదితమయ్యేదేమిటంటే ఖిలాఫత్ స్థానాన్ని పొందిన మానవుడు నిరంతరం దైవ కీర్తన చేయడంతో పాటు, దేవుని పవిత్రతను కొనియాడుతూ ఉండాలి. బుఖారీలోని ఉల్లేఖనం ప్రకారం మేరాజ్ (గగన యాత్ర) సందర్భంగా అంతిమ దైవప్రవక్త (స)కు 50 నమాజుల ఆజ్ఞ అయింది. 24 గంటల రేయింబవళ్ళలో 50 నమాజులు చేయాలంటే ఆ సమయమంతా నమాజులు చేయడానికే సరిపోతుంది. ఆ సంఖ్యను

తగ్గిస్తూ తగ్గిస్తూ రోజుకు అయిదు నమాజులు చేయాలని ఆజ్ఞాపించటం జరిగింది. అసలు మనిషి ఆచరించాల్సిన నమాజులు యాభై. కాని ఆ సంఖ్యను అయిదుకు కుదించటం జరిగింది.

నమాజును ఆచరించటం ద్వారా దాసుడు దేవుని దైవత్వాన్ని శిరసావహిస్తాడు. ఈ దైవత్వానికి లెక్కలేనన్ని కోణాలు ఉన్నాయి. మనిషి నిరంతరాయంగా దైవనామ స్మరణలో గడిపినా వాటి హక్కును నెరవేర్చలేడు. యథార్థమేమిటంటే దాసుడు ఎల్లవేళలా దైవ సన్నిధిలో నమాజీగా ఉండాలి. అయితే దేవుడు తన కారుణ్యం దృష్ట్యా, విజ్ఞతా వివేచనల దృష్ట్యా కేవలం నిర్ధారిత వేళల నమాజులను విధితం చేశాడు. మిగిలిన సమయంలో కూడా నమాజ్ ప్రభావం అభివ్యక్తం అవుతూ ఉండాలని ఆశించబడుతోంది. నిశ్చయంగా నమాజ్ విశ్వాసులపై నిర్ధారిత వేళలకు కట్టుబడి విధించబడిన ఆరాధన (అన్ నిసా : 103); అయితే దీంతోపాటు ఏమనబడిందంటే, నమాజ్ అసలు ఉద్దేశం జిక్ర్ (జ్ఞాపకం), దైవ సంస్మరణ (తాహా – 14). అంతేకాదు 'అల్లాహ్ నామ స్మరణ చాలా గొప్ప విషయం' అని కూడా అనబడింది (అల్ అన్‌కబూత్ : 45). ఈ వాస్తవాన్ని ముందుంచుకుని, జీవితపు వివిధ పరిస్థితులలో దైవాన్ని స్మరిస్తూ ఉండాలని ఆదేశించబడిన ఆయత్‌లను పఠించినప్పుడు అర్థమయ్యేదేమిటంటే, నమాజ్ తన బాహ్య స్వరూపం రీత్యా అయిదు వేళల్లో విధిగా నిర్ణయించబడిన ఆరాధనే అయినప్పటికీ, నిజ భావం దృష్ట్యా అది ఎల్లవేళలా అతని నుండి ఆశించబడుతోంది. మనిషి నూటికి నూరుశాతం ప్రాపంచిక కార్యకలాపాల్లో మునిగి ఉన్న సమయంలో కూడా అది అతని నుండి ఆశించబడుతోంది –

> "వారిని వారి వర్తకంగానీ, క్రయవిక్రయాలు గానీ దైవనామ స్మరణ నుండి ఏమార్చలేవు." *(అన్ నూర్ – 37)*

నమాజ్‌లోని ఈ విస్తృత భావం దృష్ట్యానే ఖుర్ఆన్‌లో ఒకచోట స్వర్గవాసుల గుణాన్ని ఇలా అభివర్ణించటం జరిగింది –

> "కాని నమాజ్ చేసేవారు మాత్రం (దుర్గుణాలకు దూరంగా ఉంటారు).
> వారు తమ నమాజు వ్యవస్థపై నిలకడగా ఉంటారు."
>
> *(అల్ మఆరిజ్ – 22, 23)*

ఈ నమాజుల వ్యవస్థపై నిలకడగానీ, ధ్యానంగానీ కంఠస్థం చేసుకున్న కొన్ని

వాక్యాలకు మారుపేరు కాదు. మనిషి అంతరంగం నుండి పెల్లుబికే ఉద్వేగపూరిత మయిన పలుకులే 'జిక్ర్'కు ప్రతిరూపం. అంతేగాని కేవలం నిర్ధారిత వాక్యాల పునశ్చరణ జిక్ర్ కాదు. మనిషి ఉన్నత వాస్తవాలను గ్రహించినప్పుడు అతని అస్తిత్వ మంతా దైవిక భావాలు భావనలలో లీనమైపోతుంది. ఆ క్షణంలో అతని ప్రభువు కొరకు అతని అధరాల మీదుగా జాలువారే వచనాలే జిక్ర్ (దైవసంస్మరణ)కు ప్రతీకలు. హదీసు మాటల్లో చెప్పాలంటే ఆ సమయంలో దైవదాసుడు స్వర్గవనాలలో విందారగిస్తాడు (తిబ్రానీ).

దివ్య ఖుర్ఆన్ నమాజ్‌ను రెండు రకాలుగా విభజించింది. ఒకటి : సలాతె ఖుషూ – అశక్తత, అణకువతో కూడిన నమాజ్ (మోమినూన్ – 2). రెండు : సలాతె సహూ – మరుపు (అశ్రద్ధ)కు లోనైన నమాజ్ (మావూన్ – 5). మొదటి రకం నమాజీలకు స్వర్గలోక శుభవార్త ఇవ్వబడింది. కాగా, రెండవ రకం నమాజీల కొరకు వినాశం తథ్యమని అనబడింది. హదీసు ప్రకారం ఒకసారి దైవప్రవక్త (స) మస్జిదె నబవీలో ఉండగా, ఒక వ్యక్తి నమాజ్ చేసి, ఆయన (స) దగ్గరకు వచ్చాడు. దైవప్రవక్త (స) అతనితో,

> "వెళ్ళు. వెళ్ళి మళ్ళీ నమాజ్ చెయ్యి. ఎందుకంటే నీవు అసలు నమాజ్ చెయ్యనే లేదు" అని అన్నారు.
>
> మరో ఉల్లేఖనం ప్రకారం ఆయన (స) ఇలా అన్నారు :
>
> "దాసుడు సజ్దా స్థితిలో ఉన్నప్పుడు తన ప్రభువుకు అత్యంత చేరువలో ఉంటాడు." *(ముస్లిమ్ – అబూహురైరా)*

రెండు నమాజులలో గల ఈ వ్యత్యాసం బాహ్యక్రియల రీత్యా కాదు. ఆ సమయంలో నమాజ్ చేసే వ్యక్తి ఏ మేరకు తాదాత్మ్యం చెందాడన్న దానిపై ఇది ఆధారపడి ఉంటుంది. ఏమాత్రం ఏకాగ్రత, అణకువ లేకుండా చేసిన నమాజ్ 'మరుపునకు గురైన నమాజ్' అనబడుతుంది. మనిషి మొక్కుబడిగా నమాజ్ చేస్తాడు. కాని భక్తి పారవశ్యం అందులో కనిపించదు. మహనీయ అనస్ (రజి) కథనం ప్రకారం మహాప్రవక్త (స) అటువంటి నమాజ్ గురించి ఇలా అన్నారు : "అది కపట విశ్వాసి (మునాఫిక్) నమాజ్. అతడు కూర్చుని సూర్యుణ్ణి చూస్తూ ఉంటాడు. సూర్యుడు పసుపుపచ్చ రంగులో కనిపించినప్పుడు, షైతాన్ యొక్క రెండు కొమ్ముల మధ్యన చేరుకున్నప్పుడు నిలబడి టకటకా కోడి తన ముక్కుతో పొడిచినట్లుగా

నాలుగు రకతుల నమాజ్ కానిస్తాడు. అందులో దైవస్మరణ బహు తక్కువగానే ఉంటుంది." (నిసాయి)

'సలాతె ఖుషూ' పరిస్థితే వేరు. అందులో అశక్తత, అణకువ ఉట్టిపడుతూ ఉంటుంది. ఉఖబా బిన్ ఆమిర్ కథనం ప్రకారం ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఇలా ప్రవచించారు :

"ఎవరయితే చక్కగా వుజూచేసి, నిలబడి రెండు రకతుల నమాజ్‌ను దేవుని యందే మనసును లగ్నం చేసి సలుపుతాడో అతని కొరకు స్వర్గం తప్పనిసరి అవుతుంది." *(ముస్లిమ్)*

అలాగే మహనీయ ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ (రజి) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఇలా అన్నారు :

"ఎవరయితే నా మాదిరిగా వుజూ చేసి, రెండు రకతుల నమాజ్ చేస్తాడో, ఆ సమయంలో తన ఆంతర్యంలో ఇతరత్రా ఆలోచనలు రాకుండా జాగ్రత్త పడతాడో అతనివల్ల గతంలో జరిగిన పాపాలన్నీ క్షమించబడతాయి." *(ముత్తఫఖున్ అలై)*

మనిషి తనకు ఇష్టకరమైన వ్యాపకంలో నిమగ్నుడైనప్పుడు తన మనసును పూర్తిగా అందులోనే లగ్నం చేస్తాడు. ఆ సమయంలో తన చుట్టుప్రక్కల ఏం జరుగుతుందో పట్టించుకోడు. నమాజ్‌లో వాంఛించబడేది కూడా ఇదే. నమాజ్‌ను మొదలెట్టే సమయంలో దాసుడు తన రెండు చేతుల్ని ఎత్తుతాడు. ఇది దేనికి సంకేతం? తన పరిసరాల వాతావరణాన్ని త్యజించి వేరే ప్రపంచంలోకి వెళుతున్నానని అతను సంకేతప్రాయంగా ప్రకటిస్తాడు. అతను తన ప్రభువు పవిత్రతను కొనియాడటంలో, వేడుకోళ్ళలో ఆపాదమస్తకం లీనమైపోతాడు. మరోవిధంగా చెప్పాలంటే దైవంతో సంపర్కం అవడానికి అధిగమించవలసిన అడ్డంకులన్నీ తొలగిపోతాయి. అతను తన నమాజ్‌ను ముగించిన తరువాత కుడి ఎడమల వైపు 'అస్సలాము అలైకుమ్ వ రహ్మతుల్లాహ్' అంటూ ముఖం త్రిప్పుతాడు. అంటే తనను తాను మరో ప్రపంచం నుండి వేరు చేసుకుని మళ్లీ తన గత ప్రపంచానికి వాపసు అవుతాడు. అంటే తన ప్రపంచవాసులకు సలామ్ చేస్తాడు.

ఫికహ్ (ధర్మశాస్త్రం) నమాజ్‌ను వివిధ భాగాలుగా విభజించింది. దానిని ఫర్జ్‌గా, వాజిబ్‌గా, సున్నత్‌గా, నఫిల్‌గా, ముస్తహబ్‌గా, ముఅక్కదాగా, గైర్

ముఅక్కదాగా వర్గీకరించింది. కాని వాస్తవిక జగత్తులో నమాజుకు సంబంధించిన ఇలాంటి విభజన ఏదీ లేదు. ఒకవేళ ఎవరయినా ఒక వ్యక్తి ఈ విభజనల ప్రకారం కేవలం ఫికహ్ కొలతలు తూనికల నమాజ్ గనక ఆచరిస్తే అతను కంప్యూటరైజ్డ్ నమాజ్ చేస్తున్నాడన్నమాట! అది మనిషి చేసే నమాజ్ కాదు. మానవుని నమాజ్ అతని భావాలు భావనల, అనుభూతుల సమాహారం. దానిని ఏ విధంగా కూడా శాసనపరమైన పరిభాషలో విభజించలేము. శాసనపరమైన పదజాలంలో వివరించనూలేము.

దివ్య ఖుర్‌ఆన్‌లో నమాజ్ కొరకు 'రక్షణ' అనే పదం ప్రయోగించబడింది. అంటే విశ్వాసులు తమ నమాజులను రక్షించుకునేవారై ఉంటారు (అల్ మఆరిజ్ : 34). ఇది నమాజ్‌లోని ప్రాథమిక షరతు. ఆ రక్షించుకునే తీరునుబట్టే దానిని వివిధ అంతస్తులుగా విభజించడం జరుగుతుంది.

నమాజులో మనిషి వంగుతాడు. అది మనిషి క్రియాత్మక జీవితంలో దైవ సన్నిధిలో కనబరిచే అణకువకి, వినమ్రతకి ప్రతీక కావాలి. అందుకే ఈ విధంగా సెలవీయబడింది :

> "నమాజ్ నీతి బాహ్యమైన పనుల నుండి, చెడు చేష్టల నుండి ఆపుతుంది." *(అన్ కబూత్ : 45)*

ఒక ప్రవక్త తన జాతి ప్రజలను దైవారాధన వైపునకు పిలిచినప్పుడు, ప్రజల నుండి వచ్చిన ప్రతిస్పందన ఎలా ఉందో దివ్య ఖుర్‌ఆన్‌లో చెప్పబడింది –

> "ఓ షుఐబ్! మేము మా తాతముత్తాతలు పూజిస్తూ వస్తున్న దైవాలను వదలిపెట్టాలనీ, మా సొమ్ములను మా ఇష్టప్రకారం ఖర్చుపెట్టడం మానుకోవాలని నీ నమాజు నీకు ఆజ్ఞాపిస్తోందా?" *(హూద్ : 87)*

నమాజులో మనిషి మాటిమాటికీ వంగుతూ, 'ఓ నా యజమానీ! ఆజ్ఞాపించు. నీ ఆజ్ఞలను పాలించడానికి నేను సిద్ధంగా ఉన్నాన'ని విన్నవించుకుంటూ ఉంటాడు. అందుకే ఖుర్‌ఆన్‌లో అనబడింది – ఏ నమాజుతో పాటు ప్రాపంచిక వాంఛలు కూడా ఊరిస్తూ ఉంటాయో అటువంటి నమాజులోని 'ఆత్మ' చచ్చిపోయిందని.

నమాజ్ యొక్క రెండవ అత్యున్నత శ్రేణి ఏదంటే దైవ సంస్మరణ అతని మనోమయ భావాలలో ఒక భాగమైపోయి, దేవుని ఎదుట నిలబడి ఉన్నానన్న అనుభూతి కలిగించాలి –

"నీ ప్రభువుకు సాష్టాంగ ప్రణామం చేసి, ఆయన సామీప్యం పొందు."

*(అల్ అలఖ్ : 19)*

ఖుర్ఆన్‌లోని 'మఖామె యఖీన్' అన్న దానికి కొంతమంది ఇదే అర్థం తీసుకున్నారు.

"నిశ్చయమైనది నిన్ను చేరుకునే వరకు నీ ప్రభువును సేవిస్తూ ఉండు." *(అల్ హిజ్ర్ : 99)*

'నిశ్చయమైన' దానికి చేరుకున్న మీదట నమాజ్ ముగిసిందన్నది దాని అర్థం కాదు. దీని తర్వాతే అత్యున్నత నమాజ్ మొదలవుతుంది. అలాంటప్పుడు అది సమాప్తమయ్యే ప్రసక్తే ఉండదు.

ఈ 'సామీప్యం' లేదా 'నిశ్చయమైనది' ఏమిటి? అది మాటల్లో వర్ణించనలవి కానిది. మనిషి ఈ స్థితికి చేరుకున్నప్పుడు, కానరాని వాస్తవాన్ని కళ్లారా చూస్తున్నట్లే అనుభూతి చెందుతాడు. అసంభవమైన వస్తువు అందుబాటులో ఉన్నట్లే ఫీలవుతాడు. తన ఎదుట ఏ సంబోధితుడు లేకుండానే ఫలవంతమైన సంభాషణలో లీనమైనానన్న భావనకు లోనవుతాడు. అన్నిటికన్నా ఎక్కువగా భీతి చెందాల్సిన వస్తువు పట్ల తన ఆంతర్యంలో ప్రేమైక భావాలు జనించినట్లుగా భావిస్తాడు. ఒకరి ఆధారం లేనంత వరకు చేరుకోజాలననుకున్న దాని వద్దకు ఏ ఒక్కరి ఆధారం లేకుండానే చేరుకున్నానన్న ఆనందానుభూతి చెందుతాడు.

సజ్‌దహ్ (సాష్టాంగ ప్రణామం) నమాజ్‌లోని భక్తీ పారవశ్యానికి పరాకాష్ఠ. అది దైవ సామీప్యానికి సంబంధించిన ఆఖరి హద్దు. దైవ సామీప్యపు 'సజ్‌దహ్' సమయంలో దాసునిపైన ఏర్పడే భావనను నిర్వచించడానికి మాటలు చాలవు. దాసుని ఆత్మ సమర్పణకు, దీనావస్థకు అది ఆఖరి అంచు. ఆ సమయంలో అతను తనను తాను దైవానికి పూర్తిగా అర్పించుకుంటాడు. అతని నుదురు నేలకు ఆనుకున్న క్షణంలో ఒక నీటి బిందువును సముద్రంలో కలిపేసిన అనుభూతి కలుగుతుంది. అంటే మనిషి పరమోన్నత ప్రభువును కలుసుకున్నాడు.

శాశ్వతమైన ధ్యానంగా వాంఛించబడే సిసలైన నమాజ్ అంటే ఏమిటి? దానికి సంబంధించిన జాబితా ఏదీ తయారుచేయజాలము. ఇది ఒక ద్వైపాక్షిక ప్రక్రియ. దాసుడు నిల్చొని, కూర్చొని, పడుకుని దైవాన్ని స్మరిస్తూ ఉన్నప్పుడు (ఆలి ఇమ్రాన్ : 191) దేవుడు అతని వైపునకు మరలుతాడు. దీని ఒక అంచు దాసునివైపు

ఉంటే, రెండవ అంచు దేవుని వైపు ఉంటుంది. ధ్యానానికి సంబంధించిన భావాలు భావనలు, వచనాలు అతనికి ప్రత్యేకంగా దేవుని తరఫున ప్రేరేపించబడతాయి. అతడు ఆధ్యాత్మిక స్థాయిలో క్షణం క్షణం దేవుని నుండి సరికొత్త జీవనోపాధిని పొందుతూ ఉంటాడు (ఆలి ఇమ్రాన్ : 37). ఇలాంటి సంఘటనల జాబితా తయారవటం అసంభవం. కాకపోతే ఖుర్ఆన్‌లో దీనికి సంబంధించిన కొన్ని దృష్టాంతాలు సంకేతప్రాయంగా తెలుపబడ్డాయి –

1. అతని భావనల్లో దేవుడు ఎలా అంతర్లీనం అవ్వాలంటే, ప్రతి సంఘటన అతనికి దైవాన్ని జ్ఞప్తికి తెప్పించేదై ఉండాలి.

   "వారు నిల్చొని ఉన్నా, కూర్చుని ఉన్నా, పడుకుని ఉన్నా – దైవాన్ని స్మరిస్తూ ఉంటారు. భూమ్యాకాశాల సృష్టిపై చింతన చేస్తూ ఉంటారు. వారు (అప్రయత్నంగా) ఇలా అంటారు : 'మా ప్రభూ! నీవు ఇదంతా లక్ష్యరహితంగా సృష్టించలేదు.' *(ఆలి ఇమ్రాన్ : 191)*

2. దేవుని ఔన్నత్య భావన అతని మనోమస్తిష్కాలపై ఎంతగా ఆవరించాలంటే, ఆ ఆలోచనతో అతని శరీరంపై రోమాలు నిక్కబొడుచుకోవాలి –

   "తమ ప్రభువుకు భయపడేవారి శరీరాలపై రోమాలు నిక్కబొడుచు కుంటాయి." *(అజ్ జుమర్ : 23)*

3. దైవప్రస్తావన వచ్చినప్పుడు అతని హృదయం భయంతో కంపించాలి –

   "అల్లాహ్ ప్రస్తావన వచ్చినప్పుడు వారి హృదయాలు భయంతో వణుకుతాయి." *(అల్ అన్‌ఫాల్ : 2)*

4. దైవ వచనం అతన్ని విలపించేలా చేస్తుంది –

   "సత్యాన్ని గ్రహించిన కారణంగా వారి కళ్ళ నుండి కన్నీరు ప్రవహించటం నీవు గమనిస్తావు." *(అల్ మాయిదా : 83)*

5. అతని నమాజ్ అతనికి కష్టాల్లో సహాయం అర్థించేదై ఉండాలి –

   "ఓ విశ్వాసులారా! సహనం మరియు నమాజు ద్వారా సహాయం అర్థించండి." *(అల్ బఖరా : 153)*

ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఎప్పుడు విపత్కర పరిస్థితి ఎదురైనా, ఆయన నమాజ్ చేయడానికి నిలబడేవారని హజ్రత్ హుజైఫా (రజి)

చెప్పారు. ముస్లిమ్ సముదాయంలోని సంస్కరణా ప్రియుల విధానం కూడా యిదే. ఇబ్నె తైమియ్యా గురించి ఏమనబడిందంటే, ఆయనకు ఏదయినా విషయం అర్థం కానప్పుడు, నిర్మానుష్యంగా ఉన్న మస్జిద్‌కు వెళ్ళి నమాజ్ చేసేవారు. సాష్టాంగ ప్రణామం చేసినప్పుడు, "ఓ ఇబ్రాహీమ్‌కు మార్గబోధన చేసినవాడా! నాకు మార్గబోధన చెయ్యి" అని వేడుకునేవారు. హజ్రత్ ఇబ్నె మస్ఊద్ (రజి) చెప్పినట్లుగా అబూ నుఐమ్ ఉటంకించారు :

"మీరు నమాజులో ఉన్నంతసేపు రాజాధిరాజు తలుపు తడుతూ ఉండండి. రాజాధిరాజు తలుపు తట్టిన వాని కొరకు అది తప్పక తెరువబడుతుంది."

నమాజ్ విశ్వాసి పాలిట ఎడారిలో ఒయాసిస్సు లాంటిది. ఈ నమాజ్ మనిషికి ప్రాప్తించినప్పుడు, అది అతనికి అత్యంత ప్రియమైన వస్తువైపోతుంది. "నా కంటి చలువ నమాజ్‌లో ఉంచబడింది" అని మహనీయ ముహమ్మద్ (స) వక్కాణించారు. అజాన్ ఇవ్వమని ఆయన తన ముఅజ్జిన్ బిలాల్ (రజి)ను పురమాయించినప్పుడు, ఆయన (స) నోట వెలువడే పలుకులు ఇవి :

"ఓ బిలాల్! నమాజ్ కొరకు సన్నాహాలు చేసి, మాకు నెమ్మదినివ్వు."

*(అబూ దావూద్, కితాబుల్ అదబ్)*

ప్రతిరోజూ నమాజులో ఒకసారి లేదా రెండుసార్లు పూర్తి ఖుర్ఆన్ పారాయణం చేయటం వల్ల 'ఈ నమాజ్' ప్రాప్తమవదు. ఈ విధమయిన ఆచరణ కేవలం విన్యాసం మాత్రమే కాగలదు. అది అతని సిసలైన నమాజ్ కాజాలదు. నమాజులో చేసే పారాయణంలో యోచన, చింతన ఉంటుంది. ఖుర్ఆన్ పారాయణం అన్నది కేవలం కంఠస్థం చేసుకున్న వాక్యాల పునశ్చరణ కారాదు, పైగా అది హృదయాంతరాళం నుండి పెల్లుబికే దైవసంస్మరణామృతం అయి ఉండాలి. ఈ విధంగా పారాయణం చేసే వ్యక్తికి ఒక రోజులో ఒకసారి లేదా అనేకసార్లు పూర్తి ఖుర్ఆన్ పఠించటం సంభవం కాదు. మహాప్రవక్త (స) ఒక్కోసారి ఒక్క సూరాను పారాయణం చేయడంలో రాత్రంతా గడిపేసేవారు. కొంతమంది ఒక్క రాత్రిలో ఒకసారి లేదా అనేకసార్లు పూర్తి ఖుర్ఆన్ పఠిస్తున్నారన్న సంగతి అమ్మ ఆయిషా (ర.అ) ముందు ప్రస్తావించినప్పుడు ఆమె ఇలా అన్నారు :

"వాళ్ళు పఠించారుగాని అసలు పఠించలేదు." *(ఇమామ్ అహ్మద్)*

ఆమె ఇంకా ఇలా అన్నారు :

"నేను దైవప్రవక్త (సఅసమ్) తో కలసి రాత్రంతా జాగారం చేసే దానిని. ఆయన ఆ సందర్భంగా కేవలం బఖరా సూరా, ఆలి ఇమ్రాన్ సూరా, నిసా సూరాలు పారాయణం చేయగలిగేవారు. హెచ్చరికతో కూడిన ఆయత్ వచ్చినప్పుడు ఆయన అల్లాహ్ శరణు వేడేవారు. శుభవార్త వినిపించబడిన ఆయత్ వచ్చినప్పుడు, దాని కొరకు దుఆ చేసేవారు."

## జకాత్

జకాత్ లేదా ఇన్‌ఫాఖ్‌కు అసలు భూమిక త్యాగం (అల్ హష్ర్ : 9). ప్రతి వ్యక్తీ తనపై గల ఇతరుల హక్కును సహృదయంతో అర్థం చేసుకోవాలి. ఈ బాధ్యతా భావం ద్వారా ఒక సత్సమాజం రూపొందాలి. ఆ సమాజంలోని ప్రజలు 'పుచ్చుకోవడానికి' బదులు 'ఇవ్వడానికి' సంసిద్ధులు కావాలి. ఇతరుల హక్కును కొల్లగొట్టే బదులు ఇతరులకు లాభం చేకూర్చే మార్గాలను వెతకాలి. ప్రపంచంలో తనకంటూ హక్కేమీ లేదు, ఇక్కడ కేవలం తన బాధ్యతలే ఉన్నాయి అనే గుణం ప్రతి ఒక్కరిలో పెంపొందాలి. అల్లాహ్ తన దాసుని నుండి వాంఛించేది ఇదే. ఈ సాముదాయిక స్పిరిట్‌ను జనింపజేయడానికే జకాత్ విధిగా నిర్ణయించబడింది. ధార్మిక వ్యవస్థలో దీనికి గల ప్రాధాన్యత ఎనలేనిది. బషీర్ బిన్ ఖసాసియా అనే వ్యక్తి దైవప్రవక్త (స) సమక్షంలో విధేయతా ప్రమాణం చేయడానికి వచ్చినప్పుడు, 'దైవప్రవక్తా! మీరు నా నుండి ఏ ఏ విషయాలపై ప్రమాణ స్వీకారం చేయించు కుంటార'ని అడిగారు. దానికి సమాధానంగా ఆయన (స) ఆ విషయాలను విడమరచి చెప్పినప్పుడు, 'సదకా (దానధర్మాలు), చేయటం, జిహాద్ చేయటం – ఈ రెండు పనులు నా వల్ల కావు. కాబట్టి ఈ రెండింటి నుండి నాకు మినహాయింపు ఇవ్వండి' అని విన్నవించుకున్నారు. అప్పుడు దైవప్రవక్త (స) తన చేతిని వెనక్కి తీసుకుని ఇలా అన్నారు :

> "బషీర్! దానధర్మాలు చేయలేనంటున్నావు. జిహాద్ కూడా నీవల్ల కాదంటున్నావు. మరలాంటప్పుడు స్వర్గంలో ఎలా ప్రవేశిస్తావు?"
>
> *(అహ్మద్)*

దైవప్రవక్త (స) పరమపదించిన తరువాత పెల్లుబికిన ధర్మభ్రష్టతా (ఇర్తెదాద్) ఉపద్రవం వెనుక ఉన్న కారణం కూడా ఇదే. ప్రాచీన అరేబియాలో ప్రజల ఆర్థిక ఒనరులు చాలా పరిమితంగా ఉండేవి. అందుకే ఇస్లామీయ విధుల జాబితా నుండి

జకాత్ విధిని తొలగించాలని అనేక అరబ్బు తెగలవారు కోరారు. దైవప్రవక్త (స) తదనంతరం ఇక తాము ఇస్లామీయ ప్రభుత్వానికి జకాత్ చెల్లించాల్సిన అవసరం లేదని న్యూ ముస్లిం తెగలు భావించాయి.

"ఏ వ్యక్తి మూలంగా ముస్లింలకు దైవ సహాయం అందేదో ఆ వ్యక్తి ఈ లోకం నుండి నిష్క్రమించాడ"ని వారు అన్నారు.

*(కన్జుల్ అమాల్ – సం. 3, పుట – 42)*

కేవలం జకాత్‌ను చెల్లించడానికి ఆ తెగలవారు నిరాకరించినప్పటికీ, వారు తమను తాము ముస్లింలుగానే చెప్పుకునేవారు. వారు నమాజ్, రోజా విధులకు కట్టుబడే ఉండేవారు. కాని ప్రథమ ఖలీఫా ఏమన్నారో తెలుసా!

"దైవసాక్షిగా! నమాజ్ – జకాత్‌ల మధ్యన వ్యత్యాసం కనబరిచే వారితో నేను ధర్మయుద్ధం చేస్తాను. ఎందుకంటే జకాత్ అనేది ధనంలో దేవుని హక్కు." *(బుఖారీ, ముస్లిం, అహ్మద్)*

భూమ్యాకాశాలలో ఉన్నదంతా అల్లాహ్ వారసత్వమే (హదీద్ : 7). ధరిత్రిలోని ఉపాధి అంతా అల్లాహ్ సమకూర్చినదే (అల్ ముల్క్ : 15). మీకు ప్రసాదితమై ఉన్న ధనమంతా అల్లాహ్‌దే (అన్ నూర్ : 33). ఎవరికి ఏది ప్రాప్తమైవున్నా అది కేవలం దైవానుగ్రహమే (ఇస్రా : 30). అలాంటప్పుడు సమస్త ధనరాసులు, వస్తు సామగ్రి అంతా తనదేనని అల్లాహ్ ఖరారు చేసినా, అలా చేసే హక్కు ఆయనకు ఉంది. కాని ఆయన కేవలం ఒక చిన్న భాగాన్ని మాత్రమే తన వాటాగా ఖరారు చేసి, మిగతాదంతా మన పరం చేశాడు :

"పంట కోసిన రోజున విధిగా ఇవ్వవలసిన దేవుని హక్కును ఇవ్వండి."

*(అల్ అన్ ఆమ్ : 141)*

హిజ్రీ 5వ సంవత్సరంలో జకాత్ చట్టపరంగా విధితం అయింది. అయితే నిర్ధారితం కాని రూపంలో అది మొదటి నుంచే వాంఛించబడింది. అందుకే మక్కీ సూరాలలో సైతం జకాత్ ప్రస్తావన వచ్చింది. అల్ మోమినూన్ సూరాలో "వారు జకాత్ వ్యవస్థకు కట్టుబడి ఉంటారు" (23 : 4) అని సెలవీయబడింది. ముహమ్మద్ (స)కు దైవదౌత్యం అందిన మీదట (నబువ్వత్ : 5) ముస్లింల ఒక బృందం అబీసీనియా దేశానికి వలసపోయిన తరువాత, అక్కడి చక్రవర్తి నజాషీ దర్బారులో జాఫర్ బిన్ అబీ తాలిబ్ ఇస్లామ్ ప్రవక్త గురించి పరిచయం చేస్తూ ప్రసంగించిన దానిలో ఈ వాక్యం కూడా ఉంది –

"మేము దైవారాధన చేయాలనీ, నమాజ్‌ను స్థాపించాలనీ, జకాత్‌ను చెల్లించాలని ఆయన మాకు ఆజ్ఞాపించారు."

మొదట్లో ఇది ఒక సర్వసాధారణ ఆజ్ఞగా ఉండేది. తరువాత దీని పరిమాణం, పద్దులు నిర్ధారించబడ్డాయి. ప్రభుత్వం కొరకు ఇదొక శిస్తు తరహాలో వసూలు చేయబడుతుంది. ఇప్పుడు శాసనం రీత్యా జకాత్ అనివార్యమైన అర్థం ఒక్కటే. కాని 'జకాత్' అనేది సాధారణ అర్థంలో కేవలం 'టాక్స్' కాదు, పైగా అదొక ఆరాధన కూడా. అందువల్ల దాని అర్థం బహు విస్తృతమైనది. దానికంటూ ఒక హద్దు లేదు. అది మనిషి సంకల్పాన్ని బట్టి ఉంటుంది. అతను తన దైవాన్ని ప్రసన్నుణ్ణి చేయడానికి నిర్ణీత హద్దూ పద్దుకన్నా ఎక్కువగా తన ధనాన్ని ఖర్చుపెడతాడు. ఈ విషయమై దైవప్రవక్త (స) ను ప్రశ్నించగా, ఆయన (స) ఇలా సమాధానమిచ్చారని ఫాతిమా బిన్తె ఖైస్ తెలిపారు.

"నిశ్చయంగా మనిషి ధనంలో జకాత్ కాకుండా కూడా హక్కు ఉంది." *(తిర్మిజీ)*

స్వంత అవసరాలు తీరగా, మిగిలి ఉన్న ధనంలో నుండి ఖర్చుపెట్టాలని ఖుర్ఆన్‌లో ఉంది :

"ఏం ఖర్చుపెట్టాలి?" అని వారు నిన్ను అడుగుతారు. "మీ ఖర్చులు పోగా మిగిలినది" అని నీవు వారికి చెప్పు. *(అల్ బఖరా : 219)*

'జకాత్' లేదా 'దైవమార్గంలో ఖర్చు'కు సంబంధించిన రెండు రూపాలున్నాయి – ఒకటి : సదకా, రెండు : ఖర్జె హసనా (దైవమార్గంలో అప్పు).

నిశ్చయంగా దానధర్మాలు చేసే పురుషులు, దానధర్మాలు చేసే స్త్రీలు, అల్లాహ్‌కు మంచి రుణం ఇచ్చేవారు – వారు ఇచ్చినది వారి కొరకు పెంచబడుతుంది. మరి వారి కొరకు గౌరవప్రదమైన ప్రతిఫలం ఉంది.♦ *(అల్ హదీద్ – 18)*

♦ *మొదటి కోవకు చెందిన జనుల కొరకు 'ముసద్దిఖీన్' 'ముసద్దిఖాత్' అనే పదాలు ప్రయోగించబడ్డాయి. కాని రెండవ కోవకు చెందిన ప్రజల ప్రస్తావన వచ్చేసరికి **'వ అఖ్రిజుల్లాహ ఖర్జన్ హసనా'** అనే వాక్యం ప్రయోగించబడింది. ఇది ఖుర్ఆన్ ప్రత్యేక శైలి. ఏదేని ఒక వస్తువు ప్రాముఖ్యతను చెప్పదలచినప్పుడు వాక్య ప్రయోగం మార్చివేయబడుతుంది.*

'సదఖా' అంటే నిరుపేదలకు అన్నం పెట్టడం (అల్ ముద్దస్సిర్ : 40). అంటే అవసరార్థుల అవసరం తీర్చడానికి ఖర్చుపెట్టడం. దీనికి ప్రతిగా 'ఖర్జె హసన' అంటే అర్థం దైవమార్గంలో (సత్య ధర్మ ఉన్నతికై) ఇవ్వటం, సత్యధర్మాన్ని వ్యాపింపజేయటం, సత్యధర్మాన్ని ఉన్నత స్థాయికి చేర్చటం – వీటిని అల్లాహ్ తన దాసుల నుండి కోరుతాడు. అంటే ఈ ఆశయం కొరకు ధనాన్ని, ప్రాణాన్ని త్యాగం చేయటం చాలా గొప్ప పుణ్యకార్యమని చెప్పటం జరిగింది. ఈ ఖర్చు ఉద్దేశం ఎవరయినా ఒక వ్యక్తి ఆర్థిక అవసరం తీర్చటం కాదు, పైగా అది దైవధర్మం కొరకు ఇవ్వబడుతుంది. అందుకే దేవుడు దీనిని తనకు ఇవ్వబడిన 'రుణం'గా ఖరారు చేశాడు.

'సదఖా' పరిమాణం జకాత్ రూపేణా నిర్ధారించటం జరిగింది. కాని 'ఖర్జె హసనా'కు నిర్ణీత పరిమాణం అంటూ ఏదీ లేదు. ఇది ధర్మ సేవకుల లేదా సందేశ ప్రదాతల లేదా అమరవీరుల జాబితాలో తమ పేరు వ్రాయించటం వంటిది. ఈ ముందు వరుసలో చేరదలచిన విశ్వాసులు తమ సర్వస్వాన్ని దైవానికి అర్పించవలసి ఉంటుంది :

> "నిశ్చయంగా అల్లాహ్ విశ్వాసుల నుండి, వారి ధన ప్రాణాలను స్వర్గానికి బదులుగా కొనుగోలు చేశాడు." *(అత్ తౌబా : 111)*

తబూక్ యుద్ధం (630) సందర్భంగా మహనీయ అబూబక్ర్ తన సంపదనంతా సమర్పించుకున్నారు. మహనీయ ఉమర్ తన ధనంలోని సగభాగాన్ని ఇచ్చారు. మహనీయ ఉస్మాన్ గనీ వెయ్యి ఒంటెలు, 70 గుర్రాలు, పదివేల దీనార్లు సమర్పించుకున్నారు. అది ఆ సైన్యానికి కావలసిన మూడోవంతు ఖర్చుకు సరిపోతుంది.

ఖర్చుకు సంబంధించిన ఈ రకాన్నే ఖుర్ఆన్‌లో 'దైవమార్గంలో ఖర్చు'గా పేర్కొనటం జరిగింది (అల్ హదీద్ : 10). ఈ పద్దులో ఖర్చు పెట్టకపోవటం తమను తాము వినాశంపాలు చేసుకోవటం (అల్ బఖరా : 195) గా అభివర్ణించటం గమనార్హం. ఎందుకంటే ముస్లింలు గనక ఇస్లామ్ వచనం (కలిమా) ఉన్నతి కొరకు ఖర్చుపెట్టకపోతే చివరకు వారి సామూహిక జీవితమే ఛిన్నాభిన్నమై పోతుంది. ఒక ఉమ్మత్‌గా ప్రపంచంలో వారి ఉనికి నెలకొని ఉండదు. ఈ ఖర్చుకు గాను ఏడువందల రెట్ల పుణ్యఫలం (అల్ బఖరా : 261) ఉంటుందని శుభవార్త వినిపించబడింది – అంతకంటే ఎక్కువ కూడా లభించవచ్చు. తిబ్రానీ ప్రకారం మహనీయ ముఆజ్

బిన్ జబల్ (రజి) దైవమార్గంలో సతత సమరం సందర్భంగా దైవ సంస్మరణ, ఖర్చులకు సంబంధించి ప్రాప్తమయ్యే గొప్ప ప్రతిఫలాన్ని గురించి హదీసు వివరించారు. ఆ తరువాత ఆ ఉల్లేఖనంలోని చివరి వాక్యాలివి :

> నేను ముఆజ్ బిన్ జబల్‌తో ఈ విధంగా అన్నానని అబ్దుర్రహ్మాన్ అంటున్నారు : "దైవమార్గంలో పోరాటానికి గాను ఖర్చు చేసిన దానికి ప్రతిఫలం ఏడు వందల రెట్లు" అని నేను అన్నప్పుడు హజ్రత్ ముఆజ్ ఇలా అన్నారు : "నీ అవగాహనం బహుస్వల్పం. ఈ ప్రతిఫలం ఎప్పుడు? కేవలం దైవమార్గంలో ఖర్చుపెట్టి, తాను స్వయంగా తన బిడ్డల మధ్యన కూర్చొని ఉన్నప్పుడు, ప్రత్యక్షంగా ధర్మయుద్ధంలో పాల్గొనకుండా ఉన్నప్పుడు! ఒకవేళ ధర్మయుద్ధంలో పాల్గొని, ఖర్చు కూడా చేసినట్లయితే – అటువంటి వారి కొరకు అల్లాహ్ తన ధనాగారంలో ఎటువంటి కారుణ్యాన్ని దాచిపెట్టాడంటే, దాసుని జ్ఞాన పరిధి అక్కడి వరకూ చేరుకోజాలదు. దాని గుణ విశేషాలను ఎవరూ వర్ణించలేరు కూడా."

జకాత్ తన బాహ్యరూపం రీత్యా ఒక టాక్స్‌గా కనిపిస్తుంది. కాని తన వాస్తవికత రీత్యా అదొక ఆరాధన. అందుచేత రాజ్యం దీనిని వసూలు చేసేటప్పుడు టాక్స్‌ను వసూలు చేసే విధంగా కఠినంగా వ్యవహరించినప్పటికీ, జకాత్‌ను ఇచ్చేవారు మాత్రం మనస్ఫూర్తిగా ఇవ్వాలి. అలా ఇచ్చినప్పుడే వారికి జకాత్ ప్రయోజనం చేకూరుతుంది.

1. సదకా (దానం చేయటం) ద్వారా అతను దేవుని నుండి మంచి ప్రతిఫలాన్ని ఆశిస్తున్నప్పుడు, అతడు ఈ మార్గంలో మంచి ధనాన్ని, మేలైన వస్తువులను ఇవ్వటం అవసరం :

> "విశ్వసించిన వారలారా! ధర్మసమ్మతమైన మీ సంపాదనలో నుండి, మేము మీ కోసం నేల నుండి ఉత్పత్తి చేసిన వస్తువులలో నుండి ఖర్చుచేయండి. వాటిలోని చెడు (నాసిరకం) వస్తువులను ఖర్చుపెట్టే సంకల్పం చేసుకోకండి – మీరు కళ్ళు మూసుకుని ఉంటే తప్ప మీరు స్వయంగా వాటిని తీసుకోరు కదా." *(అల్ బఖరా : 267)*

హ॥జత్ ఆయిషా (ర.అ) ఒకసారి నిల్వచేసి ఉన్న మాంసాన్ని దానంగా ఇవ్వగోరినప్పుడు, "నీవు స్వయంగా తినలేని దానిలో నుండి దానం చేస్తున్నావా?" అని దైవప్రవక్త (స) అభ్యంతరం చెప్పారు. (ముస్నద్ అహ్మద్)

2. ఏది ఇచ్చినా ఆర్ద్రంగా, హృదయపూర్వకంగా ఇవ్వాలి :

   (దైవమార్గంలో) ఇవ్వవలసిన దానిని ఇస్తూ ఉన్నప్పుడు కూడా వారి హృదయాలు వణుకుతూ ఉంటాయి. *(మోమినూన్ : 60)*

   తమకు అవసరం ఉండి కూడా వారు దైవప్రీతి కొరకు నిరుపేదలకు, అనాథులకు, ఖైదీలకు అన్నం పెడతారు. పైగా వారిలా అంటారు : "మేము కేవలం అల్లాహ్ ప్రసన్నత కోసమే మీకు తినిపిస్తున్నాము. అంతేగాని మేము మీ నుండి ప్రతిఫలాన్ని గానీ, కృతజ్ఞతలను గానీ ఆశించటం లేదు. నిశ్చయంగా మేము మా ప్రభువు తరఫు నుండి సంభవించే అత్యంత కఠినమైన, సుదీర్ఘమైన దినం గురించి భయపడుతున్నాము." *(అద్ దహ్ర్ : 8 – 10)*

3. ఇచ్చిన వారికి తమ ఉపకారాన్ని గుర్తుచేసి వారి మనస్సు నొప్పించరాదు. వారి ఆత్మాభిమానం దెబ్బతినే విధంగా వారితో మాట్లాడరాదు.

   ఎవరయితే దైవమార్గంలో ఖర్చుచేసిన తరువాత, తమ దాతృత్వాన్ని చాటకుండా, (గ్రహీతకు) మనస్తాపం కలిగించకుండా ఉంటారో, వారి ప్రతిఫలం వారి ప్రభువు వద్ద (సురక్షితంగా) ఉంటుంది.

   *(అల్ బఖరా : 262)*

4. దైవమార్గంలో ఇచ్చేవాడు, దైవ ప్రసన్నతను చూరగొనేందుకు ఇస్తున్నప్పుడు తనకు ఆర్థికంగా నష్టం వాటిల్లిందనిగానీ, తాను కష్టాల్లో పడ్డాననిగానీ భావించకూడదు.

5. దానధర్మాలను గోప్యంగా ఇవ్వటం మంచిదని ఖుర్ఆన్‌లో చెప్పబడింది (అల్ బఖరా : 271). అందుకే ప్రవక్త ప్రియసహచరులు తమ దానధర్మాలను గోప్యంగా ఉంచడం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించేవారు. అబ్దుర్రహ్మాన్ బిన్ సాబిత్ గురించి తెలియవచ్చినదేమంటే, ఆయనకు పెన్షన్ డబ్బు అందగానే తన ఇంటివారల కోసం నిత్యావసర వస్తువులు కొనుగోలు చేశాక, మిగిలిన

డబ్బంతా దానం చేసేసేవారు. మిగిలిన డబ్బు ఏది? అని ఇల్లాలు అడిగితే, 'నేను దానిని అప్పుగా ఇచ్చాన'ని అనేవారు. ఇలాంటి వ్యవహార శైలివల్ల ఇంట్లో ఎదురయ్యే ఇబ్బందులను సహాబా ఎలా అధిగమించేవారో, క్రింది సంఘటన ద్వారా ఊహించవచ్చు.

> హజ్రత్ ఉమర్ (రజి) హజ్రత్ ముఆవియాను సిరియాలో గవర్నర్ పదవి నుంచి తొలగించాక, ఆ స్థానంలో హజ్రత్ సయీద్ బిన్ ఆమిర్‌ను పంపించారు. ఆయన ఖురైష్ అమ్మాయి, అందగత్తె అయిన తన భార్యను తీసుకుని అక్కడికి వెళ్ళారు. అయితే ఆయనకు తొందరగానే ఆర్థిక ఇబ్బంది ఎదురయింది. ఈ సంగతి తెలుసుకున్న హజ్రత్ ఉమర్ (రజి) వెయ్యి దీనార్లు ఆయన వద్దకు పంపించారు. ఆయన ఆ డబ్బును తీసుకుని ఇంట్లోకి వెళ్ళి, 'ఇదిగో నీవు చూస్తున్న ఈ సొమ్మును మన కోసం ఉమర్ పంపించారు' అని చెప్పారు. దానికి ఆమె, 'ఈ సొమ్ముతో ఆహార వస్తువులను కొని నిల్వచేసుకోండి' అని సలహా ఇచ్చింది. అయితే ఆయన ఏమన్నారంటే, 'నేను దీనికన్నా మంచి విషయం నీకు తెలుపనా?' మనం ఈ దీనార్లను ఒక వ్యక్తి దగ్గర భద్రపరుద్దాము. వీటిని ఆయన మనకు అత్యవసర సమయంలో తిరిగి ఇస్తాడు.'

ఇలా చెప్పిన తరువాత ఆయన ఆ దీనార్లన్నింటినీ నిశ్శబ్దంగా దానం చేసేశారు. ఈ సంగతి తెలుసుకున్న భార్య వలవలా ఏడ్చేసింది. ఇలాంటి సందర్భాల్లో ఇంట్లో ఏ ఏ సమస్యలు ఎదురవుతాయో అవన్నీ ఎదురయ్యాయి. ఆయన తన భార్యకు నచ్చజెప్పారు. చివర్లో ఇలా అన్నారు :

> "స్వర్గ కన్యల కోసం నేను నిన్ను వదలిపెట్టడానికి సిద్ధంగా ఉన్నాను. కాని నీ కోసం నేను స్వర్గకన్యలను వదలుకోవడానికి సుతరామూ సిద్ధంగా లేను."

> ఎట్టకేలకు ఆ ఇల్లాలు తన భర్తతో రాజీపడిపోయింది.

దైవమార్గంలో ఖర్చుపెట్టి, దైవప్రసన్నతను చూరగొనే అభిరుచి ప్రియసహచరులలో ఎంతగా పెరిగిపోయిందంటే, ఒకసారి దైవప్రవక్త (స) "సదఖా ఇవ్వండి.

నేను ఒక సైన్యాన్ని పంపగోరుతున్నాను" అని ప్రకటించినప్పుడు అబూ అఖీల్ అన్సారీ అనే సహచరుని వద్ద ఏమీ లేదు. ఆయన ఒక వ్యక్తి తోటలో రాత్రంతా నీళ్లు మోసి, చెట్లను తడిపారు. ఉదయం కూలీగా తనకు రెండు సేర్ల ఖర్జూరాలు లభించాయి. ఒక సేరు ఖర్జూరాలు తన ఇంటివారి కోసం వదలి, మిగిలిన ఒక సేరు ఖర్జూరాలను తీసుకుని దైవప్రవక్త (స) వద్దకు వచ్చారు.

హజ్రత్ సాద్ బిన్ ఉబాదా చేసిన ఏర్పాటు ఏమిటో తెలుసా!? ఆయన ఒక ఏడాది జిహాద్ కొరకు వెళితే, ఆయన కుమారుడు ఖైస్ ఇంటి బాధ్యతలు వహించేవారు. మరుసటి సంవత్సరం కుమారుడు (ఖైస్) జిహాద్‌కు వెళితే, తండ్రి స్వయంగా ఇంట్లో ఉండి కుటుంబ అవసరాలు తీర్చేవారు. ఆయన తన పిల్లలకు ఇచ్చిన శిక్షణ కూడా చిరస్మరణీయమే. ఒకసారి దైవప్రవక్త (స) వద్దకు చాలామంది అతిథులు వచ్చి ఆగారు. ఆ సమయంలో సాద్ బిన్ ఉబాదా ఒక సైనికదళంలో పాల్గొని ఉన్నారు. ఈ సంగతి తెలుసుకుని ఆయన ఇలా అన్నారు :

> "నా కుమారుడు గనక ఇంట్లో ఉంటే, అతడు నా సేవకునితో, 'తాళం చెవులు ఇటివ్వు. నేను దైవప్రవక్త (స) కోసం అవసరమైన వస్తువులు తీసుకుంటాను' అని అంటాడు. దానికి నా సేవకుడు గనక, 'మీ నాన్నగారి నుండి వ్రాతపూర్వక పత్రం తీసుకురండి' అని అన్నాడనుకోండి, నా కుమారుడు అతని ముక్కు పిండి, అతన్నుండి తాళం చెవులు లాక్కుని దైవప్రవక్త (స)కు కావలసిన సామగ్రిని సమకూరుస్తాడు." *(అల్ అసాబా)*

ఆయన చెప్పినట్లుగానే జరిగింది. దైవప్రవక్త (స) అతిథులకు కావలసిన వాటిని సమకూర్చడానికి ఖైస్ వంద వసఖ్‌ల ఖర్జూరాలను సమర్పించారు.

'సదకా' ప్రాముఖ్యాన్ని హజ్రత్ అబూజర్ గిఫ్ఫారీ (రజి) ఎంతో మనోజ్ఞమైన రీతిలో విశదీకరించారు :

> "ధనంలో ముగ్గురు భాగస్వాములు ఉంటారు. వాటిలో ఒకటి విధి (జాతకం). ధనాన్ని తీసుకుపోతున్నప్పుడు అది మిమ్మల్ని సంప్రతించదు. అది మంచిదయినా, చెడ్డదయినా అంతమొందించి లేదా మీకు మరణమొసగి మరీ తీసుకుపోతుంది. రెండవది : వారసత్వం. నీవు గోరీలో ఎప్పుడు నీ తలపెడతావా, నీ సొమ్ము ఎలా కబళించాలా

అని ఎదురుచూస్తూ ఉంటుంది. మూడవది : స్వయంగా నువ్వే. ఒకవేళ నీ వల్ల సాధ్యమైనట్లయితే నీవు ముగ్గురు భాగస్వాముల్లో అందరికన్నా ఎక్కువ నిస్సహాయుడుగా నిలబడకు. ఎందుకంటే, 'మీరు అమితంగా ప్రేమించే వస్తువులను దైవమార్గంలో ఖర్చు చేయనంత వరకూ సత్కార్య స్థాయికి చేరుకోలేర'ని అల్లాహ్ సెలవిస్తున్నాడు."

హజ్రత్ అనస్ (రజి) ఇలా అంటున్నారు : విశ్వాసులమాత హజ్రత్ ఆయిషా (ర.అ) మదీనాలోని తన నివాస గృహంలో ఉండగా బయటి నుంచి సందడి వినిపించింది. ఏమిటి సంగతి? అని ఆమె విచారించగా, హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) గారి వర్తక బిడారు సిరియా నుండి వస్తోందని, అందులో ఏడు వందల ఒంటెలున్నాయని, వాటిపై వర్తక సామగ్రి మోపబడి ఉందని తెలిసింది. ఇది విన్న హజ్రత్ ఆయిషా (ర.అ), "నేను దైవప్రవక్త (స) చెప్పగా విన్నాను – 'నేను అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి)ను చూశాను. అతను స్వర్గంలో దేక్కుంటూ ప్రవేశిస్తున్నాడు' అని ఆయన (స) చెప్పారు." ఈ విషయం అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్‌కు తెలిసినప్పుడు, ఆయన ఇలా అన్నారు : "నా వల్ల సాధ్యమైతే నేను స్వర్గంలో నిల్చునే ప్రవేశిస్తాను". ఇలా చెప్పిన తరువాత ఆయన ఆ ఒంటెలన్నింటినీ వర్తక సామగ్రితో సహా దైవమార్గంలో సమర్పించుకున్నారు.

హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ సాబిత్ ఇలా అంటున్నారు : నేను దైవప్రవక్త (స) ఈ విధంగా ప్రవచించగా విన్నాను – "అల్లాహ్ ప్రళయదినాన లెక్కల కోసం జనులను సమీకరిస్తాడు. అప్పుడు నిరుపేదలైన విశ్వాసులు పావురం మాదిరిగా త్రుళ్ళుతూ వస్తారు. "లెక్కల కోసం నిలబడండి" అని వారితో అనబడినప్పుడు, 'మా దగ్గర లెక్కాగిక్కా ఏమీ లేదు. లెక్క తీసుకోవడానికి మాకేమన్నా ఇవ్వబడితే కదా!' అని వారంటారు. అప్పుడు ప్రభువు, "నా దాసులు చెప్పింది నిజం" అంటాడు. వారి కోసం స్వర్గద్వారాలు తెరువబడతాయి. వారు ఇతరులందరికన్నా డెభ్భయి ఏండ్లు ముందే స్వర్గంలో ప్రవేశిస్తారు.

జకాత్ ఆజ్ఞ ఇస్తున్నప్పుడు దానిని 'వడ్డీ'తో పోల్చటం జరిగింది. దేవుడు జకాత్‌ను వికసింపజేసి, వడ్డీ ఆధారంగా నెలకొన్న ఆర్థిక వ్యవస్థను నశింపజేస్తాడని సెలవీయటం జరిగింది :

దేవుడు వడ్డీని కుంచింపజేస్తాడు. దానధర్మాలను వికసింపజేస్తాడు.

*(అల్ బఖరా : 276)*

మరోచోట ఈ విధంగా సెలవీయబడింది :

"ప్రజల సంపదలో చేరి పెరుగుతుందన్న ఉద్దేశంతో మీరు ఇచ్చే వడ్డీ, దేవుని దృష్టిలో ఎంతమాత్రం పెరగదు. కాని దైవప్రసన్నతను పొందటానికి మీరు జకాత్ ఇచ్చినట్లయితే - అలాంటివారే దైవసన్నిధిలో తమ సంపదను పెంచుకున్న వారవుతారు."

*(అర్ రూమ్ : 39)*

వడ్డీ ద్వారా స్థిరత్వం లభించదని వేరొకచోట చెప్పటం జరిగింది : వడ్డీ తినేవారు ప్రళయదినాన దెయ్యంపట్టిన ఉన్మాదిలా లేచి వస్తారు.

*(అల్ బఖరా : 275)*

అలాగే హదీసులో ఈ విధంగా వక్కాణించటం జరిగింది :

"ఏ జాతి అయినా జకాత్ ఇవ్వటం మానేసినప్పుడు అల్లాహ్ ఆ జాతిని దుర్భిక్షానికి, కరువు కాటకాలకు లోను చేస్తాడు."

*(ఔసత్ తిబ్రానీ)*

దేవుడు ఆర్థిక వ్యవస్థకు సంబంధించి ఏ సహజ విధానాన్ని రూపొందించాడో దానికి వడ్డీ విఘాతంగా పరిణమిస్తుంది. అందుకే దానికి వ్యతిరేకంగా - అవసరమైతే - యుద్ధం చేయడానికి వెనుకాడకూడదని ఆదేశించబడింది (అల్ బఖరా : 278, 279).

జకాత్ మరియు వడ్డీలలో ఈ వ్యత్యాసానికి ప్రధాన కారణం ఏమిటంటే; జకాత్ వల్ల ధన వికేంద్రీకరణ జరుగుతుంది. కాగా, వడ్డీ ధనం ఒకేచోట కేంద్రీకృతం అవుతుంది. జకాత్ ప్రాతిపదికపై రూపొందే వ్యవస్థలో ఏకకాలంలో రెండు ఆర్థిక విలువలు ఉంటాయి. ఒకటి : డబ్బుతో డబ్బు పుట్టించే విధానానికి బదులు శ్రమతో డబ్బు సంపాదించే ధోరణి. రెండు : ధనం ఒకేచోట ప్రోగవటం నుండి అడ్డుకునే ప్రక్రియ. ఎందుకంటే జకాత్ కూడబెట్టబడిన ధనంపై విధించబడుతుంది. తద్వారా మూలధనం (పెట్టుబడి) ఒకేచోట ప్రోగయ్యే స్థితి రాదు. దీనికి భిన్నంగా వడ్డీ వ్యవస్థలో ఈ రెండు ఆర్థిక మూలికలు తలక్రిందులవుతాయి. తత్ఫలితంగా డబ్బుతో డబ్బు పుట్టించే ప్రక్రియ మొదలవుతుంది - అంటే ఒక వ్యక్తి చేతికి ఒకసారి డబ్బు గనక వస్తే అతడు దానిని పెంచుకుంటూనే పోతాడు. ఈ పోకడ ఆర్థిక దోపిడీకి

దోహదకారిగా తయారవుతుంది. అది గనక ఒకసారి విజృంభించిందంటే, దానికి పట్టపగ్గాలుండవు. అదీగాకుండా ధనకేంద్రీకరణ జరగకుండా నిరోధించే ఉపాయమేదీ వడ్డీ వ్యవస్థలో లేదు.

## హజ్జ్

హజ్జ్ త్యాగానికి ప్రతీక. హజ్జ్ కొరకు మనిషి ప్రయాణం చేస్తాడు. అది సమయ త్యాగం. దానికోసం ఖర్చులు భరిస్తాడు, అది ధనత్యాగం. పశువును జిబహ్ చేస్తాడు, అది ప్రాణత్యాగం. తవాఫ్, సయీ చేస్తాడు. దీనికి అర్థం, మనిషి అన్ని వైపుల నుండి తన శ్రద్ధాసక్తులను మరల్చుకుని ఏకాగ్రచిత్తంతో అల్లాహ్ యందే మనసును లగ్నం చేయటం.

ఒక విశ్వాసి ఈ త్యాగాలన్నింటినీ ఏకకాలంలో చేయవలసి వచ్చే దైవకార్యం ఏది? "హజ్జ్ క్రియలన్నింటినీ నెరవేర్చిన మీదట దైవాన్ని స్మరించాలి. మీరు మీ తాతముత్తాతలను పూర్వం జ్ఞాపకం చేసుకున్నట్లే, అంతకంటే అధికంగానే దైవాన్ని జ్ఞాపకం చేసుకోండి." (అల్ బఖరా : 200) మహనీయ ముహమ్మద్ (సఅసమ్) ఇలా ప్రవచించారు :

> "జమరాత్‌పై రమీ చేయటమైనా (రాళ్లు రువ్వటం), సఫా – మర్వాల మధ్యన సయీ చేయటమైనా అల్లాహ్ సంస్మరణను స్థాపించడానికే నిర్ధారించటం జరిగింది." *(మిష్కాత్ – కితాబుల్ మనాసిక్)*

హజ్జ్ యొక్క ఈ సందేశం మనకు సయ్యిదినా హజ్రత్ ఇబ్రాహీమ్ అలైహిస్సలామ్ (క్రీ.పూ. 2160 – 1985) జీవితం రూపంలో ఇవ్వబడింది. ఆ త్యాగమూర్తి తన జీవితాన్నంతటినీ దైవకార్యం కొరకు అంకితం చేసేశారు. చివరకు ఆయన తన కన్న కొడుకును సయితం ఈ ధ్యేయం కొరకు – ఈ మార్గంలో – త్యాగం చేశారు. హజ్జ్‌లోని ప్రతి అడుగు మనకు ఆ గొప్ప సందేశప్రదాత జీవితాన్ని గుర్తు చేస్తుంది.

> "మీరు మషాయిర్‌లలో (హజ్జ్ స్థలాలలో) ఆగండి. ఎందుకంటే మీరు మీ పితామహుడు ఇబ్రాహీమ్ వారసత్వంలోని ఒక భాగం."
>
> *(మిష్కాత్ – కితాబుల్ మనాసిక్)*

మహనీయ ఇబ్రాహీమ్ (అ) జీవితం ఆద్యంతం సందేశ ప్రధానమైనది. ఒక

సందేశ ప్రదాతగా ఆయన జీవితంలోని చారిత్రక ఘట్టాలను సంకేతప్రాయంగా పునరావృతం చేస్తూ హజ్జ్ యాత్రికుడు దైవంతో వాగ్దానం చేస్తాడు – ఇబ్రాహీమ్ (అ) మాదిరిగానే తన జీవితాన్ని సత్యధర్మ పరిచయ కార్యం కొరకు అంకితం చేస్తానని. ఈ మార్గంలో ఇబ్రాహీమ్‌పై వచ్చినట్లుగా ఎన్ని కష్టాలు వచ్చినాసరే వాటిని అధిగమిస్తానని మాటిస్తాడు –

> 'హాజీ అని ఎవరిని అంటారు?' అని ఒక వ్యక్తి మహాప్రవక్త (సఅసమ్)ను అడిగితే, "చెదిరిన జుట్టు, వాసనవచ్చే జుట్టుతో ఉన్నవాడు" అని ఆయన (స) పలికారు. 'ఓ దైవప్రవక్తా! ఏ హజ్జ్ శ్రేష్ఠమైనది?' అని మరో వ్యక్తి ప్రశ్నించగా, "దుమ్ము ధూళి కొట్టుకుని ఉండటం, రక్తాన్ని ప్రవహింపజేయటం (ఖుర్బానీ ఇవ్వటం)" అని ఆయన (స) బదులిచ్చారు. *(మిష్కాత్ – కితాబుల్ మనాసిక్)*

వేరే మాటల్లో చెప్పాలంటే హజ్జ్‌లోని క్రమరాహిత్య జీవన స్థితి, పిచ్చి పిచ్చిగా కనిపించే క్రియలు అర్థం పర్థంలేనివి కావు. అది ఒక విధంగా లక్ష్యబద్ధమైన జీవితంలో ఎదురయ్యే అవాంతరాలను అధిగమించడానికి ఎంతకైనా తెగిస్తాననడానికి సంకేతం.

హజ్జ్ క్రియల రూపంలో మనిషి ఆఖరి హద్దు వరకూ తనను తాను తన ప్రభువు సమక్షంలో ఆత్మసమర్పణ చేసుకోవడానికి సిద్ధపడతాడు. అతడు హజ్జ్ యాత్రకు సంకల్పించుకున్నాడంటే సమయంతో పాటు ధనాన్ని కూడా త్యాగం చేయడానికి సంసిద్ధుడయ్యాడన్నమాట. ఇహ్రామ్ దీక్షబూని – ఆ స్థితిలో – అత్యవసర అవసరాలను తప్ప మిగతా వాటన్నింటినీ త్యజించానని చాటుతాడు. 'తవాఫ్' (ప్రదక్షిణ) – 'సయీ' ద్వారా తనను పూర్తిగా తన ప్రభువుకు అంకితం చేశానన్న దానికి అది ప్రతీక. 'రమీ – జమరాత్' ద్వారా అతను దైవానికి మాటిస్తున్నాడు – దైవ విరోధులుగా ఉన్న శక్తులను తరిమి కొడతాననీ, వారితో ఎట్టి పరిస్థితులలో కూడా రాజీపడనని, నిరంతరం వారితో సంఘర్షణను కొనసాగిస్తానని! పశువును ఖుర్బానీ (బలి) చేసి, తన ప్రభువు కొరకు ప్రాణత్యాగం చేయడానికి సయితం సిద్ధపడతానని మాటిస్తున్నాడు. అరఫాత్ మైదానంలో విడిది చేయటం దేనికి సూచన? హష్ర్ మైదానంలో సమస్త మానవులు దేవుని సమక్షంలో హాజరవడానికి అది నిదర్శనం. ఈ విధంగా హజ్జ్ క్రియల ద్వారా దాసునికి అర్పణ, త్యాగం, దైవభీతి, పరలోక చింతనల పాఠం ఇవ్వబడుతుంది. తద్వారా అతని యజమాని పట్ల అతనిలో

ప్రేమ జనింపజేయబడుతుంది. ఎందుకంటే దైవప్రసన్నతను చూరగొనడానికి అతను ఒక పిచ్చివాడుగా ఆయన మార్గాన పయనించాలి.

ఇస్లాంలోని నాలుగు ఆరాధనాంశాలు (అర్కాన్) నాలుగు విభిన్న కోణాల నుంచి ఒకే ఉమ్మడి భావనను సృజించే సాధనాలు. అదేమిటంటే, మానవుడు తన ప్రభువు వైపునకు ఏకోన్ముఖుడవాలి. ఆయన ప్రసన్నతను చూరగొనడమే తన జీవిత లక్ష్యంగా భావించాలి.

హజ్జ్ ♦ అనే ఆరాధన దైవప్రవక్త మహనీయ ఇబ్రాహీమ్ (అ) జీవితంతో ప్రగాఢ సంబంధం కలిగి ఉంది. ఆయన ప్రాచీన ఇరాక్‌లోని 'ఉర్' పట్టణంలో జన్మించారు. ఆయన తండ్రి విగ్రహాలయానికి ప్రధాన పూజారి. ఆయన విగ్రహాలను విరగ్గొట్టారు. తండ్రిని విమర్శించారు. చక్రవర్తి సమక్షంలో సత్య ప్రకటన చేశారు. తన జాతి ప్రజలను, వారి మార్గభ్రష్టత గురించి హెచ్చరించారు. తత్ఫలితంగా అందరూ ఆయనకు శత్రువులైపోయారు. ఆయన తన ఇల్లూ వాకిలిని వదలిపోవాల్సి వచ్చింది. ఆయన తన భార్య (సారా)ను, భ్రాతృజుడు (లూత్)ను తీసుకుని దేశం వదలిపోవడానికి సంసిద్ధులయ్యారు. కాని సత్యధర్మ పరివ్యాప్తి కార్యక్రమాన్ని మాత్రం వీడలేదు. పైగా ఆయన సందేశప్రధాన కార్యం 'ఉర్' ఎల్లలు దాటింది. అంతర్జాతీయ స్థాయిలో ఈ కార్యాన్ని నడిపే ప్రణాళికను రచించారు. ఆయన తన భ్రాతృజుడు లూత్‌ను 'సాదూమ్' ప్రాంతంలో సందేశ ప్రదాతగా నియమించారు. నేడు ఆ ప్రదేశం ట్రాన్స్‌జోర్డాన్‌గా పిలువబడుతోంది. తన చిన్న కుమారుడు ఇస్‌హాఖ్‌ను ఇదే కార్యం కొరకు కన్‌ఆన్ ప్రాంతంలో వసింపజేశారు. ఇప్పుడది పాలస్తీనాగా ప్రసిద్ధిచెందింది. పెద్ద కొడుకు ఇస్మాయీల్‌ను హిజాజ్ క్షేత్రంలోని మక్కాలో ఉంచారు. మక్కాలో ఆయన ఒక ఇస్లామ్ కేంద్రాన్ని (బైతుల్లాహ్‌ను) నిర్మించారు. ఆ సందర్భంగా ఇలా ప్రార్థించారు : నేను ఈ బంజరు భూమిలో నా సంతానాన్ని వసింపజేశాను. నీ ధర్మవ్యాప్తి కొరకే ఈ పని చేశాను. నీవు వీరి సంతతిలో నుండి ఒక ప్రవక్తను ప్రభవింపజెయ్యి (అల్ బఖరా : 129). ఆయన చేసిన ఈ దుఆ ఫలితంగానే ఆయన సంతతిలోని ఇస్మాయీలీ శాఖ నుండి అంతిమ దైవప్రవక్త (స) ప్రభవింప జేయబడ్డారు.

---

♦ *నిఘంటువు ప్రకారం హజ్జ్ అంటే సంకల్పించుకోవటం అని అర్థం. అంటే ఫలానా చోటికి వెళతానని మొక్కుకోవటం. ఈ ఆరాధనను నెరవేర్చడానికి ప్రపంచం నలుమూలల నుండి ముస్లింలు తమ తమ దేశాల నుండి బయలుదేరి ఒక ప్రత్యేక స్థలానికి చేరుకుంటారు. అందువల్లనే దీనికి 'హజ్జ్' అనే పేరుపడింది.*

మహనీయ ఇబ్రాహీమ్ (అ)కు 175 సంవత్సరాల ఆయుషు లభించింది. ఉర్ నుండి మక్కా వరకు ఆయన సందేశ ప్రధానమైన జీవితం సుమారు ఒక శతాబ్ది కాలాన్ని పరివేష్టించి ఉంది. ఈ సందేశ ప్రధానమైన జీవితంలో ఆయనకు ఎదురయిన వివిధ ఘట్టాలను స్వల్ప వ్యవధిలో – సంకేతప్రాయంగా – పునరావృతం చేసుకునే క్రియలకు మరోపేరే హజ్జ్. సుదీర్ఘ ప్రయాణం చేసి ఇస్లామ్ కేంద్ర స్థానానికి చేరుకోవటం, కాబా గృహ ప్రదక్షిణ చేయటం, సఫా – మర్వా గుట్టల మధ్యన పరుగెత్తటం, 'మినా'లో విడిది చేయటం, ముజ్దలిఫాలో రాత్రి గడపటం, జమరాత్‌పై కంకరరాళ్లు రువ్వటం, మినాలో ఖుర్బానీ ఇవ్వటం – ఇదంతా ఏమిటి? ఇవన్నీ మహనీయ ఇబ్రాహీమ్ (అ) సందేశాత్మక జీవితంలోని చారిత్రక ఘట్టాలు. వీటిని మనం మన శిక్షణార్థం పునశ్చరణ చేసుకుంటాము. ఈ సంఘటనలను పునశ్చరణ చేసుకుని, సందేశ కార్యాన్ని నిర్వర్తిస్తామని మాట ఇవ్వవలసిందిగా అల్లాహ్ అన్ని కాలాల ముస్లింలకు విధితం చేశాడు.

> "మేము ఒక పెద్ద బలి పశువును పరిహారంగా ఇచ్చి ఆ బాలుణ్ణి విడిపించాము. ఇంకా భావితరాల వారిలో అతని సచ్చరితను మిగిల్చి ఉంచాము." *(అస్ సాఫ్ఫాత్ : 107, 108)*

మహనీయ ఇబ్రాహీమ్ (అ) అన్ని రకాల పరీక్షలలో నికార్సుగా నెగ్గుకు వచ్చినప్పుడు, సర్వావస్థల్లో సందేశ ప్రధానమైన మిషన్‌పై స్థిరంగా నిలబడినప్పుడు అల్లాహ్ ఆయన విషయంలో ఓ కీలక నిర్ణయం గైకొన్నాడని ఖుర్ఆన్‌లో ఉంది :

> ఇబ్రాహీమ్‌ను అతని ప్రభువు కొన్ని విషయాలలో పరీక్షించగా, అతను అన్నింటిలోనూ ఉత్తీర్ణుడయ్యాడు. అప్పుడు అల్లాహ్ అతనితో "నేను నిన్ను ప్రజలకు నాయకునిగా చేయబోతున్నాను" అన్నాడు.
>
> *(అల్ బఖరా : 124)*

ఇక్కడ నాయకత్వం (ఇమామత్) అంటే అర్థం రాజకీయ అధికారం కాదు. ఆయన ద్వారా మానవాళికి దేవుడు తన సన్మార్గ బోధనను ప్రజలకు అందజేయగోరాడు. ఖుర్ఆన్‌లో ఒకచోట ఇబ్రాహీమ్, లూత్, ఇస్‌హాఖ్, యాఖూబ్ (అలైహిముస్సలామ్)ల ప్రస్తావన తరువాత ఈ విధంగా సెలవీయబడింది :

> ఇంకా – మా ఆదేశానుసారం ప్రజలకు మార్గదర్శకత్వం వహించ టానికి మేము వారిని ఇమాములు (నాయకులు)గా తీర్చిదిద్దాము.

సత్కార్యాలు చేస్తూ ఉండాలని మేము వారికి సూచించాము.

*(అల్ అంబియా : 73)*

ఈ 'ఇమామత్'కు మరోపేరు ప్రవక్తాపదవి లేదా దైవదౌత్యం. మహనీయ ఇబ్రాహీమ్ (అ) తదనంతరం ఇది ఆయన సంతతిలో నిరాఘాటంగా కొనసాగింది. మొదట్లో ఆయన కుమారుడు ఇస్హాఖ్ సంతతిలో దైవప్రవక్తలు వచ్చేవారు. దైవేచ్ఛ గురించి వారు మానవాళిని సావధానపరుస్తూ ఉండేవారు. ఈ పరంపరలోని కట్టకడపటి ప్రవక్త హజ్రత్ ఈసా (అలైహిస్సలామ్). ఆ తరువాత ఇబ్రాహీమ్ (అ) గారి మరో కుమారుడు ఇస్మాయీల్ సంతతిలో నుండి హజ్రత్ ముహమ్మద్ (సఅసమ్) ఆవిర్భవించారు. ఆయనతో దైవదౌత్య పరంపర పరిసమాప్తమయింది. దీన్‌ను (ధర్మాన్ని) పరిపూర్ణం, సురక్షితం గావించి, దానిని ముహమ్మద్ (స) అనుచర సమాజానికి అప్పజెప్పటం జరిగింది. ప్రళయం వరకూ దైవదాసులకు దేవుని అభిమతం ఏమిటో విశదీకరించే బాధ్యత ఉమ్మతె ముహమ్మదీపై మోపబడింది (అల్ హజ్జ్ సూరా చివరి ఆయత్ ఆధారంగా).

దైవప్రవక్త మహనీయ ఇబ్రాహీమ్ (అ)కు ఇవ్వబడిన సహీఫాలలోని ఉపదేశాల సారాంశం ఇది :

> మూసా ప్రవక్త గ్రంథాలలోనూ, తన వాగ్దానాన్ని నెరవేర్చి తన నిజాయితీని నిరూపించుకున్న ఇబ్రాహీమ్ ప్రవక్త గ్రంథాలలోనూ వివరించబడిన విషయాల సమాచారమేదీ అతనికి అందలేదా? ఆ విషయాలు ఏమిటంటే; బరువు మోసేవాడెవడూ ఇతరుల బరువును మోయడు. దేనికై మానవుడు కృషి చేస్తాడో, అది తప్ప అతనికి మరొకటి దొరకదు. త్వరలోనే అతని కృషిని చూసి, దాని ప్రతిఫలం పూర్తిగా అతనికి ఇవ్వబడుతుంది. కడకు అందరూ పోయి చేరవలసింది నీ ప్రభువు వద్దకే. *(అన్ నజ్మ్ : 36 – 42)*

అల్లాహ్ దృష్టిలో మానవుని అతి పెద్ద వ్యవహారం ఇదే. అందుకే ఎట్టి పరిస్థితిలోనూ ఈ యథార్థాన్ని మానవునికి తెలియజేయవలసిదిగా ప్రవక్తలందరి చేత వాగ్దానం తీసుకోవటం జరిగింది –

> (ఆ సందర్భాన్ని జ్ఞప్తికి తెచ్చుకో) మేము ప్రవక్తలందరి నుండి వాగ్దానం తీసుకున్నాము – (ముఖ్యంగా) నీ నుండి, నూహ్ నుండి, ఇబ్రాహీమ్

> నుండి, మూసా నుండి మర్యమ్ కుమారుడైన ఈసా నుండి. మేము వారందరి నుండి గట్టి వాగ్దానం తీసుకున్నాము – అల్లాహ్ సత్యవంతులను వారి సత్యత గురించి ప్రశ్నించటానికి, సత్య తిరస్కారుల కొరకు ఆయన బాధాకరమైన శిక్షను సిద్ధం చేసి ఉంచాడు.
>
> *(అల్ అహ్‌జాబ్ : 7, 8)*

ఇబ్రాహీమ్ ప్రార్థనాఫలం (అల్ బఖరా : 129) గా అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స) ప్రభవనం ఈ ధ్యేయం కొరకే జరిగింది. ఆయనకు అరబీ భాషలో ఖుర్ఆన్ వొసగబడింది. మక్కా పురజనులను, ఇతర మానవులను యథార్థం గురించి సావధానపరిచే బాధ్యత ఆయన (స)పై మోపబడింది.

> అలాగే నీవు ఉమ్ముల్ ఖురా (మక్కా) వారిని, దాని పరిసరాల వారిని హెచ్చరించటానికి, సందేహానికి ఆస్కారమే లేని, అందరూ సమావేశమయ్యే రోజు గురించి అప్రమత్తం చేయటానికి మేము నీ వద్దకు అరబీ ఖుర్ఆన్‌ను వహీ చేశాము. (తీర్పు అనంతరం) ఒక వర్గం స్వర్గంలో ఉండగా, మరో వర్గం నరకాగ్నిలో ఉంటుంది.
>
> *(అష్ షూరా : 7)*

అరబ్బులకు ప్రత్యక్షంగా వారు మాట్లాడే భాషలో ఖుర్ఆన్ ప్రసాదించబడింది. మిగిలిన జాతుల వారు విశ్వసించి వారితో చేరిపోయారు.

> ఆయనే నిరక్షరాస్యులైన జనులలో – స్వయంగా వారిలో నుండే ఒక ప్రవక్తను ప్రభవింపజేశాడు. అతడు వారికి దేవుని వాక్యాలను చదివి వినిపిస్తున్నాడు. వారిని పరిశుద్ధపరుస్తున్నాడు. వారికి గ్రంథాన్ని, వివేకాన్ని బోధిస్తున్నాడు. అంతకుముందు వారు స్పష్టమైన మార్గభ్రష్టతకు లోనై ఉండేవారు. ఇంకా వారితో చేరని ఇతరుల కొరకు కూడా (ఆ ప్రవక్తను ప్రభవింపజేశాడు). ఆయన గొప్ప శక్తిశాలి, వివేచనాశీలి. ఇది అల్లాహ్ అనుగ్రహం. తాను కోరిన వారికి ఆయన దీనిని ప్రసాదిస్తాడు. అల్లాహ్ గొప్ప అనుగ్రహం కలవాడు.
>
> *(అల్ జుముఅహ్ : 2 – 4)*

కాబా గృహ నిర్మాణం సందర్భంగా ఇబ్రాహీమ్ (అ) చేసిన ప్రార్థనలోని ఒక భాగం ఇది :

"ప్రజలలో కొందరి మనసులు వారి వైపునకు మొగ్గేలా చేయి."

*(ఇబ్రాహీమ్ : 37)*

అంటే నీవు ఈ స్థలాన్ని దైవదాస్యం చేసేవారి కేంద్రస్థానంగా చెయ్యి అని ప్రార్థించారు. అందువల్ల దేవుడు ఇబ్రాహీమ్ (అ) కాలం నుండే ఆ పవిత్ర స్థలాన్ని ఇస్లామీయ సముదాయానికి అంతర్జాతీయ స్థాయి కేంద్రంగా చేశాడు. "హజ్జ్ (యాత్ర)కై ప్రకటన గావించు" (అల్ హజ్జ్ : 27) అన్న ఆయత్ ఈ సందర్భంగా గమనార్హం. ఈ ఆయత్‌కు వ్యాఖ్యానంగా ఇబ్నె కసీర్ ఇలా వ్రాశారు : మక్కాలో కాబా గృహ నిర్మాణం జరగగానే అల్లాహ్ ఇబ్రాహీమ్‌తో ఇలా అన్నాడు – దేవుడు మీ కోసం ఒక కేంద్రాన్ని నిర్ధారించాడని, కాబట్టి మీరు ఇక్కడికి రావాలని ప్రజల మధ్యన ప్రకటన గావించు. ఈ కేంద్రంలో సమావేశమవటంలోని ఉద్దేశం ప్రవక్త కోరుకున్నదే. ఉమ్మతె ముహమ్మదీ ఉనికిలోని ఉద్దేశం కూడా అదే – ప్రపంచ వాసులందరి వరకు దైవ సందేశాన్ని చేరవేయటం !

> నిశ్చయంగా మానవుల కొరకు ప్రప్రథమంగా ఖరారు చేయబడిన (దైవ) గృహం బక్కా (మక్కా)లో ఉన్నదే. అది శుభవంతమైనది. సమస్త లోకవాసులకు మార్గదర్శకం కూడాను.
>
> *(ఆలి ఇమ్రాన్ : 96)*

ఈ లక్ష్యం కొరకే 'కాబా'ను ముస్లిములంతా సమావేశమయ్యే స్థలంగా చేయటం జరిగింది :

> మేము ఈ (కాబా) గృహాన్ని మానవులందరి పుణ్యక్షేత్రంగానూ, శాంతి నిలయంగానూ చేశాము. *(అల్ బఖరా : 125)*

కాబాకు గల ఈ కేంద్రస్థాయినే వేరొకచోట మానవజాతి సమైక్య జీవన సంస్థాపనకు సాధనంగా పేర్కొనటం జరిగింది (అల్ మాయిద : 97). అంటే మక్కా ఒక విధంగా ఇస్లామ్ అనుయాయుల అంతర్జాతీయ సమావేశ స్థలం. ప్రపంచం నలుమూలల ఉండే ముస్లింలు ఏటేటా అక్కడ సమావేశమయ్యేందుకు, తమ ప్రభువును ఆరాధించేందుకు, సత్య సందేశాన్ని ప్రపంచస్థాయిలో చేరవేసే ప్రణాళికను రచించుకునేందుకు ఈ ఏర్పాటు చేయబడింది. బైతుల్లాహ్ నిజధ్యేయం ఇదే. మిగతావన్నీ ఈ లక్ష్యం క్రిందికి వచ్చే అనుబంధ విషయాలే. అందుకే పూర్వం ఏ విధంగానయితే హజ్జ్ తర్వాత తమ ముత్తాతల గొప్పతనాన్ని చాటిచెప్పే భావనతో

తిరిగివచ్చేవారో, ఇప్పుడు దేవుని ఘనత్వాన్ని కీర్తించే భావనతో హజ్జ్ నుండి తిరిగి రావాలి (అల్ బఖరా : 200) అని ఉపదేశించటం జరిగింది.

హజ్జ్‌ను కేవలం ఒక 'సందర్శన'గా తలపోసేవారు, అనేకసార్లు హజ్జ్ చేయటం శుభప్రదంగా భావించేవారు హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి) పలుకులను తెలుసుకోవాలి. వాటిని అబూ నుఅయ్‌మ్ నకలు చేశారు :

> "ముస్లింలలోని ఒక ఇంటివారల మంచీచెబ్బరలను నేను ఒక నెల రోజులపాటు వాకబు చేయటం లేదా ఒక శుక్రవారం లేదా అల్లాహ్ కోరినంత కాలం చేయటం – ఇది నా పాలిట పదే పదే హజ్జ్ చేయటం కన్నా ప్రియమైనది." *(హిలియతుల్ ఔలియా – సం. 1)*

ఇకపోతే, ఈ కేంద్రం దేవునిపట్ల తమ విశ్వాసపాత్రతను అంగీకరించిన వారి కొరకే ప్రత్యేకించబడిందని, ఇతరులకు ఇక్కడ ప్రవేశించే అనుమతి ఉండదని స్పష్టంగా చెప్పబడింది.

నా ఈ గృహాన్ని, దానికి ప్రదక్షిణం చేసేవారి కొరకు, దానిలో ఏతెకాఫ్ పాటించేవారి కొరక, రుకూ సజ్‌దాలు చేసేవారి కొరకు పరిశుద్ధంగా ఉంచవలసిందని ఇబ్రాహీము, ఇస్మాయీలు నుంచి మేము వాగ్దానం తీసుకున్నాము. (అల్ బఖరా : 125)

> ఈ కేంద్రస్థానాన్ని ఆర్థికంగా మంచి స్థితిలో ఉంచమని ఇబ్రాహీమ్ ప్రార్థించారు : "నా ప్రభూ! నీవు ఈ నగరాన్ని శాంతినగరంగా చెయ్యి. ఈ నగరవాసులలో అల్లాహ్‌ను, అంతిమ దినాన్ని విశ్వసించే వారికి పండ్లు ఫలాలను ఉపాధిగా ప్రసాదించు"
>
> *(అల్ బఖరా : 126).*

అల్లాహ్ ఈ ప్రార్థనను ఆమోదించాడు. నాలుగున్నర వేల సంవత్సరాలుగా ఈ ప్రదేశం బంజరుగా ఉన్నప్పటికీ సర్వవిధాలుగా సిరిసంపదలతో భాసిల్లుతోంది. ప్రస్తుతం అక్కడ చమురు సంపద కూడా ఈ ప్రార్థనా చలువే. పారిశ్రామిక యుగం (Industrial age) లో కూడా ఈ ప్రదేశం తన 'భూ ఉత్పత్తి' ద్వారా స్వయం సమృద్ధిని సాధించడమే గాక, అభివృద్ధి చెందిన దేశాలకు దీటుగా నిలబడుతోంది. పరిశోధకులు దీనిని 'ఆక్సిడెంట్ ఆఫ్ జాగ్రఫీ' (Accident of Geography) గా

ఖరారు చేస్తున్నారు. ప్రపంచంలోని చమురు నిధుల మూడోవంతు భాగం ఇక్కడి నేలలోనే సమీకృతమై ఉంది. ఇది ప్రస్తుత ఆధునిక పరిభాషలో 'మిడిల్ ఈస్ట్'గా వ్యవహరించబడుతోంది. కాని వాస్తవానికి ఇది ఇబ్రాహీమ్ ప్రార్థనా ఫలమే.

హజ్జ్‌లో చేయబడే ఆరాధనలు దైవసామీప్యం, దైవ సహాయం పొందడానికి సాధనంగా ఉపయోగపడతాయి. ప్రపంచంలోని ముస్లిములంతా ఒకచోట చేరి, తమ ధార్మిక ప్రయోజనాల గురించి చర్చించుకుని, తాము చేసిన వాగ్దానం గురించి ఆత్మ విమర్శన చేసుకుని సరికొత్తగా కర్తవ్యపాలనకు సంసిద్ధులవటం హజ్జ్ ప్రధాన ధ్యేయం. ఇబ్రాహీమ్ విధానం పునరుజ్జీవనం కోసం వచ్చిన ముహమ్మద్ ప్రవక్త (స) కేవలం హజ్జ్ క్రియలలో చోటు చేసుకున్న చెడుగును సంస్కరించటమేగాక, ఆ పుణ్యక్షేత్రాన్ని ధార్మిక కేంద్రంగా కూడా తీర్చిదిద్దారు. ఆయన తన హజ్జ్ సందర్భంగా ఇక్కడ (అంతిమ హజ్జ్ ప్రసంగంలో) సత్య ప్రకటన గావించారు. ధర్మాదేశాలను, విధులను విడమరచి చెప్పారు. నిషిద్ధమైనవి ఏవో స్పష్టపరిచారు. తన అనుచరుల నుండి కడసారి సాక్ష్యం కూడా తీసుకున్నారు. ఈ ప్రసంగం చివర్లో "నేను విషయాన్ని చేరవేశానా?" అని తన సహచరులను అడిగారు. 'దైవప్రవక్తా! మీరు మీ కర్తవ్యాన్ని నెరవేర్చార'ని సహచరులు సాక్ష్యమిచ్చారు. సత్యతిరస్కారులకు ఆఖరి అల్టిమేటమ్ ఇవ్వడానికి కూడా ఆయన ఈ హజ్జ్‌నే వేదికగా చేసుకున్నారు.

> అల్లాహ్ తరఫు నుండి, ఆయన ప్రవక్త తరఫు నుండీ పెద్ద హజ్జ్ దినాన ప్రజలకు తెలియజేయునది ఏమనగా ... *(తౌబా : 3)*

ఈ ఆయత్ అవతరించిన సమయంలో దైవప్రవక్త మదీనాలో ఉన్నారు. అయితే తెగత్రెంపుల ప్రకటన మాత్రం హజ్జ్ దినాన మక్కాలో చేయబడింది. మక్కా నగరం ఇస్లామీయ ఉద్యమానికి శాశ్వత కేంద్రం అన్న దానికి సాక్షీభూతం.

> "పాము తన కన్నం వైపునకు ప్రాకుతూ వచ్చినట్లే దీన్ (ధర్మం) హిజాజ్ క్షేత్రం వైపునకు సమీకృతం అవుతుంది." *(మిష్కాత్)*

ఇస్రాయీల్ సంతతికి అల్లాహ్ ఆధిక్యతను ప్రసాదించాడని ఖుర్‌ఆన్‌లో ఉంది (అల్ బఖరా : 47). ముహమ్మద్ అనుచర సమాజం కొరకు 'శ్రేష్ఠ సమాజం' అన్న కితాబు ఇవ్వబడటం వంటిదే ఇదీను (ఆలి ఇమ్రాన్ : 110). బనీ ఇస్మాయీల్ (ఉమ్మతె ముహమ్మదీ) కంటే ముందు బనీ ఇస్రాయీల్‌ను ఈ లక్ష్యం కొరకు ఎన్నుకోవటం జరిగింది. అంటే సత్యధర్మం గురించి ప్రజలను సావధానపరచండి అని వారితో అనటం జరిగింది.

"ప్రపంచంలో దేవుని సాక్షులుగా నిలబడటం బనీ ఇస్రాయీల్ ఏకైక విధ్యుక్త ధర్మమై ఉండింది" (జ్యూష్ ఎన్‌సైక్లోపీడియా : సం.6, పేజీ – 2)

"దేవుని ఏకత్వం వైపునకు పిలుపు ఇస్తూ ఉండండి. సూర్యచంద్ర నక్షత్రాదుల పూజకు వ్యతిరేకంగా ధర్మయుద్ధం చేస్తూ ఉండండి" అని బనీ ఇస్రాయీల్‌కు ఆజ్ఞాపించబడింది. (పేజీ : 5)

బనీ ఇస్రాయీల్‌పై ఈ బాధ్యత మోపబడినప్పుడు, దీంతోపాటు దైవప్రవక్త మహనీయ మూసా అలైహిస్సలామ్ (క్రీ.పూ. 1520–1400) కాలంలో వారి జీవనోపాధి కొరకు అల్లాహ్ ఓ ప్రత్యేక ఏర్పాటు చేశాడు. అదే **'మన్న్ వ సల్వా'** ఆహారం. అది ఎంతో సులువుగా, కావలసినంతగా వారు విడిది చేసిన స్థావరాలలో అందుబాటులో ఉండేది. దైవ ప్రసాదితమయిన ఈ ఉపాధిని గ్రహించి, వీలైనంత అధికంగా దైవకార్యంలో నిమగ్నమవవలసిందిగా వారికి ఆజ్ఞాపించటం జరిగింది. కాని వారు ఇందలి పరమార్థాన్ని అర్థం చేసుకోలేకపోయారు. వారికి తమ పూర్వపు రుచులు, నగర జీవితపు భోగవిలాసాలు జ్ఞప్తికి వచ్చాయి. వారు మంచి స్థితికి బదులు దుస్థితికి ఇష్టపడ్డారు. ఎట్టకేలకు వారిని ఉన్నత స్థానం నుండి తొలగించటం జరిగింది. ఎందుకంటే ఇది దేవుని దృష్టిలో దైవ తిరస్కారానికి ఆనవాలు వంటిది :

> "ఓ మూసా! ఒకే రకమయిన తిండి మాకు సహించటం లేదు. మా కొరకు నీ ప్రభువును ప్రార్థించు. నేల నుండి ఉత్పత్తి అయ్యే ఆకు కూరలు, దోసకాయలు, వెల్లుల్లి, పప్పు దినుసులు, ఉల్లిపాయలు తదితర ఆహార వస్తువుల కొరకు అర్థించు" అని వారు అడిగినప్పుడు, మూసా ఇలా అన్నాడు : "ఏమిటి, మీరు ఒక మేలైన వస్తువుకు బదులుగా ఒక అధమమైన వస్తువును తీసుకోవాలనుకుంటున్నారా? అలాగైతే ఏదయినా పట్టణానికి వెళ్ళండి. అక్కడ మీరు కోరేవన్నీ మీకు దొరుకుతాయి" – ఆ క్షణం నుండే వారిపై దైన్యం, దారిద్ర్యం రుద్దబడింది. దైవ సూచనలను తిరస్కరించిన కారణంగా వారు దైవాగ్రహానికి పాత్రులయ్యారు. *(అల్ బఖరా : 61)*

అరబ్బు జగతికి లభించిన **'చమురు సంపద'** కూడా, పూర్వం బనీ ఇస్రాయీల్‌కు లభ్యమైన **'మన్న్ వ సల్వా'** ఉపాధివంటిదే. మన్న్ వ సల్వా 'దైవధర్మానికి సాక్షులుగా' ఉండే మూల్యానికి బదులుగా ప్రాప్తమయింది. అలాగే 'చమురు సంపద'

కూడా. అంతర్జాతీయ స్థాయిలో అత్యున్నత రీతిలో దైవధర్మాన్ని పరిచయం చేసే కార్యానికి మూల్యంగా అరబ్బులకు ఇవ్వబడింది.

అరబ్బు జగతిలో 'కాబా'ను నెలకొల్పి, ఆ ప్రదేశాన్ని – శాశ్వత ప్రాతిపదికపై – ఇస్లామ్ కేంద్రంగా చేయటం జరిగింది. ఒకవైపున ఆ ప్రదేశంలో చారిత్రక ఆకర్షణ పొందుపరచబడింది. తత్కారణంగా ప్రపంచం నలు దిశల నుండి, ఏటేటా లక్షల సంఖ్యలో ముస్లింలు అక్కడికి తరలి వస్తున్నారు. దాంతోపాటే మరోవైపున అది పవిత్ర స్థలంగా, శాంతి నిలయంగా ఖరారు చేయబడింది. అంటే దాని పరిసరాలలో కొన్ని కట్టుబాట్లు ఉంచబడ్డాయి. వాటికి కట్టుబడటం విధి. ఆ విధంగా అక్కడి నిర్వహణలో వేరితరుల రాజకీయ, ఆర్థిక ప్రాబల్యానికి తావు లేకుండా చేయటం జరిగింది.

# రుజుమార్గం

## ఏది రుజుమార్గం?

అల్లాహ్ సమస్త విశ్వం కొరకు ఒక పటిష్టమయిన, స్థిరమయిన మార్గాన్ని నిర్ణయించాడని ఖుర్ఆన్ ద్వారా తెలుస్తోంది. ప్రతి వస్తువు తన కొరకు నిర్ధారించిన మార్గంలో ముందుకు సాగుతున్నది (హామీమ్ సజ్దా : 11). కడకు తేనెటీగ కూడా (అన్ నహ్ల్ : 68, 69). ఏ విధంగానయితే విశ్వంలోని ఇతర వస్తువుల సరైన కార్యనిర్వహణకు సన్మార్గంపై నడవటం అవసరమో (నహ్ల్ : 69) అదేవిధంగా మనిషి విజయ రహస్యం కూడా అందులోనే ఇమిడి ఉంది. అయితే మనిషి పరీక్షించబడుతూ ఉండటం వల్ల అతనికి కేవలం మార్గబోధన చేయటంతోనే సరిపుచ్చుకోకుండా అతనికి ఒకింత ఎంపిక స్వేచ్ఛ, నిర్ణయాధికారం కూడా ఇవ్వటం జరిగింది. దాని ననుసరించి అతను సన్మార్గాన్నయినా అనుసరించవచ్చు లేదా దానిపట్ల విముఖతనయినా కనబరచవచ్చు (దహ్ర్ : 3). రుజుమార్గం ఏదో దేవుడు స్వయంగా బోధపరచినప్పుడు, మనిషి దానిని నమ్మి నడుచుకోవాలి. ఈ ఏకైక మార్గమే అతన్ని సాఫల్యం వైపునకు తీసుకుపోతుంది (ఇబ్రాహీమ్ : 12). ఒకవేళ మానవుడు ఏదయినా తాత్కాలిక విషయానికి ప్రభావితుడై వంకర టింకర దారుల్లోకి పోతే, అతను రుజుమార్గం నుండి వేరైపోతాడు. అట్టి పరిస్థితిలో అతనికి ఈ లోకంలో నష్టం తప్ప మరొకటి ఉండదు (అల్ అన్ఆమ్ : 153).

అల్లాహ్ దృష్టిలో రుజుమార్గాన ఉన్నవాడు మాత్రమే మనిషి. రుజుమార్గాన్ని వీడినవాడు పశుస్థాయికి దిగజారిపోతాడు.

> "చెప్పండి, తన ముఖం మీద (పడుతూ లేస్తూ) నడిచేవాడు ఎక్కువగా సన్మార్గం పొందుతాడా? లేక తిన్నగా రుజుమార్గంపై నడిచేవాడా?" వారికి చెప్పు : "మిమ్మల్ని సృష్టించినవాడు ఆయనే. మీ కొరకు

కళ్ళు, చెవులు, హృదయాలను చేసినవాడు ఆయనే. కాని మీరు కృతజ్ఞతలు తెలుపుకునేది చాలా తక్కువ." *(అల్ ముల్క్:22, 23)*

దీనిద్వారా అవగతమయ్యేదేమంటే తన కనే, వినే శక్తుల్ని, హృదయంలోని సామర్థ్యాన్ని సద్వినియోగం చేసుకుని జీవితం గడిపే మనిషి మాత్రమే రుజుమార్గాన ఉన్నాడు. ఈ కనే, వినే, ఆలోచించే శక్తులే మనిషిని ఇతర జీవరాసుల నుండి వేరుగా (విశిష్టంగా) ఉంచుతాయి. పశువుల ఉపమానం దీనికి భిన్నం. అవి కూడా సంచరిస్తాయి. నడయాడుతాయి. కాని కనే, వినే, ఆలోచించే శక్తులకు అవి నోచుకోవు. కాబట్టి తమకు ప్రాప్తమయిన ఈ శక్తి సామర్థ్యాల ద్వారా లబ్ధిపొందని మానవుడు మానవత్వపు స్థానం నుండి తనను తాను దిగజార్చుకుని పశువుల స్థానంలో పడవేసుకున్నాడు. అలాంటి వారు కుక్కలాంటి వారని (అల్ ఆరాఫ్ : 176) చెప్పటం జరిగింది. వారి ఉపమానం గాడిద వంటిదని (జుముఅ : 5) కూడా చెప్పబడింది. వారు పశువుల్లాంటివారని వేరొకచోట సెలవీయబడింది (అల్ ఫుర్ఖాన్ : 44). ఆఖరికి వారి దిగజారుడుతనానికి ఆఖరి హద్దు ఏమిటంటే; వారు కోతులుగా, పందులుగా చేయబడ్డారు (అల్ మాయిద : 60). పైగా వాటికన్నా హీనం –

"నిశ్చయంగా దేవుని దృష్టిలో బుద్ధిని ఉపయోగించని చెవిటివారు, మూగవారు కడు హీనమైన జంతువుల్లాంటివారు."

*(అల్ అన్ఫాల్ : 22)*

ఖుర్ఆన్‌లోని 95వ అధ్యాయంలో ఏమనబడిందంటే, దేవుడు మనిషిని అత్యుత్తమమయిన ఆకృతిలో సృజించాడు. తరువాత అతనిని (అతని స్వయం కృతాపరాధాల కారణంగా) అట్టడుగు స్థానానికి చేర్చాడు. అయితే విశ్వసించి సత్కార్యాలు చేసిన వారికి మాత్రం దీని నుండి మినహాయింపు ఇవ్వటం జరిగింది (అత్ తీన్). మొదట ప్రస్తావించబడిన స్థానం మానవత్వానిది. రెండవది : పశువులది. అంటే – మనిషిని అల్లాహ్ మానవత్వ స్థానంలోనే పుట్టించాడు. తరువాత అతనిని పశువుల స్థానంలో పడవేశాడు. ఇప్పుడు అతనికి పెట్టబడిన పరీక్ష ఏమిటంటే, అతను ఈ అట్టడుగు స్థానం నుండి తనను ఉన్నత స్థానానికి చేర్చుకోవాలి.

"మేము గనక కోరుకుంటే ఆ సూచనల ద్వారా అతనిని ఉన్నతికి చేర్చి ఉండేవారం. కాని అతను మాత్రం నేలకే అతుక్కుపోయాడు. తన కోర్కెలనే అనుసరించసాగాడు." *(అల్ ఆరాఫ్ : 176)*

ఈ రకమయిన ఆయత్‌లలో ఎవరినైతే గుడ్డివారు, మూగవారు, బుద్ధిహీనులు అని అనటం జరిగిందో వారు శారీరకంగా గుడ్డివారు, మూగవారు కారు. పిచ్చివాళ్ళలా ఏదైనా గోతిలో బొక్కబోర్లా పడిపోయిన వారూ కారు. పైగా వారు తమ కాలపు మేధావులుగా, విజ్ఞులుగా చెలామణీ అయినవారే. వారు బ్రహ్మాండమయిన ఇండ్లను, కోటలను నిర్మించేవారు. వ్యవసాయంలో, వాణిజ్యంలో ఆరితేరినవారు. వారు రాజ్యాలను ఏలేవారు. జాతులను శాసించేవారు. ఆరాఫ్ సూరాలోని పై ఆయత్ (176) అవతరణా నేపథ్యం గురించి వచ్చిన ఉల్లేఖనాల ప్రకారం అరేబియాకు చెందిన ఉమయ్యా బిన్ అబీ సలత్ పేరు వస్తుంది. అతడు నాయకత్వం, దాతృత్వంలోనే కాదు, కవనంలో, విజ్ఞతలో కూడా సుప్రసిద్ధుడే. అలాగే దైవప్రవక్త హజ్రత్ మూసా (అ) కాలం చివర్లో బలామ్ అనే ఒక వ్యక్తి ఉండేవాడు. అతను జ్ఞానిగా, సాత్వికుడుగా ఇరాక్ ప్రాంతంలో ప్రఖ్యాతి చెందాడు. ఉబాదా బిన్ సామిత్ ఖురైషు సర్దారులను అతనికి దీటైనవారుగా భావించేవారు. వారు కాబా గృహం ధర్మకర్తలైన కారణంగా యావత్ అరేబియాలో నాయకులుగా పరిగణించబడేవారు (అల్ బహ్‌రుల్ ముహీత్).

మరలాంటప్పుడు చెవిటివారు, గుడ్డివారు అవటంలోని మతలబు ఏమిటి? దీనిని అర్థం చేసుకోవటానికి మనిషికీ – గొడ్డుకీ మధ్య గల తేడాను గురించి యోచన చేయాలి. ఒక మనిషిలో ఉండే వస్తువులన్నీ పశువులో ఉన్నట్లు పైకి అనిపిస్తుంది. పశువు కూడా నడుస్తుంది, తింటుంది, త్రాగుతుంది. చూస్తుంది, బాధ నొప్పిని అనుభవిస్తుంది. మరలాంటప్పుడు వీరిద్దరినీ వేరుచేసిన వస్తువు ఏది? జీవశాస్త్రవేత్తలు ఏమంటారంటే మనిషి భావనాపరమైన ఆలోచనా (Conceptual Thought) శక్తి కలిగి ఉంటాడు. పశువులలో ఇలాంటి సామర్థ్యం ఉండదు. దీని ఆధారంగానే మానవత్వం – పశుత్వం మధ్య గల వ్యత్యాసాన్ని అర్థం చేసుకోవచ్చు. వస్తువులోని లాభనష్టాల గురించి, పరిణామాన్ని గురించి పశువులు ఆలోచించవు. దీనికి భిన్నంగా మానవుడు మానసికంగా ఒక వస్తువు మంచీ చెడులను, లాభనష్టాలను బేరీజు వేసి, అది తన అంచనాలకు అందిన తరువాతే దానిని స్వీకరిస్తాడు. దివ్య ఖుర్‌ఆన్‌లో ఈ విధంగా సెలవీయబడింది :

> ఇది దైవగ్రంథం. ఇందులో సందేహానికి తావు లేదు. భయము, భక్తి కలవారికి ఇది మార్గదర్శిని. *(అల్ బఖరా : 2)*

కేవలం భౌతిక విషయాలకు ప్రాధాన్యతనిచ్చి లాభనష్టాలకు ప్రభావితం అయ్యేవారికి ఖుర్ఆన్ మార్గదర్శకత్వం వహించదు.

ఒక ఉల్లేఖనంలో హజ్రత్ అబూబక్ర్ (రజి) ఇస్లామ్ స్వీకరించిన సంఘటనను గురించి దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు :

> "నేను ఎవరికి ఇస్లామ్ సందేశం అందజేసినా, దాని స్వీకారంపై వారికి ఎంతో కొంత ఊగిసలాట, తడబాటు లాంటివి ఎదురయ్యాయి – ఒక్క అబూబక్ర్‌కు తప్ప. నేను ఆయనకు ఇస్లామ్ గురించి వివరించి నప్పుడు ఆయన ఎలాంటి సంశయం, తాత్సారం లేకుండా వెంటనే ఇస్లామ్ స్వీకరించారు."
>
> *(అల్ బిదాయ వన్నిహాయ : సం.3, పేజీ : 27)*

అబూబక్ర్ (రజి)కు ప్రాప్తమయిన ఈ స్థానం అత్యున్నతమైనది. ఆయన తన ఎదుట ఉన్న వస్తువును పరికించి, దాని విలువను తెలుసుకునేవారు. కొందరు ఇస్లామ్ ప్రవక్తలోని ఉన్నత వ్యక్తిత్వానికి ప్రభావితులై ఇస్లామ్ స్వీకరిస్తే, కొందరు మహిమల్ని చూసి ధర్మపరివర్తన చెందారు. కొందరు ఖుర్ఆన్‌లోని సాహితీ విలువలకు ప్రభావితులై ఇస్లాం ధర్మాన్ని ఆశ్రయిస్తే, కొందరు ఇస్లామ్‌లోని భౌతిక శుభాలను చూసి అందులోకి ప్రవేశించారు. కొందరు మక్కా విజయాన్ని చూసి ఇస్లామ్‌లోనికి వచ్చారు. కాని అబూబక్ర్ విషయం వేరు. ఆయన ఆలోచనాపరంగా ఎంత ఉన్నత స్థానంలో ఉన్నారంటే, కేవలం మంచీ – చెడులను పరిశీలించి దానిని స్వీకరించటమో, త్రోసిపుచ్చటమో చేసేవారు. హజ్రత్ అబూబక్ర్ (రజి)కు మరణ ఘడియలు ఆసన్నమైనప్పుడు, ఆయన మహనీయ ఉమర్ ఫారూఖ్ పేరును ఖిలాఫత్ కొరకు ప్రతిపాదించారు. ఇది విని ప్రజల అంతరంగాలలో అలజడి రేగింది :

> తల్హా బిన్ ఉబైదుల్లాహ్ అబూబక్ర్ దగ్గరకు వచ్చి, "ప్రజలు నన్ను దూతగా చేసి మీ దగ్గరకు పంపించారు. వారేమంటున్నారంటే, మా మీద ఉమర్ కాఠిన్యాన్ని మీరు మీ జీవిత కాలంలోనే గమనించారు. అలాంటప్పుడు, మీ తదనంతరం మా వ్యవహారాలను ఆయన గారికి అప్పగిస్తే ఇక మా పరిస్థితి ఏం కావాలి? ఈ విషయమై అల్లాహ్ మిమ్మల్ని ప్రశ్నిస్తాడు. అప్పుడు మీరు ఏం సమాధానం ఇస్తారు?"

అయితే ఎవరు మానవత్వపు అత్యున్నత స్థానంలో ఉన్నారో, బాహ్యస్థితిని అధిగమించి అంతరంగాన్ని చూస్తూ ఉన్నారో వారికి కనిపించిందేమిటంటే, ఉమర్‌లోని కాఠిన్యం ఆయన స్వార్థం కొరకు కాదు, కేవలం దీన్ (ధర్మం) విషయంలోనే ఆయన కఠినాత్ములు. ఆయన రొమ్ములోని హృదయం దైవభీతితో కూడుకున్నది. సత్యంపై స్థిరంగా ఉండటానికి ఇది చాలా అవసరం. అందుకే హ॥జత్ ఉస్మాన్ (రజి) ఇలా అన్నారు : "ఆయన బాహ్యస్థితిని పట్టించుకోకండి. ఎందుకంటే ఆయన అంతరంగం ఆయన బాహ్యంకన్నా మేలైనది". ఈ మాటే హ॥జత్ అబూబక్ర్ వేరే పదాల్లో పలికారు.

రుజుమార్గాన ఉన్న వ్యక్తిలో 'అంగీకారపు' అత్యున్నత పదార్థం జనిస్తుంది. ఖురైషులు దైవప్రవక్త (స) నోట ఖుర్‌ఆన్ విని 'ఇది కవిపుంగవుని వాక్కు' అని పలికారు. 'కవి' అనేది వారి దృష్టిలో చెడ్డ పదం కాదు. కాని అల్లాహ్ దృష్టిలో మాత్రం అది 'విశ్వాస లేమి'కి చిహ్నం. అది పరిపూర్ణ విశ్వాసానికి తార్కాణం కాదు (అల్ హాఖ్ఖా : 41). వారు దానిని కవిపుంగవుని వాక్కు అని పలికి, దానిని సాహితీపరమైన అద్భుతం అని చెప్పదలిచారు. వాస్తవానికి దైవగ్రంథంలోని ఆ వాక్కు 'తిరుగులేని సత్యం'. వారు దానిని తిరుగులేని సత్యంగానే నమ్మి దానిని ఆశ్రయించాల్సింది. మక్కా విజయం సందర్భంగా నగరంలో ప్రవేశించడానికి ఒక రోజు ముందు ఇస్లామ్‌ను స్వీకరించమని దైవప్రవక్త (స) అబూ సుఫ్యాన్‌తో చెప్పినప్పుడు, అతను పారదర్శకంగా మాట్లాడాడు గాని సత్యస్వీకారానికి ముందుకు రాలేదు. అయితే ప్రవక్త పినతండ్రి హ॥జత్ అబ్బాస్ జోక్యం చేసుకుని పరిస్థితుల స్వరూపాన్ని విశ్లేషించి చెప్పిన మీదట అతను కలిమా పఠించాడు.

## వ్యక్తిగత రుజుమార్గం

కాలిబాటల, వంకరటింకర దారుల మధ్యన 'రుజుమార్గం' ఏది? దానిని ఖుర్‌ఆన్‌లో చాలా స్పష్టంగా విశదీకరించటం జరిగింది – వ్యక్తిగత జీవితం గురించి, సామూహిక జీవితం గురించి కూడా.

దివ్య ఖుర్‌ఆన్‌లోని 6వ సూరాలో ఒక భాగం ఇది :

ప్రవక్తా! వారికి ఇలా చెప్పు : "రండి మీకు వినిపిస్తాను, మీ ప్రభువు మీపై విధించిన కట్టుబాట్లు ఏవో. ఎవరినీ ఆయనకు భాగస్వాములుగా చెయ్యరాదు. తల్లిదండ్రులతో మంచిగా ప్రవర్తించండి. పేదరికానికి

భయపడి మీ సంతానాన్ని హత్య చేయకండి. మేము మీకూ ఉపాధినిస్తు న్నాము. వారికీ ఇస్తాము. అశ్లీల విషయాల దరిదాపులకు కూడా పోకండి, బహిరంగమైనవైనా సరే లేక గోప్యమైనవైనా సరే. సత్యంతో తప్ప అల్లాహ్ పవిత్రంగా నిర్ణయించిన ఏ ప్రాణాన్నీ హతమార్చకండి. ఈ విషయాలనే పాటించమని ఆయన మీకు ఉపదేశించాడు, బహుశా మీరు ఆలోచించి పని చేస్తారని. అనాథుల ఆస్తి దరిదాపులకు పోకండి, ఉత్తమమైన రీతిలో తప్ప – వారు యుక్తవయస్సుకు చేరేవరకు. కొలతలు, తూనికలో పూర్తి న్యాయం చెయ్యండి. మేము ప్రతి మనిషి పైనా అతని శక్తిమేరకే బాధ్యతా భారాన్ని మోపుతాము. పలికితే న్యాయమే పలకండి, వ్యవహారం మీ బంధువులకు సంబంధించినది అయినా సరే. అల్లాహ్‌తో చేసుకున్న ఒడంబడికను నెరవేర్చండి. ఈ మాటలను అల్లాహ్ మీకు ఉపదేశిస్తున్నాడు, బహుశా మీరు హితబోధను స్వీకరిస్తారేమో అని. ఇంకా ఆయన ఇలా ఉద్బోధిస్తు న్నాడు : నా ఋజుమార్గం ఇదే. కనుక మీరు దీనిపైనే నడవండి. వేరే మార్గాలపై నడవకండి. ఎందుకంటే అవి మిమ్మల్ని ఆయన మార్గం నుండి తొలగించి విచ్ఛిన్నపరుస్తాయి. మీ ప్రభువు మీకు చేసిన హితోపదేశం ఇదే, బహుశా మీరు వక్రవైఖరికి దూరంగా ఉంటారని."

*(అల్ అన్ఆమ్ : 151 – 153)*

ఇది వ్యక్తిగత జీవితపు 'రుజుమార్గం'. దీని సారాంశం ఏమిటంటే – ఏకదైవారాధన చేయటం, ప్రజలతో సద్భావనతో మెలగటం, దేవునిపై పూర్తి భరోసా, చెడులకు దూరంగా మసలుకోవటం, ప్రాణాన్ని గౌరవించటం, దౌర్జన్యపూరితమైన వైఖరిని విడనాడటం, ఇచ్చిపుచ్చుకోవడాల్లో నిజాయితీగా వ్యవహరించటం, ఎట్టి పరిస్థితిలోనూ న్యాయానికి బద్ధులై ఉండటం, దేవునితో చేసుకున్న ఒడంబడికకు కట్టుబడి ఉండటం, ప్రతి విషయంలో భయభక్తుల వైఖరిని అవలంబించటం అవశ్యం.

రుజుమార్గంపై ఉన్న వారు దైవానుగ్రహాలకు నోచుకున్నవారు అవుతారు (అల్ ఫాతిహా). వారిని కటిక చీకట్ల నుండి వెలికితీసి కాంతి రేఖల్లోకి తీసుకురావటం జరిగింది (ఇబ్రాహీమ్ – 1). వారికి దైవకారుణ్యంలో, దైవానుగ్రహంలో నుండి ప్రత్యేక భాగం లభించింది (అన్ నిసా : 175). కడకు వారిపై దేవుని వరప్రసాదాలు

పూర్తి చేయబడ్డాయి (అల్ ఫత్హ్ : 2). ఇలాంటి విశిష్ట అనుగ్రహాలు పొందినవారి జీవితాలు సాధారణ వ్యక్తుల జీవితాల్లా ఉండవు. వీరి జీవితాల్లో ఈ 'ప్రాప్తి' వివిధ రూపాలలో వ్యక్తమవుతూ ఉండాలి.

1. ఈ సందర్భంగా గమనించవలసిన మొదటి విషయం ఏమిటంటే, వారి విశ్వాసం ఉన్నతస్థాయికి చేరుకుంటుంది. ఒక ఉల్లేఖనం ప్రకారం హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ రవాహ (రజి) ఒక వ్యక్తితో, "రండి, కాస్సేపటి కొరకు మనం విశ్వసిద్దాం" అన్నారు. ఇది విని ఆ వ్యక్తికి కోపం వచ్చింది. 'ఏమటి, మనం విశ్వాసులం కామా?! అని ప్రశ్నించాడు. దానికి ఇబ్నె రవాహ జవాబిస్తూ, "నిశ్చయంగా మనం విశ్వాసులమే. అయితే మనం దైవ సంస్మరణ చేసినప్పుడు, మన విశ్వాసంలో వృద్ధి జరుగుతుంది" అన్నారు. ఆ తరువాత ఆ వ్యక్తి దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి, 'ఇబ్నె రవాహ విచిత్రమైన మనిషిలా ఉన్నాడు. అతడు మీరు ప్రబోధించిన విశ్వాసాన్ని వదలి కొన్ని క్షణాల విశ్వాసం వైపునకు మొగ్గుచూపుతున్నాడ'ని ఫిర్యాదు చేశాడు. అప్పుడు ఆయన (స) ఇలా ప్రవచించారు :

> "అల్లాహ్ ఇబ్నె రవాహపై దయజూపుగాక! దైవదూతలు సయితం గర్వపడే సమావేశాలను అతను ఇష్టపడతాడు"
>
> *(అనస్ బిన్ మాలిక్ – అహ్మద్)*

హజ్రత్ ఇబ్నె రవాహ పలికిన మాట విశ్వాసంలో వృద్ధికి సంబంధించినది. కాని శాసనపరమైన ఇస్లామ్‌పై ఉన్న వ్యక్తి దానిని అర్థం చేసుకోలేకపోయాడు.

2. ఇలాంటివారి దృష్టిలో విశ్వాసం (ఈమాన్)కు గల అర్థం ఎటువంటిదంటే, దాని మూలంగా వారు సంపూర్ణంగా దైవ సన్నిధిలో ఆత్మ సమర్పణ చేసుకున్నారు. దైవమార్గం నుండి వైదొలగిపోతామేమోనన్న భయాందోళన వారిని ఉక్కిరిబిక్కిరి చేసేసింది. ఖుర్ఆన్‌లో, "ఎవరయితే వెండీ బంగారాలను ప్రోగుచేసి ఉంచుతారో ..." (తౌబా : 34) అనే ఆయత్ అవతరించినప్పుడు, "బంగారం, వెండి పాడైపోను" అని మహాప్రవక్త (స) పలికారు. ఈ మాట సహచరమాన్యులను కలచివేసింది. 'ఇప్పుడు మేము ప్రోగుచేయవలసిన సంపద ఏది?' అని పరస్పరం చెప్పుకున్నారు. ఆ తర్వాత ఈ వ్యవహారం గురించి చర్చించడానికి హజ్రత్ ఉమర్ దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చినప్పుడు, ఆయన (స) ఇలా అన్నారు,

"మీలోని ప్రతి వ్యక్తీ ధ్యానం చేసే నోటిని, కృతజ్ఞతాపూర్వకమైన హృదయాన్ని పుణికిపుచ్చుకోవాలి. విశ్వాసం (ఈమాన్) విషయంలో సహాయకురాలుగా ఉండే భార్యను మనిషి చేసుకోవాలి."

*(తఫ్సీర్ ఇబ్నె కసీర్ – సం.2, పేజీ : 351)*

3. అతనిలో 'స్వీకృత' గుణం పరిపూర్ణ స్థాయిలో జనిస్తుంది. జాబిర్ బిన్ అబ్రఖ్ గాజిరీ అనే ఒక సహాబీ ఉండేవారు. ఆయన ఒంటెపై స్వారీ అయి వచ్చి, దైవప్రవక్త (స) వారి ఒక ప్రయాణంలో ఆయనతో చేరిపోయారు. దారిలో ఆయన ఒకచోట ఆగి, తన వాహనం నుండి దిగి చర్మపు గుడారంలోనికి వెళ్ళారు. ఆ గుడారు ద్వారం వద్ద జనసందోహం పెరిగిపోయింది. ఆయన ఇలా అన్నారు : నన్ను ఒక వ్యక్తి గట్టిగా తోసి ద్వారం వద్ద నుండి దూరం జరపాలనుకున్నాడు. మరోసారి గనక నన్ను తోసావంటే నేను కూడా నిన్ను తోయాల్సి ఉంటుంది, ఒకవేళ నువ్వు నన్ను కొడితే నేను కూడా నిన్ను కొడతానని అన్నాను. ఇది విని ఆ వ్యక్తి, 'ఓయీ మనుషులలోకెల్లా దుష్టుడా!' అన్నాడు. 'దైవసాక్షి! నీవు నాకన్నా ఎక్కువ దుష్టుడివి' అన్నాను. అప్పుడతను ఇలా అన్నాడు : 'ఆ మాట ఎలా అంటావు? నేను యమన్ పరిసరప్రాంతం నుండి వచ్చాను. దైవప్రవక్త నోట విన్న పలుకులను ఇక్కడి వరకూ రాలేకపోయిన నా తెగవారికి చేరవేయవలసిన బాధ్యత నా మీద ఉంది. కాని నువ్వేమో నన్ను ఆపుతున్నావు.' ఈ మాట వినగానే జాబిర్ బిన్ అబ్రఖ్ గాజిరీ ఆవేశం చల్లారిపోయింది. వెంటనే ఆయన నోట వెలువడిన మాట యిది :

"నువ్వు నిజం చెప్పావు. నేను నీకన్నా ఎక్కువ దుష్టుణ్ణి."

*(కన్జుల్ అమాల్)*

4. అతడు తన హక్కులకన్నా తన బాధ్యతల పట్ల ఎక్కువ శ్రద్ధ వహిస్తాడు. ముస్నదె ఇమామ్ అహ్మద్‌లో ఉమ్మె సలమా ఉల్లేఖనం ప్రకారం ఇద్దరు వ్యక్తులు దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చారు. ఒకానొక వారసత్వ ఆస్తిపై వారిద్దరి మధ్య వివాదం తలెత్తింది. దారిలో ప్రతి ఒక్కడూ ఆ ఆస్తి తనదంటే తనదని వాదిస్తున్నారు. కాని వారిద్దరి వద్ద స్పష్టమయిన సాక్ష్యాధారాలు లేవు. దైవప్రవక్త (స) వారిద్దరినీ ఉద్దేశించి ఇలా అన్నారు : "చూడండి! మీరు మీ వివాదాలను నా దగ్గరకు తీసుకు వస్తుంటారు. కాని నేనూ మానవమాత్రుణ్ణే. మీలో వాగ్ధాటి కలవాని మాటలు విని నేను అతని పక్షాన తీర్పు వినిపించే అవకాశం ఉండవచ్చు. కాని బాగా గుర్తుంచు

కోండి! ఒకవేళ మీ సోదరుని హక్కును గనక నేను మీకు ఇప్పించి ఉంటే ప్రళయదినాన అది అతని పాలిట నిప్పు కణికగా పరిణమిస్తుంది" – ఈ మాట విని ఆ వ్యక్తులిద్దరూ ఏడ్వసాగారు. చివరకు వారిద్దరూ, 'నా హక్కు నా సోదరునిది, నా హక్కు నా సోదరునిది' అని అనసాగారు.

5. దీనివల్ల మనిషిలో ఉన్నత దృష్టి సృజించబడుతుంది. అతడు తనకన్నా చిన్న వారిని సయితం తనకన్నా పెద్దవారుగా భావిస్తాడు. అమీర్ ముఆవియా తన పరిపాలనా కాలంలో ఒక అన్సార్ వ్యక్తి దగ్గరకు ఐదువందల దీనార్లను పంపారు. అన్సార్ వ్యక్తికి అది స్వల్పమొత్తం అనిపించింది. అతను తన కొడుకుతో, 'ఈ సొమ్మును ముఆవియా వద్దకు తీసుకెళ్ళి, అతని ముఖంమీదే కొట్టి రా' అని ఆదేశించాడు. నేను చెప్పినట్లే చేయాలి అని తన కుమారునికి ఒట్టేసి మరీ చెప్పారు. అతను ఆ సొమ్మును తీసుకుని అమీర్ ముఆవియా దగ్గరకు వచ్చాడు. 'అమీరుల్ మోమినీన్! మా నాన్నగారు నన్ను ఈ విధంగా ఆజ్ఞాపించి పంపారు. నేను ఆయన మాటను జవదాటలేను' అన్నాడు. అమీర్ ముఆవియా తన చేతిని నోటివద్ద పెట్టుకుని, "నీ తండ్రి ఆజ్ఞను తప్పక పాలించు. అయితే నీ బాబాయి పట్ల కాస్త మృదువుగా వ్యవహరించాలి సుమా!" అన్నారు. ఆ అబ్బాయి సిగ్గుపడిపోయి, ఆ దీనార్లను కాస్త దూరంగా విసిరి వెళ్ళిపోయాడు. తరువాత అమీర్ ముఆవియా ఆ దీనార్లను రెట్టింపు చేసి ఆ అన్సార్ వ్యక్తికి పంపించారు. (తారీఖుల్ ఫఖ్రి)

6. దీనిద్వారా యథార్థాన్ని తెలుసుకునే గుణం జనిస్తుంది. ఒక అతి సామాన్యమైన మనిషి సయితం మహామహులనే ఆశ్చర్యచకితుల్ని చేసే మాటలంటాడు. హజ్రత్ ఉమర్ (రజి) ఖిలాఫత్ కాలంలో సాద్ బిన్ అబీ వక్కాస్ ఖాద్సియా (పారసీక దేశం)పై దండెత్తిన రోజుల్లో పారసీక సేనాధిపతి రుస్తుంకి – ఈయన గారికి మధ్యన దూతల మార్పిడి జరిగింది. ఆ సందర్భంగానే ఒక దూత అతి నిరాడంబరంగా వైభవోపేతమైన రుస్తుం దర్బారులోకి వెళ్ళినప్పుడు ఆ దూత అతని దృష్టికి అల్పుడుగా కనిపించాడు. అతడు ఆ దూత చేతిలోని ఈటె వైపు సంజ్ఞ చేస్తూ, 'కదురు మాదిరిగా ఇదేమిటి నీ చేతిలో?' అని అడిగాడు. దానికి ఆ దూత, "ఇది చిన్నదైనంత మాత్రాన నిప్పు కణిక కోసం ఇందులో ఎలాంటి లోటు ఏర్పడదు" అన్నాడు. (తారీఖుల్ ఫఖ్రి).

7. దీనిద్వారా అతనిలో సూక్ష్మదృష్టి జనిస్తుంది. అతడు శత్రువు పన్నే కుటిల పన్నాగాలను ఇట్టే పసిగట్టేస్తాడు. హజ్రత్ ఉమర్‌తో పాటు మదీనాకు వలసపోయిన

వారిలో అయాష్ బిన్ రబీయా ఒకరు. అతను మక్కా వదలి మదీనా వెళ్ళిపోయాడని ఖురైషులకు తెలిసినప్పుడు అతని బంధువులైన అబూజహల్, హారిస్ బిన్ హిషామ్ లిద్దరూ మదీనా నగరానికి వచ్చి, 'నీవు మాతోపాటే మక్కాకు పద. నీ తల్లి నిన్ను తలచుకుని చాలా బాధపడుతోంది. నిన్ను చూసేవరకూ తల దువ్వుకోనని, నీడలో విశ్రమించనని ప్రతిజ్ఞ చేసింది' అని చెప్పారు. హజ్రత్ ఉమర్ (రజి) ఆ మాయ మాటల్లోని లోతులకు చేరుకున్నారు. నిన్ను వెనక్కి రప్పించడానికి వాళ్ళు పన్నిన కుట్ర ఇది అని అయాష్ బిన్ రబీయాతో చెప్పారు. నువ్వు వీళ్ళ మోసంలో పడకు అని కూడా సలహా ఇచ్చారు. ఇంకా ఇలా అన్నారు :

> "దైవసాక్షిగా! నీ తల్లి తలలో పేలుపడినప్పుడు ఆమె తప్పకుండా తల దువ్వుకుంటుంది. మక్కాలో ఎండలు ముదిరినప్పుడు తప్పకుండా నీడను ఆశ్రయిస్తుంది." *(అల్ బిదాయ వన్నిహాయ – సం. 3)*

కాని ఈ సలహాను అయాష్ బిన్ రబీయా ఖాతరు చేయలేదు. మక్కా వెళ్ళగానే అక్కడి జనులు అతన్ని ఉపద్రవానికి గురి చేశారు.

రుజుమార్గాన్ని అవలంబించిన ఇలాంటి వారి కొరకే గొప్ప ప్రతిఫలం ఉందనీ (తలాఖ్ – 5) శుభవార్త వినిపించబడింది. వారి చెడులు సత్కార్యాలుగా పరివర్తనం చేయబడతాయని కూడా చెప్పటం జరిగింది (అల్ ఫుర్ఖాన్ : 70). యథార్థమేమిటంటే తప్పులు ప్రతి ఒక్కరిచేత జరుగుతాయి. విశ్వాసి వల్ల, అవిశ్వాసి వల్ల కూడా తప్పులు జరుగుతాయి. అయితే నిజభావంలో దైవదాస్యం చేసే వ్యక్తి ద్వారా తప్పు జరిగిపోయినప్పుడు, అతడు రెట్టింపు పశ్చాత్తాపభావంతో దేవుని వైపునకు మరలుతాడు. ఆ విధంగా అతను చేసిన తప్పు అతనిలో వినూత్న విశ్వాస మాధుర్యానికి కారణం అవుతుంది. దీనికి ప్రతిగా రెండవ వర్గం తప్పుల చీకట్లలో తచ్చాడుతూ ఉంటుంది. దాని తప్పులు దానికి సరికొత్త విశ్వాస ఆహారాన్ని ఇచ్చే బదులు దాని కల్మషాన్ని పెంచుతూ పోతాయి.

> "నిశ్చయంగా దైవభీతి కలవారు, తమకు షైతాన్ నుండి ఏదన్నా చెడు ప్రేరణ కలిగినప్పుడు వెంటనే తేరుకుంటారు. అప్పటికప్పుడే వారికి దిశా నిర్దేశన జరిగిపోతుంది. ఇకపోతే షైతానుల సోదరులు; షైతానులు వారిని మార్గభ్రష్టత వైపునకు లాక్కుపోతారు. అందులో వారు ఏ లోటూ చేయరు." *(అల్ ఆరాఫ్ : 201, 202)*

# సామూహిక రుజుమార్గం

దైవప్రవక్త తరఫున నమాజ్ రోజాల విధానం తెలియపరచబడినట్లే ఉద్యమం ఎలా నడపాలి, శత్రువుల బలాన్ని ఎలా నిర్వీర్యం చేయాలి, ఇస్లామ్‌కు ఏ విధంగా ప్రపంచంలో ప్రాబల్యం చేకూర్చాలి అనేది కూడా తెలియపరచబడింది. వేరే మాటల్లో వ్యక్తిగత జీవితానికి ఒక రుజుమార్గం ఉన్నట్లే, సాముదాయిక జీవితానికి కూడా ఒక రుజుమార్గం ఉంది. హుదైబియా ఒడంబడిక (628) ఇస్లామ్ సామూహిక పోరాటంలో చిరస్మరణీయ ఘట్టం. ఖుర్ఆన్‌లోని 48వ సూరాలో దీనిని గురించి ప్రస్తావిస్తూ ఇలా సెలవీయటం జరిగింది :

> "విశ్వాసులకు ఇదొక సూచనగా ఉండాలని! అల్లాహ్ మిమ్మల్ని రుజుమార్గంపై నడిపించాలని!!" *(అల్ ఫత్హ్ : 20)*

హుదైబియా ఒడంబడిక నేపథ్యంలో ఈ ఆయత్ అవతరించటం వల్ల స్పష్టమయ్యేదేమిటంటే, ఆరాధనల్లో, నీతీనడవడికలలో ఒక రుజుమార్గం ఉన్నట్లే యుద్ధాలు, సంధి ఒప్పందాలలో కూడా ఒక రుజుమార్గం ఉంది.

ఎవరు రుజుమార్గంపై ఉంటాడో – వేరే మాటల్లో మానవత్వపు స్థానంలో ఉంటాడో –, ఎక్కడ అతను మాటను పూర్తిగా విని, విషయాన్ని పరికించి, ఆలోచించి నిర్ణయం గైకొంటాడో, మంకుతనాన్ని విడనాడుతాడో అక్కడ అతనికి దూరదృష్టి లభిస్తుంది. అతడు భావోద్రేకాల దశలన్నింటినీ అధిగమించి అసలు యథార్థాన్ని చూడసాగుతాడు. ఈ దార్శనికత కారణంగా అతను వేసుకునే పథకం ఖచ్చితంగా ఉంటుంది. అతని గురి తప్పదు. అతను లక్ష్య ఛేదనలో ఎలాంటి తప్పు చేయడు. హదీసులో ఇలా అనబడింది :

> "విశ్వాసి దూరదృష్టి నుండి తప్పించుకోండి. ఎందుకంటే అతడు అల్లాహ్ జ్యోతితో చూస్తాడు."

విశ్వాసులు తమకన్నా పదిరెట్లు అధికంగా ఉన్న శత్రువులను ఓడిస్తారని ఖుర్ఆన్‌లో చెప్పటం జరిగింది. కారణం ?

> "మీలో ఇరవైమంది సహనస్థయిర్యాలు కలవారై ఉంటే వారు రెండు వందల మందిపై ప్రాబల్యం వహిస్తారు. ఒకవేళ మీరు వందమంది ఉంటే వెయ్యిమంది తిరస్కారులపై ప్రాబల్యం వహిస్తారు. ఎందుకంటే వారు అవగాహన లోపించిన జనులు." *(అల్ అన్ఫాల్ : 65)*

హుదైబియా ఒడంబడిక ఈ సందర్భంగా చాలా స్పష్టమైన దృష్టాంతం. ఈ ఒప్పందం పైకి అణగిమణగి చేసుకున్నదిగా కనిపిస్తుంది. పాశవిక బుద్ధి దీని కొరకు ససేమిరా సంసిద్ధమవదు. ఒకవైపు 1500 మంది ప్రాణానికి తెగించి పోరాడే యోధులుండగా ప్రత్యర్థులు విధించిన షరతులన్నింటికీ తలొగ్గి సంధి చేసుకోవటం జరిగింది. కాని ఆ సమయంలో అది మానవీయ బుద్ధికి 'స్పష్టమయిన విజయం'గా కానవచ్చింది (అల్ ఫత్హ్ : 1)

అలాగే జీవితపు సమస్త వ్యవహారాలు, ఇహపరలోకాల విషయాలన్నింటి కొరకు ఒక రుజుమార్గం లేదా దైవమార్గం చూపబడింది. జగమంతా పూర్తిగా ఈ దైవమార్గంపైనే నడుస్తోంది. మానవుని కోసం కూడా సాఫల్యమార్గం ఇదే. ఇష్టమున్నా, ఇష్టంలేకపోయినా విశ్వవ్యవస్థ ఈ నియమానికి కట్టుబడవలసిందే (హామీమ్ సజ్దా : 11). మనిషి మాత్రం ఖుద్దుగా తన ఇష్టంతో ఈ మార్గాన నడవవలసి ఉంది.

ఖుర్ఆన్ ఏ విధంగానైతే వ్యక్తి యొక్క వ్యక్తిగత ప్రయాణం కొరకు రుజుమార్గం నిబంధనలను నిర్ధారించిందో అదేవిధంగా సాముదాయిక వ్యవహారాలలో కూడా రుజుమార్గమేదో స్పష్టపరచడానికి అనుభవపూర్వకమైన ఉదాహరణలను మన ముందు ఉంచింది. ఉదాహరణకు : హుదైబియా ఒడంబడికలో ఔచిత్యాన్ని విశదీకరించిన తరువాత, "నీకు రుజుమార్గం చూపాలని" ఈ ఏర్పాటు చేయటం జరిగిందని సెలవీయటం జరిగింది (అల్ ఫత్హ్ : 2). మరోవైపు ఏమనబడిందంటే, మనిషి పాశవిక స్థితి నుండి పైకివచ్చి మానవీయ స్థితికి చేరుకున్నట్లయితే, సాముదాయిక వ్యవహారాలలో తాను అవలంబించవలసిన స్ట్రాటజీ గురించి ఎన్నడూ తప్పు చేయదు.

1. ఈ సందర్భంగా మొట్టమొదటి మౌలిక విషయం ఏమిటంటే నకారాత్మక ఆలోచనతో ఎన్నడూ ఎలాంటి చర్యకు పూనుకోరాదు. సదా సకారాత్మక (Positive) దృష్టికోణంతో తన వ్యవహారాన్ని ముందుంచుకుని కార్యోన్ముఖులవ్వాలి. తన సాముదాయిక ప్రణాళికా రచన అంతా సకారాత్మక (Positive) లక్ష్యాల కనుగుణంగా ఉండాలి –

> "విశ్వసించిన ప్రజలారా! దేవుని కోసం (నీతికి) నిలబడేవారు, న్యాయానికి సాక్ష్యమిచ్చేవారు అవండి. ఏదయినా ఒక వర్గంతో ఉన్న శత్రుత్వం మిమ్మల్ని, వారిపై అన్యాయానికి పురికొల్పరాదు. న్యాయం చెయ్యండి. ఇది దైవభక్తికి సన్నిహితమైనది."
>
> *(అల్ మాయిదా : 8)*

నిశిత దృష్టితో చూసినట్లయితే చరిత్రలో అనేక వైఫల్యాల వెనుక కానవచ్చే కారణం ఏమిటంటే హఠం, వైషమ్యం, అసూయ, వ్యతిరేక ధోరణికి ప్రభావితమై ఒకరికి విరుద్ధంగా చర్య గైకొనబడి ఉంటుంది. ఎప్పుడు ఒక వ్యక్తి లేదా ఒక వర్గం ఈ విధమైన భావోద్రేకాలకు లోనై తన కార్యాచరణను రూపొందించినా అది అవశ్యంగా పెడదారిపట్టి ఉంటుంది. దీనికి భిన్నంగా మనిషి తన బుద్ధిని పాశవిక స్థాయి నుండి పైకెత్తి, దానిని మానవీయ స్థాయికి చేర్చినట్లయితే అతను నెగటివ్ ఆలోచనలకు లోనయ్యే ఆస్కారమే ఉండదు. అతడు తప్పకుండా పాజిటివ్ పునాదులపై తన ప్రణాళికను రచించుకుంటాడు. పాజిటివ్ ప్రాతిపదికపై రూపొందించబడిన ప్రణాళిక ఎన్నడూ విఫలం అవదు.

> "సత్యతిరస్కారులు తమ హృదయాలలో అహంభావాన్ని పెంచుకున్నప్పుడు – అందునా వారు అజ్ఞానపు కుహనా ప్రతిష్ఠకు పోయినప్పుడు – అల్లాహ్ తన ప్రవక్తపై, విశ్వాసులపై తన తరఫు నుండి నెమ్మదిని అవతరింపజేశాడు. అల్లాహ్ వారిని భక్తి వాక్యానికి (నైతిక నియమానికి) కట్టుబడి ఉండేలా చేశాడు. వారు దానికి హక్కుదారులు, యోగ్యులు కూడాను. అల్లాహ్ ప్రతిదీ క్షుణ్ణంగా తెలిసినవాడు."
>
> *(అల్ ఫత్హ్ : 26)*

అంటే, ఇస్లామ్ సాముదాయిక పోరాటాన్ని రుజుమార్గంపై ఉంచే విధానం ఏమిటంటే, ప్రత్యర్థి నుండి ఎలాంటి అజ్ఞానపు వెకిలి చేష్టలు వ్యక్తమైనప్పటికీ, మనం దానిని సహిస్తూ భక్తివాక్యాన్ని గట్టిగా పట్టుకుని ఉండాలి. వేరేమాటల్లో చెప్పాలంటే అవతలి వర్గం అవలంబిస్తున్న వైఖరికి రెచ్చిపోయి, ప్రతిచర్యకు పూనుకోరాదు. పైగా సకారాత్మక భావాలతో తాము రూపొందించుకున్న నిర్ణీత నియమాల, ఆశయాల వెలుగులో తమ సామూహిక కార్యాచరణకు నడుం బిగించాలి. వర్తమానం బదులు సదా భవిష్యత్తుపై దృష్టిని నిలపాలి.

2. అలాగే సామూహిక మార్గదర్శకత్వానికి సంబంధించిన మరో ముఖ్య నియమం ఏమిటంటే ప్రభువు మార్గాన్ని (నహ్ల్ : 69) అవలంబించాలి. ఈ సందర్భంగా ఖుర్ఆన్‌లో వృక్షం ఉపమానం ఇవ్వబడింది. వృక్షం మొదట నేలలో వ్రేళ్ళూనుకుంటుంది. ఆ తరువాత నెమ్మదిగా పైకి ఎదుగుతుంది. అలాగే మిల్లత్ నిర్మాణంలో అంతర్గత పటిష్టతకు ఎల్లప్పుడూ ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలి. వ్రేళ్ళ

బాగా లోపల దిగకముందే బయటి చర్యకు పూనుకోరాదు. వృక్షాన్ని పెంచడానికిగాను ఏ పద్ధతి అవలంబించబడిందో, దానినే సమాజ నిర్మాణం కొరకు అనుసరించాలని ఉపదేశించటం జరిగింది :

> దేవుడు 'కలిమయె తయ్యిబా' (సద్వచనం)ను దేంతో పోల్చాడో మీరు చూడలేదా? అదొక పవిత్ర వృక్షం (మేలు జాతి వృక్షం) వంటిది. దాని వేరు భూమిలోపల బాగా పాదుకుని ఉంది. దాని కొమ్మలు అంబరాన్ని చుంబిస్తున్నాయి. అది ఎల్లవేళలా తన ప్రభువు ఆజ్ఞతో ఫలాలనిస్తుంది. జనులు ఉపదేశం గ్రహించగలందులకు దేవుడు ఈ విధంగా ఉపమానాలు ఇస్తుంటాడు. 'కలిమయె ఖబీసా' (దుష్టవచనం) ఉపమానం దుష్టజాతి వృక్షం వంటిది. అది భూమి ఉపరితలం నుండే పెరికి వేయబడుతుంది. దానికి స్థిరత్వం అంటూ ఉండదు. విశ్వసించిన వారికి దేవుడు స్థిరమయిన వాక్కు ద్వారా, ప్రాపంచిక జీవితంలోనూ పరలోకంలోనూ నిలకడను ఇస్తాడు. దేవుడు దుర్వర్తనులను మాత్రం మార్గభ్రష్టుల్ని చేస్తాడు. దేవుడు తాను తలచిన దానిని చేసితీరుతాడు. *(ఇబ్రాహీమ్ : 24 – 27)*

ఆలోచించండి, ఈ ఉపమానాలు చాటిచెప్పేదేమిటి? ఏ వర్గమైనా తన వైఫల్యాలను మరొక వర్గంపై ఎగదోసినట్లయితే, అది వాస్తవానికి 'చెడుజాతి వృక్షాన్ని' పెంచి పోషించిందని చాటుతుంది. ఒకవేళ అది గనక తన సామూహిక నిర్మాణాన్ని మేలుజాతి వృక్షం నియమంపై చేపట్టివుంటే, 'ఫలానా వర్గం వారు నా వృక్షాన్ని పెకలించార'ని కాకిగోల చేసేందుకు ఆస్కారమే ఉండేది కాదు.

3. హిజ్రీ మూడవ సంవత్సరంలో బద్ర్ సంగ్రామం ఎదురైనప్పుడు ముస్లింల ముందు రెండు లక్ష్యాలున్నాయి. ఒకటి : అబూ సుఫ్యాన్ నేతృత్వంలో సిరియా నుండి మక్కాకు వెళుతున్న ఖురైషుల వర్తక బిడారు. ఆ వాణిజ్య బృందం వద్ద వెయ్యి ఒంటెలు, యాభై వేల దీనార్ల వస్తుసామగ్రి ఉంది. రెండు : మరోవైపున ఖురైషుల సైనికదళం. వెయ్యిమంది సైనికులతో కూడిన ఆ దళం మదీనా వైపునకు వస్తోంది. ఆ సైన్యంలో అబూ జహల్‌తో సహా ఖురైషు హేమాహేమీలు ఎందరో ఉన్నారు. దైవప్రవక్త (స) తన సహచరులను సంప్రతించినప్పుడు, వర్తక బిడారు వైపునకు వెళ్ళటం పట్ల కొంతమంది ఆసక్తి కనబరిచారు. ముస్లింలు హిజ్రత్ చేసి

మదీనాకు వచ్చిన ఆ రోజుల్లోనే మక్కా బహుదైవారాధకుల వాణిజ్య బృందాలు సిరియా నుండి మక్కాకు రాకపోకలు సాగించేవి. ఆ వాణిజ్య బృందాలపై దాడిచేసి శత్రువును ఆర్థికంగా కోలుకోకుండా చేయాలి, మరోవైపున ముస్లింలను ఆర్థికంగా బలం చేకూర్చాలన్న స్ట్రాటజీ కూడా ఎన్నదగినదే. కాని ఖురైషు సైన్యాన్ని ప్రతిఘటించాలన్నది దైవప్రవక్త (స) ఆలోచన. మరి కొంతమంది అగ్రశ్రేణి సహచరమాన్యుల అభిప్రాయం కూడా అదే –

> ఆ రెండు సమూహాలలో ఏదో ఒకటి మీ చేతికి చిక్కుతుందని దేవుడు ఒక వైపున మీతో వాగ్దానం చేస్తూ ఉండగా, కనీసం ముల్లయినా గుచ్చుకోనిది మీకు తారసపడాలని మీరు కోరుకున్నారు. కాని దేవుని తలంపు మరో విధంగా ఉంది. ఆయన తన వాక్కు ద్వారా సత్యాన్ని సత్యంగా రూఢపరచాలని, సత్యతిరస్కారుల దుంప త్రెంచివేయాలని నిశ్చయించుకున్నాడు. *(అల్ అన్ఫాల్ : 7)*

మదీనాలోని అభాగ్యజీవులు, ఆర్థికంగా బాగా చితికిపోయినవారు వర్తక సామగ్రితో నిండివున్న బిడారును వదలి, తమకన్నా మూడు రెట్లు అధికంగా ఉన్న సైనిక దళాన్ని మార్కొనడానికి బయలుదేరుతుందని పాశవిక బుద్ధి ఊహించనయినా లేదు. సైనికబలాన్ని కకావికలం చేయటం ఎన్ని సత్ఫలితాలనిస్తుందో మానవీయ బుద్ధిమాత్రమే అర్థం చేసుకోగలదు. కడకు ఆర్థిక ఒనరుల ప్రాప్తి కూడా దీని ద్వారానే సాధ్యం. అసత్యం నడుం విరిచినట్లయితే ప్రాపంచిక ఉద్దేశాలు కూడా వాటంతటఅవే నెరవేరుతాయి. బద్ర్ విజయం ద్వారా అదే ప్రాప్తమయింది.

4. సామూహిక కార్యాచరణను రుజుమార్గంపై నడిపించే ఒక సూత్రం ఏమిటంటే, సమయస్ఫూర్తితో తమకు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవటం. అంతేగాని భవిష్యత్తులోని లక్ష్యాల ప్రాతిపదికపై భారీఎత్తున చర్యకు ఉపక్రమించకూడదు. ఈ సూత్రంపై అమలుకు సంబంధించిన ఒక దృష్టాంతం హిజ్రీ 1వ సంవత్సరంలో దైవప్రవక్త (స) మదీనాలోని బహుదైవారాధకులతో, యూదులతో చేసుకున్న ఒప్పందం. దైవప్రవక్త (స) మదీనాకు వలస వచ్చినప్పుడు అక్కడి ముస్లిములతో పాటు బహుదైవారాధకులు, యూదులు కూడా చాలా పెద్ద సంఖ్యలో ఉన్నారు. దైవప్రవక్త (స) వారితో ఒక్కసారిగా సంఘర్షణా వైఖరిని అవలంబించలేదు. ఆనాటి పరిస్థితుల్లో అక్కడ వారికి గల సామాజిక స్థాయిని

అంగీకరిస్తూ, ముస్లింలు తమ పద్ధతి ననుసరించి మెలగుతారని, యూదులు తమ పద్ధతి ప్రకారం మెలగుతారని ప్రకటించారు.

5. ప్రత్యర్థికి ప్రతిగా సాధ్యమైనంత వరకు ప్రతిచర్యను పూనుకోకుండా ఉండాలి. ఆఖర్లో అనివార్యమైనప్పుడే 'చర్య' గైకొనాలి. తమ జీవన అవకాశాలను మెరుగుపరచుకునే శాశ్వత కార్యాచరణ ముస్లింల వద్ద ఉండాలి. దాని కొరకు వారు అవలంబించే వైఖరి శత్రువు ఉపాధి అవకాశాలను కుంచించుకుపోయేలా ఉండాలి. హజ్రత్ అలీ గారి ఒక ఉల్లేఖనం ప్రకారం ఆయన (స) ఇలా అన్నారు :

> "వారు ఇరుకైన దారిగుండా సాగిపోవటం తప్ప మార్గాంతరం లేని పరిస్థితిని సృష్టించండి". *(తిర్మిజీ)*
>
> ఇదే యథార్థం ఖుర్ఆన్‌లో ఈ విధంగా సెలవీయబడింది :
>
> "ఏమిటి, మేము నేలను ఏ విధంగా దాని దిశలన్నింటినుండీ కుదించు కుంటూ వస్తున్నామో వారు గమనించటం లేదా? ఇంత జరిగినా వీరే ప్రాబల్యం వహిస్తారటనా?" *(అల్ అంబియా : 44)*

ఇస్లామ్ నిశ్శబ్దంగా తన ప్రచార కార్యక్రమం ద్వారా నిరంతరం వ్యాపిస్తూ పోతోందని పై ఆయత్ చెప్పకనే చెబుతోంది. మక్కాలోని ఎందరో ప్రముఖులు ముస్లింలుగా ధర్మపరివర్తన చెందారు. మక్కా పరిసరాలలోని పలు తెగలు (గిఫ్ఫార్, ముజైనా, జుహైనా) ఇస్లామ్ పరిధిలోనికి వచ్చేశాయి. మక్కావాసుల వాణిజ్య మార్గంలో ఉన్న మదీనాలోని తెగలు (ఔస్, ఖజ్రజ్) ఇస్లామ్‌ను స్వీకరించాయి. ఈ విధంగా ఇస్లామ్ వ్యతిరేకుల ప్రదేశం రాను రాను – అనుదినం – కుంచించుకుపోతూ ఉంది. దీనికి భిన్నంగా ఇస్లామ్ పరిధి నిరంతరం విస్తరిస్తూపోతోంది. అతి త్వరలోనే మక్కావాసులు ఇస్లామ్‌ను ఆశ్రయించక తప్పని సమయం ఆసన్నం కానున్నది.

బలాన్ని కూడగట్టుకోమని ఖుర్ఆన్‌లో ఆదేశించటం జరిగింది. అయితే ఈ బలం తప్పనిసరిగా ప్రయోగించడానికి కాదు, శత్రు శిబిరంలో భయాన్ని, ఒత్తిడిని పెంచటమే దీని అసలు ఉద్దేశం (అల్ అన్ఫాల్ : 60). అందుకే ఇస్లామ్ ప్రవక్త ఇలా ప్రవచించారు :

> "ఒక నెల రోజుల ప్రయాణ దూరం వరకు నాకు భయోత్పాతం ద్వారా సహాయం చేయటం జరిగింది."

ఈ 'భయోత్పాతం' ద్వారానే ఆయన (స) జీవిత కాలంలో ఎన్నో విజయాలు

వరించాయి. ఆయన జీవిత కాలంలో 80 యుద్ధాలు ఎదురైనప్పటికీ శత్రువును కేవలం 9 సార్లు మాత్రమే మార్కొనవలసి వచ్చింది. మిగిలినవన్నీ భయోత్పాతం వల్ల జయించబడినవే.

ప్రస్తుత ఆధునిక యుగంలో వైజ్ఞానిక, సాంకేతిక ప్రగతి ఈ స్థానాన్ని ఆక్రమించింది. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత జపాన్ ఈ విధానాన్నే అవలంబించింది. తత్ఫలితంగా అమెరికా జపాన్ నుండి తోకముడిచి, వెళ్ళిపోవాల్సిన అగత్యం ఏర్పడింది. మరి చూడబోతే అమెరికాకు వ్యతిరేకంగా జపాన్ ఎలాంటి సైనిక చర్య గైకొనటంగానీ, రాజకీయ శక్తిని ప్రయోగించటంగానీ చేయలేదు.

6. ఈ సందర్భంగా గమనించవలసిన అతి ముఖ్యమైన సూత్రం వాస్తవిక దృష్టి. ఇది సాధారణంగా మనిషికి అంత తొందరగా మింగుడుపడదు. వాస్తవిక దృష్టి అంటే ఏమిటి? భావావేశాలకు లోనై, ప్రతీకార భావంతో ఊగిపోయే బదులు బౌద్ధిక నిర్ణయం ప్రకారం చర్య గైకొనటం! బాహ్యాపరమైన ఆకర్షణలకు ప్రభావితం అవకుండా విషయం లోతుల్లోకి పోయి, పరిశీలించి పని చేయటం!! సమీప ప్రయోజనాలకు బదులు బహుదూరం వరకు ప్రయోజనాలు చేకూర్చేలా దూరదృష్టితో వ్యూహరచన చేయటం!!! శీఘ్ర విజయాలకు బదులు విజయపరంపరకు కారణభూతమైన దానిని పట్టుకుని శత్రువు బలాన్ని నిర్వీర్యం చేయటం!!!!

దైవప్రవక్త (స) ఇస్లామీయ సందేశాన్ని అందజేసిన తీరును ఒక్కగానొక్క మాటలో చెప్పాలంటే, దాని కొరకు 'వాస్తవిక దృష్టి'కన్నా సమంజసమైన పదం మరొకటి దొరకదు. మక్కాలో ఆయన (స) ముందు – పవిత్ర కాబాలో – 360 విగ్రహాలు ప్రతిష్ఠించబడి ఉన్నాయి (మరి కొన్ని ఉల్లేఖనాల ప్రకారం అంతకన్నా ఎక్కువే ఉన్నాయి). అయితే ఆయన (స) వాటిని పవిత్ర కాబా ప్రాంగణం నుండి తొలగించడానికి ఆందోళన చేపట్టలేదు. తన చుట్టుప్రక్కల ఉన్న 'సామ్రాజ్యవాద ప్రభుత్వాల" ఉద్దేశాలేమిటో ఆయన (స)కు తెలుసు. కాని ఆయన (స) వాటికి వ్యతిరేకంగా పల్లెత్తుమాట అనలేదు. మక్కావాసులు ఆయన్ని కడతేర్చాలని కుట్ర పన్నినప్పుడు వీరమరణం కొరకు తనను తాను సంసిద్ధం చేసుకోలేదు. పైగా నిశ్శబ్దంగా – రహస్యంగా – మక్కా వదలి వెళ్ళిపోయారు. అన్సార్ల బృందం మక్కా నగరానికి వచ్చి ఆయన చేతిలో చెయ్యేసి విధేయతా ప్రమాణం (బైఅత్) చేసినప్పుడు, వారి నాయకుడు ఇలా అన్నాడు :

'దైవప్రవక్తా! మీకు సత్యం ఇచ్చి పంపిన వాని సాక్షిగా చెబుతున్నాము. మీరు గనక కోరినట్లయితే మేము రేపే 'మినా' వాసులపై ఖడ్గాలతో దండెత్తటానికి సిద్ధంగా ఉన్నాము.'

*(తహ్‌జీబ్ సీరత్ ఇబ్నె హిషామ్ – సం.1, పేజీ : 105)*

దీనికి సమాధానంగా ఆయన (స) ఏమన్నారో తెలుసా! "ఆ మేరకు మేము ఆజ్ఞాపించబడలేదు. మీరు మీ మీ నివాసాలకు తిరిగి వెళ్ళండి." – ఖైబర్‌లో నిత్యం ఆయన (స)కు వ్యతిరేకంగా కుట్రలు జరిగేవి. కాని మక్కావాసులతో హుదైబియా ఒడంబడిక జరగనంత వరకూ ఆయన (స) ఖైబర్ ముట్టడికి సంసిద్ధులు కాలేదు. హుదైబియా ఒడంబడిక సందర్భంగా ఖురైషులు రెచ్చగొట్టే ప్రయత్నాలు చేశారు. ఆ సమయంలో ఒక్క అబూబక్ర్ (రజి) తప్ప మిగిలిన సహచరమాన్యులంతా ఆవేశంతో ఊగిపోయారు. కాని దైవప్రవక్త (స) మాత్రం ఎంతో సంయమనంతో వ్యవహరించి సంధిపత్రంపై తన ఆమోదముద్ర వేశారు.

దివ్య ఖుర్‌ఆన్‌లో ఈ నిగ్రహం, సంయమనం, వాస్తవిక దృష్టికి ఎంతో ప్రాముఖ్యత ఇవ్వబడింది. సూరయె హూద్‌లోని చివరి వాక్యాలలో సెలవీయబడింది – (ప్రవక్తా!) అన్యుల తాత్కాలిక విజయాలను చూసి, వారి ఆచరణా వైఖరే సరైందేమోనని నీవు తలపోయకు. నీకు ఉపదేశించబడిన విధానానికి నీవు కట్టుబడి ఉండు. ఈ రకమయిన సంశయాల కారణంగానే యూదులు విభేదాలకు లోనయ్యారు. దారిలో పెడదారి తీశారు. తత్కారణంగా రుజుమార్గం వారి నుండి వేరైపోయింది. నీవు మాత్రం అలా చేయకూడదు సుమా! అన్యథా నిన్ను అగ్ని చుట్టుకుంటుంది. నీవు దైవ సహాయానికి దూరమైపోతావు.

## సహాయానికి నోచుకునే సూత్రం

రుజుమార్గంపై ఉన్న వానికి దైవ సహాయం అందుతుందని వాగ్దానం చేయటం జరిగింది –

"అల్లాహ్ నీకు రుజుమార్గం చూపాలనీ, నీకు గొప్ప సహాయం అందించాలనీని." *(అల్ ఫత్హ్ : 3)*

దైవ సహాయం ఎంత నిశ్చయమైనదో, దైవ సహాయానికి యోగ్యత కూడా అంతే అవసరం. ఆ యోగ్యత లేకుండా దైవ సహాయం అందదు. ఇది దైవ సంప్ర దాయం. దైవ సంప్రదాయంలో ఎప్పుడూ ఎలాంటి పరివర్తన ఉండదు (ఫాతిర్:43).

ఒకవేళ ఎవరయినా ఒక వ్యక్తి వ్యాకులతకు గురైనప్పుడు కేవలం అతను చేసే ప్రార్థన మాత్రమే సహాయాన్ని తీసుకువస్తుంది :

"దీనుడు (కలత చెందినవాడు) మొరపెట్టుకున్నప్పుడు, అతని మొరను ఆలకించి, అతని బాధను దూరం చేసేవాడెవడు?"

*(అన్ నమ్ల్ : 62)*

అంటే ఎవరయితే వ్యాకులతకు లోనయ్యాడో అతను దైవ సహాయానికి నోచుకోవటానికి కేవలం వేడుకోలు వచనాలే దోహదపడతాయి. అతడు వేడుకున్నప్పుడు దైవసహాయం అతనికి అందుతుంది. కాని ఏ వ్యక్తి లేదా ఏ వర్గం వ్యాకులతకు లోనై ఉండదో వారు వేడుకోలు (దుఆ)తో పాటు మరికొన్ని షరతులను కూడా నెరవేర్చవలసి ఉంటుంది.

ఒకటేమిటంటే వారు వేడుకోలు (దుఆ)కు అనుగుణంగా ఆచరించవలసి ఉంటుంది –

పవిత్ర వచనం ఆయన వైపునకు ఎగబ్రాకుతుంది. సదాచరణ దానిని మరింత ఉన్నతికి చేర్చుతుంది. (ఫాతిర్ : 10)

వేడుకోలు (దుఆ) రీత్యా సదాచరణ లేదా దానికి అనుగుణమైన ఆచరణ ఏది? ఏదేని వ్యవహారంలో సహాయం అర్థించడానికి మనిషి చేసే వేడుకోలును బట్టి అది ఉంటుంది – ఒకవేళ ఎవరయినా ఖుర్ఆన్ ఆదేశాలను, పరమార్థాలను తెలుసుకునేందుకు దుఆ చేస్తున్నట్లయితే, ఆ దుఆకు అనుగుణమైన ఆచరణ ఏమిటంటే, అతను దైవగ్రంథంలో చింతన చేయాలి (సాద్ : 29). ఎవరయినా ఆర్థిక సహాయం కొరకు అర్థిస్తున్నట్లయితే, దుఆతో పాటు అతను ఉపాధిమార్గాలలో తగు రీతిలో సాధన చేయాలి (జుముఆ : 10). అన్యులకు వ్యతిరేకంగా సహాయం అర్థిస్తున్నట్లయితే తమ పంక్తులలో ఐకమత్యాన్ని పెంపొందించుకోవాలి (అన్ఫాల్ : 46). ఇస్లామ్ పరివ్యాప్తికై దుఆ చేసేమాటైతే ఇస్లామ్ పరిచయ కార్యక్రమాన్ని చేపట్టాలి. ఎందుకంటే, పురములలో నివసించే జనులు సత్యం గురించి తెలియని స్థితిలో ఉండగా – వారి దుర్వర్తన కారణంగా – వారిని తుదముట్టించడం ప్రభువు విధానం కాదు (అల్ అన్ఆమ్ – 131).

దైవ సహాయానికి పాత్రులవడానికి నిరూపించుకోవలసిన మరో ముఖ్య విషయం నిగ్రహం, సంయమనం. అంటే ఏదేని ఒక జాతికి వ్యతిరేకంగా దైవ

సహాయాన్ని అర్థిస్తున్నప్పుడు, ఆ జాతివారు పెట్టిన బాధలపై ఓర్పు వహించాలి (ఇబ్రాహీమ్ : 12). అంటే, విరోధికి వ్యతిరేకంగా చర్యకు పూనుకోకుండా, అతడు పెట్టిన బాధలను ఓపికతో భరించాలి. అతని ముందు అదేపనిగా డిమాండ్లు చేసే బదులు మౌన వైఖరిని అవలంబించాలి.

ఈ షరతులకు కట్టుబడి దైవ సహాయం అర్థించినట్లయితే ఇస్లామ్ అనుయాయులకు సహాయం చేస్తానని అల్లాహ్ వాగ్దానం చేస్తున్నాడు. అట్టి పరిస్థితిలో వారు 20 మంది ఉంటే 200 మంది అసత్యవాదులపై ప్రాబల్యం వహిస్తారు (అల్ అన్ఫాల్ : 65). ఈ నిష్పత్తి ఇంతకన్నా తక్కువగా కూడా ఉండవచ్చని ఇస్లామీయ చరిత్రలోని ఎన్నో సంఘటనలు నిరూపిస్తున్నాయి. ...

'రుజుమార్గం' (సిరాతె ముస్తఖీమ్)పై నడిచేవాడు దైవ సహాయంతో విజయం సాధిస్తాడు – అంతమాత్రాన అతనికి నష్టం వాటిల్లదని దీని అర్థం కాదు. సాధన చేస్తున్నప్పుడు ప్రత్యర్థికి వాటిల్లినటువంటి నష్టాలే ఇతనికీ వాటిల్లుతాయి. ఇతను కూడా ప్రత్యర్థి మాదిరిగానే దెబ్బ తినవలసి ఉంటుంది (ఆలి ఇమ్రాన్ : 140). అయితే రుజుమార్గంపై నిజాయితీగా నడుస్తూ, ఆ మార్గంపై స్థిరంగా ఉన్నవానిదే అంతిమ విజయం అవుతుంది.

ఇస్లామీయ చరిత్రలో ముస్లింలు ఎన్నోసార్లు నష్టాలను ఎదుర్కోవాల్సి వచ్చింది. ఉహుద్ యుద్ధం (షవ్వాల్, హిజ్రీ – 3)లో రణనీతిలో భాగమైన ఒక ఆజ్ఞను తెలియక ఉల్లంఘించిన కారణంగా తీవ్రమయిన నష్టాన్ని చవిచూడాల్సి వచ్చింది. హునైన్ యుద్ధం (షవ్వాల్, హిజ్రీ – 8)లో ముస్లింల గూఢచార వ్యవస్థ సరిగ్గా లేకపోవటం వల్ల, వారు లోయలోకి రాగానే కొండల్లో పొంచివున్న శత్రువులు వారిని ఒక్కసారిగా ముట్టడించి, బాణాల వర్షం కురిపించారు. తాయిఫ్ (హిజ్రీ – 8)ను ముట్టడించినప్పుడు కూడా అంతే. మూడు వారాలపాటు ఎంతో నష్టాన్ని భరించిన మీదటగాని అది కైవసం కాలేదు. ముతా యుద్ధం (జమాదివుల్ అవ్వల్, హిజ్రీ –8)లో మూడు వేలమంది ముస్లిం యోధులలో ఏడువందల మంది అమరగతి నొందారు.

అయినప్పటికీ ఖుర్ఆన్ వాగ్దానం ప్రకారం అంతిమ విజయం రుజుమార్గాన్ని అవలంబించే వారిదేనన్న దృఢ నమ్మకం ముస్లింలలో ఏర్పడింది. ఈ విజయం కొరకు కొంత ప్రాణనష్టం సంభవించినా ఫరవాలేదనుకున్నారు. ఎందుకంటే

(ధర్మయుద్ధంలో) మరణించినవాడు, మరణించి స్వర్గానికి పోతాడు. అతడు చేసిన ప్రాణత్యాగం బ్రతికి ఉన్నవారిని దైవ సహాయానికి అర్హులుగా చేస్తుంది. అది వారి కొరకు విజయద్వారం తెరుస్తుంది. ఉమర్ ఫారూఖ్ ఖిలాఫత్ హయాంలో రబీ బిన్ ఆమిర్ రుస్తుం దర్బారులోనికి వెళ్ళినప్పుడు, అతనికి ఇస్లామ్ ధర్మాన్ని పరిచయం చేశారు. ఆ సందర్భంగా ఆయన ఇలా అన్నారు : 'దైవ వాగ్దానాన్ని చేరుకునే వరకూ మేము పోరాడుతూనే ఉంటాము'. 'ఇంతకీ ఏమిటా దైవ వాగ్దానం?' అని అతను అడిగినప్పుడు రబీ బిన్ ఆమిర్ ఇచ్చిన జవాబు ఇది :

> "సత్య తిరస్కారులతో పోరాడుతూ వీరమరణాన్ని ఆస్వాదించిన వారికి స్వర్గం. మిగిలి (బ్రతికి) ఉన్నవారికి విజయం."
>
> *(అల్ బిదాయ వన్నిహాయ)*

సంకల్పబలం, విశ్వాసపాత్రతకి సంబంధించిన ఏ ప్రమాణాన్నయితే ప్రవక్త సహచరమాన్యులు ఏర్పరచారో, అలాంటి ప్రమాణం గనక ఏ వర్గంలోనయినా జనిస్తే దానికి దైవ సహాయం అందటం తథ్యం. దైవ సహాయానికి మరోపేరే విజయం. ఆ సహచరమాన్యులు ఎలాంటివారంటే ఏదైనా విషయంపై 'ప్రమాణం' చేసినప్పుడు, బాగా ఆలోచించుకుని చేసేవారు. ఒకసారి చేతిలో చెయ్యేసి విధేయతా ప్రమాణం (బైఅత్) చేశారంటే, కడదాకా దానికి కట్టుబడి ఉండేవారు. దాని కొరకు ప్రాణాలర్పించవలసి వచ్చినా వెనక్కి తగ్గేవారు కారు. విధేయతా ప్రమాణం (బైఅత్) వారి కొరకు మృత్యువుతో సమానమై ఉండేది.

> హజ్రత్ సలమా ఇలా అంటున్నారు : నేను దైవప్రవక్త – సల్లల్లాహు అలైహి వ సల్లమ్ – సమక్షంలో విధేయతా ప్రమాణం చేసి, ఒక చెట్టు నీడలోకి వెళ్ళి కూర్చున్నాను. జనసందోహం తగ్గిన మీదట దైవప్రవక్త (స), "అక్వా పుత్రుడా! నీవు విధేయతా ప్రమాణం (బైఅత్) చేయవా?" అని అడిగారు. 'దైవప్రవక్తా (స)! నేను ఇందాకే ప్రమాణబద్ధుణ్ణి అయ్యాను కదా!' అని నేను విన్నవించుకున్నాను. "ఫరవాలేదు. మరోసారి ప్రమాణం చెయ్యి" అని ఆయన (స) కోరారు. అప్పుడు నేను మరోసారి ఆయన (స) సమక్షంలో విధేయతా ప్రమాణం చేశాను. ఉల్లేఖకుడు ఇలా అంటున్నారు : 'మీరు ఆ రోజుల్లో ఏ

విషయం మీద విధేయతా ప్రమాణం చేసేవారు?' అని నేను సలమాను అడిగితే 'మృత్యువు మీద' అని ఆయన చెప్పారు.

ఒకసారి వారు గనక విధేయతా ప్రమాణం చేశారంటే చాలు, దానిని ఆచరణలో పెట్టడానికి తక్షణం సంసిద్ధులయ్యేవారు.

> హజ్రత్ అబూ సాలబా ఇలా అంటున్నారు : దైవప్రవక్త ప్రియసహచరులు – ప్రయాణాలలో – ఏదైనా స్థలంలో ఆగినప్పుడు, వారు పరస్పరం వేరైపోయి పర్వత కనుమలలో, లోయలలో విశ్రమించేవారు. "మీరు ఈ విధంగా కనుమలలోకి, లోయలలోకి వెళ్ళటం షైతాన్ ప్రేరణ" అని దైవప్రవక్త (స) చెప్పారు. ఆనాటి నుంచీ వారి పరిస్థితి ఎలా తయారయిందంటే, వారు ఎక్కడయినా విడిది చేసినప్పుడు పరస్పరం కలిసిమెలసి ఉండేవారు. ఆ దృశ్యాన్ని చూసినప్పుడు, వారంతా ఒకే వస్త్రం క్రిందికి వచ్చేశారా! అనిపించేది.

వారు ఇస్లామ్‌లోనికి ప్రవేశించిన తరువాత, తమ ఏ వస్తువు గురించి కూడా పట్టించుకోలేదు. బద్ర్ యుద్ధ సందర్భంగా దైవప్రవక్త (స) తన సహచరుల అభిప్రాయాలను గురించి అడిగినప్పుడు, హజ్రత్ సాద్ బిన్ ముఆజ్ అన్సార్ల తరఫున ప్రాతినిధ్యం వహిస్తూ ఇలా అన్నారు :

> 'దైవప్రవక్తా! మా సంపదలలో నుండి మీరు కోరినది తీసేసుకోండి. మీరు కోరినంత మాకు ఇవ్వండి. మీరు మా నుండి తీసుకున్నది మాకు ఇచ్చిన దానికన్నా ప్రియమైనదవుతుంది.'

వారు అన్ని రకాల మానసిక చిక్కుల నుండి తమను తాము వేరుపరచుకుని దైవధర్మంలో ప్రవేశించారు. ఇలాంటివారు గనక కేవలం కొన్ని వందల సంఖ్యలో ఏకమైనా చాలు, వారు మానవ చరిత్రకు మేలిమలుపును ఇవ్వగలరు.

# ఇస్లామ్ పరిచయ విధానం

ఖుర్ఆన్‌లో ఈ విధంగా ఉపదేశించబడింది :

ఏ ధర్మాన్ని స్థాపించమని అల్లాహ్ నూహ్‌కు ఆజ్ఞాపించాడో అదే ధర్మాన్ని మీ కోసం కూడా నిర్ధారించాడు. దానినే (ఓ ప్రవక్తా!) మేము నీకు 'వహీ' (దైవవాణి) రూపంలో పంపాము. దీని గురించే మేము ఇబ్రాహీమ్, మూసా, ఈసాలకు ఆజ్ఞాపించాము – మీరు ధర్మాన్ని స్థాపించండి, అందులో విభేదించుకోకండి అని. (ప్రవక్తా!) ఏ విషయం వైపునకు నీవు పిలుస్తున్నావో అది బహుదైవారాధకులకు భరించశక్యం కానిదిగా ఉంది. *(అష్ షూరా : 13)*

ధర్మసంస్థాపనకు సంబంధించిన ఈ ఆయత్‌లో "ధర్మాన్ని స్థాపించండి, అధర్మాన్ని స్థాపించకండి" అని అనబడలేదు. "ధర్మాన్ని స్థాపించండి, ధర్మంలో విభేదించుకోకండి" అని మాత్రమే అనబడింది. ఏ స్థితిని అవలంబించమని ఆజ్ఞాపించటం జరిగిందో, ఏ స్థితి నుండి వారించటం జరిగిందో, అవి రెండూ ఈ ఆయత్‌లోని వాక్యాల ప్రకారం, అవి స్వయంగా ధర్మానికి సంబంధించిన పరిస్థితులే. ఈ పరిస్థితుల్లో నుండి ఒక ధార్మిక స్థితిని పరిత్యజించి, రెండవ ధార్మిక స్థితిని అవలంబించమని ఆదేశించబడింది. అంటే ఈ ఆయత్‌లో ఉన్న ఆదేశం; అధర్మస్థాపనకు ప్రతిగా ధర్మసంస్థాపనం కాదు, విభేదాలకు ప్రతిగా ధర్మసంస్థాపనం.

ఈ ఆయత్‌లో 'దీన్' అంటే అర్థం 'ధార్మిక మూలం' అని వ్యాఖ్యాతలు వ్రాశారు. ఎందుకంటే దైవప్రవక్తలందరి మధ్యన ధార్మిక మూలాలు ఒక్కటిగానే ఉండేవి. వాటినే అందరూ ఉమ్మడిగా అనుసరించవచ్చు. కాకపోతే షరీఅత్ విషయంలో వారి మధ్యన వైవిధ్యం ఉండేదని ఖుర్ఆన్ ద్వారా తెలుస్తోంది. అందుకే షరీఅత్ విషయంలో దైవప్రవక్తలందరినీ – ఏకకాలంలో – అనుసరించటం సంభవం కాదు.

షరీఅత్ విషయంలో దైవప్రవక్తల మధ్యన గల వ్యత్యాసం పరిణామం ఆధారంగా కాదు, పరిస్థితులు, సందేశఘట్టాల దృష్ట్యానే ఈ వ్యత్యాసం ఉండేది. ఈ వ్యత్యాసం ముస్లిం వర్గాల మధ్యన నేటికీ ఉంది. ఎల్లప్పుడూ ఉంటుంది. ఈ విషయాన్ని వేరే మాటల్లో చెప్పాలంటే ధర్మం (దీన్)లో రెండు భాగాలున్నాయి. ఒకటి : శాశ్వత ప్రాతిపదికపై – సమానంగా – వాంఛించబడేది. రెండవది : పరిస్థితులకు లోబడినది. మొదటి భాగం మౌలిక శిక్షణకు సంబంధించినది. ఇది ఖుర్ఆన్‌లో 'అల్ దీన్' (షూరా)గా వ్యవహరించబడింది. రెండవ భాగం షరీఅత్‌కు సంబంధించినది, విధానపరమైనది (అల్ మాయిద : 48). అంటే అనుబంధ శాసనాలు, సాపేక్షిక విషయాలు. మొదటి భాగం ఖుర్ఆన్‌లో 'సబీల్' (మార్గం)గా అభివర్ణించబడింది. రెండవ భాగాన్ని 'సుబుల్' (మార్గాలు)గా పేర్కొనటం జరిగింది. ఎందుకంటే మొదటి భాగం నిత్యం ఒకటిగానే ఉంటుంది. అది అన్ని కాలాల వారికి ఏకైక మార్గం. దీనికి ప్రతిగా దీన్ యొక్క రెండవ భాగం పరిస్థితులపై ఆధారభూతమై ఉంటుంది. ఇందులో ఒకటికన్నా ఎక్కువ స్వరూపాలకు ఆస్కారం ఉంటుంది. మీరంతా ఒక్కటై ధర్మసంస్థాపనా కార్యంలో నిమగ్నులై ఉండండి, దీన్‌లోని పాక్షిక సాపేక్షిక విషయాల వెనుకపడి ముఠాలుగా చెల్లాచెదురవకండి అని ఆదేశించ బడింది.

ఖుర్ఆన్‌లో విశ్వాసులను ఉద్దేశించి పలుచోట్ల చెప్పబడిన ముఖ్యాంశం ఏమిటంటే, మీ కొరకు అల్లాహ్ ఆచరణకు సంబంధించిన ఒక రాచబాటను నిర్ధారించాడు. కాబట్టి మీరు ఆ బాటపైనే నడవండి. కుడి ఎడమల అపమార్గాలపై, కాలి బాటలపై నడవకండి. అన్యథా మీరు సిసలైన దైవమార్గం నుండి వైదొలగిపోతారు. ఈ రాచబాటే ఖుర్ఆన్‌లో 'దీనె ఖయ్యిమ్' (స్థిరమైన ధర్మం)గా, 'హబ్లుల్లాహ్' (దేవుని త్రాడు)గా, 'సవాఅస్సబీల్' (సరళ మార్గం)గా, 'సిరాతె ముస్తఖీమ్' (రుజుమార్గం)గా పేర్కొనబడింది. అల్ అన్ఆమ్ సూరాలో కొన్ని మౌలిక ఆదేశాల ప్రస్తావన తరువాత ఈ విధంగా సెలవీయబడింది :

> "ఇదే నా రుజుమార్గం. కాబట్టి మీరు దీనినే అనుసరించండి. (అడ్డ) దారుల్లో పోకండి. అవి మిమ్మల్ని ఆయన మార్గం నుండి వేరు చేస్తాయి. మీరు జాగ్రత్తగా మసలుకుంటారని ఆయన మీకు చేసిన తాకీదు ఇది." *(అల్ అన్ఆమ్ : 153)*

ఈ ఆయత్‌లో '(అడ్డ)దారులు' అంటే అర్థం షిర్క్‌తో, కుఫ్ర్‌తో కూడుకున్న మార్గాలు. పైగా అవి, 'దీన్'లో 'దీన్' పేరిట తీయబడే పెడత్రోవలు (ఖుర్తుబీ). అల్లాహ్‌కు కావలసిందేమిటో ఖుర్‌ఆన్‌లో చాలా స్పష్టమైన వాక్యాల్లో చెప్పటం జరిగింది. ఈ ఖుర్‌ఆనీ ప్రబోధనలు క్రియాత్మక జీవితంలో ఎలా రిఫ్లెక్ట్ అవుతాయో చూడాలంటే మహాప్రవక్త (స) జీవితాన్ని, ఆయన ప్రియ సహచరుల జీవితాలను చూడాలి. అలాగే మనిషి విశ్వాసపరంగానూ, క్రియాత్మకంగానూ ఆ మహనీయులు స్థాపించిన దీన్‌పై స్థిరంగా ఉండాలి. ఇది మినహా దీన్ (ధర్మం)లో ఖుర్‌ఆన్ సున్నత్‌ల ద్వారా నిరూపితం కాని పోకడలను సృష్టించటం, మనిషిని రాచబాట నుండి వేరుపరిచే కుడి ఎడమల అపమార్గాలపై పోవటం మంచిది కాదు. ఇదంతా చేస్తూ మనిషి దైవమార్గంపైనే ఉన్నానని అనుకుంటూ ఉంటాడు. కాని వాస్తవానికి అసలు ధర్మం (దీన్)తో దానికెట్టి సంబంధం లేదు.

## దీన్ – షరీఅత్‌ల మధ్యన గల వ్యత్యాసం

'అల్ – దీన్' అంటే ఏమిటి? అది 'తౌహీద్' (దేవుని ఏకత్వం, ఏకేశ్వరోపాసన). అంటే ఒక్కగానొక్క అస్తిత్వాన్ని సృష్టికర్తగా, యజమానిగా నమ్మి నడుచుకోవటం. ఆయన్నే సమస్త శ్రద్ధాభక్తులకు మూలకేంద్రంగా చేసుకోవటం. ఆయన్నే తన సర్వస్వంగా తలపోయటం. ఆయన సన్నిధిలోనే తనను తాను సమర్పించుకోవటం. ఇదే అసలు దీన్ (ధర్మం)కు సంబంధించిన త్రాడు. అది గనక చేతికి చిక్కితే మిగిలినవన్నీ చేతికి అందినట్లే. అది గనక జారిపోతే ఏ వస్తువు కూడా మనిషి వాటా లోనికి రాదు – అతను పైకి ఎంతగా తన ధార్మికతను చాటుకున్నా సరే!

ఖుర్‌ఆన్‌లో 'ధర్మసంస్థాపనం' గురించి ఏ ఆజ్ఞ ఇవ్వబడిందో అది ఈ 'అల్ దీన్'కు సంబంధించినదే. సూరయె షూరాలోని ఈ ఆయత్ (13)లోని ధర్మసంస్థాపనం అంటే అర్థం 'తౌహీద్ స్థాపన'. అంటే దాసుణ్ణి నిజభావంలో నిజదైవంతో కలపటం, అతనికి సాటిలేని అద్వితీయ దేవుని మార్గం చూపటం! ఒకవేళ ఏ వర్గమైనా ఆరాధనకు సంబంధించిన పాక్షిక విషయాలను పట్టుకుని, ఫికహ్‌పరమైన వివాదాన్ని లేవనెత్తితే లేదా ధర్మసంస్థాపన పేరుతో అధికార ప్రభుత్వంతో రాజకీయ పోరాటాన్ని మొదలెడితే అది ధర్మసంస్థాపన అనిపించుకోదు, పైగా అది ఖుర్‌ఆన్ మాటల్లో కాలిబాటల (సుబుల్) అనుసరణ అవుతుంది. దీన్‌లో దానికి ఎలాంటి ప్రాధాన్యత లేదు. ఈ రకమయిన పాక్షిక విషయాలపై, అభిప్రాయభేదాలపై ఆందోళన చేపట్టడం

శ్రేయోదాయకం కాదు, పైగా అది ఉమ్మత్‌లోని ఐకమత్యాన్ని అంతమొందించే చర్య అవుతుంది. దీని మూలంగా ఉమ్మత్ వివిధ ముఠాలుగా, వర్గాలుగా చీలిపోయి సాముదాయిక సహాయానికి నోచుకోకుండా పోతుంది. ఏకాభిప్రాయంతో కూడిన విషయం కొరకు పాటుపడటమే ధర్మసంస్థాపనం. భేదాభిప్రాయం ఉన్న అంశాలను తీసుకుని ముస్లింలలో తర్జన భర్జనకు, వాదోపవాదాలకు తెర లేపటం ధర్మసంస్థాపనం కాదు.

'అద్దీన్' అంటే అర్థం వాస్తవానికి తౌహీద్ (దేవుని ఏకత్వం) అయినప్పటికీ, స్వాభావికంగా అందులో ఖుర్ఆన్ సున్నత్‌ల ప్రకారం ఏకాభిప్రాయం కల అంశాలన్నీ చేరుతూ ఉంటాయి.

ఉదాహరణకు : దేవుని ఉనికి, దేవుని ఏకత్వం, ఆయన సార్వభౌమత్వం వంటి అంశాలను ప్రజల ముందుకు తెచ్చినట్లయితే దానిపై ఉమ్మత్‌లో విభేదానికి తావు ఉండదు. ఎందుకంటే ఈ విశ్వాసాలు తిరుగులేని దైవవచనాల ద్వారా, ప్రవక్త ప్రవచనాల ద్వారా రూఢీ అయి ఉన్నాయి. దీనికి భిన్నంగా దైవానికి శరీరం ఉందా? లేదా? దైవ సింహాసనం ఎక్కడుంది? దేవుడు తన వంటి వానిని సృష్టించ గలడా? లేదా? లాంటి వాటిపై చర్చ మొదలెడితే దీనిపై ఉమ్మత్‌లో ఏకాభిప్రాయసాధన సంభవం కాదు. ఎందుకంటే ఇలాంటి విషయాలన్నీ భావాన్వయంతో కూడుకున్నవి. దీనిపై ఆలోచించినప్పుడు ఒకరి అభిప్రాయాలు ఒక వైపునకు తీసుకెళితే, మరొకరి అభిప్రాయం మరో వైపునకు తీసుకెళుతుంది. ఈ విధంగా వివిధ వ్యాఖ్యానాలు, అభిప్రాయాలు ఉనికిలోనికి వస్తాయి. ఒక్కో అభిప్రాయం చుట్టూ విశ్వాసుల ఒక్కో వర్గం చేరుతుంది. ఒకే ధర్మం అనేక ధర్మాలుగా తయారవుతుంది – కాబట్టి మొదట ప్రస్తావించిన విశ్వాసాన్ని ప్రబోధించినట్లయితే అప్పుడు ధర్మసంస్థాపన సాధ్యమవు తుంది. దీనికి విరుద్ధంగా రెండవ దానిపై ఊహాగానాలు సాగించినట్లయితే అది ఖుర్ఆన్ మాటల్లో ధర్మంలో చీలిక తీసుకురావటం వంటిదవుతుంది. కాబట్టి మొదటి వస్తువు వాంఛనీయమైతే రెండవది అవాంఛనీయం.

ఆరాధనల విషయం కూడా అంతే. ఉదాహరణకు : నమాజ్ కొరకు వజూ చేయటం అవశ్యం అన్నది ఏకాభిప్రాయంతో కూడుకున్నది. అయితే దాని అర్కాన్‌లు, షరతుల సంఖ్యకు సంబంధించి ఒకటికన్నా ఎక్కువ అభిప్రాయాలున్నాయి. సునన్, ముస్తహబాత్ సంఖ్య సంగతి అటుంచండి, వజూలో ఫరాయిజ్ (విధుల)పైన కూడా

ధర్మవేత్తల మధ్య ఏకాభిప్రాయం లేదు. హనఫీల ప్రకారం వజూలోని విధులు నాలుగు. మాలికీల దృష్టిలో ఏడు, షాఫియీల హంబలీల దృష్టిలో అవి ఆరు. అందువల్ల ఇలాంటి అభిప్రాయభేదం గల విషయాలపై తర్జన భర్జనకు తెర లేపినట్లయితే అందరూ ఒక అభిప్రాయానికి రావటం సాధ్యం కాదు. ఈ రకమయిన ప్రయత్నం కొనసాగించినట్లయితే, అది అనైక్యతకి, విచ్ఛిన్నానికి కారణభూతమవుతుంది. ఆ విధంగా ఈ ఒక్క ఉమ్మత్ అనేక ఉమ్మత్‌లుగా విభజితమైపోతుంది. అందుకే ఏకాభిప్రాయం కల వాటిని సందేశ ప్రధానంగా చేసుకోవాలని, భిన్నాభిప్రాయాలు గల వ్యవహారాలను సందేశ ప్రధానంగా చేసుకోరాదని ఆదేశించటం జరిగింది.

ఇస్లామీయ రాజకీయ వ్యవహారం కూడా ఇంతే. ఒక వ్యక్తి రాజ్యాధికారుల సంస్కరణ కొరకు ప్రార్థించి, వ్యక్తిగతంగా వారిని కలుసుకుని దైవభీతి, పరలోక చింతన గురించి ఉపదేశించాలి. చక్కని పద్ధతిలో ప్రసంగం ద్వారా లేక లిఖితపూర్వక పత్రం ద్వారా ఇస్లామీయ రాజకీయంలోని కోణాలను క్షుణ్ణంగా వారికి అర్ధమయ్యేటట్లుగా చెప్పాలి. అలా చేయటం వల్ల సమాజం (ఉమ్మత్)లో చీలిక రాదు. దీనికి భిన్నంగా కొంతమంది హడావిడిగా రంగప్రవేశం చేసి, నిరసనల జెండాలు పట్టుకుని, రాజకీయ సంగఠనలు స్థాపించి, పరిపాలకులను అధికారం నుంచి తొలగించే ప్రయత్నం చేసినట్లయితే, పరిణామ స్వరూపంగా సమాజం వర్గాలుగా, ముఠాలుగా చీలిపోతుంది. ఒక వర్గం ప్రభుత్వానికి వత్తాసు పలికితే, రెండవ వర్గం గద్దె దించే ప్రయత్నాలు చేస్తుంది. ఆ విధంగా ఉమ్మత్ రెండు గ్రూపులుగా వేర్పడిపోతుంది. ఒకటి మరో దానిపై కయ్యానికి కాలుదువ్వుతుంది. 'ధర్మసంస్థాపనం' పేరు మీద 'ధర్మంలో చీలిక' ఉనికిలోకి వస్తుంది.

వజూ ఆదాబులు, నియమ నిబంధనల 'సంఖ్య' పర్యాలోచనకు సంబంధించిన విషయం. ఈ కారణంగానే ఆ సంఖ్య నిర్ధారణ విషయంలో విద్వాంసుల మధ్య భిన్నాభిప్రాయాలు ఏర్పడ్డాయి. ముస్లిం సముదాయం యొక్క రాజకీయ మిషన్ వ్యవహారం కూడా యింతే. ఇది కూడా పూర్తిగా భావాన్వయంతో కూడుకున్నదే. ఎందుకంటే రాజకీయ మిషన్‌పై ఇదమిత్థంగా ఒక నిర్ధారణకు వచ్చే మూలం (నస్) ఏదీ ఖుర్‌ఆన్ హదీసులలో లేదు. ఈ కారణంగానే – ఈ వ్యవహారంలో – పండితుల అభిప్రాయాలలో వైవిధ్యం ఏర్పడింది. నేటి కాలపు ఒక వర్గం వారేమంటున్నారంటే, ఇస్లామీయ ప్రభుత్వ స్థాపనకై నిరంతరం పాటుపడటం ఉమ్మతె ముస్లిమా అసలు ధ్యేయం. ప్రభుత్వం అనేది దేవుని తరపున కానుకగా లభిస్తుంది, కేవలం దానిని

లక్ష్యంగా పెట్టుకోవటం సరైనది కాదని మరో వర్గం వారంటున్నారు. ఇంకొక వర్గం వారేమంటున్నారంటే మనం చేయాల్సిన సిసలైన పని సంఘ సంస్కరణ, అంతేగాని ప్రభుత్వం కొరకు ప్రాకులాడకూడదు. సమాజ సంస్కరణ గనక జరిగితే దానంతటదే మనం కోరుకున్న ప్రభుత్వం నెలకొంటుంది. ఈ సైద్ధాంతిక విభేదాలను అలావుంచితే, ప్రభుత్వ వ్యవహారం క్రియాత్మకంగా సంక్లిష్టమైనది. ఎప్పుడు అధికారంలో ఉన్న ఒక వర్గాన్ని గద్దె దించే ప్రయత్నాలు చేసినా, ప్రభుత్వం తన రాజకీయ ప్రత్యర్థులకు వ్యతిరేకంగా తప్పనిసరిగా బలప్రయోగం చేస్తుంది. తత్ఫలితంగా ముస్లింలలో రక్తపాతం సంభవిస్తుంది. విధ్వంసం జరుగుతుంది. 'ధర్మసంస్థాపనం' కాస్తా క్రియాత్మకంగా 'ధర్మంలో చీలిక'గా పరిణమిస్తుంది. ఒక్కటికన్నా ఎక్కువ దృక్పథాలకు ఆస్కారం ఉన్న షరీఅత్ వ్యవహారాలలో ప్రజలందరినీ ఒకే పతాకం క్రిందికి తీసుకువచ్చే ప్రయత్నం సదా బెడిసికొడుతుంది. తత్ఫలితంగా అనేక జెండాలు పుట్టుకువస్తాయి. అందుకే భిన్నాభిప్రాయాలకు ఆస్కారం ఉన్న అంశాలను ఉద్యమానికి కేంద్ర బిందువుగా చేసుకోరాదని, ఏకాభిప్రాయం ఉన్న విషయాల పునాదిపైనే ఉద్యమాలను స్థాపించాలని స్థిరమైన ఆజ్ఞ ఇవ్వటం జరిగింది.

ఈ కారణాల మూలంగానే ఖిలాఫత్ ములూకియత్ (రాజరికం)గా మారటం మనం చూశాము. ఈ ములూకియత్ వెయ్యేళ్ల వరకూ నడిచింది. కాని సమాజంలోని సంస్కరణా ప్రియులు ఎన్నడూ దానికి వ్యతిరేకంగా ఉద్యమించలేదు. వారు రాజ్యాధికారులను వ్యక్తిగతంగా ఉపదేశించారు. అంతేగాని వారి అధికారానికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు, ఆందోళనలు చేపట్టలేదు. కేవలం ఆధునిక యుగంలోని ఉద్యమాలలోనే ఈ పోకడ జనించింది. రాజకీయ విప్లవమే ముస్లిం సమాజం నిజధ్యేయమని చెప్పేవారు ముస్లింలలో పుట్టుకువచ్చారు. తత్ఫలితంగా ప్రతి ముస్లిం రాజ్యంలో ముస్లింల రెండు వర్గాలు ఏర్పడ్డాయి. ఒకటి : ఏలినవారి వర్గం. రెండవది : వారికి వ్యతిరేకంగా విప్లవకారుల వర్గం. రెండు ముస్లిం వర్గాల మధ్య నిరవధిక రాజకీయ పోరాటం నడుస్తోంది. అది వినాశానికి హేతువుగా మారటం తప్ప ఫలితం శూన్యం (అల్ బఖరా : 205). ఇదంతా 'ధర్మసంస్థాపనం' పేరిట జరుగుతోంది.

రాజకీయ ప్రక్రియకు సంబంధించి ముస్లిం సముదాయంలోని విద్వాంసుల మధ్య పలు అభిప్రాయాలుండటాన్ని బట్టి విదితమయ్యేదేమంటే రాజకీయ ఉద్యమాల విషయం 'చీలిక మార్గాల' క్రిందికే వస్తుంది, 'అద్దీన్' క్రిందికి రాదు. కాబట్టి ఒక సంస్కర్త ముస్లిం పరిపాలకులలో చెడును చూసినప్పుడు శ్రేయోభిలాషతో దిద్దుబాటుకు

ప్రయత్నించవచ్చు. మృదువుగా ఉపదేశించవచ్చు. కాని ధర్మసంస్థాపనం పేరిట రాజ్యాధికారులతో పోరుబాటను అనుసరించటం దైవగ్రంథం పట్ల వైముఖ్యం క్రిందికే వస్తుంది. ఇది కాలి బాటలపై పోవటమే గాని వాస్తవానికి ధర్మసంస్థాపనం కాదు.

ఈ 'విభజన' యొక్క అర్థం దీన్ (ధర్మం)లో కేవలం మౌలికాంశాలే ముఖ్యమని, పాక్షిక విషయాల అవసరం లేదని ఎంతమాత్రం కాదు. మౌలికాంశాలకు – పాక్షిక విషయాలకు మధ్య గల వ్యత్యాసాన్ని సదా దృష్టిలో ఉంచుకోవాలన్నదే దీని ఉద్దేశం. మూలాలను దృఢంగా ఆశ్రయించాలి. పాక్షిక విషయాలలో సడలింపుల వైఖరిని అవలంబించాలి.

దీనిని ఒక ఉపమానం ద్వారా అర్థం చేసుకోవచ్చు – భోజనం విషయంలో ఒక మౌలిక విషయం ఏమిటంటే హలాల్ – హరాంల మధ్య విచక్షణ పాటించాలి. (అంటే ధర్మసమ్మతమైన దానిని తినాలి. నిషిద్ధ ఆహారాన్ని తినకూడదు). కేవలం ధర్మసమ్మతమైన వస్తువులనే ఆహారంగా తీసుకోవాలి. నిషిద్ధమైనది గొంతులో దిగకుండా జాగ్రత్త వహించాలి. రెండవ అంశం భోజన మర్యాదలకు సంబంధించినది. ఉదాహరణకు : చేత్తో తినాలా? లేక స్పూన్‌తో తినాలా? క్రింద కూర్చుని భోజనం చేయాలా? లేక కుర్చీపై టేబుల్ మీల్స్ చేయాలా? బూట్లు ధరించి తినాలా? లేక బూట్లు విడిచి తినాలా? ఇత్యాదివి. వీటిలో మొదటిది ధర్మంలో మౌలిక విషయం. దాసునికి ఏ వస్తువు ధర్మసమ్మతమో, మరేది నిషిద్ధమో అల్లాహ్ పేరు పెట్టి మరీ చెప్పేశాడు. కాని రెండవ విషయమై ఖచ్చితమైన నిర్దేశన ఏదీ చేయబడలేదు. దైవప్రవక్త (స) ఆదర్శ జీవితంలో, ప్రవక్త ప్రియసహచరుల జీవితాలలో – ఈ సందర్భంగా – ఒకటికన్నా ఎక్కువ ఉదాహరణలు లభ్యమవుతాయి. ఇట్టి పరిస్థితిలో ఎవరైనా హలాల్ – హరాం (ధర్మాధర్మాల) గురించి నిక్కచ్చిగా వ్యవహరిస్తే దానికి సంబంధించి ఉమ్మత్‌లో చీలికలకు ఆస్కారం ఉండదు. ఎందుకంటే ఈ విషయంలో విద్వాంసులందరి మధ్య ఏకాభిప్రాయం ఉంది. దీనికి భిన్నంగా భోజన మర్యాదల విషయంలో, నేను పట్టిన కుందేటికి మూడే కాళ్ళు అని హఠంచేస్తే, దానిపై ఉమ్మత్‌లో ఏకాభిప్రాయసాధన సంభవం కాదు. ఉదాహరణకు : భోజనం చేసేటప్పుడు చెప్పులు విడువటం తప్పనిసరి అనీ, హదీసులలో చెప్పులు విడువమని ఉందని ఒక వ్యక్తి అంటాడు. ఇది ధర్మాధర్మాలకు సంబంధించిన విషయం కాదు గనక అలా చేయటం తప్పనిసరి కాదని మరో వ్యక్తి అంటాడు. సౌలభ్యాన్నిబట్టి, పరిస్థితిని బట్టి తదనుగుణంగా వ్యవహరించవచ్చని అంటాడు. ఎందుకంటే పూర్తి

హదీసు ఇలా ఉంది : "మీ చెప్పులు విడువండి. ఎందుకంటే ఇలా చేయటంలోనే మీకు సౌకర్యం ఉంది." కాబట్టి సరైన పద్ధతి ఏమిటంటే, "పరిశుద్ధమయిన వస్తువులను తినండి, సదాచరణ చేయండి" (అల్ మూ'మినూన్) – ఈ నియమానికి ఖచ్చితంగా కట్టుబడాలి. భోజన మర్యాదలు, తినే పద్ధతులపై ఉదారంగా వ్యవహరించాలి – అహ్లె హదీస్ ఉద్యమం ఆరంభంలో ఈ విచారధారపైనే – ఖచ్చితంగా – ఉండేది. తరువాతి కాలంలో అది దానిపై స్థిరంగా ఉండలేకపోయింది. అది వేరే విషయం.

## దీన్‌ను (ధర్మాన్ని) పరిపూర్ణం చేయటమంటే ఏమిటి?

నేటి యుగంలో "పరిపూర్ణ ఇస్లామీయ విప్లవ" ధ్వజవాహకులకు – "అసంపూర్ణ ధర్మావలంబీకుల"కు మధ్య పలు దేశాలలో సంఘర్షణ కొనసాగుతోంది. దీనికి ప్రధాన కారణం "సంపూర్ణ ధర్మం"కు సంబంధించిన తప్పుడు సిద్ధాంతం, ఇస్లామ్ ఒక పరిపూర్ణ ధర్మం లేక జీవన వ్యవస్థ (నాగరిక చట్టాల దృష్ట్యా) అని జనులు భావిస్తున్నారు. కాబట్టి ధర్మాన్ని స్థాపించటమంటే అర్థం, దానిని విధిగా ఒక సంపూర్ణ సాంస్కృతిక వ్యవస్థగా స్థాపించటమేనని తలపోస్తున్నారు. ఒకవేళ సంపూర్ణ ధర్మానికి అర్థం ఇదే అయినట్లయితే, మరి ప్రవక్తల పితామహుడైన హజ్రత్ ఇబ్రాహీమ్ (అలైహిస్సలామ్) ధర్మం అసంపూర్ణమా? అన్న సంశయం కలగకమానదు. ఎందుకంటే ఆయనకు నాగరిక నియమ నిబంధనలు, సాంస్కృతిక చట్టాలు ఇవ్వబడలేదు. అలాగే ఇతర చాలామంది దైవప్రవక్తలకు కూడా ఇవ్వబడలేదు. ఇతర ప్రవక్తలకు వొసగబడిన ధర్మమే మీకూ వొసగబడిందని ఖుర్ఆన్‌లో స్పష్టంగా చెప్పటం జరిగింది (షూరా : 13).

నిజభావంలో దీన్ అంటే ఏకేశ్వరోపాసకునిగా రూపొందటం. దీన్ పరిపూర్ణం అవటమంటే మనిషి ఏకేశ్వరోపాసకునిగా పరిపూర్ణతను పొందాలి. ఎవరు ఎంతగా దైవాన్ని పొందుతాడో అంతగానే దీన్ (ధర్మం)లో పరిపూర్ణత నొందాడు. తన ప్రభువును ఎంత తక్కువగా పొందాడో అంతే అతని దీన్ అసంపూర్ణంగా ఉందన్న మాట. చట్టపరమయిన అధికరణలు ఎన్ని వ్రాసుకున్నా అవి దీన్‌కు పరిపూర్ణత నివ్వవు. ఉదాహరణకు ఖుర్ఆన్‌లో గనక క్రీ.శ. 7వ శతాబ్దికి సంబంధించి సమస్త ఆదేశాలు, నియమ నిబంధనలు పొందుపరచినా, అప్పటికీ లిఖించవలసిన శాసనపరమైన అంశాలు ఎన్నో ఉండిపోతాయి. ఉదాహరణకు : సముద్రయాన శాసనాలు, అంతరిక్ష నియమ నిబంధనలు మొదలగునవి. ఎందుకంటే ఇవి అప్పట్లో

చర్చనీయాంశాలు కావు. యథార్థమేమిటంటే సంపూర్ణ ధర్మానికి ఈ అర్థం తీసుకుంటే ఇస్లామ్ కూడా సంపూర్ణ ధర్మంగా కానరాదు.

## అమీర్ హమ్దానీ ఉపమానం

పైన పేర్కొనబడిన ఇస్లామీయ విధానానికి సంబంధించిన ఒక ఉదాహరణ కశ్మీర్ చరిత్రలో కనిపిస్తుంది. కశ్మీర్‌ను సాధారణంగా ప్రజలు ప్రకృతి సౌందర్యానికి నిలయంగా భావిస్తారు. కాని వాస్తవానికి అక్కడ దానికన్నా పెద్ద వస్తువు ఉంది. అది ఇస్లామీయ విధానానికి సంబంధించిన నమూనా, అది మీర్ సయ్యిద్ అలీ హమ్దానీ (క్రీ.శ. 1314–1384) జీవితంలో లభిస్తుంది. కశ్మీరీలు ఆయన్ని సాధారణంగా 'అమీర్ కబీర్' అని పిలుస్తారు. ఆయన తన క్రియాత్మక జీవితం ద్వారా గొప్ప అనుసరణీయమైన దృష్టాంతాన్ని నెలకొల్పారు. అలాంటి దృష్టాంతం ఇటీవలి శతాబ్దులలో అరుదుగానే లభిస్తుంది. కశ్మీర్ తన ప్రకృతి దృశ్యాల ద్వారా భూతల స్వర్గం అనుకుంటే, అది తన చారిత్రక నమూనా ద్వారా మనకు ఇస్లామీయ సందేశ పరిచయ విధానం వైపునకు మార్గదర్శకత్వం వహిస్తుంది. ఇది దానికన్నా (ప్రకృతి సౌందర్యం కన్నా) ఎక్కువ విలువైనది.

ప్రస్తుత కశ్మీర్ అమీర్ కబీర్ కృషి ఫలితమే. కాని అమీర్ కబీర్ ఖడ్గ బలంతోనో, పోరుబాటతోనో ఈ విజయాన్ని సాధించలేదు. ఆయన జీవితం నేర్పే అతి గొప్ప పాఠం ఏమిటంటే – ఇస్లామ్‌ను పునరుజ్జీవింప జేయాలంటే పోరుబాటను పూర్తిగా పరిత్యజించి దిద్దుబాటను అనుసరించండి. అప్పుడు మీకు దైవ సహాయం లభిస్తూ ఉంటుంది. ఇస్లామ్‌కు ఉన్నతి, ముస్లిములకు గౌరవం ప్రాప్తమవుతుంది.

మీర్ సయ్యిద్ అలీ హమ్దానీ ఈరాన్ దేశస్థులు. కుంటి తైమూర్ (క్రీ.శ. 1335 – 1405)కు సమకాలికులు. తైమూర్ చక్రవర్తి ఒకానొక విషయంలో ఈయనతో విభేదించి కన్నెర్రజేశాడు. ఈరాన్‌ను విడిచిపొమ్మని ఆజ్ఞాపించాడు. ఇప్పుడు అమీర్ కబీర్ ముందు ఉన్న మార్గాల్లో ఒకటి కుంటి తైమూర్‌కు విరుద్ధంగా జిహాద్ నినాదాన్ని పూరించటం! ఈరాన్‌లో సజ్జనుల ప్రభుత్వాన్ని స్థాపించటానికి పోరాటం సాగించటం – దానికొరకు ప్రాణత్యాగం చేయాల్సివచ్చినా సరే వెనుకాడక పోవటం! కాని అమీర్ కబీర్ రాజకీయ సంఘర్షణను విడనాడి, తన నలభైమంది శిష్యులను వెంటబెట్టుకుని దేశం వదలి, అఫ్గానిస్తాన్ మీదుగా హిజ్రీ 781లో కశ్మీర్ చేరుకున్నారు. అంతకు ముందు ఆయన హిజ్రీ 762లో ఒకసారి కశ్మీర్‌ను సందర్శించి ఉన్నారు.

కశ్మీర్ చేరుకున్న తరువాత కూడా తైమూర్ చక్రవర్తికి వ్యతిరేకంగా ఉద్యమం నడిపే అవకాశం ఆయనకు లేకపోలేదు. తైమూర్ సమకాలికుల్లో అనేక రాజకీయ కారణాల వల్ల తైమూర్ పట్ల శత్రుత్వం కలవారు అక్కడ ఉన్నారు. అమీర్ కబీర్ వారందరినీ కలుపుకుని, తైమూర్‌ను అధికారం నుండి తొలగించే ఉద్యమం చేపట్ట గలిగేవారు. కాని అమీర్ కబీర్ అలాంటి ఏ చర్యకూ పూనుకోలేదు. అలాగే నాయకత్వానికి సంబంధించిన మరో దారి కూడా ఆయన కొరకు ఆనాడు తెరచుకుని ఉంది. ఆ కాలంలో కశ్మీర్‌లో ఒక ముస్లిం కుటుంబీకులు అధికారంలో ఉన్నప్పటికీ అక్కడి ముస్లింలు మాత్రం పేదరికంలో మ్రగ్గుతూ ఉన్నారు. దానికితోడు వారు అల్పసంఖ్యాకులు. వారి నుండి విగ్రహాలయాల కొరకు బలవంతంగా నజరానాలు వసూలు చేయబడేవని అనబడుతోంది. అలాంటి పరిస్థితిలో అమీర్ కబీర్ గారు గనక ముస్లింల హక్కుల కొరకు ఉద్యమించివుంటే ఒక నాయకునిగా రాణించగలిగేవారు. కాని ఆయన ఈ విధమైన 'మిల్లీ రాజకీయానికి' కూడా దూరంగా ఉండిపోయారు.

అలాగే అమీర్ కబీర్ కొరకు మరో అవకాశం కూడా ఉంది. ఆయన మానవతా విలువల కోసం ఉద్యమించి రాజ్యంలోని వివిధవర్గాల వారికి శాంతియుతంగా మెలగమని ఉపదేశించగలిగేవారు. అలా చేసివుంటే ఆయన రెండు పెద్ద సముదాయాల వారి హృదయాలను జయించగలిగేవారు. ఎందుకంటే సత్యాసత్యాల విషయాన్ని ముట్టుకోకుండా సహనం, సామరస్యం, సహజీవనం గురించి చేసే ఉపదేశాన్ని అందరూ స్వాగతిస్తారు, శ్లాఘిస్తారు. ఈ పని చేసిన వారికి ఎలాంటి కష్టనష్టాలు కూడా ఉండవు. కాని ఈ రకమయిన సభలు, ఉపన్యాసాలు పైకి ఎంత రమ్యంగా ఉన్నా క్రియాత్మకంగా నిష్ప్రయోజనమే. అదీగాక ఇలాంటి కార్యక్రమాలతో ఇస్లామీయ సందేశానికి ఎలాంటి సంబంధం లేదు. ప్రజలకు పరలోకంలో ఎదురుకానున్న సమస్యల గురించి సావధానపరచటం ఇస్లామీయ సందేశ ప్రధాన ఉద్దేశం.

అమీర్ కబీర్ తన ప్రోగ్రాంను తైమూర్ చక్రవర్తికి వ్యతిరేకంగా – ప్రతిచర్యగా – చేపట్టలేదు. అలా అని ముస్లింల తత్కాల పరిస్థితులకు ప్రభావితమై ఉద్యమించనూ లేదు. ఆ కాలంలో కశ్మీర్‌లో ఒక ముస్లిం రాజు (సుల్తాన్ కుతుబుద్దీన్) ప్రభుత్వం ఉండేది. ఆ రాజులో విశ్వాసపరమైన లోపాలు, క్రియాత్మకమైన చెడుగులు ఎన్నో ఉండేవి. అందువల్ల ఆయన సుల్తాన్‌కు శ్రేయోభిలాషతో కూడిన లేఖల ద్వారా

సంస్కరణ ఆవశ్యకతను నొక్కిచెప్పారు. అంతేకాని ఆయన అతన్ని అధికారం నుండి తొలగించి, సజ్జనుల ప్రభుత్వాన్ని తీసుకువచ్చే ఆందోళన చేపట్టలేదు. అమీర్ కబీర్ గారు ఈ చర్యలన్నింటినీ కాదని, తన సకారాత్మక ఆలోచన ప్రకారం తన కార్యక్రమాన్ని రూపొందించుకున్నారు. మరి ఆ కార్యక్రమాన్ని కూడా చడీచప్పుడు కాకుండా నిర్వహించారు. దీనికోసం ఆయన కన్వెన్షన్లు, కాన్ఫరెన్సులు కండక్ట్ చేయలేదు. ఆయన శిష్యులు రాజ్యంలోని వివిధ ప్రాంతాలలో విస్తరించారు. ప్రశాంత వాతావరణంలో అక్కడి ప్రజలలో ఇస్లామ్ ప్రచారం చేశారు. వారు కశ్మీరీ భాషను నేర్చుకున్నారు. అక్కడి పరిస్థితులను అవగాహన చేసుకుని ప్రజలతో కలసిపోయారు. పరదేశంలో స్థిరపడటానికి ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నారు. ఈ విధంగా నిగ్రహం, సంయమనంతో జీవిస్తూ తమ నిశ్శబ్ద సందేశపరిచయ కార్యాన్ని కొనసాగించారు.

## కశ్మీర్‌లో ఇస్లామ్

కశ్మీర్‌లో ఇస్లామ్ ప్రవేశించినది ముహమ్మద్ బిన్ ఖాసిమ్ (హిజ్రీ 66 – 96) కాలంలోనే అయినప్పటికీ, ఆ రాష్ట్రంలో ఇస్లామ్ విస్తృత ప్రాతిపదికపై ప్రచారం అయింది మాత్రం బహుశా సయ్యిద్ బుల్ బుల్ షా ఖలందర్ హయాంలోనే. ఏడు వందల ఏండ్ల క్రితం కశ్మీర్‌లో రీంచిన్ అనే ఒక బౌద్ధ రాజు (క్రీ.శ. 1320 – 23) ఉండేవాడు. ఆ రాజు సయ్యిద్ బుల్ బుల్ షా చేతుల మీదుగా ఇస్లాం స్వీకరించాడు. ఆ కాలంలో ప్రజలు తమ నాయకుల మతధర్మాన్ని అవలంబించేవారు. రాజుని చూసి కశ్మీర్ ప్రజల్లో చాలామంది ముస్లింలుగా ధర్మపరివర్తన చెందారు. హజ్రత్ బుల్ బుల్ షా ఫికహ్ పరంగా హనఫీ పంథాను అనుసరించేవారు. అందువల్ల ఆ కాలంలో ముస్లింలుగా మారినవారు ఆయన ప్రభావం వల్ల హనఫీ పంథా (మస్లక్) ననుసరించి ఆరాధనలు చేసుకునేవారు. అయితే మీర్ సయ్యిద్ అలీ హమ్దానీ ప్రచారం వల్ల కశ్మీర్ ప్రజలు ముస్లింలుగా మారినప్పుడు ఒక సమస్య ఎదురయింది – “ఇప్పుడు ఈ న్యూ ముస్లింలు ఏ పంథాననుసరించి ఆరాధనలు చేసుకోవాలి?” హజ్రత్ అమీర్ కబీర్ షాఫియి పంథా ననుసరించేవారు. కాగా, ఆ కాలంలో ముస్లింలుగా ఉన్న కశ్మీరీలు హనఫీలు. ఆ సమయంలో అమీర్ కబీర్ గనక ఆ న్యూ ముస్లింలకు షాఫియి మస్లక్ ననుసరించి నమాజ్ చేసుకోండి అని చెప్పివుంటే ముస్లింలు రెండు ముఠాలుగా చీలిపోయేవారు – ఒక ముఠా అమీర్ కబీర్ చేతుల

మీదుగా ఇస్లాం స్వీకరించిన వారిది. రెండవది, ముందునుండే ముస్లింలుగా ఉన్న కశ్మీర్ ప్రజలది. హనఫీ – షాఫియీల ఈ కయ్యం ఆ రెండు ముఠాల మస్జిదులను, మదర్సాలను వేరుపరచటమే గాకుండా ప్రతి ముఠా తన పంథా సరైనదంటే, తన పంథాయే కరెక్ట్ అని రూఢీ చేయటంలో తలమునకలై పోయేది. తత్కారణంగా అసలైన తబ్లీగ్ కార్యం స్తంభించేది. కశ్మీరీ ముస్లింలు రెండు ముఠాలుగా ఏర్పడి పరస్పరం కయ్యానికి కాలుదువ్వేవారు. ధర్మపరిచయ కార్యం కొరకు వినియోగించ వలసిన శక్తిసామర్థ్యాలు కాస్తా పరస్పర కీచులాటల్లో వెచ్చించబడేవి. కొన్ని తరాలు గతించేవి కాని ఈ విభేదం మాత్రం సమసిపోయేది కాదు.

మీర్ సయ్యిద్ అలీ హమ్దానీ గారు కేవలం దీన్ (ధర్మం) మౌలికాంశాలను మాత్రమే ప్రచారం చేశారు. ఫికహ్‌కు సంబంధించిన అంశాలను స్పర్శించలేదు. ఈ విషయంలో ఆయన ఎంత జాగ్రత్తగా వ్యవహరించారంటే, తాము షాఫియీలం అన్న విషయాన్ని కూడా అనుయాయులకు తెలియనివ్వలేదు. సామాన్య ముస్లింలతో కలసి వారు కూడా హనఫీ పంథా ప్రకారం నమాజ్ చేసుకునేవారు. తమ సహచరులకు కూడా హనఫీ మస్లక్ ప్రకారమే ఆరాధనలు చేసుకొమ్మని ఉపదేశించేవారు. తత్ఫలితంగా కశ్మీర్‌లో పని చేసుకోవడానికి ఆయనకు విస్తృతమైన మైదానం దొరికింది. వారికి అన్ని వర్గాల సహాయసహకారాలు అందాయి. తమకు సంబంధం లేని విషయాల జోలికి వారు పోలేదు. ఆయన సందేశ ప్రధానమైన కృషి ఎంతగా విజయవంతమైందంటే కశ్మీర్ ముస్లిం మెజారిటీ గల ప్రదేశంగా మారింది. అమీర్ కబీర్ గారే గనక అక్కడ హనఫీ మస్లక్ – షాఫియీ మస్లక్‌ల సమస్యను ముఖ్యాంశంగా చేసుకుని ఉంటే ఆయన తన కార్యక్రమంలో కృతకృత్యులు కాలేకపోయేవారు.

ఈ మార్గంపై నడిచే వారితో ఏ ఒక్కరూ విభేదించరని దీని అర్థం ఎంతమాత్రం కాదు. లక్ష్యసాధన కొరకు పాటుపడే మనిషి పట్ల ఇలా ఎన్నడూ జరగలేదు. స్వయంగా అమీర్ కబీర్ పరిస్థితులు తెలిపేదేమిటంటే 73 ఏళ్ల వయస్సులో కశ్మీర్లో కొంతమంది దుర్మార్గులు ఆయనపై విషప్రయోగం చేశారు. అదే ఆయన మరణానికి కారణ మయింది. అయితే ఇలాంటి భేదాభిప్రాయాలు వ్యక్తిగతమైనవై ఉంటాయి. అవి సందేశ ప్రదాతకు కేవలం వ్యక్తిగతంగా నష్టం చేకూరుస్తాయి. కాగా, ధర్మంతో సంబంధంలేని అంశాన్ని ధార్మిక అంశంగా చేసుకుంటే సముదాయానికి నష్టం

చేకూరుతుంది. అది ధర్మంలో చీలికలకు దారి తీస్తుంది. ఇది ఎంత పెద్ద అపరాధమంటే దాని కారణంగా ఒక వర్గానికి ప్రసాదించబడిన వరాలు లాక్కో బడతాయి.

అమీర్ కబీర్ సయ్యిద్ అలీ హమ్దానీ జీవితం ఇస్లామీయ విధానానికి సంబంధించినంత వరకు ఉదాహరణప్రాయం. తన సందేశప్రధాన కార్యక్రమంలో ఆయన దేవుని ఏకత్వం, పరలోక చింతనకు పెద్ద పీఠం వేశారు. అది మినహా రాజకీయ, ఆర్థిక, ఫికహ్ విషయాల జోలికి ఆయన పోలేదు. ఆయన సిసలయిన ధర్మం (దీన్)పై స్థిరంగా ఉన్నారు. పాక్షిక సాపేక్షిక విషయాల కోసం హఠం చేయలేదు. అంతమాత్రాన ఆయన గారి దృష్టిలో రాజకీయ, ఆర్థిక విషయాలు పనికిరానివని, ధర్మంతో వాటికి సంబంధం లేదని అర్థం ఎంత మాత్రం కాదు. ఆయనకు ప్రతి ఒక్కదాని ప్రాధాన్యత గురించి తెలుసు. కాకపోతే ప్రతి దానిని ఆయన సమయ స్ఫూర్తితో అవసరాల కనుగుణంగా అన్వయింపజేశారు. కాకపోతే ఆయన ధర్మంలో అందరూ ఏకీభవించే అంశాలనే తన సందేశ కార్యానికి ఎంపిక చేసుకున్నారు.

అమీర్ కబీర్ సాబ్ ఫికహ్‌కు సంబంధించిన షరతులన్నింటికీ కట్టుబడి నమాజ్ చేసేవారు. కాని ఫికహ్‌పరమైన భేదాభిప్రాయాల వెనుకపడటం, ఒక పంథాను తప్పుగా నిరూపించి దాని స్థానంలో వేరొక పంథాకు ప్రాముఖ్యత నివ్వటాన్ని ఆయన తన ఎజెండాగా చేసుకోలేదు. అలాగే ఆర్థిక విషయాలలో ఆయన ఒక మార్గాన్ని అవలంబించారు. ఆయన గనక అలా చేసి ఉండకపోతే, ఆయన సహచరులు ఎలా మనగలిగేవారు? అయితే ఆర్థిక సమస్యల పరిష్కారం కొరకు లేదా వాటిని యావత్ సమాజ ఉమ్మడి సమస్యగా చేసి, దాని ఆధారంగా ఉద్యమించలేదు. అలాగే ఆయన రాజకీయ నినాదాలు ఇవ్వకపోయినప్పటికీ ఆయనకంటూ ఒక రాజకీయ విధానం ఉండేది. పైగా ఆ విధానం ఎంతో లోతైనది. ఒకవేళ ఈయన ఆ విధానాన్ని అవలంబించి ఉండకపోతే, నేడు కశ్మీర్‌లో ముస్లింలకు రాజకీయంగా కీలక స్థానం లభించి ఉండేది కాదు. అయినా కశ్మీర్ ప్రజలు ఆయన్ని ఒక రాజకీయ నాయకునిగా చూడరు, సంస్కరణా ప్రియునిగానే స్మరించుకుంటారు – అమీర్ కబీర్ తనకు అందుబాటులో ఉన్న ప్రతి వస్తువు వెనుక పరుగెత్తలేదు. ఆయన కేవలం 'యథార్థం' అనే త్రాడును పట్టుకున్నారు. ఆ తరువాత మిగతావన్నీ వాటంతటవే ఆయన వైపునకు వచ్చాయి.

# సారాంశం

దీన్ (ధర్మం)లో అత్యంత ప్రాముఖ్యత గల అంశం ఏదంటే మనిషి బహుదైవారాధనకు దూరంగా ఉండాలి. ఏకేశ్వరోపాసన (తౌహీద్)పైనే తన మనసును లగ్నం చేయాలి. తద్వారానే అతని జీవితం చక్కదిద్దబడుతుంది. అందుకే మనం నికార్సయిన ఏకేశ్వరోపాసకులుగా జీవిస్తూ, ఏకేశ్వరోపాసన వైపునకే ప్రజలను పిలువాలి. ఆ తరువాత వ్యవహారాలలో దీన్ (ధర్మం) వాంఛించే వాటిపై శ్రద్ధ వహించాలి. వాటిలో పరిస్థితుల కనుగుణంగా ఏదో ఒక విధానానికి కట్టుబడి ఉండటం అవసరం. అయితే వాటినే సందేశ ప్రచారానికి ప్రధానాంశాలుగా చేసుకోరాదు. ద్వితీయశ్రేణి అంశాలను గనక మనిషి తన సందేశ ప్రధానాంశాలుగా చేసుకున్నాడంటే, అతను పాక్షిక విషయాన్ని 'మూలాధారం'గా చేసుకున్నట్లే. ఈ రకమయిన ప్రక్రియ ధార్మిక వ్యవస్థను అస్తవ్యస్తంగా చేసేస్తుంది.

మీరు మీ కొరకు ఒక ప్రత్యేక ఫికహ్ పంథాను ఇష్టపడేమాటైతే ఇష్టపడండి. కాని దాని ప్రాతిపదికపైనే మస్జిద్‌లను, మదర్సాలను నిర్మించకండి. మీరు ఏదయినా ఒక విధానాన్ని పవిత్రమైనదిగా భావిస్తే భావించండి. కాని దానినే ఇతరుల కొరకు కూడా ఇస్లామీ కొలమానంగా ఖరారు చేయకండి. ఎక్కడయినా ఒక ముస్లిం పరిపాలకుడు 'ప్రాథమిక ప్రజాస్వామిక' వ్యవస్థను స్థాపించి ఉంటాడు. మీరు దానికి ఎదురుగా 'ప్రజలు మెచ్చిన ప్రజాస్వామ్యాన్ని' సరైనదిగా భావిస్తున్నట్లయితే, మంచి పద్ధతిలో మీ మాటను ఇతరుల వరకు చేరవేయండి. అంతేగాని ఆ విషయాన్ని తీసుకుని దేశాన్ని రాజకీయ రణరంగంగా మార్చకండి. మిల్లత్‌కు చెందిన ఆర్థిక, సామాజిక హక్కులు కాలరాయబడుతున్నట్లుగా మీకు కనిపిస్తుంటే, శక్తితో, నిజాయితీ తత్పరత (అల్ ఖసస్ : 26)తో తమ సమస్యను పరిష్కరించుకునే దిశగా ప్రజలలో చైతన్యాన్ని మేల్కొలిపే కృషి చేయండి. అంతేగాని ఈ వ్యవహారాన్ని తీసుకుని దౌర్జన్యపరులకు వ్యతిరేకంగా డిమాండ్ల, నిరసనల హోరును సృష్టించకండి – ఈ రకమయిన ప్రతి ఉద్యమం 'రాచబాట' నుండి వైదొలగి కాలిబాటలపై పరుగులు తీస్తుంది. ఇలాంటి ప్రయత్నం సంకల్పశుద్ధితో చేసినప్పటికీ క్రియాత్మకంగా సత్ఫలితం ఇవ్వదు – అలజడిని సృష్టించటం తప్ప. అది మనిషిని నిజ దైవారాధన నుండి దూరం చేసేస్తుంది. అంతేకాదు, ఉమ్మత్ వివిధ కూటములుగా, ముఠాలుగా చీలిపోవటానికి కారణమవుతుంది. ఉమ్మత్ ఈ విధంగా చీలిపోవడాన్ని అల్లాహ్

సుతరామూ సహించదు. ఇలాంటి వారి నుండి దేవుని సామూహిక తోడ్పాటు లాక్కోబడుతుంది. ఉమ్మత్ తన అనైక్యతకు స్వస్తి పలికి మళ్లీ ఏకైక ఉమ్మత్‌గా రూపొందనంత వరకూ ఆ సహాయం అందదు.♦

---

♦ *జమీఅతె అహ్లె హదీస్ జమ్మూ కశ్మీర్ వార్షిక సదస్సు సందర్భంగా శ్రీనగర్‌లో (1978 జులై 30వ తేదీన) సమర్పించబడిన వ్యాసమిది.*

# ప్రవక్త (స) చరితము : ఒక ఉద్యమంగా

ఇస్లామ్ ప్రవక్త (స) చరితమును లిఖించిన వైనం ఇలా ఉంటుంది : ఆమినా కడుపున ఒక అద్భుతమైన వ్యక్తిత్వం ప్రభవించింది. ఆయన తన అద్భుతాలతో యావత్ అరేబియాను పాదాక్రాంతం చేసుకున్నారు. ...

సీరత్ పుస్తకాలలో మానవ చరిత్రకన్నా ఎక్కువగా అద్భుతాలు, మహిమలే నిండి ఉన్నాయి. ఈ 'అభిరుచి' ఎంతగా పెరిగిపోయిందంటే అద్భుతాలకు ఆస్కారంలేని సంఘటనలలో కూడా జనులు తమ మేథాశక్తితో ఏదో ఒక అద్భుతమైన వస్తువును వెతికి పట్టుకున్నారు. ఉదాహరణకు : హజ్రత్ సుహైబ్ (రజి) హిజ్రత్ గురించి ఏమనబడిందంటే, ఆయన మక్కా నుండి బయలుదేరినప్పుడు ఖురైషు యువకులు కొందరు వచ్చి ఆయన్ని అడ్డుకున్నారు. 'నేను కూడబెట్టిన సొమ్మును గనక మీకు ఇచ్చినట్లయితే నన్ను వెళ్ళనిస్తారా?' అని సుహైబ్ వారిని అడిగారు. వెళ్ళనిస్తాము అని వారన్నారు. అప్పుడు సుహైబ్ తన దగ్గర ఉన్న కొన్ని ఊఖియాల బంగారాన్ని వారికి ఇచ్చి మదీనాకు చేరుకున్నారు. బైహఖీలోని ఒక ఉల్లేఖనంలో ఆయన గురించి ఇలా ఉంది :

> మహనీయ సుహైబ్ ఇలా అన్నారు : ప్రవక్త మహనీయులు (స) నన్ను మదీనాలో చూసినప్పుడు, "అబూ యహ్యా! నీవు చేసిన ఈ వర్తకం లాభసాటి వర్తకం" అన్నారు. దానికి నేను, 'దైవప్రవక్తా! నాకంటే ముందు మక్కా నుండి ఎవరూ రాలేదుకదా! ఈ సమాచారం ఖచ్చితంగా మీకు జిబ్రీల్ దూత ద్వారా తెలిసి ఉంటుంది' అన్నాను.

కాని ఇదే సంఘటనను ఇబ్నె మర్దూయ, ఇబ్నె సాద్ నకలు చేశారు. అందలి వాక్యాలు ఇలా ఉన్నాయి –

నేను ఖురైషులకు నా సొమ్మును ఇచ్చి మక్కా నుండి ప్రయాణ మయ్యాను. నేను మదీనా చేరుకున్న సంగతి దైవప్రవక్త (సఅసం)కు తెలియపరచబడినప్పుడు, "సుహైబ్ వర్తకం లాభసాటి వర్తకం. సుహైబ్ వర్తకం లాభసాటి వర్తకం" అన్నారు.

యథార్థమేమిటంటే ఇస్లామ్ ప్రవక్త (స) జీవితమంతా ఒక నిరాడంబరమైన మానవుని జీవితం లాంటిది. అందుకే ఆయన (స) మన కొరకు ఆదర్శప్రాయం. దారిలో నడుస్తున్నప్పుడు ఆయనకు, ఒక సాధారణ మనిషికి ఎదురుదెబ్బ తగిలినట్లే తగిలింది. (బుఖారీ). ఆయన సందేశాన్ని మొట్టమొదట విన్నవారికి ఆయన మాటలు నమ్మశక్యం కాలేదు. ఎందుకంటే ఆయన అందరిలాంటి ఒక మానవమాత్రుని వలెనే కనిపించారు. వారిలా అన్నారు :

"మీరూ మా మాదిరిగానే బజారులో క్రయవిక్రయాలు జరుపుతారు. మా లాగానే జీవనోపాధిని అన్వేషిస్తున్నారు."

ఇస్లామ్ ప్రవక్త (స) జీవిత ఔన్నత్యం ఆయన ఒక సాధారణ మనిషిలా ఉండటంలోనే ఉంది; అద్భుతాల వృత్తాంతంలో లేదు. దైవ సహాయంతోనే ఆయన విజయం సాధించారు. ఈ రకంగా అది కచ్చితంగా అద్భుతమే. అయితే ఈ అద్భుతం 'మానవ ప్రవక్త' స్థాయిలోనే జరిగింది.

ఖుర్ఆన్‌లో ఇస్లామ్ ప్రవక్త (స) గురించి ఇవ్వబడిన వివరాలను ముందుంచుకున్నప్పుడు మనకు బోధపడేది ఇదే.

తన జీవితంలోని నలభయ్యవ ఏట హిరా కొండగుహలో ఆయన (స)పై మొదటిసారి 'వహీ' (దైవవాణి) అవతరించినప్పుడు, ఒక మానవమాత్రుని నుండి ఎదురయ్యే స్పందనే ఆయన నుండి కూడా ఎదురయింది. ఆయన (స) భయ కంపితులైన స్థితిలో తన ఇంటికి వచ్చారు. అక్కడ ఆయన సతీమణి ఖదీజా ఉంది. ఆమె ఆ సంఘటనకు ప్రత్యక్ష సాక్షి కాదు, ఈ కారణంగా ఆమె ఇలా అన్నారు:

"ఎంత మాత్రం కాదు. దైవసాక్షి! దేవుడు మిమ్మల్ని పరాభవం పాల్జేయడు. మీరు బంధువుల హక్కులు ఇస్తారు. బలహీనుల బరువు ఎత్తుకుంటారు. నిరుద్యోగులకు ఉపాధిని సంపాదించే యోగ్యత నిస్తారు. అతిథులకు మర్యాద చేస్తారు. కష్టకాలంలో జనులను ఆదుకుంటూ ఉంటారు."

ఒక కొత్త ప్రదేశంలో సాధారణ సందేశప్రదాతకు ఎదురయ్యే వాతావరణమే ఆయన (స)కూ ఎదురయింది. పరిస్థితుల స్వరూపం దృష్ట్యా మొదట్లో ఆయన రహస్యంగా పనిచేయాల్సి వచ్చింది.

> ఇబ్నె ఇస్‌హాఖ్ కథనం ప్రకారం అలీ బిన్ అబీ తాలిబ్ ఆయన (స) ఇంటికి వచ్చారు. ఆ సమయంలో ఆయన (స), హజ్రత్ ఖదీజా (ర.అ) – ఇద్దరూ నమాజ్ చేస్తున్నారు. 'ముహమ్మద్! ఇదేమిటి?' అని ఆయన అడిగారు. "ఇది దైవధర్మం. దేవుడు దీనిని తన కొరకు ఎంపిక చేసుకున్నాడు. దాని ప్రచారం కొరకు తన ప్రవక్తల్ని పంపించాడు. నేను నిన్ను ఒకే ఆరాధ్యదైవం వైపునకు పిలుస్తున్నాను. ఆయనకు ఎవరూ సాటిలేరు. ఆయన్ని సేవించవలసినదిగా నీకు ఉపదేశిస్తున్నాను. ఇక మీదట నీవు లాత్, ఉజ్జా దేవతలను పూజించటం మానుకోవాలి" అని దైవప్రవక్త (స) పిలుపు ఇచ్చారు. సమాధానంగా అలీ బిన్ అబీ తాలిబ్ ఇలా అన్నారు : 'ఇది నా కొరకు కొత్త మాట. ఇంతకు ముందెన్నడూ నేను ఇలాంటి మాట వినలేదు. దీని గురించి మా నాన్నగారు అబూ తాలిబ్‌తో చర్చించనంత వరకూ నేనొక నిర్ణయానికి రాలేను'. అయితే బహిరంగ ప్రకటనకు ముందు ఈ రహస్యం బహిర్గతం అవటం ఆయన (స)కు ఇష్టం లేదు. అందుకే ఆయన (స) అలీతో, "అలీ! నీవు ఇస్లామ్ ధర్మం స్వీకరించకపోతే పోనీ. కాని ఈ వ్యవహారాన్ని రహస్యంగా ఉంచు" అని అన్నారు. అలీ బిన్ అబీ తాలిబ్ ఆ రాత్రి అక్కడే ఆగిపోయారు. మరునాడు ఉదయం ఆయన దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి, 'ఓ ముహమ్మద్! నిన్న మీరు నాతో ఏమన్నారు?' అని ప్రశ్నించారు. "అల్లాహ్ తప్ప మరో నిజ ఆరాధ్య దైవం లేడనీ, ఆయన ఒకే ఒక్కడని, ఆయనకు సహవర్తులు ఎవరూ లేరని సాక్ష్యమివ్వు. దైవానికి సహవర్తులుగా కల్పించబడే లాత్, ఉజ్జాలను పూజించటం మానుకో. ఆ మిథ్యా దైవాలతో తెగత్రెంపులు చేసుకో" అని ఇస్లామ్ ప్రవక్త (స) విశదీకరించారు. అలీ (రజి) ఈ వచనాలను శిరసావహించి ఇస్లామ్ స్వీకరించారు. ఆనాటి నుంచీ అబూ తాలిబ్‌కు భయపడి గుట్టుచప్పుడు

కాకుండా దైవప్రవక్త (స) ఇంటికి వచ్చేవారు. ఆ విధంగా అలీ (రజి) తన ఇస్లామ్‌ను దాచివుంచారు, వ్యక్తపరచలేదు.

ఔస్, ఖజ్రజ్ తెగలకు చెందిన తొలి ముస్లింలు కూడా యస్రిబ్‌కు తిరిగి వచ్చినప్పుడు – ఆరంభంలో – రహస్యంగానే సందేశపరిచయ కార్యం నిర్వర్తించేవారు (తిబ్రానీ).

ఆయన (స) తన జీవిత కాలంలో ఒక నియమానికి కట్టుబడ్డారు. అదేమంటే, తాను బలోపేతం కానంతవరకూ ప్రత్యర్థిపై చర్యకు పూనుకోలేదు. హజ్రత్ ఆయిషా (ర.అ) ఇలా అంటున్నారు : దైవప్రవక్త (స) వద్ద 38 మంది ప్రియసహచరులు గుమిగూడారు. అప్పుడు హజ్రత్ అబూబక్ర్ ఆయన (స)కు 'ఇస్లామ్ ప్రకటన చేద్దాం' అని విజ్ఞప్తి చేశారు. అంటే ఇక నుండి మనం బహిరంగంగా ఇస్లామ్ ప్రచారం చేద్దాం అన్నారు. కాని ఆయన (స) ఏమన్నారో తెలుసా! "ఓ అబూబక్ర్! ప్రస్తుతం మనం అల్పసంఖ్యలో ఉన్నాం". అలాగే దైవదౌత్యం అందిన ఆరవ యేట హజ్రత్ ఉమర్ (రజి) ఇస్లామ్ స్వీకరించినప్పుడు, 'ఓ దైవప్రవక్తా! మనం సత్యంపై ఉన్నప్పుడు మన ధర్మాన్ని గోప్యంగా ఎందుకు ఉంచాలి? దీనికి విరుద్ధంగా అన్యులు అధర్మంగా ఉండి కూడా యథేచ్ఛగా ప్రచారం చేసుకుంటున్నార'ని విన్నవించుకోగా, ఆయన (స) అప్పుడు కూడా అదే జవాబు ఇచ్చారు : "ఓ ఉమర్! మనం తక్కువ సంఖ్యలో ఉన్నామ"ని. ఆయనగారి ఈ విధానం చాలా కాలం వరకు ఇలాగే ఉండేది. హిజ్రత్ (వలస) అనంతరం ముస్లింల శక్తి ఒకచోట కేంద్రీకృతం అయినప్పుడు, మరోవైపున ఖురైషులు సైనికదళంతో కదం తొక్కుతూ ముస్లింలపై దండెత్తి వచ్చినప్పుడు ఆయన (స) ప్రతిఘటనకు ఆనతి ప్రదానం చేశారు.

ఉల్లేఖనాల ద్వారా తెలిసేదేమంటే దైవప్రవక్త (స)పై సందేశ ప్రచార బాధ్యత మోపబడినప్పుడు, ఇది చాలా గొప్ప కార్యమని, దీని కొరకు పూర్తిగా జీవితాన్ని అంకితం చేయవలసిన ఆవశ్యకత ఉందని ఆయన (స) భావించారు. తన కుటుంబీకులు ఆర్థికంగా తనను ఆదుకుంటే, ఈ మహత్కార్యాన్ని ఏకాగ్రతతో నిర్వర్తించవచ్చని తలపోశారు. అందుకే ఆయన (స) తన నివాస గృహంలో అబ్దుల్ ముత్తలిబ్ పరివారం వారిని సమావేశపరిచారు. వారు సుమారు 40 మంది వరకూ ఉన్నారు. వేరొక ఉల్లేఖనం ప్రకారం 30 మంది ఉన్నారు. ఆయన వారిని ఉద్దేశించి ప్రసంగిస్తూ, వారి సహాయ సహకారాలకై విజ్ఞప్తి చేశారు :

"ఓ అబ్దుల్ ముత్తలిబ్ కుటుంబీకులారా! నేను మీ వైపునకు ప్రత్యేకంగా, జనులందరి వైపునకు సర్వసామాన్యంగా ప్రవక్తగా పంపబడ్డాను. ఈ విషయమై మీలో ఎవరు నాకు ప్రమాణబద్ధులవుతారు? అలాంటి వారు నా సహోదరులవుతారు. మీలో నా అప్పులను తీర్చేవారు, నేను చేసిన వాగ్దానాలను నెరవేర్చేవారు ఎవరు? నా పరోక్షంలో నా ఇంటివారల బాధ్యత వహించేవారెవరు? అలాంటివారు స్వర్గంలో నా వెంట ఉంటారు." దీనికి సమాధానంగా ఒక వ్యక్తి ఇలా అన్నాడు : 'ఓ ముహమ్మద్ ! నీవొక సముద్రానివి. ఈ బాధ్యత మోయడానికి ఎవరు సిద్ధపడతారు?'

ఆయన (స) పరివారం ఆయన బాధ్యత తీసుకోవడానికి సిద్ధంగా లేదు. అబ్బాస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ ఆయన (స) పినతండ్రే. ఆర్థికంగా ఆయన (స)కు అండగా నిలిచే స్థోమత అబ్బాస్‌కు ఉంది. కాని ఆయన మౌనం వహించారు. అయితే అల్లాహ్ ఆయన (స)కు సహాయం అందించాడు. మొదట ఆయన భార్య ఖదీజా (ర.అ), ఆ తర్వాత అబూబక్ర్ (రజి) సంపద మక్కీ జీవితంలో ఆయన (స)కు ఆర్థికంగా చేయూతనిచ్చింది.

ప్రజలకు సత్యసందేశాన్ని చేరవేసేందుకు దైవప్రవక్త (స) తహతహ లాడుతుండేవారు. ఇబ్నె జరీర్ హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ నుండి నకలు చేసిన దాని ప్రకారం మక్కా నగర ప్రముఖులు ఒక రోజు సూర్యాస్తమయం తరువాత కాబా ప్రాంగణంలో సమావేశమై చర్చల నిమిత్తం ఆయన్ని పిలిపించారు. ఆ తరువాత ఆ ఉల్లేఖనంలోని వాక్యాలివి :

దైవప్రవక్త (స) చాలా వేగంగా నడచివచ్చారు. సత్యస్వీకారం వైపు ఖురైషులు మొగ్గు చూపుతున్నారని ఆయన (స) తలపోశారు. ఎందు కంటే ఖురైషుల మార్గదర్శకత్వాన్ని ఆయన తీవ్రంగా కాంక్షించేవారు. వారు వినాశం పాలవటం ఆయన్ని తీవ్రంగా కలచివేసేది.

కాని పిలిపించిన వారి ఉద్దేశం మరో విధంగా ఉంది. వారు కేవలం వాదోపవాదాల నిమిత్తం ఆయన్ని పిలిపించారు. సుదీర్ఘ వాదన తరువాత ఆయన దుఃఖవదనులై తిరిగి వెళ్ళారు.

దైవప్రవక్త (స) కలత చెందిన మనసుతో విచారంతో తన ఇంటికి తిరిగి వచ్చారు. ఎందుకంటే తన జాతి వారి నుండి దేన్నయితే ఆశించి వెళ్ళారో అది నెరవేరలేదు. ఆ జనులు దానికి (సత్యానికి) బహు దూరాన ఉన్నారు.

*(తహ్‌జీబ్ సీరత్ ఇబ్నె హిషామ్ – సం.1, పేజీ : 68)*

అబూ తాలిబ్ మరణవ్యాధికి గురైనప్పుడు జనులు ఆయన దగ్గరకు వచ్చి, "మాకూ – మీ భ్రాతృజునికి మధ్య మరణానికి ముందే తీర్పు చేయండి" అని విజ్ఞప్తి చేసినప్పుడు, ఆయన దైవప్రవక్త (స)ను పిలిపించి, 'ఇంతకీ నీవు నీ జాతి వారి నుండి ఏం కోరుతున్నావు?' అని విచారించారు. దానికి దైవప్రవక్త (స), "వారు లా ఇలాహ ఇల్లల్లాహ్ అని పలకాలి. అల్లాహ్‌ను వదలి వారు పూజిస్తున్న మిథ్యాదైవాల ఆరాధనను విడనాడాలి. ఇదే నేను కోరుకునేది" అని బదులిచ్చారు. కాని జాతి ప్రజలు దీనికి అంగీకరించలేదు. జనులు వెళ్ళిపోయిన తర్వాత – ఇబ్నె ఇస్‌హాఖ్ ఉల్లేఖనం ప్రకారం – అబూ తాలిబ్ ఇలా అన్నారు : 'అబ్బాయి! నా అభిప్రాయంలో నీవు నా జాతి వారినుండి కష్టతరమైనదేదీ కోరలేదు'. అబూ తాలిబ్ నోట ఈ మాట వినగానే దైవప్రవక్త (స)లో ఆశలు చిగురించాయి.

ఉల్లేఖకుడు ఇలా అంటున్నారు : దైవప్రవక్త (స)కు అబూ తాలిబ్ విషయంలో ఆశ జనించింది. "బాబాయి! అలాగయితే మీరే ఈ కలిమాను పఠించండి. ప్రళయదినాన మీ కొరకు సిఫారసు చేయటం నాకు ధర్మసమ్మతం అవుతుంది" అని దైవప్రవక్త (స) కోరారు.

*(అల్ బిదాయ వన్నిహాయ)*

ఆయన (స) ఆహూతుల నుండి అన్ని రకాల రెచ్చగొట్టే మాటల్ని – ఆఖరి హద్దు వరకూ – భరించేవారు. మక్కా విజయం సందర్భంగా అబూ సుఫ్యాన్ భార్య హింద్ ఆయన (స) సన్నిధికి విధేయతా ప్రమాణం (బైఅత్) చేయడానికి వచ్చింది. ఆయన (స) ఆమె నుండి ప్రమాణ స్వీకారం చేయించుకుంటూ, ఆనవాయితీ ప్రకారం "నీవు నీ సంతానాన్ని హతమార్చనని నాకు మాటివ్వాలి" అన్నారు. దానికి ఆమె వెంటనే,

'అయ్యో! సంతానాన్ని హతమార్చటానికి తమరు (బద్ర్ యుద్ధం

> తర్వాత) మా పిల్లల్ని బ్రతికి ఉండనిస్తే కదా!' అని నిష్ఠూరంగా పలికింది.

వ్యంగ్యంతో కూడిన ఈ మాటలకు దైవప్రవక్త (స) రెచ్చిపోలేదు. చిరునవ్వుతో ప్రమాణ స్వీకారం చేయించుకున్నారు.

ఈ సందేశకార్యంలో ఆయన తన శారీరక, మానసిక శక్తులన్నింటినీ అర్పించటమేగాక, తన సంపదనంతా ఈ మార్గంలో ధారబోశారు. ప్రవక్తగా నియుక్తులుకాక పూర్వం మక్కాలోని ధనికురాలైన మహిళను నికాహ్ చేసుకున్న కారణంగా ఆయన ఒక ధనికునిగా పరిగణించబడేవారు. దైవసందేశం అందిన తొలి కాలంలో – మక్కాలో – ఒకసారి ఖురైషులు ఉతబా బిన్ రబీయాను తమ ప్రతినిధిగా చేసి దైవప్రవక్త (స) దగ్గరకు పంపించారు. ఆయనతో చర్చలు జరిపి దైవసందేశ కార్యాన్ని నిలిపివేయాలని కోరాలన్నది ఖురైషుల లక్ష్యం. కాని అక్కడకు వెళ్ళిన ఉతబా స్వయంగానే ప్రభావితుడై పోయాడు.

> ఆ తర్వాత ఉతబా తన ఇంట్లోనే ఉండిపోయాడు. జనులలోకి రాలేదు. దానిపై అబూజహ్ల్, 'ఖురైష్ సోదరులారా! దైవసాక్షి! నా ఉద్దేశంలో ఉతబా కూడా ముహమ్మద్ మాటల్లో పడిపోయాడు. అతనికి ముహమ్మద్ విందు భోజనం నచ్చినట్లుంది. ఖచ్చితంగా ఏదో అవసరంకొద్దీ అతను ఇలా చేయాల్సి వచ్చి ఉంటుంది. రండి, మనం ఉతబా వద్దకు వెళదాం' అన్నాడు. వారంతా అతని దగ్గరకు వెళ్ళారు. అబూజహ్ల్ ఇలా అన్నాడు : 'దైవసాక్షి! నీవు ముహమ్మద్ మాటల్లో పడిపోయి ఉంటావన్న భయంతో మేమంతా నీ దగ్గరకు రావలసి వచ్చింది. బహుశా అతని వ్యవహారం నీకు నచ్చి ఉంటుంది. చెప్పు, నీకు డబ్బు అవసరం ఉంటే, నీ కోసం మేము విరాళాలు ప్రోగుచేసి, నీకు ముహమ్మద్ విందు భోజనం అవసరం లేకుండా చేస్తాము.' ఈ మాటలు విని ఉతబా రెచ్చిపోయాడు. 'నేను ఇక నుండి ముహమ్మద్‌తో మాట్లాడను' అని ఒట్టేసి మరీ చెప్పాడు.

అలాగే అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి) కథనం ప్రకారం వలీద్ బిన్ ముగీరా దైవప్రవక్త (స) దగ్గరకు వచ్చాడు. ఆయన (స) అతనికి ఖుర్ఆన్ వినిపించారు. ఖుర్ఆన్‌లోని సాహితీ సౌరభానికి అతను ముగ్ధుడయ్యాడు. ఈ సంగతి తెలుసుకున్న

అబూజహ్లో వలీద్ బిన్ ముగీరా వద్దకు వచ్చి, 'నీ కోసం చందా సేకరించాలని అందరూ అనుకుంటున్నారు. ఎందుకంటే ముహమ్మద్ లాగా ధనవంతుడవ్వాలనే పేరాశ నీలో పుట్టింది' అన్నాడు.

ఈ విధమైన సంపన్న స్థితిలో దైవప్రవక్త (స) మిషన్ ప్రారంభమయింది. కాని దైవదౌత్యం అంది 13 ఏళ్ళు గడిచేసరికి ఆయన (స) దగ్గర ఉన్న సంపదంతా కరిగిపోయింది. మదీనాకు హిజ్రత్ చేస్తున్నప్పుడు అబూబక్ర్ (రజి) నుండి అప్పు తీసుకుని ప్రయాణం చేయవలసిన అగత్యం ఏర్పడింది.

## సందేశ భాష

సందేశ ప్రదాత నోట వెలువడే భాష, అతను మాటలాడే మాటతో పాటు అతని వ్యక్తిత్వం కూడా అందులో కలగలసి ఉంటుంది. సందేశప్రదాత ఎదలో దైవభీతితో కూడుకున్న హృదయం ఉంటుంది. సంబోధితులు తన పిలుపును అంగీకరించాలన్న తహతహ, ఆత్రుత అతనిలో తీవ్రంగా ఉంటుంది. నేను నా మాటలతో దైవదాసులను దైవానికి దగ్గరకు చేర్చినట్లయితే దేవుడు నా పట్ల ప్రసన్నుడవుతాడన్న ఆరాటం మరోవైపు అతన్ని అవిశ్రాంతంగా పని చేసేలా చేస్తుంది. అతను ఎదుటివారితో మాట్లాడేటప్పుడు సందర్భోచితంగా మాట్లాడుతాడు. సమయస్ఫూర్తితో ప్రవర్తిస్తాడు.

ఇస్లామ్ ప్రవక్త (స) జీవితంలో ఈ వస్తువు పరిపూర్ణ స్థాయిలో గోచరిస్తుంది. ఆయన (స) రేయింబవళ్ళు దైవసందేశాన్ని చేరవేసే పనిలో నిమగ్నులై ఉండేవారు. అంతేగాని కొన్ని పలుకుల్ని అవతలివారికి లాంఛనప్రాయంగా వినిపించి ఊరుకోవటం ఆయన (స) విధానమై ఉండేది కాదు. సంబోధితుని పరిస్థితుల్ని, సామర్థ్యాన్ని పసిగట్టి తదనుగుణంగా అతనికి తన మాటను వినిపించేవారు.

మక్కా తొలి కాలంలో ఆయన (స) ఒకసారి అబూ సుఫ్యాన్‌ను, ఆయన భార్య హింద్‌ను ఆహ్వానించారు. ఇబ్నె అసాకిర్ ఉల్లేఖనం ప్రకారం ఆయన (స) ఇలా అన్నారు :

> "ఓ అబూ సుఫ్యాన్! ఓ హింద్! దైవసాక్షిగా చెబుతున్నాను. ఏదో ఒకనాడు మీకు మరణం తథ్యం. ఆ తరువాత మీరు మళ్ళీ (సజీవులై) లేవవలసి ఉంది. పిదప మంచివారు స్వర్గంలో ప్రవేశిస్తారు. దుష్టులు

నరకానికి ఆహుతి అవుతారు. నేను ఏదైతే చెబుతున్నానో అది సత్యబద్ధం."

ఇబ్నె ఖుజైమా నకలు చేసిన ఒక కథనం ప్రకారం మక్కాలోని ఒక పెద్దాయన హుసైన్‌తో ఆయన (స) సంభాషణ ఇలా సాగింది :

"హుసైన్! ఎంతమంది ఆరాధ్య దైవాలను పూజిస్తారు?" అని దైవప్రవక్త (స) అడిగిన దానికి, 'నేలనున్న వారు ఏడుగురిని. నింగినున్నవాడు ఒకడిని' అని హుసైన్ బదులిచ్చాడు. "కష్టాలు వచ్చినప్పుడు ఎవరిని మొరపెట్టుకుంటారు?" అని ఆయన (స) అడగ్గా, 'నింగినున్న వానిని' అని హుసైన్ చెప్పాడు. "మీ సిరిసంపదలకు నష్టం వాటిల్లినప్పుడు ఎవరిని ప్రార్థిస్తారు?" అని తిరిగి ప్రశ్నించగా, 'నింగినున్న వానినే' అని హుసైన్ సమాధానమిచ్చాడు. "చూశారా! ఆ ఒక్కడైన అల్లాహ్ మీ మొరలను ఆలకించి ఆమోదిస్తున్నాడు. కాని మీరేమో ఆయనకు భాగస్వాముల్ని కల్పిస్తున్నారు (ఇది న్యాయమేనా?)" అని దైవప్రవక్త (స) చెప్పారు.

ఇమామ్ అహ్మద్ అబూ ఉమామా నుండి సంగ్రహించిన దాని ప్రకారం ఒకానొక తెగకు చెందిన ఒక వ్యక్తి దైవప్రవక్త (స) వద్దకు వచ్చి, 'దేవుడు మిమ్మల్ని ఏ వస్తువు ఇచ్చి పంపాడు?' అని ప్రశ్నించాడు. అతనికి జవాబు ఇస్తూ ఆయన (స) ఇలా అన్నారు :

"బంధువుల హక్కులు ఇవ్వాలి. అన్యాయంగా ఎవరినీ చంపరాదు. రాకపోకల మార్గాల్లో శాంతిభద్రతల్ని కల్పించాలి. విగ్రహాలను విరగ్గొట్టాలి. కేవలం ఒకే దైవాన్ని పూజించాలి. ఆయనకు సహవర్తులుగా ఎవరినీ కల్పించకూడదు."

మదీనాకు వచ్చాక ఆయన (స) నజ్రాన్ వాసులకు సందేశ లేఖ వ్రాస్తూ, ఈ పదాలను ప్రయోగించారు :

"నేను మిమ్మల్ని దాసుల దాస్యం నుండి దేవుని దాస్యం వైపునకు ఆహ్వానిస్తున్నాను. దాసుల రాజ్యం నుండి దేవుని రాజ్యం వైపునకు పిలుస్తున్నాను."

ఇస్లామ్ ప్రచారానికి ఒక ముఖ్య సాధనం దివ్య ఖుర్ఆన్. ఎవరయినా ఒక వ్యక్తి తనకు తారసపడినప్పుడు దైవప్రవక్త (స) అతనికి ఖుర్ఆన్‌లోని కొన్ని భాగాలు వినిపించేవారు. ఖుర్ఆన్ శైలి అరబ్బులను ఆశ్చర్యచకితుల్ని చేసింది. ఇస్లామ్ బద్ధ శత్రువులు సైతం రాత్రిపూట దైవప్రవక్త (స) ఖుర్ఆన్ పారాయణం చేస్తున్నప్పుడు చెవియొగ్గి చాటుమాటుగా వినేవారు. ఆ వాక్కు అరబ్బులను మంత్రముగ్ధుల్ని చేసేది. వలీద్ బిన్ ముగీరా అరబ్బుల తరఫున ప్రతినిధిగా ప్రవక్త (స) వద్దకు వెళ్ళినప్పుడు, ఆయన (స) అతనికి ఖుర్ఆన్‌లోని కొన్ని భాగాలు చదివి వినిపించారు. ఆ వచనాలకు అతను ఎంతగా ప్రభావితుడయ్యాడంటే, ఖురైషులను కలుసుకున్నప్పుడు 'అది అత్యున్నతమైన వాక్కు. దాని ముందు ఇతర వాక్కులన్నీ దిగదుడుపే' అన్నాడు. ఆహూతులకు ఖుర్ఆన్ వినిపించటం ఆ కాలంలో ఆనవాయితీగా మారింది. హజ్రత్ ముస్అబ్ సందేశ ప్రచారకునిగా మదీనా వెళ్ళినప్పుడు, అక్కడి ప్రజలతో సంభాషిస్తూనే మధ్య మధ్యలో ఖుర్ఆన్ వినిపించేవారు. ఈ కారణంగా ఆయనకు 'ముఖరీ' అనే పేరు పడిపోయింది.

## అరబ్బుల ప్రతిభ

సందేశాన్ని స్వీకరించటమనేది కేవలం సందేశంలోని సత్యతపై, సందేశప్రదాత ప్రయత్నంపై మాత్రమే ఆధారపడి ఉండదు. అంతకన్నా అధికంగా అది ఆహూతుని పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. అరబ్బులలో మానవీయ గుణం సమృద్ధిగా ఉండేది. ఆ రకంగా వారు ఎంతో విలువైనవారు. వారి అజ్ఞానం మొరటుతనం వెనుక ప్రకృతి సిద్ధమయిన నిరాడంబరత చెక్కు చెదరకుండా ఉండేది. 30 లక్షల చదరపు కిలోమీటర్ల అత్యధిక ఉష్ణ దేశంలో అత్యున్నత మానవతా విలువలు ప్రోగై ఉండేవి. ఒక అరబ్బు తన జీవనోపాధికి ముఖ్యసాధనమైన తన ఒంటెను జిబహ్ చేసి, దాని మాంసాన్ని అతిథులకు తినిపించి మహదానందం చెందేవాడు. తన అతిథులు ఆకలితో బాధపడరాదన్నదే అతని అభిమతమై ఉండేది. ఎడారిలో ఎవరయినా ఒక బాధిత వ్యక్తి ఒక అరబ్బుని గుడారంలో ఆశ్రయం కోరితే, ఖడ్గం చేబూని రాత్రంతా కాపలా ఉంటూ శత్రువు బారి నుండి అతన్ని కాపాడేవాడు. ఆ బాధిత వ్యక్తిని శత్రువు తీసుకుపోవాలంటే ఆ అరబ్బు శవం మీదుగా వెళ్ళాల్సిందే. బందిపోటు దొంగలు సైతం స్త్రీల ఆభరణాలను దోచుకోవాలనుకున్నప్పుడు, ఆడవాళ్ళ ఒంటిపై చెయ్యి వేసేవారు కారు. నగలు తీసి ఇమ్మని బెదిరించేవారు. స్త్రీలు తమ

నగలను, వస్త్రాలను విప్పుతున్నప్పుడు బందిపోటు దొంగలు తమ ముఖాలను మరో వైపునకు త్రిప్పుకునేవారు.

అరేబియాలోని పల్లెటూరి బైతులు బొత్తిగా 'బుద్ధిహీనులు' అని భావించటం పొరపాటు. యథార్థానికి వారు ఎంతో చైతన్యవంతులు. చాలా తొందరగా విషయం లోతుల్లోకి చేరుకునేవారు.

ఒక తెగకు చెందిన 700 మంది న్యూముస్లింలు ఒకసారి దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చారు. మాటలమధ్యలో వారేమన్నారంటే, మేము అజ్ఞాన కాలం నుండి ఐదు విషయాలను నేర్చుకున్నాము. తమరు వాటి నుండి మమ్మల్ని వారించేవరకూ మేము వాటికి కట్టుబడి ఉంటాము.

> ఇంతకీ ఆ అయిదు విషయాలేమిటి? అని ఆయన (స) అడిగినప్పుడు వారిలా సమాధానం ఇచ్చారు : "(1) కలిమిలో కృతజ్ఞతా భావంతో మెలగటం (2) కష్టకాలంలో సహనం వహించటం (3) (శత్రువులు) మార్కొన్నప్పుడు నిజాయితీని నిరూపించుకోవటం (4) విధివ్రాతపై రాజీపడిపోవటం (5) ఒకరు ఆపదలో ఉన్నప్పుడు సంబరపడక పోవటం – వారు మన శత్రువులైనాసరే – ఇది విని దైవప్రవక్త (స), "అరె! వీళ్ళు జ్ఞానులే కాదు, సంస్కారవంతులు కూడా. వీళ్ళలో దైవప్రవక్తల్లోని వైభవం ఉట్టిపడుతోంది. ఎంత గొప్పవి వీళ్ళ మాటలు!" అన్నారు. *(కన్జుల్ అమాల్ – సం. 1, పేజీ : 69)*

జమాద్ అనే ఒక వ్యక్తి అజ్దె షన్వా తెగకు చెందినవాడు. అతను భూతవైద్యం చేసేవాడు. అతను ఒకసారి మక్కా నగరానికి వచ్చినప్పుడు, జనులు అతన్ని కలుసుకుని ముహమ్మద్ (స) పరిస్థితి గురించి చెప్పారు. ఆయనకు జిన్ను పట్టుకుని సతాయిస్తున్నాడని చెప్పారు. తన మంత్రశక్తితో దెయ్యాన్ని వదిలించగలననే ధీమాతో జమాద్ ఆయన్ని కలుసుకున్నాడు. కాని ఆయన (స) మాటలు విన్న తర్వాత జమాద్ ఆశ్చర్యచకితుడయ్యాడు. 'దైవసాక్షి! నేను జ్యోతిష్కుల, మాంత్రికుల మాటలు విన్నాను. కవుల కవనం కూడా విన్నాను. కాని ఇలాంటి పలుకుల్ని ఎన్నడూ వినలేదు అని చెప్పాడు. 'మీ చెయ్యిచాపండి. మీ చేతులమీదుగా విధేయతా ప్రమాణం (బైఅత్) చేస్తాన'న్నాడు. ఇస్లామ్ ప్రవక్త (స) ఆ సందర్భంగా – ఆనవాయితీ ప్రకారం సుదీర్ఘమైన ఉపన్యాసం ఇవ్వలేదు. 'ముస్లిం' ఉల్లేఖనం ప్రకారం కేవలం ఈ మాటలన్నారు :

"నిశ్చయంగా స్తోత్రం అల్లాహ్‌కే శోభాయమానం. నేను ఆయన్నే స్తుతిస్తున్నాను. సహాయం కొరకు ఆయన్నే అర్థిస్తున్నాను. అల్లాహ్ సన్మార్గం చూపించిన వానిని ఎవరూ పెడదారి పట్టించలేరు. అల్లాహ్ అపమార్గాన వదలివేసిన వానిని ఎవరూ సన్మార్గానికి తేలేరు. అల్లాహ్ తప్ప మరో నిజ ఆరాధ్య దైవం లేదని, ఆయన అద్వితీయుడని, ఆయనకు సహవర్తులు ఎవరూ లేరని నేను సాక్ష్యమిస్తున్నాను."

అయితే ఆ సంక్షిప్త ప్రసంగం నుండే అతను గొప్ప అర్థాన్ని గ్రహించాడు. జమాద్ దైవప్రవక్త (స)తో, "ఆ మాటల్ని మరోసారి పలకండి. ఈ వాక్యాలు సముద్రపు లోతుల్లోకి దిగి ఉన్నాయి" అన్నాడు.

*(అల్ బిదాయ వన్నిహాయ – సం.3, పేజీ : 36)*

ఒక అరబ్బు కొరకు మాటకు – ఆచరణకు మధ్య వ్యత్యాసానికి తావు ఉండేది కాదు. వారు స్వయంగా తమ మాటల్లో చేతల్లో సత్యవంతులు. ఇతరులను కూడా వారు సత్యవంతులుగానే భావించేవారు. అవతలివారు చెప్పే మాట గనక అర్థమైతే చాలు, తక్షణం దానికి అంగీకరించేవారు. ఇబ్నె ఇస్‌హాఖ్ హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ ద్వారా ఉల్లేఖించిన దాని ప్రకారం బనీ సాద్ తెగవారు జమామ్ బిన్ సాలబాను తమ ప్రతినిధిగా చేసి, దైవప్రవక్త (స) వద్దకు పంపించారు. ఆయన మదీనాకు వచ్చి తన ఒంటెను మస్జిద్ ద్వారం వద్ద కట్టేసి, మస్జిద్‌లోనికి ప్రవేశించారు. ఆ సమయంలో దైవప్రవక్త (స) తన సహచరులతో కలసి కూర్చుని ఉన్నారు. జమామ్ సాహసవంతుడు, బుద్ధిమంతుడు కూడా. ఆయన దైవప్రవక్త (స) సమావేశం ఎదుట నిలబడి, 'మీలో అబ్దుల్ ముత్తలిబ్ పుత్రుడు ఎవరు?' అని అడిగారు. "నేను అబ్దుల్ ముత్తలిబ్ పుత్రుడను" అని దైవప్రవక్త చెప్పారు. 'ఓ ముహమ్మద్!' అన్నారు జమామ్. "చెప్పండి" అన్నారు ప్రవక్త. 'ఓ ఇబ్నె అబ్దుల్ ముత్తలిబ్! నేను మీకు కొన్ని ప్రశ్నలు అడుగుతాను. నిర్ద్వంద్వంగా, దాపరికం లేకుండా అడుగుతాను. అన్యథా భావించకండి' అన్నారు జమామ్. "ఫరవాలేదు, అడగండి. నేనేమీ అనుకోను" అన్నారు దైవప్రవక్త (స). జమామ్ ఇలా అన్నారు : 'నేను మీ ఆరాధ్య దైవం మీద, మీకు పూర్వం ఉన్నవారి ఆరాధ్యదైవం మీద, మీ తర్వాత రానున్న వారి ఆరాధ్య దైవం మీద ఒట్టేసి అడుగుతున్నాను. అల్లాహ్ మిమ్మల్ని తన సందేశహరునిగా చేసి మా వద్దకు పంపాడా?' దానికి ఆయన (స) "అవును" అని సమాధానమిచ్చారు.

జమామ్ వేసిన రెండవ ప్రశ్న – 'మీ ఆరాధ్య దైవం మీద, మీకు పూర్వం గతించిన వారి ఆరాధ్య దైవం మీద, మీ తరువాత రాబోయే వారి ఆరాధ్య దైవం మీద ఒట్టేసి అడుగుతున్నాను – మేము కేవలం అల్లాహ్‌నే ఆరాధించాలి, ఆయనకు భాగస్వాములుగా ఎవరినీ నిలబెట్టకూడదని, మా తాతముత్తాతలు పూజిస్తూ వచ్చిన దైవాలను మేము వదలిపెట్టాలని అల్లాహ్ మీతో అన్నాడా?' దానికి దైవప్రవక్త (స) "అవును" అని బదులిచ్చారు. 'మేము అనుదినం ఐదువేళల నమాజు ఆచరించాలని అల్లాహ్ మీకు ఆజ్ఞాపించాడా?' "అవును" అని ప్రవక్త (స) సమాధానమిచ్చారు. ఆయన జకాత్, రోజా, హజ్జ్‌ల గురించి, ఇతర ఆదేశాలన్నింటి గురించి ఇదేవిధంగా ప్రశ్నించారని ఉల్లేఖకుడు తెలిపారు ప్రశ్నోత్తరాలన్నీ పూర్తయ్యాక జమామ్ ఇలా అన్నారు :

> "అల్లాహ్ తప్ప వేరే నిజ ఆరాధ్య దైవం లేదని నేను సాక్ష్యమిస్తున్నాను. ఇంకా ముహమ్మద్ (స) దైవ సందేశహరులని కూడా నేను సాక్ష్యమిస్తున్నాను. ఇక నుంచి నేను ఈ విధులన్నింటినీ నెరవేరుస్తాను. మీరు వారించిన వాటన్నింటినీ మానుకుంటాను. వీటిలో ఎలాంటి హెచ్చుతగ్గులు చేయను." *(అల్ బిదాయ వన్నిహాయ – సం. 5)*

తరువాత ఆయన తన ఒంటెపై కూర్చొని వెళ్ళిపోయారు. తన జాతివారి వద్దకు వెళ్ళి ఈ విషయాన్ని విడమరచి చెప్పారు. ఒక ఉల్లేఖనం ప్రకారం పొద్దుగూకక ముందే అక్కడి పురుషులు స్త్రీలంతా ముస్లింలుగా ధర్మపరివర్తన చెందారు.

వారిలో కాపట్యం ఉండేది కాదు. స్వీకరణకు – తిరస్కరణకు మధ్య వారికి మూడో విషయం తెలీదు. వారు ఎవరికయినా మాట ఇచ్చారంటే ఎట్టి పరిస్థితిలోనూ దానిని నెరవేర్చేవారు. దానికోసం ప్రాణత్యాగం చేయవలసి వచ్చినాసరే వెనక్కి తగ్గేవారు కాదు. అరబ్బులలోని ఈ వ్యక్తిత్వం యస్రిబ్ తెగల (ఔస్ – ఖజ్రజ్) ఉపన్యాసాలలో కూడా కనిపిస్తుంది. రెండవ 'బైఅతె అఖబా' సందర్భంగా వారి ప్రతినిధులు చేసిన ఉపన్యాసాన్ని మచ్చుకు ఇక్కడ పొందుపరుస్తున్నాము –

> యస్రిబ్ వాసులు దైవప్రవక్త (స) సమక్షంలో విధేయతా ప్రతిజ్ఞ (బైఅత్) చేయడానికి ఒకచోట చేరినప్పుడు అబ్బాస్ బిన్ ఉబాదా, 'ఓ ఖజ్రజ్ తెగవారలారా! మీరు ఏ విషయం మీద ఈయన చేతిలో చెయ్యేసి ప్రమాణం చేస్తున్నారో ఆలోచించారా? మీరు తెలుపు – ఎరుపుతో

తలపడటంపై ప్రతిజ్ఞ చేస్తున్నారు. బాగా ఆలోచించుకోండి! ఒకవేళ మీ సంపద అంతా వృథా అయిపోయి, మీలోని మర్యాదస్తులు హతమార్చబడిన తరువాత ముహమ్మద్ (సఅసమ్)ను ఆయన జాతివారికి అప్పజెప్పాలన్నదే మీ ఉద్దేశమైతే ఆ పని ఇప్పుడే చేయండి. ఎందుకంటే ఒకవేళ మీరు తరువాత ఆ పని చేసినట్లయితే, దైవసాక్షి! అది ఇహపరాలలో మీ పరాభవానికి కారణమవుతుంది. ఒకవేళ మీరు ఏ ఏ విషయాలపై వాగ్దానం చేశారో, దానిని నెరవేర్చాలన్నదే మీ దృఢ సంకల్పమైతే – దాని కొరకు మీ ధనం ఖర్చయిపోయినా, మీలోని ప్రముఖులు హతమార్చబడినా ఫరవాలేదనుకుంటే, ఈయన్ని మీ వెంట తీసుకెళ్ళండి. ఎందుకంటే, దైవసాక్షిగా ఇందులోనే మీ ఇహపరాల సాఫల్యం ఉంది.'

దీనికి వారిచ్చిన సమాధానం ఇది : 'మేము ఈయన్ని తీసుకెళతాము – దీనికొరకు మా ధనం కరిగిపోయినాసరే, మాలోని ప్రముఖులు హతమార్చబడినా సరే.' 'దైవప్రవక్తా! దీనికిగాను ప్రతిఫలంగా మాకేం లభిస్తుంది?' అని వారు ప్రశ్నించగా, "స్వర్గం లభిస్తుంది" అని ఆయన (స) సమాధానమిచ్చారు.

తరువాత వారు, 'అలాగైతే మీ చేయి చాపండి' అన్నారు. ఆయన (స) తన చేతిని ముందుకు చాపారు. వారంతా విధేయతా ప్రమాణం చేశారు. *(అల్ బిదాయ వన్నిహాయ – సం.3, పేజీ : 162)*

ఆ తరువాత జరిగిన సంఘటనలు నిరూపించిందేమిటంటే, వారు కేవలం 'భాషణలు' చేయలేదు. వారు అక్షరాలా తమ వాగ్దానాన్ని నెరవేర్చారు. ఇస్లామ్ ప్రాబల్యం వహించిన తరువాత కూడా వారు తమ త్యాగాలకు గాను ప్రతిఫలాన్ని ఆపేక్షించలేదు. పైగా వారు ఖిలాఫత్‌ను ముహాజిర్లకు అప్పగించి, దానిపై సంతుష్టులయ్యారు. ఆ స్థితిలోనే వారు ఒక్కొక్కరుగా ఈ లోకం నుండి నిష్క్రమించారు.

## సందేశం సర్వతోముఖం

ఇబ్నె ఇస్‌హాఖ్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ నుండి సంగ్రహించిన దాని ప్రకారం, ఒకసారి ఖురైష్ ప్రముఖులు అబూ తాలిబ్ దగ్గర సమావేశమయ్యారు. వారిలో

ఉతబా బిన్ రబీయ, షైబా బిన్ రబీయ, అబూజహ్లా బిన్ హిషామ్, ఉమయ్యా బిన్ ఖలఫ్, అబూ సుఫ్యాన్ బిన్ హరబ్ వంటి లీడర్లు ఉన్నారు. అబూ తాలిబ్ ద్వారా వారు అడిగించారు – ఇంతకీ ఆయన (స) ఏం కోరుతున్నారో చెప్పమని. సమాధానంగా దైవప్రవక్త (స) ఇలా అన్నారు :

> "నేను కోరేదొక్కటే. మీరు గనక దానికి అంగీకరిస్తే యావత్ అరేబియాకు మీరు అధిపతులైపోతారు. అరబ్బేతరులు మీకు విధేయులైపోతారు."
>
> *(అల్ బిదాయ వన్నిహాయ – సం.2, పేజీ : 123)*

దేవుని ఏకత్వపు వచనం (కలిమా) పైకి కేవలం ఒక విశ్వాసపరమైన వచనంగానే కనిపిస్తుంది. కాని అందులో అన్ని రకాల మానవీయ విజయాలు నిక్షిప్తమై ఉన్నాయి. ఇది మానవుని అంతరాత్మ ప్రబోధం. అందుకే అది మానవ మనోమయ భావాల లోతుల్లో అంతర్లీనమైపోతుంది. తన ప్రతికూలురుల్లో సయితం తన అనుకూలురను సృష్టించుకుంటుంది. ఖాలిద్ బిన్ వలీద్ మక్కా విజయానికి ముందు ఇస్లామ్ స్వీకరించారు. అయితే ఇస్లామ్‌లోని సత్యం అంతకు ముందే ఆయన మనోక్షేత్రంలో నాటుకుంది. ఇస్లామ్ స్వీకరించిన మీదట ఆయన ఇలా అన్నారు :

> "నేను దైవప్రవక్త (స)కు వ్యతిరేకంగా అన్ని యుద్ధాలలో పాల్గొన్నాను. కాని నేను ఎప్పుడు యుద్ధం చేసి వెనుతిరిగినా నేను సరైన చోట నిలబడిలేనని నా మనస్సాక్షి ఘోషించేది."
>
> *(అల్ బిదాయ వన్నిహాయ – సం.4)*

ఇలాగే చాలామంది గురించి ఉల్లేఖనాలున్నాయి. వాటి ప్రకారం వారి హృదయాలలో ఏనాడో ఇస్లామ్ గురించి సుముఖత ఏర్పడింది. కడకు వారు కలలు గనేవారు. ఉదాహరణకు : ఖాలిద్ బిన్ సయీద్ బిన్ ఆస్ ఇస్లామ్ స్వీకరణకు ముందు ఒక కలగన్నారు – ఆ కలలో ఆయన ఒక పెద్ద అగ్ని గుండం అంచున నిలబడి ఉన్నారు. ఎవరో ఆయన్ని బలవంతంగా తోసి, ఆ అగ్ని గుండంలో పడవేయగోరుతున్నాడు. అంతలోనే ఇస్లామ్ ప్రవక్త (స) వచ్చి, ఆయన్ని అగ్నికి ఆహుతి కాకుండా కాపాడారు.

తౌహీద్ (దేవుని ఏకత్వపు) సిద్ధాంతంలోని ప్రత్యేకత ఏమిటంటే అందులో

వర్గ విభజనకు, వర్ణవ్యవస్థకు ఎలాంటి ఆస్కారం లేదు. అందుచేత ఈ సిద్ధాంతం ప్రాతిపదికపై ఎప్పుడు ఎక్కడ ఉద్యమం మొదలైనా అది ఆశ్చర్యకరమయిన రీతిలో ప్రజాబాహుళ్యాన్ని ప్రభావితం చేస్తుంది. ఎందుకంటే తౌహీద్ నీడలో తమకు మానవ సమానతలు, మానవ ఔన్నత్యం ప్రాప్తిస్తాయని వారు భావిస్తారు. ముగీరా బిన్ షూబా పారసీక సేనాధిపతి రుస్తుం దర్బారులోకి వెళ్ళినప్పుడు దర్బారులోని వారిపై ఆయన ప్రసంగ ప్రభావం ఏవిధంగా పడిందో చూడండి –

> "దైవసాక్షి! ఈ అరబ్బు వ్యక్తి చెప్పిన మాట నిజం" అని క్రింది వారన్నారు. కాగా సర్దారులు ఇలా అన్నారు : "దైవసాక్షి ఇతను విసిరిన మాట ఎటువంటిదంటే, మన బానిసలంతా దానివైపు వెళ్ళి పోతారు. దేవుడు మన పూర్వీకులను నాశనం చెయ్య! ఎంతటి మూర్ఖులు వారు! ఈ జాతి వ్యవహారాన్ని వారు చాలా తేలిగ్గా తీసుకున్నారు." *(తారీఖె తబ్రీ – సం.3, పేజీ : 36)*

దైవదౌత్యం అందిన 13వ యేట ఇస్లామ్ ప్రవక్త (స) అబూబక్ర్‌తో కలసి మదీనా చేరుకున్నప్పుడు, సుమారు 500 మంది ఆయనకు స్వాగతం పలకటానికి గుమిగూడారు. వారిలా అన్నారు :

> "స్వాగతం, సుస్వాగతం! తమరిక్కడ సురక్షితం. తమరు మా నాయకులు."

మదీనాలో ఈ నాయకత్వం ఆయనకు ఎలా లభించింది? సందేశ ప్రదానం ద్వారా. మదీనా (యస్రిబ్)కు చెందిన మొట్టమొదటి వ్యక్తి సువైద్ బిన్ సామిత్ ఖజ్రజీకి ఆయన (స) ఇస్లామ్ సందేశం చేరవేశారు. ఇస్లామ్ సందేశం విన్న మీదట అతను, "బహుశా నా దగ్గర ఉన్నదే మీ దగ్గరా ఉంది" అని పలికాడు. ఇంతకీ నీ దగ్గర ఏముంది? అని ఆయన (స) అడగ్గా, "లుఖ్మాన్ వివేచన" అని అతను చెప్పాడు. "ఏదీ, కాస్త వినిపించు" అని ఆయన (స) కోరినప్పుడు, అతను కొన్ని కవితలు చదివి వినిపించాడు. "నా దగ్గర ఖుర్‌ఆన్ ఉంది. అది దీనికన్నా గొప్పది" అన్నారాయన (స). ఆ తరువాత ఆయన అతనికి ఖుర్‌ఆన్ వినిపించగానే, అతను అప్పటికప్పుడే ముస్లింగా మారాడు. యస్రిబ్ చేరగానే అతను తన తెగవారికి ఇస్లామ్ పరిచయం చేశాడు. వారు అతన్ని చంపేశారు. (తారీఖె తబ్రీ – పేజీ : 232)

ఆ తర్వాత అబుల్ హైసమ్ (అనస్ బిన్ రాఫె) అనే ఒక యస్రిబ్ నాయకుడు

మక్కా వచ్చాడు. అతని వెంట బనీ అబ్దె అష్‌హల్ తెగకు చెందిన యువబృందం ఉంది. బనూ ఖజ్రజ్ తెగవారికి మద్దతుగా ఖురైషులతో ఒడంబడిక చేసుకునే ఉద్దేశంతో వారు వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న దైవప్రవక్త (స) ఆ బృందం దగ్గరకు వెళ్ళి, "మీరు ఏ పనికోసం వచ్చారో దానికన్నా మేలైనదేదో నేను మీకు చెప్పనా?" అన్నారు. తరువాత ఆయన (స) వారికి ఏకదైవారాధనా సందేశం అందజేశారు. వారిలోని ఒక యువకుడు అయాస్ బిన్ ముఆజ్ ఇలా అన్నాడు : "నా జాతివారలారా! దైవసాక్షి! మీరు ఏ పనిమీద వచ్చారో దానికన్నా ఈ విషయం మేలైనది". కాని ఆ యువబృందానికి విషయం అర్థం కాలేదు. "అరే. పోనీ. మనం వచ్చింది దీనికోసం కాదు కదా!" అన్నారు. వారు యస్రిబ్‌కు తిరిగి వెళ్ళారు. వెళ్ళిన కొన్నాళ్ళకే ఔస్ – ఖజ్రజ్ తెగల వారి మధ్య యుద్ధం జరిగింది. అది 'బుఆస్' యుద్ధంగా ప్రసిద్ధి చెందింది.

ఖుబైబ్ బిన్ అబ్దుర్రహ్మాన్ కథనం ప్రకారం యస్రిబ్‌వాసులైన ఇద్దరు వ్యక్తులు మక్కా వచ్చారు. వారి పేర్లు సాద్ బిన్ జరారా, జక్వాన్ బిన్ ఖైస్. వారిద్దరూ ఉతబా బిన్ రబీయా వద్ద ఆగారు. ఇస్లామ్ ప్రవక్త ప్రస్తావన రావటంతో ఆయన్ని కలుసుకోవడానికి వెళ్ళారు. ఆయన (స) వారిద్దరికీ ఇస్లామ్ సందేశం అందజేశారు. ఖుర్ఆన్ వినిపించారు. వారిద్దరూ ఇస్లామ్ స్వీకరించారు. తర్వాత వారు తమ అతిథేయుడైన ఉతబా బిన్ రబీయాను కలుసుకోకుండానే యస్రిబ్ వెళ్ళిపోయారు. యస్రిబ్ ప్రజలకు ఇస్లామ్‌ను పరిచయం చేసిన తొలి వ్యక్తుల్లో వీరిద్దరూ ముఖ్యులు. దైవప్రవక్తగా నియుక్తులైన పదవ యేట జరిగిన సంఘటన ఇది.

నుబువ్వత్ 11వ యేట – హజ్జ్ సందర్భంగా – యస్రిబ్ నుండి ఖజ్రజ్ తెగకు చెందిన ఆరుగురు మక్కా వచ్చారు. వారు దైవప్రవక్త ఎదుట విధేయతా ప్రమాణం చేశారు. ఆ తర్వాత వారు తమ నగరానికి వెళ్ళి ఇస్లామ్ ప్రచారం మొదలెట్టారు. మరుసటి సంవత్సరం 12 మంది వచ్చి దైవప్రవక్త సమక్షంలో 'బైఅత్' చేశారు. అది చరిత్రలో 'ప్రథమ అఖబా (621) ప్రతిజ్ఞ'గా ప్రసిద్ధిచెందింది. నుబువ్వత్ 13వ యేట ఈ సంఖ్య మరింతగా పెరిగింది. యస్రిబ్ నుండి 75 మంది వచ్చి విధేయతా ప్రమాణం చేశారు. ఆ విధంగా 'ద్వితీయ అఖబా ప్రతిజ్ఞ' ఉనికిలోకి వచ్చింది.

మక్కాకు భిన్నంగా యస్రిబ్‌లో సంభవించిన ఒక పరిణామం ఏమిటంటే, మొదటి దశలోనే అక్కడి ప్రముఖులు ఇస్లామ్ స్వీకరించారు. అది తెగల ప్రాబల్యం

గల కాలం. తెగలలో సర్దారులు ఏ మతాన్ని అవలంబిస్తే ప్రజలు కూడా సాధారణంగా అదే మతాన్ని అనుసరిస్తారు. అందుచేత యస్రిబ్‌లో చాలా వేగంగా ఇస్లామ్ వ్యాప్తి చెందింది. చివరకు ఇస్లాం స్వీకరించని ఏ ఒక్క ఇల్లూ మిగల్లేదు. ఈ విధంగా యస్రిబ్ జనాభాలో ముస్లింలు అధిక సంఖ్యాకులు కాగానే, సహజంగానే ఆ బస్తీలో వారి పలుకుబడి పెరిగింది.

> "అంతే. ముస్లింలు మదీనాలో మిగతా వారందరికన్నా ప్రాబల్యం కల వర్గంగా తయారయ్యారు. వారి పరిస్థితి చక్కబడింది."
>
> *(ఉర్వా – తిబ్రానీ)*

## సందేశ ప్రయోజనాలు

ప్రతి యుగంలో కాలప్రవాహానికి కొట్టుకుపోకుండా తమ వ్యక్తిత్వాన్ని కాపాడుకునేవారు ఎంతో కొంతమంది ఉంటారు. వారు తమ ప్రకృతి పిలుపును చెవియొగ్గి ఉంటారు. అరబ్బు సమాజంలో కూడా ఇలాంటి వారు ఉన్నారు. మిల్లతె ఇబ్రాహీమీ గుణాల అవశేషాలు వారిలో ఉండేవి. వారు నిత్యం సత్యాన్వేషణలో ఉండేవారు. విగ్రహారాధనను ఇష్టపడేవారు కారు. ఇలాంటి వారు 'హనీఫ్'గా వ్యవహరించబడేవారు. ఖైస్ బిన్ సాయిదా, వరఖా బిన్ నౌఫల్ మొదలగువారు ఈ కోవకు చెందినవారే. జున్దబ్ బిన్ అమ్ర్ దౌసీ కూడా 'హనీఫ్' కోవకు చెందినవారే. ఆయన అజ్ఞాన కాలంలో ఇలా అనేవారు :

> "నిశ్చయంగా ఈ సృష్టికి ఒక కర్త ఉన్నాడు. కాని ఆయన ఎవరో నాకు తెలీదు". *(ఇబ్నె అబ్దుల్ బర్ ఫిల్ ఇస్తియాబ్ – సం. 2)*

ముహమ్మద్ ప్రవక్త (స) ప్రభవించారన్న సంగతి తెలియగానే ఆయన తన తెగకు చెందిన 75 మందితో సహా మక్కా వచ్చారు. వారంతా ఇస్లామ్ స్వీకరించారు. అబూజర్ గిఫ్ఫారీ కూడా ఇలాంటి సత్యాన్వేషకులలో ఒకరు. దైవప్రవక్త (స) గురించి తెలిసినప్పుడు, ఆయన తన సోదరుణ్ణి మక్కాకు పంపించారు. సోదరుడు మక్కా నుండి తిరిగి వచ్చాక అతడు సమర్పించిన నివేదికలోని ఒక వాక్యం ఇది :

> "నేనొక వ్యక్తిని చూశాను. జనులు అతన్ని ధర్మభ్రష్టుడని అంటున్నారు. అతను చాలావరకు మిమ్మల్ని పోలి ఉన్నాడు."
>
> *(ముస్లిం – అబ్దుల్లాహ్ బిన్ సామిత్)*

ఇలాంటి శుభాత్ములకు ఇస్లామ్ సందేశాన్ని అర్థం చేసుకోవటంలో ఎలాంటి ఇబ్బందీ ఎదురు కాలేదు.

ఏదైనా ఒక సమాజంలో సందేశపరిచయ కార్యం మొదలైనప్పుడు, దాని విత్తనం ఎక్కడెక్కడ నాటుకుంటుందో, స్వయంగా సందేశప్రదాత కూడా ఊహించలేదు.

అరేబియాలో చాలామంది "ఆలస్యంగా" ఇస్లామ్ స్వీకరించారంటే దాని అర్థం, ఒక్కసారిగా – అకస్మాత్తుగా – వారికి జ్ఞానోదయం అయిందని ఎంతమాత్రం కాదు. యథార్థమేమంటే దైవప్రవక్త (సఅసమ్) గారి అత్యుత్తమ గుణగణాలు, ఆయన రేయింబవళ్ళు సందేశ ప్రచారకార్యంలో నిమగ్నులై ఉండటం, ప్రతికూల పవనాల కారణంగా ఆయన సందేశం నిత్యం చర్చనీయాంశంగా ఉండటం – ఇవన్నీ ప్రతి ఒక్కరికీ ప్రశ్నార్థకంగా తయారయ్యాయి. ఈ సంఘటనలు వందలాది మంది అరబ్బుల మనోభూమిలో ఇస్లామీయ బీజాన్ని నాటాయి. వర్గతెగల దురభిమానంవల్ల నైతేనేమీ, పూర్వీకుల అంధానుసరణవల్ల నైతేనేమీ ఒక వ్యక్తి పైకి విరోధిగా కనిపించినప్పటికీ, అతని ఆంతర్యంలో ఇస్లామ్ నిశ్శబ్దంగా పెరిగి పెద్దదయ్యేది. దానిని అతను సయితం నిరోధించలేకపోయేవాడు. హజ్రత్ ఉమర్ (రజి) ఇస్లామ్ స్వీకరణ గురించి ప్రసిద్ధిచెందిన విషయం ఏమిటంటే, ఒక సంఘటన ఆయనకు ఎదురయింది, అదే ఆయన ధర్మపరివర్తనకు కారణమయింది. చివరి ఘట్టంలో ఆయనకు ఆ సంఘటన ఎదురైన విషయం నిజమే. కాని ఇస్లామ్ బీజం అంతకుముందే – ఏనాడో – ఆయన మనోక్షేత్రంలో నాటుకుంది.

> ఉమ్మె అబ్దుల్లాహ్ బిన్తె అబీ హైస్మా ఇలా అంది : దైవసాక్షిగా! మేము అబిసీనియా దేశం వైపునకు బయలుదేరడానికి సిద్ధంగా ఉన్నాము. నా భర్త ఏవో అవసరాల కోసం వెళ్ళి ఉన్నారు. అంతలోనే ఉమర్ బిన్ ఖత్తాబ్ వచ్చి నా దగ్గర నిలబడ్డారు. ఆయన అప్పటికింకా ఇస్లామ్ స్వీకరించలేదు. ఆయన ద్వారా మాకు ఎన్నో కష్టాలు ఎదురయ్యేవి. "ఉమ్మె అబ్దుల్లాహ్! ఎక్కడికో వెళుతున్నట్టున్నావ్?" అని ఉమర్ అడిగారు. దానికి నేను, "అవును. దైవసాక్షిగా! దేవుని భూభాగంలో మేము ఏదో ఒక భాగానికి వెళుతున్నాము. ఎందుకంటే మీరు మమ్మల్ని రాచిరంపాన పెడుతున్నారు. మమ్మల్ని వేధిస్తున్నారు. దేవుడు మా కోసం ఏదేని విస్తృత ప్రదేశాన్ని కల్పించకుండా ఉండడు" అన్నాను.

> ఉమ్మె అబ్దుల్లాహ్ ఇలా అన్నారు : నా మాట విన్న తర్వాత ఉమర్ నోట వెలువడిన పలుకులు ఇవి – "దేవుడు నీకు తోడుగా ఉందుగాక!" అలా అంటున్నప్పుడు ఉమర్ కళ్లు చెమ్మగిల్లాయి. ఆయన్ని అలాంటి పరిస్థితిలో నేనెన్నడూ చూడలేదు. తరువాత ఆయన వెళ్ళిపోయారు. మేము మక్కా నగరాన్ని విడిచిపోయినందుకు ఆయన ఎంతగానో బాధపడ్డారు.

అన్ని కాలాల్లోనూ ఇలాంటి భావాలు, ఆలోచనలుంటాయి. అవి ప్రజల మనోమస్తిష్కాలను అల్లుకుపోతాయి. ఈ ఆలోచనల గోడ బద్దలు కానంత వరకూ కేవలం తాత్విక పునాదులపై వారిలో 'స్వీకృతి' ఏర్పడదు. ప్రారంభకాలంలో అరబ్బుల తరఫున పొడసూపిన భేదాభిప్రాయాలకు కారణం కేవలం మంకుతనం లేక స్వార్థప్రియత్వం కాదు. దానికి అసలు కారణం ఏమిటంటే పవిత్ర కాబా ధర్మకర్తల మతధర్మం తప్ప మరేదీ నిజమైనది కాదని వారు గట్టిగా నమ్మేవారు. అయితే అరేబియాలోని యూదులకు పొరుగున నివసించే అరబ్బు తెగలవారు మాత్రం ఈ నమ్మకాల నుండి సురక్షితంగా ఉన్నారు. ఎందుకంటే వారు యూదుల ద్వారా వినేవారు – అరేబియాలో ఒక ప్రవక్త ప్రభవించనున్నాడని తమ గ్రంథాలలో ఉన్నట్లు వారు చెబుతూ ఉండేవారు :

> అన్సార్ ప్రజలు దైవప్రవక్త (స) వాక్కును విన్నప్పుడు నిశ్శబ్దంగా ఉండిపోయారు. వారి అంతరంగం ఆయన (స) సందేశం విని సంతృప్తి చెందింది. గ్రంథం కల ప్రజల ద్వారా ఏదైతే విని ఉన్నారో ఆ లక్షణాలన్నీ వారికి ఆయన (స) లో కనిపించాయి. వారు ఆయన్ని దైవప్రవక్త (స)గా ధ్రువపరచి, ఆయన్ని విశ్వసించారు.

ఉకాజ్ సంతలో ఆయన (స) బనీ కుందా గుడారాల్లోకి వెళ్లి, వారికి తన సందేశం చేరవేసినప్పుడు, ఒక యువకుడు ఇలా అన్నాడు :

> "నా జాతి ప్రజలారా! ఇతరులు ముందంజవేయక ముందే ఈయనగారికి తోడ్పడటంలో మీరు త్వరపడండి. దైవసాక్షి! మక్కా పుణ్యపురి నుండి ఒక ప్రవక్త ప్రభవించనున్నాడని, ఆ కాలం దగ్గరపడిందని గ్రంథం కల ప్రజలు చెబుతుండేవారు."

మదీనాలోని అరబ్బు తెగలయిన ఔస్ ఖజ్రజ్‌లు విశ్వసించటంలో ముందడుగు వేయడానికి ప్రధాన కారణం ఈ మానసిక నేపథ్యమే. కాగా, మక్కా ప్రజలు, దాని పరిసర ప్రాంతాలలోని తెగల 'సత్యబద్ధత'కు ప్రమాణం 'కాబా అధికారం'. ప్రాచీన కాలంలో రాజరిక వ్యవస్థలో 'కిరీటానికి' గల ప్రాధాన్యతే కాబా గృహానికి ఉండేది. అదీగాక 'కిరీటం' (Crown) తో కేవలం రాజకీయ అధికార దృక్పథమే ముడివడి ఉంటుంది. కాని కాబాతో అధికారంతో పాటు పవిత్ర భావాలు కూడా పూర్తిస్థాయిలో పెనవేసుకుని ఉన్నాయి. ఎవరయితే కాబాపై అధికారం సంపాదిస్తారో వారే సత్యంపై ఉన్నట్లు లెక్క అని అరేబియాలోని సామాన్య ప్రజానీకం తలపోసేది. బనూ ఆమిర్ తెగకు చెందిన జుల్ జూషన్ ఇలా అంటున్నారు :

"ఓ జుల్ జూషన్! నీవు ఇస్లామ్ ఎందుకు స్వీకరించవు? స్వీకరించే మాటైతే తొల్దొలి విశ్వాసులలో నీవూ ఒకడుగా పరిగణించబడతావు కదా!" అని దైవప్రవక్త (స) అడిగారు. దానికి నేను, 'స్వీకరించను' అని చెప్పాను. "ఎందుచేత?" అడిగారాయన (స). 'మీ జాతివారు మీపైన కత్తి కట్టడాన్ని నేను చూస్తున్నాను' అన్నాను. "బద్ర్ రణరంగంలో వారి పరాజయం గురించి నీవు వినలేదా?" అని ఆయన అడిగితే, 'విన్నాన'ని చెప్పాను. "నీకు సన్మార్గ బోధన చేసేదా?" అని ఆయన అడగ్గా, 'చేయండి. కాని కాబాను జయించి, దానిని కైవసం చేసుకున్న మీదట చేస్తే బాగుంటుంది' అని నేనన్నాను. "నీవు గనక బ్రతికి ఉంటే అదీ చూస్తావు" అని ఆయన చెప్పారు. ఆ తరువాత నేను నా స్వస్థలంలో ఉండగా ఒక వ్యక్తి వాహనంపై వచ్చాడు. 'ఏమిటి సంగతి?' అని నేనడిగితే, 'దైవసాక్షి! ముహమ్మద్ (స) కాబాను వశపరచుకున్నారు' అని చెప్పాడు. అంతే, 'నా తల్లి నన్ను మాయం చేయ! నేను ఆ రోజే ఇస్లామ్ స్వీకరించి ఉంటే ఎంత బాగుండేది! నేను ఆనాడే ఇస్లామ్ స్వీకరించి 'హీరా'ను నాకు ఇవ్వమని అడిగి ఉంటే, ముహమ్మద్ (స) దానిని నాకు తప్పకుండా ఇచ్చి ఉండేవారు' అన్నాను. *(తిబ్రానీ)*

ఈ కారణంగానే మక్కాను జయించిన తరువాత ప్రజలు తండోప తండాలుగా వచ్చి ఇస్లామ్‌లో చేరారు (అన్ నస్ర్ : 2).

# సందేశ ప్రతిక్రియ

దైవప్రవక్త (స) సందేశ కార్యక్రమాన్ని ప్రారంభించినప్పుడు, ఒక సమాజంలో కొత్త పిలుపు వినిపించినప్పుడు ఎదురయ్యే ప్రతిస్పందనే ఎదురయింది. ఆయనకు వ్యతిరేకంగా ఎన్నో సంఘటనలు ఎదురయ్యాయి. ఏమిటిది? అని కొందరు ఆశ్చర్యచకితులయ్యారు. అబ్ద్ బిన్ హుమైద్ తన ముస్నద్‌లో నకలు చేసిన దాని ప్రకారం ఖురైష్ సర్దారులు ఒకసారి ఉతబా బిన్ రబీయాను దైవప్రవక్త (స) దగ్గరకు పంపించారు. అతను ఆయన సందేశాన్ని ఖండిస్తూ సుదీర్ఘ ఉపన్యాసం ఇచ్చాడు. అతని ఉపన్యాసం ముగిసిన తర్వాత, "నీ మాట పూర్తయిందా?" అని ఆయన అడిగారు. పూర్తయింది అని అతనన్నాడు. అప్పుడు ఆయన (స) బిస్మిల్లా హిర్రహ్మాని్రహీమ్ అని పలికి, హామీమ్ సజ్దా సూరాలోని మొదటి 13 వచనాలు చదివి వినిపించారు. ఉతబా అది విని 'చాలు చాలు' అన్నాడు. ఆ తర్వాత ఈ ఉల్లేఖనంలోని వాక్యాలు ఇవి :

> పిదప ఉతబా ఖురైషుల వద్దకు వచ్చాడు. 'ఏమయింది?' అని వాళ్ళడిగారు. దానికి ఉతబా ఇచ్చిన సమాధానం ఇది : "మీరు చెప్పి పంపించినదంతా అతనితో చెప్పేశాను." 'దానికేమన్నాడు?' అడిగారు ఖురైషులు. "అతను బదులిచ్చాడు. కాని దైవసాక్షి! అతను చెప్పిన దానిని నేను అర్థం చేసుకోలేకపోయాను. ఆద్ సమూద్ జాతుల వారిపై వచ్చిపడిన ఆపద గురించి అతను భయపెట్టాడు. అదొక్కటే నాకు అర్థమయింది" అని ఉతబా చెప్పాడు. దానికి ఖురైషులు కోపంతో, 'నీ పాడుగాను. ఒక వ్యక్తి నీతో అరబీలో మాట్లాడుతుంటే నీవు అర్థం చేసుకోలేకపోయావా?' అని అంటే, "దైవసాక్షి! భయంకరమైన అరుపు గురించి అతను చేసిన భయబోధ ఒక్కటే నాకు అర్థమయింది" అని ఉతబా వివరణ ఇచ్చాడు. (బైహఖీ)

ఆనాడు కొంతమంది మతానికి సంబంధించిన ఒక ప్రత్యేక సాంప్రదాయిక ఆచారానికి దగ్గరగా ఉన్నారు. దైవప్రవక్త (స) ఇచ్చిన సందేశంలో వారికి తమ పూర్వీకుల పరాభవ వాసన వచ్చింది. అబూ నుఅయిమ్ గారు 'దలాయెలు న్నబువ్వ'లోనూ, నసాయి, బగ్‌వీలు కూడా నకలుచేసిన ఉల్లేఖనం ప్రకారం మహనీయ జమ్మాద్ మక్కా వచ్చారు – ఉమ్రా చేసుకోవడానికి. ఆ సందర్భంగా ఆయన ఒకరోజు

అబూజహ్ల్, ఉతబా బిన్ రబీయ, ఉమయ్యా బిన్ ఖలఫ్ హాజరైన ఒక సమావేశంలో కూర్చున్నారు. అబూజహ్ల్ ఇలా అన్నాడు :

"ఆ వ్యక్తి మా సముదాయంలో చీలిక తీసుకువచ్చాడు. మమ్మల్నందరినీ మూర్ఖులుగా చిత్రించాడు. మా పూర్వీకులను మార్గభ్రష్టులుగా ఖరారు చేశాడు. మా దేవతలను తూలనాడాడు" – 'ఆ వ్యక్తి పిచ్చివాడే. అందులో ఎలాంటి సందేహం లేద'ని ఉమయ్యా అభిప్రాయపడ్డాడు.

అమ్ర్ బిన్ ముర్రా జుహన్నీ తన జుహన్నా తెగవారికి ఇస్లామ్ సందేశం వినిపించినప్పుడు ఒక వ్యక్తి ఇలా అన్నాడు :

"ఓ అమ్ర్ బిన్ ముర్రా! ఏమిటి అసలు నీ ఉద్దేశం? దేవుడు నీ బ్రతుకును నీ కొరకు దుర్భరం చేయుగాక! మేము మా దేవతల్ని విడనాడాలని ఆజ్ఞాపిస్తావా? మా సమూహంలో చీలిక తీసుకువస్తారా? నైతికంగా ఎంతో ఉన్నత స్థానంలో ఉన్న మన తాతల తండ్రుల మతాన్ని వ్యతిరేకించమంటావా? తిహామాలో నివసించే ఈ ఖురైషీ మమ్మల్ని దేని వైపునకు పిలుపు ఇస్తున్నాడు? ఇందులో ఎలాంటి మేలుగానీ, మహిమగానీ లేదు."

ఆ తరువాత అతను మూడు కవితలు చెప్పాడు. చివరి కవిత సారాంశమిది:

"అతను గతించిన మన పూర్వీకులను మూర్ఖులుగా నిరూపించాలనుకుంటున్నాడు. ఇలాంటి ఉద్దేశం ఉన్నవాడు ఎన్నటికీ సాఫల్యం పొందలేడు."

మరి కొంతమందికి అసూయ అడ్డంకిగా మారింది. ఎందుకంటే ముహమ్మద్ (స) తనను దైవసందేశహరునిగా ప్రకటించుకున్నాడు. వేరే మాటల్లో, నా దగ్గర వాస్తవిక జ్ఞానం ఉంది అని ప్రకటించారు. తనకు దొరకని భాగ్యం ఎదుటివారికి ప్రాప్తమైనప్పుడు, మనిషి అంత తొందరగా దానిని స్వీకరించడు. బైహఖీ ముగీరా బిన్ షూబా నుండి సంగ్రహించిన దాని ప్రకారం అబూజహ్ల్ ఒకరోజు వారితో ఇలా అన్నాడు :

దైవసాక్షి! ఆయన (స) చెప్పేది సత్యమని నాకు బాగా తెలుసు. కాని విశ్వసించడంలో ఒక విషయం నాకు అడ్డంకిగా నిలిచింది. 'కాబా

> గృహ ధర్మకర్తృత్వం మాది' అని బనీ ఖుస్పై చెప్పినప్పుడు మేము అవునన్నాము. 'హజ్జ్ యాత్రీకులకు నీరు త్రాపే బాధ్యత మాది' అని బనీ ఖుస్పై చెప్పినప్పుడు మేము దానికీ అవునన్నాము. 'దారున్నద్వా' పై సర్వహక్కులు మావే అని బనీ ఖుస్పై చెప్పినప్పుడు మేము 'ఖచ్చితంగా' అని బదులిచ్చాము. 'యుద్ధ సమయంలో పతాకం మా చేతుల్లోనే ఉంటుంది' బనీ ఖుస్పై చెప్పినప్పుడు కూడా మేము అవునన్నాము. కాని ఇప్పుడేమో ఆయన (స) 'నుబువ్వత్' మాలో ఉంది అని అంటున్నారు. దైవసాక్షి! నేను దీనిని ఎట్టి పరిస్థితిలోనూ అంగీకరించేది లేదు. *(అల్ బిదాయ వన్నిహాయ - సం.3)*

మరి కొందరికి ఆర్థిక ప్రయోజనాలు అడ్డొచ్చాయి. ఇస్లామ్‌కు పూర్వం కాబాగృహం అతి పెద్ద విగ్రహాలయంగా ఉండేది. అందులో అన్ని మతాల వారి విగ్రహాలు ఉండేవి. కడకు ఏసుక్రీస్తు, మర్యమ్‌ల విగ్రహాలు కూడా ప్రతిష్ఠించబడి ఉండేవి. ఆ విధంగా కాబాగృహం అన్ని మతావలంబీకుల సందర్శనా స్థలంగా భాసిల్లేది. ఏడాదికి నాలుగు మాసాలు పవిత్రమైనవిగా భావించటంలోని ఉద్దేశాలలో ఇదీ ఒకటి. ఎందుకంటే ఆ పవిత్ర మాసాలలో అన్ని మతాలవారు మక్కా నగరానికి వచ్చేవారు. విగ్రహాలను గనక కాబాగృహం నుండి తొలగిస్తే మక్కా నగరానికి ఎవరూ రారు. నాలుగు మాసాలపాటు మక్కా మార్కెట్‌లో సాగే వ్యాపారం మూతపడిపోతుంది. అందుకే మక్కా పౌరులు ఆయన (స) సందేశంలోని లాభనష్టాలను బేరీజు వేసుకున్నారు. దేవుని ఏకత్వపు (తౌహీద్) సందేశం గనక అక్కడ వ్యాపించినట్లయితే నీరూ పచ్చికాలేని మక్కా ప్రదేశం ఆర్థికంగా దివాలా తీస్తుందని వారు ఊహించారు. అదీగాక కాబాగృహ ధర్మకర్తృత్వం కారణంగా అరేబియాలోని వివిధ తెగలవారు ఖురైషులను తమ నాయకులుగా గౌరవించేవారు. ఒక చరిత్రకారుడు ఇలా వ్రాశారు :

> "ఖురైషుల వాణిజ్య బృందాలు తూర్పు పడమరల వైపు ప్రయాణం చేసేవి. వారు ఇతర జాతులతో చేసుకున్న వాణిజ్య ఒప్పందాల ననుసరించి ఈ వర్తక ప్రయాణాలు జరిగేవి. ఉదాహరణకు : పారసీకులతో, అబిసీనియన్లతో, బాజెంటైన్ ప్రభుత్వంతో జరిగిన ఒడంబడికలు - ముహమ్మద్ దైవదౌత్యాన్ని అంగీకరించినట్లయితే

ఇరుగుపొరుగు రాజ్యాలవారు, అరేబియాలోని ఇతర తెగలవారు తమతో చేసుకున్న వాణిజ్య ఒప్పందాలను రద్దు చేస్తాయని ఖురైషులు భయపడ్డారు. అదే గనక జరిగితే, అది తమ పాలిట వాణిజ్యపరంగా మృత్యువేనని, ఒకవేళ ఆ పరిస్థితి గనక వస్తే అరేబియాపై తమకు గల అధికారం అంతమైపోతుందని ఖురైషులు అంచనా వేశారు.

అందుకే "అబద్ధీకరణనే మీరు మీ వాటా జీవనోపాధిగా భావిస్తున్నారా?" *(56 . అల్ వాఖిఅహ్ : 82)*

అన్న దైవ వచనానికి వ్యాఖ్యాతలు ఏమని వ్రాశారంటే, ఇస్లామ్ ప్రవక్త (స) ఇచ్చే దేవుని ఏకత్వపు సందేశాన్ని అబద్ధీకరించి మీరు మీ ఆర్థిక ఒనరుల్ని, సిరిసంపదల్ని కాపాడుకోగలమని అనుకుంటున్నారా?

ఆయన (స) ఇచ్చిన సందేశం కారణంగా ఆయన ఉనికే ప్రశ్నార్థకంగా మారింది. ఆయన్ని చూసినవాడు మరో వ్యక్తితో, 'వాడే వీడా?' అనేవాడు (అబూ యాలా).

ఆయన (స) వర్తక బిడారాల మధ్యన నడుస్తుంటే జనులు వ్రేలితో ఆయన వైపు సైగ చేసేవారు. *(జాబిర్ ఉల్లేఖనం – అహ్మద్)*

ఎవరయినా మక్కా నగరానికి వస్తే, తిరిగి వెళ్ళాక తన స్నేహితులతో అక్కడి విశేషాలను చెప్పడంతో పాటు, 'ముహమ్మద్ బిన్ అబ్దుల్లాహ్ తనను దైవప్రవక్తగా ప్రకటించుకున్నాడు. ఇబ్నె అబీ ఖహాఫా అతనికి తోడుగా నిలిచాడు' అని కూడా చెప్పేవాడు. ఖురైషులు ఆయన్ని ముహమ్మద్ అని పిలువకుండా 'ముజమ్మమ్' (నిందితుడు, ఖండించబడినవాడు) అని పిలిచేవారు. ఆయన (స) తమ పూర్వీకులను మూర్ఖులుగా చిత్రించి, అవమానిస్తున్నారని ఆరోపించారు. ఆయన దారిలో రాత్రివేళ – నడుస్తున్నప్పుడు – కసువును, మాలిన్యాన్ని వేసేవారు. ఒకసారి ఆయన (స) వారిని చూసి, 'ఓ ఖురైషు వంశీయులారా! ఎటువంటి పొరుగువారు మీరు?' అని ఆవేదనను వ్యక్తపరిచారు.

అబూ తాలిబ్ జీవించి ఉన్నంతకాలం వారు ఆయన (స)కు వ్యతిరేకంగా తీవ్రమైన చర్య ఏదీ గైకొనలేకపోయారు. ఎందుకంటే ట్రైబల్ వ్యవస్థ ప్రకారం ఆయనపై కయ్యానికి కాలు దువ్వటమంటే బనీ హాషిమ్ తెగవారందరితో యుద్ధం చేసినట్లే. ఉమర్ బిన్ ఖత్తాబ్ ఇస్లామ్‌కు పూర్వం ఒకసారి ఆయన (స)ను హతమార్చే

ఉద్దేశంతో ఖడ్గం తీసుకుని బయలుదేరినప్పుడు, ఒక వ్యక్తి చెప్పిన ఒక్కగానొక్క మాట ఆయన కోపాన్ని చల్లార్చడానికి సరిపోయింది – ముహమ్మద్ (స)ను హత్యచేసి మొత్తం బనూ హాషిమ్ తెగవారితో ఎలా తలపడతావు? అని ఆ వ్యక్తి ప్రశ్నించాడు. ఎప్పుడు ఏ వ్యక్తి ఆయన (స)కు వ్యతిరేకంగా కఠిన చర్యకు ఉపక్రమించినా, తక్షణం అతనికి ఎదురయ్యే ప్రశ్న యిదే. అందుకే మక్కాలో ఆ రోజుల్లో వేధింపులు, అత్యాచారాలు, దౌర్జన్యాలన్నీ బానిస వర్గంపై, దళిత వర్గంపైనే జరిగాయి. ఇమామ్ అహ్మద్, ఇబ్నుమాజాలు హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్ (రజి) నుండి నకలు చేసిన దాని ప్రకారం తొలికాలంలో ఏడుగురు వ్యక్తులు మక్కాలో ఇస్లామ్‌ను స్వీకరించినట్లు ప్రకటించారు. వారు దైవప్రవక్త (సఅసమ్), అబూబక్ర్, అమ్మార్, సయీద్, సుహైబ్, బిలాల్, మిఖ్దాద్.

> దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లమ్)ను అల్లాహ్ ఆయన పెత్తండ్రి ద్వారా కాపాడాడు. హజ్రత్ అబూబక్ర్‌ను ఆయన జాతివారి ద్వారా రక్షించాడు. మిగిలిన ముస్లింలను బహుదైవారాధకులు పట్టుకున్నారు. వారికి ఇనుప కవచాలు తొడిగించి మండుటెండల్లో మాడ్చారు.
>
> *(ఇబ్నె మస్ఊద్ ఉల్లేఖనం – అహ్మద్)*

బనూ హాషిమ్ నాయకుడు అబూ తాలిబ్ మరణించిన తరువాత ఖురైషుల్లోని ఒక దుష్టుడు ఆయన (స) మీద మట్టి వేశాడు. ఆయన (స) ఇంటికి తిరిగివచ్చాక ఆయన కూతురు మట్టి దులిపింది. ఆ సమయంలో ఆయన (స) ఇలా అన్నారు : "నాకు ఖురైషుల ద్వారా ఇంతవరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటన ఎదురు కాలేదు. కాని అబూ తాలిబ్ మరణించగానే వీళ్ళు ఇలాంటి వెకిలి చేష్టలు మొదలెట్టారు." (అబ్దుల్లాహ్ బిన్ జాఫర్ – బైహఖీ)

> మహనీయ అబూ హురైరా (రజి) ఉల్లేఖనంలో ఇలా ఉంది : "అబూతాలిబ్ మరణించిన తరువాత ఖురైషులు మక్కాలో ఆయన (స) పట్ల దురుసుగా వ్యవహరించసాగారు. అప్పుడు ఆయన (స), "బాబాయి! మీ వియోగం ఎంత భరించరానిదో నాకు తొందరగానే అర్థమయింది" అన్నారు.
>
> *(అబూ నుఅయిమ్ ఫిల్ హిలియా – సం. 8)*

అబూ తాలిబ్ మరణం తరువాత ఖురైషులలో దైవప్రవక్త (స)ను హతమార్చే

కు(టలు మొదలైపోయాయి. అబూజహ్లా ఆయన (స) తల మీద ఒంటె కసువు వేయటం, ఉఖబా బిన్ ముఅయ్త్ ఆయన (స) మెడలో దుప్పటివేసి లాగటం అప్పటి సంఘటనలే. ఆయన (స) గొంతు పిసికి చంపేసే విఫల యత్నాలు కూడా చేయబడ్డాయి. అబూ తాలిబ్ మరణానంతరం ఆయన (స)కు వ్యతిరేకంగా నీచాతినీచమైన చర్యలు గైకొనడానికి మార్గం సుగమం అయిపోయినప్పటికీ, ఒక రకమయిన తడబాటు వారిలో ఉండేది. ఎందుకంటే అరబ్బు చరిత్రలో ఈ రకమయిన దృష్టాంతం మొదటిది. ఇదిలా ఉండగా స్వయంగా బహుదైవారాధకులైన అరబ్బులలో కూడా కొంతమంది ఉండేవారు. వారు తమ అంతరాత్మ ప్రబోధం ప్రకారం ఆయన (స)కు నైతిక మద్దతు ఇచ్చేవారు. ఉదాహరణకు : అబూజహ్లా మొదటిసారి ఆయన (స) తలపైన, మెడలోనూ ఒంటె ప్రేగులు వేసి ఆయన గొంతు నులమాలని ప్రయత్నించినప్పుడు, ఈ విషయం తెలుసుకున్న అబుల్ బఖ్తరి కొరడా తీసుకుని కాబా ప్రాంగణంలోకి వచ్చాడు. అబూజహ్లా అక్కడ విజయహాసం చేస్తూ తన మిత్రులతో మాట్లాడుతున్నాడు. అబుల్ బఖ్తరీ అతని తలమీద కొరడాతో ఎడాపెడా కొట్టేసరికి అబూజహ్లా పెడబొబ్బలు పెట్టాడు.

మతాల చరిత్ర చాటిచెప్పేదేమంటే బహుదైవభావన (షిర్క్) తనకు వ్యతిరేకంగా విమర్శను ఎన్నడూ సహించలేదు. అదీగాక ప్రాచీన కాలంలో సామాజిక వ్యవస్థ షిర్క్ పునాదులపైనే నిలబడి ఉండేది. దానికి తోడు రాజకీయ అండదండలు కూడా షిర్క్‌కు ఉండేవి. అందువల్ల మక్కాలో ఏకేశ్వరోపాసనా సందేశం ఆయన (స) పాలిట ఎంతో ఓపికతో కూడుకున్న కార్యంగా తయారయింది. మొదటి మూడేళ్ళ కాలంలో కొద్దిమంది తప్ప ఎవరూ ఆయన్ని విశ్వసించలేదు. రెండు చదరపు కిలోమీటర్లలో విస్తరించి ఉన్న మక్కాలో ఒక్క చెట్టు నీడ కూడా ఉండేది కాదు. అలాగే ఆ ప్రదేశంలో ఆయన సహచరులు, సమర్ధకులు కూడా ఉండేవారు కారు. ఆయన ఆత్మీయులు అనదగ్గవారు కేవలం నలుగురే – ఖదీజా, అలీ, జైద్, అబూబక్ర్. ఒకవేళ అబూబక్ర్ పసిబిడ్డ ఆయిషాను కూడా లెక్కించుకుంటే (ఆమె ముస్లింగా పుట్టిన తొలి మహిళ) ఆయన సమర్ధకుల సంఖ్య కేవలం అయిదు.

మూడేళ్ళ వరకూ ఇదే పరిస్థితి! ఆ రోజుల్లో ఆయన ఇంటి నుండి బయటకు వస్తే పిచ్చోడి వెనుక పడినట్లే జనులు వెంబడించేవారు. ఒకరోజు అబూజహ్లా ప్రోద్బలంపై ఒక ముష్కర మూక ఆయన్ని తిడుతూ ఉంది. ఆయన్ని అనరాని మాటలంటోంది. ఆ సమయంలో అటువైపు నుంచి వెళుతున్న ఒక వ్యక్తి దీన్ని

గమనించాడు. మక్కాలోని ఒక మర్యాదస్తుని పట్ల ఈ రకంగా ప్రవర్తించటాన్ని చూసి అతను ఓర్చుకోలేకపోయాడు. సరాసరి ఆయన (స) పినతండ్రి అయిన హమ్జా బిన్ అబ్దుల్ ముత్తలిబ్ దగ్గరకు వెళ్ళి, 'నీ పౌరుషం ఏమైపోయింది? ఒకవైపు జనులు నీ భ్రాతృజుణ్ణి అవమానపరుస్తుంటే నువ్విలా నిర్లిప్తంగా ఉండిపోతావా?" అని చీవాట్లు పెట్టాడు. అంతే, హమ్జాలోని పౌరుషం పురివిప్పింది. అప్పటికప్పుడే అబూజహ్ల్ వద్దకు వచ్చి, తన ఇనుప ధనుస్సుతో అతని మాడు బద్దలుగొట్టారు. "ఏమనుకుంటున్నావ్? ఈనాటి నుంచీ నేను కూడా ముహమ్మద్ (స) మతాన్ని స్వీకరిస్తున్నాను. నీకు చేతనయింది చేసుకో పో" అన్నారు. (తిబ్రానీ)

హమ్జా అరేబియాలోని సుప్రసిద్ధ పహిల్వాను. ఆయన ఇస్లామ్ స్వీకరణతో కొంతమందికి ధైర్యం వచ్చింది. ముస్లింల సంఖ్య 30 కి చేరుకుంది. ఆ సమయంలో మక్కాలో ఇద్దరు ప్రముఖ వ్యక్తులు ఉన్నారు. ఒకరు, ఉమర్. రెండవవారు అబూజహ్ల్. "దేవా! వారిద్దరిలో ఏ ఒక్కరి ద్వారానయినా ఇస్లామ్‌కు బలం చేకూర్చు" అని దైవప్రవక్త (స) వేడుకున్నారు. ఆయన మొర మొదటి వ్యక్తి విషయంలో ఆమోదం పొందింది. నుబువ్వత్ 6వ సంవత్సరంలో ఉమర్ ఇస్లామ్ స్వీకరించడంతో చాలామంది ఇస్లామ్ వైపునకు వచ్చారు. ఇప్పుడు ముస్లింల సంఖ్య 40 కి చేరుకుంది. ఆ రోజుల్లోనే ముస్లింలు ఇబ్నె అర్ఖమ్ ఇంట్లో తమ రహస్య కేంద్రాన్ని ఏర్పాటు చేసుకుని ఉన్నారు. **'దార్ అర్ఖమ్'**లో సమావేశమయ్యే వారి సంఖ్య 39 అని అల్ బిదాయ వన్నిహాయలో ఉంది.

అయితే సాంప్రదాయిక వ్యవస్థను ఆశ్రయించి తదనుగుణంగా ఆచరించేవారి బలం సదా అధికంగానే ఉంటుంది. అందుకే ఓ తాత్కాలిక విరామం తర్వాత దౌర్జన్యాల పరంపర మళ్ళీ మొదలయింది. ఆయన్ని నానా విధాలుగా వేధించినప్పటికీ హత్యాయత్నం మాత్రం చేయలేదు. ఎందుకంటే ట్రైబల్ ఆచారం ప్రకారం ఏదేని ఒక తెగకు చెందిన వ్యక్తిని చంపటమంటే, మొత్తం తెగవారితో యుద్ధం చేయడానికి సిద్ధమైనట్లే. ఈ కారణంగానే దైవప్రవక్త హజ్రత్ షుఐబ్ (అ) జాతివారు, ఒకవేళ నీ తెగవారి భయం లేకుంటే మేము నీపై రాళ్ళు రువ్వి చంపేసేవారం (హూద్ : 91) అని చెప్పారు. ఖురైషులు ఆయన (స) పినతండ్రి అయిన అబూ తాలిబ్ వద్దకు వచ్చి, ముహమ్మద్ (స)ను తెగ నుండి బహిష్కరించమని కోరారు. అలాచేస్తే ఆయన్ని చంపవచ్చు అన్నది వారి దురాలోచన. కాని అబూ తాలిబ్‌లోని స్వాభిమానం అందుకు అంగీకరించలేదు. ఒకసారి ఖురైషుల ఫిర్యాదును పురస్కరించుకుని అబూ తాలిబ్

ముహమ్మద్ (స)ను పిలిపించి, 'నీవు వారి విగ్రహాలను విమర్శించటం మానుకో' అని సూచించారు. ఈ మాట విని, తన పినతండ్రి తనను ఖురైషులకు అప్పగించబోతున్నారని అనుమానించారాయన. కాని వెంటనే తనకలాంటి ఉద్దేశం లేదని చెప్పి, ఆయన (స)కు భరోసా ఇచ్చారు అబూ తాలిబ్. అప్పుడు ఖురైషులు అందరూ ఒక్కటై బనూ హాషిమ్‌ను సంఘబహిష్కరణ చేయాలని నిర్ణయించారు. అది దైవదౌత్యం అందిన ఏడవ సంవత్సరం. ఆ తర్వాత అబూ తాలిబ్ ఆయన్ని, ఆయన కుటుంబీకుల్ని తీసుకుని మక్కా వెలుపల ఒక పర్వత కనుమవద్ద మకాం వేశారు. అదే షేబె అబీ తాలిబ్‌గా పిలువబడుతుంది. అది కటిక కొండప్రాంతం. అక్కడ అడవి మొక్కలు తప్ప మరేమీ లేవు. ఆయన (స) మూడేళ్ళ వరకూ ఆకులలములు, చెట్ల వేర్లు తింటూ గడిపారు. ఏడాదిలో కేవలం నాలుగు నెలలు మాత్రమే వెసులుబాటు ఉండేది. అంటే అవి పవిత్ర మాసాలు. ఆ సమయంలో ఆయన కుటుంబీకులు మక్కా నగరానికి వెళ్ళి ఖుర్బానీ పశువుల మాంసాన్ని తెచ్చి ఎండబెట్టుకునేవారు. అది వారికి అనేక వారాలపాటు పనికి వచ్చేది.

మూడేళ్ళ తర్వాత – నుబువ్వత్ 10వ యేట – ఆంక్ష ఎత్తివేయబడింది. కాని ఈ బహిష్కరణ వారికి ప్రాణాంతకంగా పరిణమించింది. అబూ తాలిబ్ మరణం (620) తరువాత తెగలో అందరికన్నా పెద్దవాడైన అబ్దుల్ ఉజ్జా (అబూ లహబ్) బనీ హాషిమ్ నాయకుడయ్యాడు. ఇప్పుడు స్వయంగా శత్రువే న్యాయాధిపతి పీఠాన్ని అధిష్టించాడు. అతడు పదవిలోకి రాగానే ఆయన్ని తెగనుండి బహిష్కరిస్తున్నట్లుగా ప్రకటించాడు.

## తెగనుండి బహిష్కరణ

అరేబియాలోని ఎడారి జీవితంలో ఎవరయినా ఒక వ్యక్తి తన తెగ నుండి బహిష్కరించబడ్డాడంటే, అతను బలవంతంగా సముద్రంలోకి తోయబడినట్లే. ఎందుకంటే తెగల వ్యవస్థలో చట్టబద్ధమయిన ప్రభుత్వం ఉండేది కాదు. ఏ వ్యక్తి అయినాసరే ఒక తెగను ఆశ్రయించి మాత్రమే జీవించగలిగేవాడు. 'మినా' విడిది స్థలాలలో ఒకసారి దైవప్రవక్త (స) ఒక తెగ ముందు ఇస్లామ్ సందేశం వినిపించారు. ఆ తెగవారు ఆ సందేశాన్ని త్రోసిపుచ్చారు. అయితే వారిలో మైసరా అనే ఒక వ్యక్తి మాటల్నిబట్టి, అతను తన సందేశానికి ప్రభావితుడయ్యాడని ఆయన (స) తలపోశారు:

దైవప్రవక్త (స)కు మైసరా పైన ఆశలు చిగురించాయి. ఆయన (స)

> అతనితో మాట్లాడారు. దానికి మైసరా ఇలా అన్నాడు : "మీ మాట ఎంత చక్కనిది! అది కాంతితో నిండి ఉంది. కాని (ఏం చేయ మంటారు) నా జాతివారు దీనికి వ్యతిరేకంగా ఉన్నారు. ఏ మనిషి అయినా తన జాతి వారిలోనే ఉండగలుగుతాడు."
>
> *(అల్ బిదాయ వన్నిహాయ – సం. 3)*

అలాంటి పరిస్థితుల్లో తెగ నుండి బహిష్కరించబడటం ఆయన పాలిట అనూహ్యమైన గడ్డు పరిస్థితి. ఇప్పుడు ఆయన స్వస్థలంలోనే ఆయనకు ఏ ఆశ్రయం లేదు. ఆయన ముందు ఇప్పుడున్న దారి ఒక్కటే – తనకు అండగా నిలిచే ఏదైనా తెగను అన్వేషించటం! ఈ ప్రయత్నంలో భాగంగానే ఆయన (స) మక్కా నుండి తాయిఫ్‌కు బయలుదేరారు. దైవప్రవక్త (స) ఒకసారి హ్రజత్ ఆయిషా (ర.అ)తో ఈ ప్రయాణంలోని చేదు అనుభవాన్ని నెమరువేసుకుంటూ, "అప్పుడు నన్ను నేను ఇబ్నె అబ్దె యాలైల్ ముందు సమర్పించుకున్నాను" అన్నారు.

ఉర్వా బిన్ జుబైర్ కథనం :

> "అబూ తాలిబ్ మరణం తరువాత ఆయన (స)పై కష్టాలు పెరిగి పోయాయి. అప్పుడు ఆయన (స) బనీ సఖీఫ్ తెగవారి వైపునకు (తాయిఫ్‌కు) బయలుదేరారు. వారు తనకు రక్షణ కల్పిస్తారని, తనకు మద్దతు ఇస్తారని ఆయన (స) ఆశించారు."

కాని వాళ్ళు ఆయన పట్ల క్రూరంగా ప్రవర్తించారు. తాయిఫ్ నుండి తిరిగి వస్తున్నప్పుడు దైవప్రవక్త (స) చేసిన ఈ వేడుకోలును బట్టి బనీ సఖీఫ్ తెగవారు ఎంత ఆటవికంగా వ్యవహరించారో ఊహించవచ్చు.

> "దేవా! నా దౌర్బల్యం గురించి, నా ఒనరుల కొరత గురించి, జనుల దృష్టిలో నేను అల్పునిగా కనిపించటం గురించి నీకు మాత్రమే ఫిర్యాదు చేసుకుంటున్నాను – ఓ అందరికన్నా అధికంగా కరుణించేవాడా!"
>
> *(అల్ బిదాయ వన్నిహాయ – సం. 3)*

తాయిఫ్ నుండి తిరిగి వస్తూ ఆయన (స) వారితో చేసుకున్న విన్నపం గమనార్హం – "మీరు నా యెడల ప్రవర్తించిన తీరు గురించి దయచేసి మక్కా వారికి తెలియనివ్వకండి. తెలిస్తే వారి దుస్సాహసం మరింత పెరిగిపోతుంది." (తహ్‌జీబ్ సీరత్ ఇబ్ను హిషామ్ – పేజీ : 95)

తాయిఫ్ నుండి తిరిగి వచ్చిన తరువాత ఆయన (స) మళ్లీ మక్కా పొలిమేరల్లోనే మకాం వేయవలసి వచ్చింది. నగరంలోని పలువురు ప్రముఖులకు కబురు పంపించారు – ఎవరయినా తనకు రక్షణ కల్పిస్తే మక్కా నగరంలోనికి వచ్చి ఉంటానని. ఎట్టకేలకు ముత్యిమ్ బిన్ అదీ ఆయన (స)కు మద్దతు ఇవ్వడానికి అంగీకరించాడు. అతని కొడుకుల ఖడ్గాల నీడలో ఆయన (స) మళ్ళీ మక్కా నగరంలో ప్రవేశించగలిగారు.

ఇప్పుడు ఆయన (స) చేసిన పనేమిటంటే, వివిధ సంతలలో, మార్కెట్లలోకి వెళ్ళి పరిసరప్రాంతాల నుండి వచ్చే తెగలవారిని కలుసుకోవటం, వారు తనకు మద్దతు ఇచ్చేలా ఒప్పించాలి. ఆయన (స) తన పినతండ్రి అబ్బాస్‌తో ఇలా అన్నారు:

"మీరుగానీ, మీ బంధువులుగానీ ఎలాగూ నాకు రక్షణ ఇవ్వరు. కనీసం మీరు నాతో రండి, మార్కెట్లలోని గుడారాల వద్దకు వెళ్ళి వారితో మాట్లాడుదాం." (అల్ బిదాయ వన్నిహాయ – సం.3)

ఆయన (స) ఒక్కో తెగవారు విడిది చేసిన గుడారం వద్దకు వెళ్ళి, మీరు నాకు ఏ విధమైన రక్షణ ఇప్పించగలరు? అని అడగసాగారు. నా తెగవారు నన్ను బహిష్కరించారు, మీరు గనక నాకు రక్షణ కల్పించినట్లయితే నాపై మోపబడిన దైవదౌత్య బాధ్యతను నిర్వర్తించుకుంటాను అని ప్రాధేయపడసాగారు. ఈ సందర్భంగా ఆయన (స) మొత్తం 15 తెగల వారిని కలుసుకుని వ్యక్తిగతంగా మాట్లాడారని చరిత్రకారులు పేర్కొన్నారు.

కాని ఖురైషులు బహిష్కరించిన వ్యక్తికి రక్షణ ఇవ్వటం ఎంత ప్రమాదకరమో తెగలవారికి తెలుసు. అందుకే ఏ ఒక్కరూ ఆయనకు రక్షణ కల్పించటానికి ముందుకు రాలేదు. ఒక తెగవారిలో కొంతమంది ఆయన (స) పట్ల కాస్త మెత్తబడ్డారు. కాని ఆ తెగకు చెందిన ఒక పెద్ద మనిషి ఇలా అన్నాడు :

> "అతని తెగవారు అతన్ని బహిష్కరించి ఉండగా, మీరేమో అతనికి రక్షణ ఇవ్వాలనుకుంటున్నారు. ఏమిటి, మీరు అరబ్బులందరితో ఏరి కోరి తగవు కొనితెచ్చుకుంటారా?
>
> *(అబూ నుఅయ్‌మ్ ఫిల్ దలాయెలున్నబువ్వ)*

ఏదయినా ఒక తెగ నుండి బహిష్కరించబడిన వ్యక్తికి ఆశ్రయం కల్పించటం అంటే ఆ తెగవారిపై యుద్ధప్రకటన చేయటమేనని వారికి తెలుసు. అందునా యావత్

అరేబియాలో రాజకీయ ప్రాబల్యం ఉన్న ఖురైషులతో తగవు పెట్టుకుంటే, వ్యవహారం మరింత జటిలమవుతుంది. అదలావుంటే, అరేబియా సంప్రదాయం ప్రకారం ఎవరయినా ఒక వ్యక్తి రక్షణ కల్పించమని అభ్యర్థించినప్పుడు, అతనికి రక్షణ ఇవ్వకపోవటం నామోషీగా భావించబడేది. కాని దైవప్రవక్త (స) తనకు రక్షణ కల్పించమని అనేక తెగలవారిని సంప్రతించటం అరుదైన సంఘటన. కాని ఏ ఒక్కరూ ఆయనకు రక్షణ ఇవ్వడానికి అంగీకరించలేదు. తాయిఫ్‌వాసులుగానీ, ఇతర తెగల వారుగానీ ససేమిరా అన్నారు. కారణం ఆయన (స) వ్యవహారం ప్రత్యేకమయింది కావటమే. మొత్తం అరేబియాకే నాయకులుగా భావించబడే ఖురైషులు అయన్ని తిరస్కరించారు. ఖురైషులు బహిష్కరించిన వ్యక్తికి రక్షణ ఇవ్వటమంటే, మొత్తం అరేబియాతో యుద్ధం చేయటం వంటిదే. ఈ కారణంగానే అన్సార్లు 'బైఅత్' చేస్తున్నప్పుడు అబుల్ హైసమ్ (రజి) తన సహచరులతో ఇలా అన్నారు :

> "బాగా తెలుసుకోండి! మీరు గనక ఈయన్ని (స) మీ వద్దకు తీసుకెళ్ళి
> నట్లయితే అరబ్బులంతా ఒక్కటై మీ వైపు బాణాన్ని ఎక్కుపెడతారు."
>
> *(తిబ్రానీ)*

అదీగాక సరిహద్దుల్లో నివసించే తెగల సమస్య కూడా ఉంది. వారి పొరుగు వారు అరబ్బేతరులు. వారితో ఆ తెగలకు ఒడంబడిక ఉంది. ఆయన (స) లాంటి వివాదాస్పదమైన వ్యక్తిని తమ వెంట తీసుకెళితే ఇరుగుపొరుగున ఉన్న రాజ్యాలు తమపై కన్నెర్ర జేస్తాయని, వారితో కయ్యం తప్పదని భయపడేవారు. 'అల్ బిదాయ వన్నిహాయ'లో పొందుపరచబడిన దాని ప్రకారం దైవప్రవక్త (స) 'మినా' సంతకు వెళ్ళి అక్కడ ఉన్న బనూ షైబాన్ బిన్ సాలబా నాయకులతో చర్చలు జరిపారు. వారు ఆయన (స) సందేశాన్ని శ్లాఘించారు. కాని చివరకు హానీ బిన్ ఖుబైసా, తాము సరిహద్దుల్లో నిస్సహాయులుగా ఉన్నామని పారసీక చక్రవర్తి (కిస్రా)తో తమకు ఒడంబడిక ఉందని చెప్పాడు.

> "మీరు దేని వైపునకు మమ్మల్ని పిలుస్తున్నారో అది బహుశా చక్రవర్తుల
> ఆగ్రహానికి కారణం కావచ్చు."

ఆయన (స) నిస్సహాయ స్థితికి మరో తార్కాణం ... ఒకసారి ఆయన (స) బనూ అబ్దుల్లాహ్ అనే తెగ వద్దకు వెళ్ళారు –

ఆయన (స) వారిని అల్లాహ్ వైపునకు పిలిచారు. తనకు మద్దతు ఇవ్వమని కోరారు. కడకు ఆయన (స) ఈ విధంగా కూడా చెప్పారు : "ఓ బనూ అబ్దుల్లాహ్! అల్లాహ్ మీకు ఎంత మంచి పేరు పెట్టాడు?" అయినా వారు ఆయన (స) ప్రతిపాదనను స్వీకరించలేదు.

*(అల్ బిదాయ వన్నిహాయ)*

ఈ విధంగా మక్కా జీవితంలోని చివరి మూడు సంవత్సరాలు వివిధ తెగల మద్దతును అన్వేషించటంలోనే గడిచిపోయాయి. కాని ఎంతగా ప్రయత్నించినా ఏ ఒక్క తెగ కూడా ఆయనకు మద్దతు ఇవ్వడానికి సిద్ధం కాలేదు. ఆఖరికి కొన్ని తెగలవారు, ఏమిటి, మీరు మా మీద ఆశ వదలుకునే రోజు ఇంకా రాలేదా? అని చెప్పేశారు. ఎట్టకేలకు అల్లాహ్ యస్రిబ్ (మదీనా)లోని ఔస్, ఖజ్రజ్ తెగల వారికి ఆ సద్బుద్ధిని ప్రసాదించాడు. ఔస్, ఖజ్రజ్ తెగల వారి సుముఖత వెనుక ఓ ప్రత్యేక నేపథ్యం ఉంది. ఈ రెండు తెగలు యూదులకు పొరుగున నివసించేవి. ఖైబర్ యూదులు ఆ ప్రదేశంలోని సారవంతమైన భూములపై యాజమాన్యం కలిగి ఉండేవారు. వర్తకం కూడా వారి స్వాధీనంలోనే ఉండేది. అందువల్ల యస్రిబ్‌లోని ఔస్, ఖజ్రజ్ తెగలవారు తమ జీవనోపాధి కోసం యూదుల దగ్గర కూలి పని చేయాల్సి వచ్చేది. హిజ్రత్ తరువాత దైవప్రవక్త (స) తన ప్రియసహచరులతో కలసి మస్జిదె నబవీ నిర్మిస్తున్నప్పుడు ఆయన (స) అధరాల మీదుగా జాలువారిన కవితా సారాంశం ఇది :

"ఇది కూలి పనియే. కాని ఖైబర్ కూలి వంటిది కాదు. మా ప్రభువు సాక్షిగా! ఇది దానికన్నా ఎంతో మేలైనది."

యూదుల ఆర్థిక పెత్తనం, దోపిడీ విధానం వల్ల ఔస్ – ఖజ్రజ్ తెగల మధ్యన తరచూ యుద్ధాలు జరుగుతూ ఉండేవి. తమ గ్రంథాల ప్రకారం త్వరలోనే అరేబియాలో ఒక ప్రవక్త ప్రభవించనున్నారని యూదులు వారితో చెబుతుండేవారు. ఆ ప్రవక్త వచ్చిన తరువాత మేము ఆయనతో కలసి మీతో యుద్ధం చేస్తాము, మిమ్మల్ని ఇక్కడి నుండి పూర్తిగా తుడిచిపెట్టేస్తామని కూడా వారు చెప్పేవారు. యూదుల ఈ ప్రగల్భాలనే ఖుర్ఆన్ ఇలా ప్రస్తావించింది. "అంతకు ముందైతే వారు అవిశ్వాసులపై తమకు విజయం ప్రసాదించమని ప్రార్థించేవారు. తీరా అది (ఖుర్ఆన్) తమ వద్దకు వచ్చాక, దానిని గుర్తుపట్టి కూడా తిరస్కరించారు" (అల్

బఖరా : 89). ఔస్ – ఖ్రజ్ తెగలవారు ఆయన (స) సందేశాన్ని విన్నప్పుడు, “దైవసాక్షి! యూదులు చెబుతూ ఉండే ఆ ప్రవక్త ఈయనే. యూదులు ముందంజ వేయక ముందే మనం ఈయన్ని విశ్వసించి, ఈయన వర్గంలో చేరిపోవటం మంచిది” అన్నారు. ఈ ప్రత్యేక నేపథ్యంతో పాటు మరికొన్ని సామాజిక, చారిత్రక కారణాల వల్ల కూడా ఔస్, ఖ్రజ్ తెగలవారు ఆయన (స) సందేశాన్ని స్వీకరించటం సులభతరమైపోయింది.

సంవత్సరాల తరబడి ఆయన (స) నిరీక్షిస్తూ ఉన్న సమయం ఇప్పుడు ఆసన్నమయింది. తెగల మద్దతులో తన కృషిని మరింత మెరుగైన రీతిలో కొనసాగించేందుకు అనువైన ప్రదేశం ఆయనకు లభించింది. మక్కాలోనూ, మక్కా చుట్టుప్రక్కల్లో ఉన్న ముస్లింలందరినీ ఒక చోటికి చేర్చి, దానిని ఇస్లామీయ కేంద్రంగా మలిచే అవకాశం కూడా ప్రాప్తమయింది. యస్రిబ్‌కు చెందిన వారు పెద్ద సంఖ్యలో ఇస్లామ్ స్వీకరించటం వల్లనే ఇది సాధ్యమయింది. ఔస్ ఖ్రజ్ తెగలవారు ఆయన (స) చేతిలో చెయ్యేసి విధేయతా ప్రమాణం (బైఅత్) చేసిన దృశ్యం చరిత్రలో ఇలా చిత్రించబడింది :

> ఆయన (స) తక్షణం తన సహచరుల వైపునకు మరలి, “దైవానికి కృతజ్ఞతలు తెలుపుకోండి. అల్లాహ్ ఈ రోజు రబీయా సంతానానికి పారసీకులపై ఆధిపత్యం వొసగాడు” అని చెప్పారు.
>
> *(అల్ బిదాయ వన్నిహాయ – సం.3, పేజీ – 145)*

ఆయన (స) హిజ్రత్ సన్నాహాలు మొదలెట్టారు. ఆయన ఈ విషయాన్ని ఎంత రహస్యంగా ఉంచినా ఖురైషులకు ఈ సమాచారం అందుతూనే ఉండేది. హజ్రత్ ఉర్వా ఆధారంగా తిబ్రానీ ఇలా నకలు చేశారు –

> ఖురైష్ బహుదైవారాధకులకు దైవప్రవక్త (స) మక్కా విడిచి వెళ్ళిపోతున్నారన్న అనుమానం వచ్చినప్పుడు, అల్లాహ్ ఆయన కొరకు మదీనాలో నివాసం కల్పించి, ఆయన రక్షణకు ఏర్పాట్లు చేశాడని తెలుసుకున్నప్పుడు, అన్సార్లు ఇస్లామ్ స్వీకరించారని, ముహాజిర్లు మదీనాలో స్థిరపడనున్నారని విన్నప్పుడు వారు ఆయన (స)కు వ్యతిరేకంగా కుట్రలు పన్నటం మొదలెట్టారు – ఆయన్ని ముందు అరెస్టు చేయాలనీ, ఆ తరువాత హత్య చేయటమో లేక కారాగారంలో వేయటమో చేయాలని లేదా దేశం నుండి బహిష్కరించాలని లేదా నిర్బంధంలో ఉంచాలని తీర్మానించుకున్నారు.

ఔస్ ఖజ్రజ్ తెగలవారు ఇస్లామ్ స్వీకరించిన మీదట ఆయన (స) ఆర్నెల్ల వ్యవధిలో పకడ్బందీగా ప్రయాణ సన్నాహాలు చేసుకున్నారు. ఆ తరువాత చడీ చప్పుడు కాకుండా మక్కా నుండి ప్రస్థానం చేశారు.

## హిజ్రత్ (వలస)

మదీనాలో అన్సారులు దైవప్రవక్తకు, ముహాజిర్ ముస్లిములకు అందించిన తోడ్పాటు చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడింది. జనులు ఎవరికయినా ఏదైనా ఇస్తే ప్రతిఫలాన్ని ఆశించి ఇస్తారు. లేదా భయం వల్లనయినా ఇస్తారు. లావాదేవీలకు సంబంధించిన మూడవ రకం కూడా ఉంది. అది 'శుభం' కొరకు ఉనికిలోనికి వస్తుంది. సజీవులు లేక మృతుల గురించి జనులు ఏమనుకుంటారంటే ఆయన 'మహనీయుడు'. ఆయనపై ఖర్చుచేస్తే లేదా నజరానాలు ఇచ్చుకుంటే సిరిసంపదల్లో, ఆలుబిడ్డల్లో సమృద్ధి జరుగుతుంది. కాని మానవ చరిత్రలోనే అపూర్వమయిన ఉదాహరణ అన్సార్లది. వారు ఇల్లూ వాకిలిని వదలి వచ్చిన నిర్వాసితులైన ముహాజిర్ల కోసం తమ తలుపులు తెరిచేశారు. వారికి తమ ఇండ్లలో చోటు ఇవ్వటమే గాకుండా, వారితో సోదరబంధం ఏర్పరచుకుని, స్వంత అన్నదమ్ములవలే తమ ఆస్తిపాస్తుల్లో భాగస్థులుగా చేసుకోవటానికి సిద్ధపడ్డారు. ముహాజిర్లకు చేయూత నందించటమంటే అరబ్బులకు వ్యతిరేకంగా యుద్ధం చేయటమేనని తెలిసి కూడా వారు వెనక్కి తగ్గలేదు. హజ్రత్ అలీ (రజి) కేవలం రెండు పదాల్లో వారి చిత్తశుద్ధిని బహుచక్కగా చిత్రించారు. ఆయన ఇలా అన్నారు –

"వారు సత్యసంధులు, సహనస్థైర్యాలు కలవారు."

*(అల్ బిదాయ వన్నిహాయ – సం. 3)*

ముహాజిర్లు తమ దేశాన్ని వదలి యస్రిబ్ చేరుకున్నప్పుడు, అన్సార్లలోని ప్రతి ఒక్కరూ వారికి ఆతిథ్యం ఇవ్వడానికి పరస్పరం పోటీపడ్డారు. కడకు ఈ విషయంలో చీటీలు (లాటరీ) వేయవలసిన పరిస్థితి ఏర్పడింది. వారు తమ సంపదలోని నాణ్యమైన భాగాన్ని ముహాజిర్లకు అప్పగించారు. వారు ఈ విధంగా అసాధారణ త్యాగాలు చేసిన తరువాత కూడా వారిచేత ప్రమాణ స్వీకారం చేయించటం జరిగింది – పదవుల పంపకంలో ఇతరులకు ప్రాధాన్యత ఇవ్వబడినాసరే, దానికోసం గొడవ చేయవద్దని. (తహ్జీబ్ సీరత్ ఇబ్ను హిషామ్, సం – 1, పేజీ : 111)

పోనీ, మదీనా నగరానికి వచ్చిన తరువాత అయినా ఆయన (స) జీవితం

ప్రశాంతంగా గడిచిందా అంటే అదీ లేదు. అరబ్బులంతా ఒక్కటై మదీనా ముస్లింల కంటికి కునుకు లేకుండా చేశారు. మహనీయ ఉబై బిన్ కాబ్ (రజి) ఇలా అంటున్నారు:

> "ఆయన (స), ఆయన సహచరమాన్యులు మదీనా వచ్చినప్పుడు అన్సార్లు వారికి ఆశ్రయం కల్పించారు. తత్కారణంగా అరబ్బులంతా ఏకమై ఆయన్ని (స) లక్ష్యంగా చేసుకున్నారు. చివరకు మదీనా ముస్లింల పరిస్థితి ఎలా తయారయిందంటే వారు ఆయుధాలు ధరించి రాత్రి గడిపేవారు. సాయుధులైన స్థితిలోనే తెల్లవార్చేవారు."
>
> *(కన్జుల్ అమాల్ – సం.1, పేజీ : 259)*

అరబ్బులంతా కలసి మదీనాపై ఆర్థిక ఆంక్షలు విధించారు. వారి ఆదాయం తగ్గిపోయింది. జనాభా పెరిగిపోవటంతో ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. దానికి తోడు నిరంతర యుద్ధాల వల్ల ఖర్చులు పెరిగిపోయాయి. పూట గడవటం కష్టమైపోయింది. హజ్రత్ ఉమర్ ఇలా అంటున్నారు : నేను మదీనాలో దైవప్రవక్త (స)ను గమనించాను. ఆయన పగలంతా ఆకలితో అలమటించేవారు. తరువాతి కాలంలో ఎవరో హజ్రత్ ఆయిషా (ర.అ)ను దీపం గురించి అడిగితే, "మా దగ్గర దీపం వెలిగించేటంత నూనె ఉండివుంటే, మేము దానిని త్రాగేసేవారం" అని బదులిచ్చారు. యుద్ధాలలో ఒనరుల కొరత గురించి ఏమని చెప్పేది!? హజ్రత్ అబూ మూసా ఇలా అంటున్నారు : మేము దైవప్రవక్త (స) వెంట యుద్ధరంగానికి బయలుదేరేవారం. ఆరుగురు యోధులకు ఒక ఒంటె మాత్రమే ఉండేది. మేము వంతుల వారీగా దానిమీద స్వారీ అయ్యేవారం. నిరంతరం నడచి వెళ్ళటం వల్ల మా పాదాలు నెర్రలు కొట్టాయి. అందువల్ల మేము మా పాదాలకు గుడ్డ పేలికలు కట్టుకోవాల్సి వచ్చింది. అందుకే ఆ యుద్ధానికి 'జాతిర్రిఖా' (గుడ్డ పేలికల) యుద్ధం అనే పేరుపడింది. యుద్ధ ప్రయాణాలలో ఒక్కోసారి ఆహారకొరత ఎంత తీవ్రంగా ఉండేదంటే, యోధులు ఖర్జూరాన్ని తినేబదులు చప్పరించేవారు. అది చాలకపోతే తుమ్మ ఆకుల ద్వారా, మిదుతల ద్వారా కడుపు నింపుకునేవారు. తత్కారణంగా ఉదర జబ్బులు వచ్చేవి. మక్కా పౌరులు మాంసం, పాలకు అలవాటు పడినవారు. అయితే మదీనాలో వారికి ఖర్జూరపండ్లు లభ్యమయ్యేవి. తిబ్రానీ ఉల్లేఖనం ప్రకారం ఒకరోజు దైవప్రవక్త (స) జుమా నమాజ్ చేయించడానికి మస్జిద్‌లో ప్రవేశించినప్పుడు, మక్కాకు చెందిన ఒక ముస్లిం బిగ్గరగా అరిచాడు :

"ఓ దైవప్రవక్తా! ఖర్జూరం మా కడుపుల్ని మాడ్చేసింది."

హృదయాలను జయించే పథకం క్రింద ఆయన (స) జనుల పట్ల ఎంతో ఉదారంగా వ్యవహరించారు. వారికి విరివిగా సొమ్ములిచ్చారు. సఫ్వాన్ బిన్ ఉమయ్యా మక్కా ప్రముఖుల్లో ఒకడు. మక్కా విజయం తర్వాత అతను నగరం నుండి పరారై ఒక పర్వత కనుమలో దాక్కున్నాడు. ఆయన (స) అతనికి అభయమిచ్చి వెనక్కి పిలిపించారు. హవాజిన్ విజయం తరువాత ఆయన (స) 'జారానా'లో విజయ ధనాన్ని పర్యవేక్షిస్తున్న సమయంలో సఫ్వాన్ బిన్ ఉమయ్యా కూడా ఆయన (స) వెంట ఉన్నారు. అప్పటికింకా ఆయన ముస్లిం కాదు. సఫ్వాన్ ఒక పర్వత లోయకు చేరుకుని అక్కడున్న గొఱ్ఱెల్ని, మేకల్ని ఆశగా చూడసాగాడు. దైవప్రవక్త (స) సఫ్వాన్ పరిస్థితిని గమనించి "ఓ అబూ వహబ్! పశుసంపదతో నిండివున్న ఈ లోయ నీకు నచ్చిందా?" అని అడిగారు. దానికి సఫ్వాన్ 'అవున'న్నాడు. అంతే. "ఇదీ, ఇందులో ఉన్నదంతా ఇక నుండి నీదే" అన్నారు. ఇది విన్న సఫ్వాన్, 'ఒక్క దైవప్రవక్త తప్ప మరెవరి హృదయం కూడా ఇంత విశాలంగా ఉండదు. అల్లాహ్ తప్ప మరో నిజ ఆరాధ్య దైవం లేదని, ముహమ్మద్ దైవదాసుడు, దైవ సందేశహరుడని నేను సాక్ష్యమిస్తున్నాను' అని పలికారు. (కన్జుల్ అమాల్ – సం.5, పేజీ – 294)

ఆయన (స) అనేక వివాహాలు చేసుకోవటంలోని ముఖ్య ఉద్దేశ్యం కూడా ప్రజా సంబంధాలను పెంచుకోవటమే. తెగల వ్యవస్థలో ఆనాడు బంధుత్వ సంబంధానికి ఎనలేని ప్రాముఖ్యత ఉండేది. హిజ్రత్ తరువాత ఆయన (స) అనేక వివాహాలు చేసుకోవటం వల్ల విస్తృత ప్రాతిపదికన బంధుత్వాలు ఏర్పడ్డాయి. ప్రజల హృదయాలు ఆయన పట్ల, ఆయన సందేశం పట్ల మెత్తబడ్డాయి. మొదటి వివాహం ఆయన తనకన్నా రెట్టింపు వయసున్న వితంతువుతో చేసుకున్నారు. మిగిలిన వివాహాలన్నీ కేవలం దాంపత్య సుఖం కోసం చేసుకున్నవి కావు, సందేశ ప్రధానమైన ప్రయోజనాన్ని, రాజకీయ సుస్థిరతను ఆశించి చేసుకున్నవే.

హుదైబియా ఒడంబడిక (628) ననుసరించి ఆయన మరుసటి సంవత్సరం సుమారు రెండువేల మంది ముస్లింలతో కలసి కాబా సందర్శనార్థం మక్కా నగరానికి వెళ్ళారు. ఆ సందర్భంగా – మూడు రోజులు అక్కడ విడిదిచేసి మైమూనా బిన్తె హారిస్‌ని నికాహ్ చేసుకున్నారు. ఆమె ఒక వితంతువు. మైమూనాకు ఎనమండుగురు అక్కా చెల్లెళ్ళు. వారి వివాహాలు మక్కాలోని ఉన్నత కుటుంబీకుల్లో జరిగాయి. ఆయన (స) వితంతు మైమూనాను మనువాడటంతో ఎనిమిది కుటుంబాలతో బంధుత్వ

సంబంధం ఏర్పరచుకున్నట్లయింది. అదీగాక ఖాలిద్ బిన్ వలీద్ మైమూనా అన్న కుమారుడు. ఆమెగారు ఆయన్ని తన కన్న కొడుకులాగా పెంచారు. ఈ నికాహ్ తర్వాత ఖురైషుల అతిపెద్ద సేనాని ఆయన (స)కు 'కుమారుడు' అయిపోయారు. ఆనాటి నుండీ ఖాలిద్ బిన్ వలీద్ ముస్లింలకు వ్యతిరేకంగా ఏ ఒక్క యుద్ధంలో కూడా పాల్గొనలేదు. తొందరగానే ముస్లింగా కూడా ధర్మపరివర్తన చెందారు. నికాహ్ అనంతరం ఆయన (స) మక్కా వారికి వలీమా విందుకు ఆహ్వానించారు. కాని మక్కావారు వచ్చి, ఒడంబడిక ప్రకారం మీరు మూడు రోజులకన్నా ఎక్కువగా ఇక్కడ ఉండలేరని, ఈ గడువు ముగిసిందనీ, కాబట్టి మీరు వెంటనే బయలుదేరండి అనీ అన్నారు. అందువల్ల ఆయన (స) మక్కా వారికి వలీమా విందు ఇవ్వలేకపోయారు. కాని ఆ సందర్భంగా దైవప్రవక్త (స) ద్వారా వర్షించిన ఔదార్యం ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. ఖాలిద్ బిన్ వలీద్, అమ్ర్ బిన్ ఆస్ లిద్దరూ ఒకేసారి ఇస్లామ్ స్వీకరించారు. వారిద్దరూ మదీనా నగరానికి వచ్చినప్పుడు ఒక వ్యక్తి బిగ్గరగా ఇలా అరిచాడు : "ఇంకేముంది, వీరిద్దరి తరువాత మక్కావారు తమ పగ్గాలను మన చేతికి ఇచ్చేసినట్లే." (బైహఖీ)

ఉమ్మె హబీబా బిన్తె అబూ సుఫ్యాన్ వివాహం మొదట ఉబైదుల్లాహ్ జహ్షాతో జరిగింది. ఆ దంపతులిద్దరు ఇస్లామ్ స్వీకరించి అబిసీనియా దేశానికి వలసిపోయారు. కాని అక్కడికి వెళ్ళాక ఆమె భర్త క్రైస్తవం పుచ్చుకున్నారు. ఆ తరువాత కొద్దికాలంలోనే అతను మరణించాడు. అప్పుడు ఆయన (స) వితంతువు అయిన ఉమ్మె హబీబాను వివాహం చేసుకునే పథకం రూపొందించారు. అదే గనక జరిగితే మక్కాలోనే అతి పెద్ద నాయకుడుగా ఉన్న అబూ సుఫ్యాన్‌కు ఆయన (స) అల్లుడు కాగలరు. దీనికోసం ఆయన వ్యూహాత్మకంగా వ్యవహరించారు. ఉమ్మె హబీబా గనక అబిసీనియా నుండి మక్కాకు తిరిగి వచ్చేసినట్లయితే, ఆమె తండ్రి ఈ వివాహం జరగనివ్వడు. అందుకే నజాషీ చక్రవర్తిని మధ్యవర్తిగా పెట్టి, ఆయన (స) ఉమ్మె హబీబాను 'నికాహ్ గాయిబాన' చేసుకున్నారు. ఆ తరువాత ఉమ్మె హబీబా నేరుగా మదీనాకు పంపించబడ్డారు. ఈ వివాహం తరువాత ఇస్లామ్ పట్ల అబూ సుఫ్యాన్ వైరవైఖరి మెత్తబడిపోయిందన్న దానికి చరిత్రే సాక్షి. చివరకు మక్కా విజయానికి ఒక రోజు ముందు అతను కూడా ఇస్లామ్ స్వీకరించాడు.

అబూబక్ర్ సిద్దీఖ్ (రజి) ఖలీఫాగా బాధ్యతలు చేపట్టిన తరువాత ఉసామా సారథ్యంలో సైనికదళం రోమనుల వైపు వెళ్ళటం కూడా కీలక పరిణామమే. దైవప్రవక్త

(స) పరమపదించిన మీదట ఒక్క 'త్తై' తెగవారు తప్ప మదీనా చుట్టుప్రక్కల ఉన్న తెగలలో తిరుగుబాటు ధోరణి ప్రబలింది. ఒకవైపు మదీనాలోని ముస్లింల వల్ల ముస్లింల పరిస్థితి "శీతాకాలపు వర్షంలో తడిసిన మేక"లా తయారయింది. అలాంటి పరిస్థితుల్లో లోపలి శత్రువులను చిత్తు చేయడానికి దేశీయాంగ వ్యవస్థను బలోపేతం చేసుకోవలసిన ఆవశ్యకత ఉంది. కాని ఇస్లామ్ ప్రవక్త నిర్ణయానుసారం ఉసామా నేతృత్వంలోని సైనిక దళాన్ని దండయాత్రకు పంపటానికే కట్టుబడ్డారు ప్రథమ ఖలీఫా. ఈ సైనిక చర్య వల్ల లోపలి వ్యవస్థపై పడిన ప్రభావం ఎటువంటిదో మహనీయ అబూ హురైరా (రజి) మాటల్లోనే చూదండి –

> ధర్మభ్రష్టులవడానికి సిద్ధంగా ఉన్న తెగల వారి మీదుగా ఉసామా సైనిక దళం కదం తొక్కుతూ ముందుకు సాగిపోతున్నప్పుడు తెగల వారిలో గుండె దడ పెరిగింది. వారిలా అనుకున్నారు : "ఒకవేళ ముస్లింల వద్ద సైనిక బలం లేకపోయినట్లయితే, ఇలాంటి సేనావాహిని మా మీదుగా వెళ్ళేదే కాదు. మనం కూడా వారిని అటకాయించకుండా పోనిద్దాం. వాళ్ళను రోమనులతో పోరాడనిద్దాం." ముస్లిం సేనలు రోమనులను మార్కొని చిత్తుగా ఓడించాయి. వారు రోమనులను హతమార్చారు. పిదప (విలువైన యుద్ధప్రాప్తితో సహా) సురక్షితంగా మదీనాకు తిరిగి వచ్చారు. ఈ వైనాన్ని ఆసక్తితో గమనించిన అరబ్బు తెగలవారు తమ ధర్మభ్రష్టతా (ఇర్తెదాద్) ఉద్దేశాన్ని ఉపసంహరించుకుని ఇస్లామ్ ధర్మంపై స్థిరపడిపోయారు.
>
> *(అల్ బిదాయ వన్నిహాయ – సం.6, పేజీ : 305)*

దైవప్రవక్త (స) మదీనాకు వచ్చినప్పుడు, అక్కడ బహు దైవారాధకుల ఒక మైనారిటీ వర్గాన్ని మినహాయిస్తే రెండు పెద్ద వర్గాలు ఉండేవి. వారే యూదులు, ముస్లింలు. మరి వారు కూడా వివిధ ముఠాలుగా చీలిపోయి ఉన్నారు. వారిమధ్య ఐకమత్యం అన్నదే లేదు. ప్రజలు మానసికంగా – తమ మధ్య ఐకమత్యాన్ని పెంపొందించి, సంస్థాగత వ్యవస్థను బలోపేతం చేసే నాయకుని కొరకు ఎదురుచూస్తూ ఉన్నారు. దైవప్రవక్త (స) వారి స్థితిగతులను అధ్యయనం చేసి ఒక 'సహీఫా'ను జారీ చేశారు. అందులో యూదుల, ముస్లింల సామాజిక స్టేటస్‌ను అంగీకరించటం జరిగింది. అప్పటికే వారిలో చెలామణిలో ఉన్న హక్కులు – బాధ్యతల జోలికి

పోకుండా వారందరికీ ఆమోదయోగ్యమైన రీతిలో వారి స్టేటస్‌కు గుర్తింపు నివ్వటం జరిగింది. పిదప అందులో ఒక అధికరణను చేర్చటం జరిగింది. అది ఈ విధంగా ఉంది :

> "మీ మధ్య ఎప్పుడు ఏ వ్యవహారంలోనయినా విభేదం వస్తే, ఆ వ్యవహారం దైవం మరియు దైవప్రవక్త వైపునకు మరల్చబడుతుంది."
>
> *(తహ్‌జీబ్ సీరత్ ఇబ్ను హిషామ్ – 129)*

ఈ విధంగా ఈ 'సహీఫా' ఒక రకమయిన రాజకీయ చర్య వంటిది. తద్వారా ఆయన (స) ఎంతో విజ్ఞతతో, దూరదృష్టితో మదీనాలో ఇస్లామీయ రాజ్యాంగబద్ధమైన ప్రభుత్వాన్ని స్థాపించినట్లయింది.

ఆయన (స) మదీనా చేరుకున్న మీదట ఖురైషులు శాంతించాల్సింది పోయి అగ్గిమీద గుగ్గిలం అయ్యారు. నలువైపులా చెల్లాచెదురుగా ఉన్న ముస్లింలంతా ఒకచోట చేరి తమకంటూ ఒక పటిష్టమైన కేంద్రాన్ని నిర్మించుకోవటాన్ని వారు పసిగట్టారు. హిజ్రత్ చేసిన రెండవ సంవత్సరంలోనే ముస్లింలు ఖురైషులను మార్కొనవలసిన అగత్యం ఏర్పడింది. అయితే ముందుకెళ్ళి వారిని ప్రతిఘటించాలా? లేక మదీనా నగరంలోనికి వారిని జొరబడనివ్వాలా? అన్న ప్రశ్న ఎదురయింది. ఆ సమయంలో ఖురైషు సైనికులు 950 మంది ఉండగా, ముస్లిం యోధులు కేవలం 313 మంది మాత్రమే. అయితే దైవప్రవక్త (స) తన దూరదృష్టితో వేసిన అంచనా ప్రకారం బహుదైవారాధకులు సంఖ్యాపరంగా అధికులే అయినప్పటికీ కేవలం అసూయాద్వేషాల నకారాత్మక సామగ్రిని తమ వెంట తెచ్చుకున్నారు. దీనికి ప్రతిగా ముస్లింల వద్ద విశ్వాసం (ఈమాన్) అనే సకారాత్మక నిధి ఉంది. అది శత్రువుకంటే ఎన్నో రెట్ల ఎక్కువ బలవత్తరమైనది. అదీగాక అరబ్బులు తమ అజ్ఞాన కాలపు అహంభావం కారణంగా వ్యక్తిగతంగా – వేర్వేరుగా – తలపడి తమ వీరోచిత పోరాటాన్ని, పరాక్రమాన్ని ప్రదర్శించేవారు. ఆ విధంగా తాము లోకుల దృష్టిలో వీరులుగా, శూరులుగా పేరు సంపాదించాలని భావించేవారు. కాని ముస్లింలు విశ్వసించిన మీదట – అల్లాహ్‌పై భారం మోపి – తమలోని ఈ స్వార్థబుద్ధిని పరిత్యజించారు. ఆయన (స) అరబ్బులను ప్రప్రథమంగా కలసికట్టుగా సైన్యాన్ని మోహరించేలా తీర్చిదిద్దారు. వారిలో టీమ్ స్పిరిట్‌ను నూరిపోశారు. మీరు మీ వ్యక్తిగత పేరు ప్రతిష్ఠల కోసం పోరాడకండి. అందరూ ఒక జట్టుగా శత్రువును మార్కొనండి.

ఖురైషుల వ్యక్తిగత బలాన్ని మీ సామూహిక (టీం) బలంతో ఓడించండి (సఫ్ : 4) అని దైవప్రవక్త (స) తన సహచరమాన్యులకు ప్రేరేపించారు. ఒకవైపు విశ్వాసం, మరోవైపు సంఘటిత పోరాటం మూలంగా చరిత్రలో ఓ అద్భుతమైన సంఘటన ఉనికిలోకి వచ్చింది. అదే బద్ర్ విజయం.

## ఇస్లామ్ విజయం

బద్ర్‌లో ఎదురైన పరాభవాన్ని ఖురైషులు జీర్ణించుకోలేకపోయారు. కొద్దికాలం తర్వాతనే పోరాటాల పరంపర మొదలయింది. వాటిలో ఉహుద్ పోరాటం (హిజ్రీ 3), కందక పోరాటం (హిజ్రీ 5) చెప్పుకోదగినవి. ఈ యుద్ధాలలో ముస్లింలకు ఎన్నో కష్టనష్టాలు ఎదురయ్యాయి. కందక యుద్ధంలో 800 మంది ఉన్నారు. కాని తీవ్రమయిన చలి, ఆకలి, అలసట వల్ల వారిలో నిస్సత్తువ ఆవరించింది. శత్రు శిబిరంలోకి ఒక మనిషిని గూఢచారిగా పంపదలిచారు దైవప్రవక్త. ఆ పనికోసం మూడుసార్లు పిలిచినా ఎవరూ లేవలేకపోయారు. చివరకు ఆయన (స) మహనీయ హుజైఫా దగ్గరకు వచ్చి, పేరుపెట్టి పిలిచిన తర్వాత, ఆయనకు ఆ పని అప్పగించారు.

మరోవైపున మదీనాలోని యూదులు నిరంతరం తలనొప్పిగా తయారయ్యారు. వారు ఖురైషులతో కుమ్మక్కయి ముస్లింలకు వ్యతిరేకంగా కుట్రలు పన్నేవారు. కందక పోరాటం సందర్భంగా 20 రోజుల దిగ్బంధం తర్వాత ఒక తీవ్రమైన పెనుగాలి రావటంతో ఖురైషుల సైన్యం మక్కాకు తిరిగి వెళ్ళిపోయింది. మహాప్రవక్త (స) ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ యూదులపై సైనిక చర్యకు పూనుకున్నారు. ఎందుకంటే కందకపోరాటం సందర్భంగా యూదుల కుటిల పన్నాగాలన్నీ బట్టబయలయ్యాయి. అందువల్ల యూదు తెగలను (బనూ నజీర్, బనూ ఖైనుఖా, బనూ ఖురైజాలను) ముట్టడించి, తౌరాతు గ్రంథంలోని శాసనం ప్రకారం చర్యగైకొని, వారి సమస్యను శాశ్వతంగా పరిష్కరించారు.

ఇప్పుడు మిగిలింది ఖైబర్ సమస్య. అది హిజ్రీ 6వ సంవత్సరం. ఇస్లాం కేంద్రమైన మదీనాకు దక్షిణాన 400 కి.మీ. దూరంలో మక్కా ఖురైషులుంటే, మదీనాకు ఉత్తరాన 200 కి.మీ. దూరంలో ఖైబర్ యూదులున్నారు. అటు ఖురైషులు, ఇటు యూదులు. ఇస్లామ్ పట్ల శత్రుత్వంలో వారిది ఒకేమాట. అయినప్పటికీ ఒంటరిగా ఇస్లామ్‌ను అంతమొందించేంత శక్తి వారికి లేదు. అందుకే వారిమధ్య రహస్యమంతనాలు జరుగుతున్నాయి. ఒకేసారి ఒక్కుమ్మడిగా మదీనాపై దండెత్తి

ఇస్లామ్‌ను అంతమొందించాలన్నది వారి లక్ష్యం. మరోవైపు ముస్లింలు కూడా ఈ శత్రువులిద్దరినీ ఒకే సమయంలో ఎదుర్కొనేంత శక్తి కలిగి లేరు.

ఇలాంటి పరిస్థితుల్లో ఆయన (స) దైవిక తరుణోపాయాన్ని అనుసరించి హిజ్రీ 6వ సంవత్సరంలో వెయ్యిన్నర మంది సహచరులను వెంటబెట్టుకుని మక్కా వైపునకు బయలుదేరారు. తాము ఎవరిపైనా యుద్ధానికి వెళ్ళటం లేదని, ఉమ్రా చేయడానికి మాత్రమే వెళుతున్నామని ప్రకటన గావించారు. ఖుర్బానీ పశువులను కూడా ఆయన (స) తీసుకెళ్ళారు. ఆఖరికి అజ్ఞాన కాలపు సంప్రదాయం ప్రకారం ఖుర్బానీ పశువులకు చిహ్నంగా ఒంటెల మెడలలో త్రాడు కూడా కట్టమని ఆదేశించారు. అంటే ఆయన కేవలం కాబా గృహ సందర్శనార్థం వెళుతున్నారని ప్రజలకు తెలియాలన్నది దాని ఉద్దేశం.

మక్కా నగరానికి సుమారు పదకొండు కిలో మీటర్ల దూరంలో ఉన్న హుదైబియా వరకు ఈ బృందం చేరుకుంది. ముందుగా ఊహించినట్లుగానే ఖురైషులు వచ్చి ముస్లింలను నిలువరించారు. దైవప్రవక్త (స) ఏమాత్రం గొడవకు ఆస్కారం ఇవ్వకుండా అక్కడే విడిది చేశారు. మీకూ – మాకూ మధ్య సంధి జరిగితే ఉభయులకూ మంచిదని ఖురైషులకు సందేశం పంపించారు.

> "మేము ఎవరితోనూ యుద్ధం చేయడానికి రాలేదు. కేవలం ఉమ్రా చేసుకోవడానికే వచ్చాము. యుద్ధాలు ఖురైషుల బ్రతుకును దుర్భరం చేసివేశాయి. వారికి తీవ్రనష్టం వాటిల్లింది. వారు గనక కోరుకున్నట్లయితే ఒక నిర్ణీత గడువు వరకు నిర్యుద్ధ సంధి చేసుకోవడానికి నేను సిద్దంగా ఉన్నాను. వారు నాకూ – జనులకూ మధ్య నుండి వైదొలగాలి. ఒకవేళ నేను ప్రాబల్యం వహించినట్లయితే, అప్పుడు వారు కోరుకున్నట్లయితే, జనులు ప్రవేశిస్తున్న దీన్ (ధర్మం)లో ప్రవేశించవచ్చు. ఒకవేళ నేను ప్రాబల్యం వహించక పోయినట్లయితే, వారు తమ మాటకు కట్టుబడి ఉండవచ్చు. ఒకవేళ ఖురైషులు దీనికి తిరస్కరించినట్లయితే – ఎవరి అధీనంలో నా ప్రాణముందో ఆయన సాక్షిగా చెబుతున్నాను – ఈ వ్యవహారంలో నేను వారితో పోరాడు తాను. ఈ పోరాటంలో నా మెడ, నా శరీరం నుండి వేరైపోవటమో లేక అల్లాహ్ ఆజ్ఞ నెరవేరటమో జరుగుతుంది."

ఈ సందేశం వాస్తవానికి ఖురైషులలో ఉన్న ఒక ఆలోచన నుండి లబ్ధి పొందటం వంటిది. మక్కాలో ఉన్నప్పుడు ఆరంభ కాలంలో – ఉతబా బిన్ రబీయా ఖురైషుల ప్రతినిధిగా ఆయన్ని కలుసుకోవడానికి వచ్చాడు. చర్చల అనంతరం అతను ఖురైషుల వద్దకు వెళ్ళి చెప్పిన మాటల్లో ఇదీ ఒకటి :

> "అతన్ని అతని మానాన వదలివేయండి. దైవసాక్షి! అతను తన పంతాన్ని వీడే రకం కాదు. కాబట్టి మీరు అతనికి – సమస్త అరబ్బు జనులకి మధ్య నుండి వైదొలగండి. ఒకవేళ అతను అరేబియాపై ప్రాబల్యం వహించినట్లయితే, అతని గౌరవం మీ గౌరవం అవుతుంది. ఒకవేళ అతను ఓడిపోతే ఇతరుల బారి నుండి మీకు విముక్తి లభిస్తుంది."

ఈ 'ఆలోచన' స్వయంగా చాలాకాలం నుండి ఖురైషులలో అణగారి ఉంది. దానిని ఆయన (స) సమయోచితంగా వారిపై ప్రయోగించారు. దీని ఫలితంగా స్వయంగా ప్రత్యర్థివర్గం నుండి తన దృక్పథానికి సకారాత్మకంగా స్పందించేవారు లభించారు.

ఒకవైపున ఆయన వారికి నిర్యుద్ధ సంధి సందేశం పంపారు. మరోవైపు నుంచి వారిని వివిధ పద్ధతుల ద్వారా ప్రభావితుల్ని చేసే ప్రక్రియ మొదలైంది. బనీ కనానాకు చెందిన ఒక వ్యక్తి మక్కా నుండి బయలుదేరి హుదైబియా చేరుకున్నాడు – ముస్లింలు అసలు వచ్చింది ఎందుకో తెలుసుకుందామని. అతను వస్తున్నట్లు సహచరులు ఆయన (స)కు తెలియపరచగానే, "ఆ వ్యక్తి ఏ తెగకు చెందినవాడో, ఆ తెగవారు ఖుర్బానీ పశువుల పట్ల శ్రద్ధాభక్తులు కనబరుస్తారు. కాబట్టి మీరు మీ ఖుర్బానీ పశువులను తోలుకుని వచ్చి అతని ముందు నిలబెట్టండి" అని ఆయన ఆదేశించారు. ముస్లింలు తమ ఖుర్బానీ పశువులను తోలుకొని వచ్చి, **'లబ్బైక్ అల్లాహుమ్మ లబ్బైక్'** అంటూ అతని ముందు నుండి సాగిపోయారు. ఇది చూసి ఆ వ్యక్తి అమితంగా ప్రభావితుడయ్యాడు. అతను మక్కాకు తిరిగి వెళ్ళి, 'నా ఉద్దేశంలో ముస్లింలు కేవలం కాబా గృహ సందర్శనార్థం వచ్చారు. కాబట్టి వారిని అడ్డుకోవటం మంచిది కాద'ని ఖురైషులతో చెప్పాడు.

ఈ విధంగా 15 వందల మంది ముస్లింల 'విశ్వాసం', వారి భావాలు, భావనలు కూడా ఎదుటివారిని ఎంతగానో ప్రభావితం చేసేలా ఉన్నాయి. ఖురైషుల

ఒక రాయబారి హుదైబియా చేరుకున్నప్పుడు ముస్లింలు వరుసలు తీరి దైవప్రవక్త (స) నేతృత్వంలో నమాజ్ చేస్తున్నారు. నమాజులో వారు ప్రదర్శించిన ఏకాగ్రత, క్రమశిక్షణ, నాయకుని పట్ల వారి విధేయతా భావాన్ని చూసి అతను అమితంగా ప్రభావితుడయ్యాడు, భయపడ్డాడు కూడా. అతను మక్కాకు తిరిగి వచ్చాక, 'ముస్లింల ఐకమత్యం, సంగఠితత్వం గురించి ఏమని చెప్పేది! యావజ్జాతి ముహమ్మద్ (స) యొక్క ఒక్కో సైగపై కదలుతోంది' అని ఖురైషులతో చెప్పాడు – ఒక రాయబారి గడమనించిన దృశ్యం యిది. ఇస్లామ్ ప్రవక్త వుజూ చేస్తున్నప్పుడు, ఆ ఉపయోగిత నీరు క్రిందపడకుండా తమ చేతుల్లోకి తీసుకోవడానికి ముస్లింలు ఎగబడుతున్నారు. ఆయన (స) మాట్లాడుతున్నప్పుడు సహచరమాన్యులంతా నిశ్శబ్దంగా ఉండిపోతు న్నారు. ఆయన పట్ల భక్తీ ప్రపత్తులతో ఆయన వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. రాయబారి తిరిగి వచ్చాక ముస్లింల విశ్వాసపాత్రత, ప్రేమాదరణల గురించి ఖురైషులతో చెప్పినప్పుడు వారు ఆశ్చర్యంతో, కించిత్ భయంతో విన్నారు. బుదైల్ బిన్ వరఖా ఖుజాయి ద్వారా ఈ సందేశం ఖురైషులకు అందినప్పుడు ఒక వ్యక్తి (ఉర్వా బిన్ మస్ఊద్) ఇలా ప్రసంగించారు :

> "నా జాతి ప్రజలారా! మీలోని కొందరు నా తండ్రిలాంటి వారు కారా?" దానికి జనులు 'నిశ్చయంగా' అని బదులిచ్చారు. "ఏమిటి, మీలోని కొందరు నా సంతానం లాంటివారు కారా?" అని ఉర్వా ప్రశ్నించినప్పుడు, 'అందులో సందేహమే లేద'ని వారన్నారు. "ఏమిటి, మీకు నా మీద అనుమానం ఉందా?" అని ఉర్వా అడిగినప్పుడు, 'లేద'ని వారు సమాధానమిచ్చారు. "చూడండి, ఆ మనిషి మీ ముందు అత్యుత్తమమైన ప్రతిపాదన ఉంచాడు. మీరు దానికి అంగీకరించండి. అతనితో చర్చలు జరపడానికి నన్ను వెళ్ళనివ్వండి" అని ఉర్వా చెప్పాడు. *(అల్ బిదాయ వన్నిహాయ)*

ఖురైషులు ఏ డిమాండు చేసినా దానికి అంగీకరిస్తానని ఇస్లామ్ ప్రవక్త ప్రకటించారు. ఎట్టకేలకు 'నిర్యుద్ధ సంధి' లిఖించబడింది. ఆ సందర్భంగా ఖురైషులు రకరకాలుగా తమ అజ్ఞానకాలపు అహంభావాన్ని ప్రదర్శించారు. ఒడంబడిక పత్రంలో నుంచి "దైవప్రవక్త యగు ముహమ్మద్" అనే వాక్యాన్ని చెరిపివేసి, "అబ్దుల్లాహ్ కుమారుడగు ముహమ్మద్" అని వ్రాయించారు. "బిస్మిల్లాహిర్రహ్మా నిర్రహీమ్" కు

బదులు "బిస్మికల్లాహుమ్మ" అని లిఖించమని హఠం చేశారు. ఖురైషులకు చెందిన ఏ వ్యక్తి ముస్లిముల వద్దకు వచ్చినా, వారు అతన్ని తిరిగి పంపాలన్న అధికరణను ఆ పత్రంలో చేర్చారు. దానికి ప్రతిగా ఏ ముస్లిమైనా ఖురైషుల వద్దకు వస్తే వారు అతన్ని వాపసు చేసేది లేదు అని కూడా వ్రాయించారు. ముస్లింలు ఈ ఏడాది మక్కాకు వచ్చి ఉమ్రా చేసుకునేందుకు అనుమతి ఉండదని తెగేసి చెప్పారు – ఈ షరతులు ప్రవక్త ప్రియసహచరులెవరికీ సహించలేదు. చివరకు ఉర్వా బిన్ మస్ఊద్ రెచ్చగొట్టే ధోరణిలో ఇలా అన్నాడు : "ఓ ముహమ్మద్! మీరు మీ దగ్గర ప్రోగు చేసుకున్న ఈ అలగా జనులు ఏదో ఒకనాడు మిమ్మల్ని వదలి పారిపోతారు." ఇది విని అబూబక్ర్ (రజి) లాంటి సౌమ్యుడు కూడా ఆదేశంతో ఊగిపోయారు. ఆ సమయంలో ఆయన నోట వెలువడిన మాటలివి :

> "పోరా పో. పోయి లాత్ మర్మాంగం నాకు. ఏమంటావురా, మేము
> ఈయన్ని విడిచి పారిపోతామా?" *(అల్ బిదాయ వన్నిహాయ)*

అయితే ఇస్లామ్ ప్రవక్త మాత్రం అన్ని రకాల రెచ్చగొట్టే మాటలను సహిస్తూ, ఖురైషుల డిమాండ్లన్నింటికీ తలఒగ్గి వారితో పదేళ్ళ నిర్యుద్ధ సంధి చేసుకున్నారు. ఇప్పుడు ఖురైషులు పదేళ్ళపాటు ముస్లింలతో ప్రత్యక్షంగాగానీ, పరోక్షంగాగానీ ముస్లింలకు వ్యతిరేకంగా ఏ యుద్ధంలో కూడా పాల్గొనలేరు.

ఈ ఒడంబడిక ముస్లింలకు ఎంతగా బాధ కలిగించిందంటే, కార్యక్రమమంతా ముగిసిన తరువాత పశువుల ఖుర్బానీ ఇవ్వమని దైవప్రవక్త చెప్పినప్పుడు, – మూడుసార్లు ప్రకటన చేసినా – ఏ ఒక్క వ్యక్తి కూడా ఖుర్బానీ ఇవ్వడానికి లేవలేదు. ఆ తరువాత లేచినా వారు బాధాతప్త హృదయంతో లేచారు. ఖుర్బానీ అనంతరం శిరోముండనం చేయించుకుంటున్నప్పుడు వారి వాలకాన్ని చూస్తే, ఒండొకరి కుత్తుక కోయడానికి సిద్ధంగా ఉన్నారా! అనిపించింది. అయితే అణగిమణగి చేసుకున్న ఆ ఒడంబడిక ద్వారా చేకూరిన ప్రయోజనాలు అగణ్యం.

హుదైబియా ఒప్పందం జరిగినప్పుడు ముస్లింలకు రెండు బలమైన ప్రత్యర్థులున్నారు. ఒకరు, ఖైబర్‌లోని యూదులు. రెండవవారు, మక్కాలోని ఖురైషులు. ముస్లింల వద్ద ఏకకాలంలో రెండు శక్తులను ఎదుర్కొనే తాహతు లేదు. ఒక దానిపై దాడి చేస్తే రెండవది వెనుక నుండి వచ్చి, మదీనాలో జొరబడి ముస్లింల కేంద్రాన్ని ధ్వంసం చేసే ప్రమాదం ఉంది. అందుకే ఇస్లామ్ ప్రవక్త ఎంతో దూరదృష్టితో

ఖురైషుల డిమాండ్లన్నింటినీ ఒప్పుకుని పదేళ్ళపాటు వారితో యుద్ధం జరగకుండా ఉండేలా సంధి చేసుకున్నారు. ఆ విధంగా వారిని మక్కా లోయకే పరిమితం చేశారు (ఫత్హ్ : 24). ఆ తరువాత మదీనాకు తిరిగి వచ్చాక, వీలైనంత తొందరగానే ఖైబర్‌పై దండెత్తి యూదుల బెడద శాశ్వతంగా సమసిపోయేలా చేశారు.

ఖైబర్‌ను జయించిన తర్వాత, ఇప్పుడు మక్కా ఖురైషుల బెడద ఒక్కటే మిగిలి ఉంది. దైవప్రవక్త (స) తన దూరదృష్టితో ప్రత్యర్థికి తప్పు చేసేందుకు పూర్తి విడుపు ఇచ్చారు. అవతలివారు ఘోరమైన తప్పిదం చేసే వరకు వారి జోలికి పోవడానికి ఒడంబడిక ఒప్పుకోదు. ఖురైషులలోని నకారాత్మక భావాలు ఎటువంటివో ప్రవక్తకు తెలుసు. అసూయ, అక్కసు, ద్వేషం, అహంకారం, అధికార వ్యామోహం – ఇలాంటి నకారాత్మక భావాలు కలవారు ఏదో ఒక క్షణంలో మూర్ఖత్వంతో బరితెగించకుండా ఉండరు. దైవప్రవక్త వేసిన అంచనా ఖచ్చితమైనదని తొందరగానే తేలిపోయింది. బనూ బకర్ – బనీ ఖుజాఅ తెగల మధ్య యుద్ధం మొదలయినప్పుడు ఖురైషులు తమ మిత్రపక్షమైన బనూ బక్ర్ తెగతో కుమ్మక్కయి బనూ ఖుజాఅ తెగపై దండెత్తింది. బనూ ఖుజాఅ తెగతో ముస్లింలకు స్నేహ సంబంధాలున్నాయి. ఖురైషులు చేసిన పని హుదైబియా ఒడంబడికకు విరుద్ధం. వారు ఒడంబడికను ఉల్లంఘించి ఘోరమైన తప్పు చేశారు. హుదైబియా ఒడంబడిక జరిగిన రెండేళ్ళకే ఈ పరిణామం చోటు చేసుకుంది. ఈలోగా ముస్లింల శిబిరం బలోపేతంగా తయారయింది. హుదైబియా ఒడంబడిక సమయంలో 1500 మంది ఉన్న ముస్లిం యోధుల సంఖ్య ఇప్పుడు పదివేలకు చేరింది. ఆయన (స) నిశ్శబ్దంగా మక్కా వైపునకు సాగిపోయారు. ఇదంతా ఎంత వివేచనతో, మరెంత పారదర్శకతతో జరిగిందంటే దాదాపు రక్తపాతం జరగకుండానే మక్కా నగరం కైవసమయింది.

> ఇంకా అల్లాహ్ ఎన్నో విజయసొత్తులను గురించి మీకు వాగ్దానం చేశాడు. వాటిని మీరు గ్రహిస్తారు. దీనిని మాత్రం ఆయన మీకు వెంటనే అనుగ్రహించాడు. జనుల చేతులను మీ నుండి ఆపాడు.
>
> *(అల్ ఫత్హ్ : 20)*

ఒడంబడిక జరిగే నాటికి పరిస్థితుల స్వరూపం ఎలా ఉందంటే, సుమారు 20 ఏళ్ళ కృషి వల్ల ఇస్లామ్ వాణి అరేబియా అంతటా విస్తరించింది. ప్రతి తెగకు చెందిన ప్రజల హృదయాలలో ఇస్లామ్‌లోని సత్యత చోటు సంపాదించుకున్నది.

కాని ఆ సమయంలో అరేబియాలో ఖురైషుల నాయకత్వం ఉంది. ప్రజలు ఖురైషులకు భయపడి తమ ఆంతర్యాలలో అణగారి ఉన్న ఇస్లామ్‌ను ప్రకటించలేకపోయేవారు. ఇస్లామ్‌ను స్వీకరించటమంటే ఖురైషులతో యుద్ధం చేయటమేనని వారికి తెలుసు. హుదైబియా ఒడంబడిక జరగగానే అరబ్బులందరికీ ఒక విషయం తెలిసిపోయింది – ముస్లింలకూ – ఖురైషులకు మధ్య నిర్యుద్ధ సంధి జరిగిందనీ, పదేళ్ళ వరకూ ఎలాంటి యుద్ధాలు ఉండవనీని. అంతే, ట్రాఫిక్ (కూడలి) ప్రదేశంలో గ్రీన్ సిగ్నల్ కనిపించినప్పుడు వాహనాలు పరుగెత్తినట్లే ప్రజలు ఇస్లామ్ వైపునకు పరుగులు తీస్తూ వచ్చారు.

> ఇబ్నె షిహాబ్, జుహ్రీ తదితరులు ఏమంటారంటే, అల్లాహ్ హుదైబియా ఒడంబడిక ద్వారా ముస్లింలకు ప్రసాదించిన విజయాలు ఇతర యుద్ధాలకన్నా అధికం. దైవప్రవక్త (స) మక్కా విజయం వరించిన సంవత్సరం పదివేల మందితో కలసి నగరంలో ప్రవేశించారు. అంతకు ముందు వారి సంఖ్య ఎన్నడూ మూడువేలకు మించలేదు. కారణమేమంటే ఖురైషులు యుద్ధాలకు స్వస్తి పలకటంతో అరబ్బులు ఇస్లామ్‌లో ప్రవేశించడానికి ఎలాంటి అవరోధం మిగల్లేదు. ఎందుకంటే ఇప్పుడు ఖురైషుల ఆగ్రహానికి తగు కారణమేదీ లేదు.

బుఖారీ హజ్రత్ బరార్ ఆధారంగా ఉటంకించిన దాని ప్రకారం, ఆయన తరువాతి కాలంలో ఇలా అనేవారు : "మీరు మక్కా విజయాన్ని 'విజయం'గా భావిస్తున్నారు. కాని మేమైతే హుదైబియా ఒడంబడికను 'విజయం' అని అనేవారం."

ఈ ఒప్పందం వల్ల మదీనాపై ఉన్న ఆర్థిక ఆంక్షలు ఎత్తివేయబడ్డాయి. మదీనాకు చెందిన వర్తక బిడారాలు నిరాటంకంగా మక్కా మీదుగా సాగిపోయేవి. అబూ బసీర్, అబూజందల్ తదితరులు ఒప్పందం ప్రకారం ఖురైషుల వద్దకు తిరిగి రావలసింది. కాని వారు పరారై సముద్రతీర ప్రాంతానికి చేరుకున్నారు. మరికొంత మంది కూడా వారిద్దరికీ తోడయ్యారు. అదొక స్థావరంగా రూపొందింది. వారు ఖురైషుల వర్తక బిడారాలకు ఎంత తలనొప్పిగా తయారయ్యారంటే, ఖురైషులు స్వయంగా ఒడంబడికలోని ఆ అధికరణను ఉపసంహరించుకున్నారు. మనిషిలోని అతి పెద్ద బలహీనత తొందరపాటు, పైకి కనిపించే దానిపట్ల ఆరాటం. మనిషి

గనక ఈ బలహీనతల నుండి పైకి వచ్చి ఆలోచిస్తే ప్రపంచంలో అల్లాహ్ అతని కొరకు ఎన్నో విజయావకాశాలను పొందుపరచిన వాస్తవం అర్థమవుతుంది.

> మహనీయ అబూబక్ర్ ఇలా అనేవారు : ఇస్లామ్‌లో హుదైబియా విజయానికి మించిన విజయమేదీ లేదు. కాని ఆ రోజు ప్రజల చూపులు అక్కడి వరకు చేరుకోలేక పోయాయి. ఆ వ్యవహారం దైవానికి – దైవప్రవక్త (స)కు మధ్యనే ఉంది. దాసులు ప్రతి దానికీ తొందరపడతారు. కాని దేవుడు దాసుల మాదిరిగా తొందరచేయడు. వ్యవహారం చేరవలసిన చోటుకు చేరే వరకూ (విడుపు ఇస్తుంటాడు).

వాస్తవిక ప్రియత్వం ప్రపంచంలో అన్నిటికన్నా అరుదైనది. మరి చూడబోతే మనిషిని విజయం వరకు చేర్చేది వాస్తవిక ప్రియత్వమే.

ఖైబర్ విజయం తర్వాత వెంటనే దైవప్రవక్త (స) మరో జైత్రయాత్రకు సన్నాహాలు మొదలెట్టారు. కాని ఏ ఒక్కరికీ ఆయన దాని గురించి చెప్పలేదు. ఆయనకు ఆంతరంగికుడైన అబూబక్ర్‌కు సయితం తెలీదు – ఎటువైపు బయలు దేరుతున్నారో. హిజ్రీ శకం 8వ యేట రమజాన్ నెలలో ఆయన తన సహచర మాన్యులతో కలసి బయలుదేరినప్పుడు గాని తెలియలేదు – తాము మక్కా వైపునకు వెళుతున్నామని. ఎంతో పకడ్బందీగా ప్రయాణం సాగింది. ఆయన మక్కా పొలిమేరలకు చేరుకునే వరకూ మక్కా పుర ప్రజలకు కూడా ఆ సంగతి తెలియదు. ఆయన (స) ప్రయాణానికి ముందు ఇలా ప్రార్థించారు :

> "దేవా! నేను మక్కా నగరంలో ప్రవేశించే వరకూ ఖురైషు గూఢచారులను నిలువరించు. వారికి సమాచారం తెలియనివ్వకు."

ఈ ప్రయాణం కొరకు ఆయన (స) ఆశ్చర్యకరమైన రీతిలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. మదీనా నగరాన్ని దిగ్బంధం చేయండి, బయటి వ్యక్తి నగరం లోపలికి రాకూడదు, లోపలి వ్యక్తి నగరం బయటికి పోకూడదని ఆదేశించారు. మహనీయ అలీ నేతృత్వంలో కొంతమంది సాయుధులు నగర పొలిమేరల్లో కాపలా కొరకు నియమించబడ్డారు. హాతిబ్ బిన్ అబీ బల్తా దూతను పట్టుకుని ఆమె నుండి ఉత్తరాన్ని వశపరచుకున్నవారు కూడా వీరే.

ముస్లిం యోధులందరినీ వెంటబెట్టుకోవటం జరిగింది. పదివేల మంది సైనికుల్ని వివిధ దళాలుగా ఆయన విభజించారు. ప్రతి దళానికి ఒక అధిపతి

పతాకం చేబూని ముందు నడిచేవాడు. అతని వెనుక కొన్ని వందల మంది వరుసలు తీరి కదం తొక్కసాగారు. అబూ సుఫ్యాన్‌కు తమ సైనికుల కవాతు చేస్తున్న దృశ్యాన్ని చూపించమని ఆయన తన బాబాయి అబ్బాస్‌కు సూచించారు.

> "అబూ సుఫ్యాన్‌ను పర్వత కనుమ వద్ద – రాకపోకల మార్గంలో – ఆపండి. దేవుని సేనావాహిని అతని ముందు నుంచి సాగిపోతుండగా అతడు చూసుకుంటాడు" అని ఆయన హజ్రత్ అబ్బాస్ (రజి)తో చెప్పారు. *(తహ్‌జీబ్ సీరత్ ఇబ్ను హిషామ్ – సం.2, పేజీ : 61)*

ఆ దృశ్యం తిలకించిన అబూ సుఫ్యాన్‌కు దిమ్మ తిరిగినంత పనయింది. ఒక వైపున ఆయన మక్కా నాయకుణ్ణి (అబూ సుఫ్యాన్) ఈ విధంగా ప్రభావితం చేసి, మరోవైపున అబూ సుఫ్యాన్ ఇంట్లో ప్రవేశించిన వారికి రక్షణ ఉంటుందని ప్రకటన చేయించారు. తత్ఫలితంగా అబూ సుఫ్యాన్ స్వయంగా ప్రకటన గావించాడు – "ప్రజలారా! ముహమ్మద్ (స)కు విధేయత చూపండి. ఈ రోజు ఆయన్ని ఎదుర్కొనే శక్తి ఎవరికీ లేదు." మక్కా విజయం తర్వాత సంభవించిన సంఘటనలన్నీ నిరూపించిందేమిటంటే, ఈ జైత్రయాత్ర కొరకు ఆయన అవలంబించిన రణనీతి రక్తపాతం కొరకు అవలంబించినది కాదు, మక్కా వాసులను భయపెట్టడానికి మాత్రమే. రక్తపాతం జరగకుండానే తాము అలవోకగా మక్కా నగరంలో ప్రవేశించగలగాలన్న ఆయన స్ట్రాటజీ విజయవంతం అయింది. ఇస్లామీయ సైన్యాధిపతి సాద్ బిన్ ఉబాదా మక్కా సమీపానికి చేరుకోగానే "ఈ రోజు విధ్వంసం జరిగే రోజు" అని నినదించారు. తక్షణం ఆయన (స) జోక్యం చేసుకుని, "లేదు. ఈ రోజు కరుణించే రోజు" అని ప్రకటించారు. సాద్ బిన్ ఉబాదాను సైన్యాధిపతి హోదా నుంచి ఉద్వాసన పలికి, ఆయన కుమారుడు ఖైస్ చేతికి ధ్వజం అందించారు.

మక్కా విజయం తరువాత కూడా కొన్ని పోరాటాలు జరిగాయి. చిన్నాపెద్దా పోరాటాలన్నింటినీ కలుపుకుంటే వాటి సంఖ్య 80 కి చేరుకుంటుంది. అయితే మక్కా విజయం కీలకమైనది. ఈ విజయంతో అరేబియా అంతా ఇస్లామీయ ప్రభుత్వం క్రిందికి వచ్చేసింది. స్వల్పమైన ప్రతిఘటనల తర్వాత అరబ్బులంతా ఆయన (స) అధికారం ముందు తలవంచారు.

# నేటి ఇస్లామీయ ఉద్యమాలు

ప్రఖ్యాత హదీసు ప్రకారం ముస్లిం సమాజంలో ప్రతి యుగంలో "ధర్మాన్ని పునరుజ్జీవింపజేసేవారు" ప్రభవిస్తారు. ఈ భవిష్యవాణి ముస్లిం సమాజ చరిత్రలో నిజమని రూఢీ అయింది. ఈ వస్తువే ముస్లిం సముదాయంలో ధార్మిక పరంపరను మిగిల్చి ఉంచింది.

అయితే ఇక్కడ ఒక ప్రశ్న జనిస్తుంది – "ధార్మిక పునరుజ్జీవన కృషికిగాను గత కాలంలో వెలువడిన సత్ఫలితాలు ఈ కాలంలో ఎందుకు వెలువడటం లేదు?" అనేది. మాజీలో యుగపురుషులు చేసిన కృషి ఎంతగా ఫలించిందంటే, వెయ్యేళ్ల వరకూ భూమండలంపై ఇస్లామ్ వెలుగొందింది. యావత్ ముస్లిం జగతిలో ఈ ప్రభావం కనబడింది. చైనా సరిహద్దులు మొదలుకుని ఆఫ్రికా పశ్చిమ తీరప్రాంతం వరకు ఇస్లామీయ ప్రాబల్యం భాసిల్లింది. ఆలోచనాసరళి, జీవన రీతులు, లావాదేవీల నియమాలు, సత్యాసత్యాల ప్రమాణం – ఇలా ప్రతి విషయంలోనూ ఇస్లామ్ నాణెం చెల్లుబాటయ్యేది. జీవితపు సకల కార్యకలాపాలపై ఇస్లామ్ ముద్రపడింది. ఒక హదీసువేత్త, ఒక ధర్మవేత్త నోట వెలువడిన ఒక మాట ఆ కాలపు చక్రవర్తి ఫర్మానాకన్నా ఎక్కువ ప్రాధాన్యత కలిగి ఉండేది. దీనికి భిన్నంగా ప్రస్తుత కాలంలో మనం చూస్తున్నాం – లెక్కలేనంతమంది సంస్కర్తలు పుట్టారు. వారు పెద్ద ఎత్తున పునరుద్ధరణా ప్రయత్నాలు చేశారు. పరిమాణం దృష్ట్యా వీరి పని గత కాలపు యుగపురుషుల పనికన్నా పెద్దదే. కాని ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ఇస్లామ్ పరాధీనత సమసిపోలేదు. జీవితంపై అజ్ఞాన కాలపు అనాగరిక ప్రాబల్యం అనుదినం పెరుగుతూనే పోయింది. రెండువందల ఏళ్ల క్రితం ఇస్లామ్ పునరుజ్జీవన ప్రక్రియ మొదలైనప్పుడు ఉన్న ఇస్లామ్ పరిస్థితికన్నా నేడు మరింత వెనక్కి వెళ్ళింది. కారణం ఈ సంస్కర్తలు అవలంబించిన విధానాలు సరైనవి కాకపోవటమే.

దైవదౌత్యం అందిన ఆరేళ్ల తర్వాత హజ్రత్ ఉమర్ (రజి) ఇస్లామ్ స్వీకరించినప్పుడు, మస్జిదె హరామ్‌లోనికి వెళ్ళి తాను ముస్లింగా ధర్మపరివర్తన

చెందినట్లు బాహాటంగా ప్రకటించారు. అప్పుడు ఖురైషులు ఆయన్ని చుట్టుముట్టారు. చాలాసేపటి వరకు సంఘర్షణ సాగింది. చివరకు హజ్రత్ ఉమర్ (రజి) సత్యతిరస్కారులతో ఇలా అన్నారు :

> "మీకు చేతనయింది చేసుకోండి. నేను దేవునిపై ప్రమాణం చేసి చెబుతున్నాను – మా జనసంఖ్య మూడువందలకు చేరుకున్నప్పుడు, మేము ఈ భూభాగాన్ని మీకు వదలిపెట్టడమో లేదా మీరు దీనిని మాకు వదలిపెట్టడమో జరుగుతుంది."

*(అల్ బిదాయ వన్నిహాయ : సం.3, పేజీ : 83)*

ఆయన పలుకులు ఎంత దూరదృష్టితో కూడుకున్నవో నుబువ్వత్ 14వ యేట బద్ర్ సంఘటన నిరూపించింది. హజ్రత్ ఉమర్ (రజి) తన ఖిలాఫత్ కాలంలో ఈజిప్టులో ఉన్న అమ్ర్ బిన్ ఆస్ (రజి)కు లేఖ వ్రాశారు. కారణం విజయం వరించటంలో ఆలస్యం అవటమే. ఆ లేఖలో ఆయన ఇలా అన్నారు :

> "నీ వెంట 12 వేలమంది ఉన్నారన్న సంగతిని మరచిపోకు. 12 వేల మంది ఎన్నడూ ఓటమిని చవిచూడరు."

*(కన్జుల్ అమాల్ – సం.3, పేజీ : 151)*

ఫారూఖె ఆజమ్ (రజి) గారి ఈ పలుకుల ద్వారా విదితమయ్యేదేమిటంటే విప్లవం కొరకు మూడువందల మంది కూడా సరిపోతారు. ఒకవేళ ఈ సంఖ్య 12 వేలకు చేరుకుంటే ప్రత్యర్థి ఎంతపెద్ద సంఖ్యలో ఉన్నాసరే అల్పసంఖ్య కారణంగా ఓటమి పాలవదు. కాని మనం చూస్తున్నాము – నేటి ఆధునిక యుగంలో ఒక్కో ఇస్లామీ జమాఅత్‌లో ఒక్కో ముస్లిం నాయకుని వెనుక లక్షలాది మంది అనుయాయులు ఉన్నప్పటికీ పరాజయాలే తప్ప మరొకటి లభ్యం కావటం లేదు. దీనిని బట్టి అవగతమయ్యేదేమిటంటే ఈ జమాఅత్‌ల లేదా వ్యక్తుల ఉద్యమాలలో ఎక్కడో ఏదో మౌలిక లోపం ఉంది. తత్కారణంగా చిత్తశుద్ధితో సాధన చేసినప్పటికీ, త్యాగాలు చేసినప్పటికీ ఫలితం ప్రతికూలంగా ఉంటోంది.

## ఆరంభ స్థానం

ఈ సందర్భంగా ఆలోచించవలసిన ముఖ్య విషయం, ధార్మిక పునరుజ్జీవన కార్యం ఎక్కడి నుండి మొదలెట్టాలన్నది. ఇస్లామ్ ప్రవక్త (స)కు సత్యసందేశ ప్రకటన చెయ్యమని ఆజ్ఞాపించబడినప్పుడు ఆయన సఫా కొండపైకెక్కి, మక్కా వారికి పిలుపు

ఇచ్చారు. మక్కాలో ఏదయినా అత్యవసర స్థితి ఏర్పడినప్పుడే ఈ విధంగా ప్రకటన గావించటం జరుగుతుంది. జనులు గుమిగూడిన తరువాత ఆయన (స) ఇలా ప్రసంగించారు :

> "మీరు నిద్రిస్తున్నట్లుగానే మరణిస్తారు. అయితే మీరు నిద్ర నుండి మేల్కొన్నట్లే తిరిగి లేపబడతారు. ఆ తరువాత నిశ్చయంగా మీరు శాశ్వతంగా స్వర్గానికో, నరకానికో పోతారు."

జీవిత సత్యం గురించి జనులకు సావధానపరచడంతో ఆయన (స) సందేశ కార్యం ఆరంభమయింది. కాని అబూ లహబ్‌కు ఈ 'మూలం' కనిపించలేదు. అతనిలా అన్నాడు :

> "నీ పాడుగాను. మమ్మల్ని సమావేశపరచింది ఇది చెప్పడానికేనా?"
>
> *(మిష్కాత్)*

అబూ లహబ్ ఆలోచన ప్రకారం, అరేబియాలోని మిల్లతె ఇబ్రాహీమీ ఆనాడు ఎదుర్కొంటున్న సమస్యలకు ఈ 'ప్రసంగం'తో ఎలాంటి సంబంధం లేదు. అన్ని విధాలా వెనుకబడిన అరబ్బు జాతిని ఇతర నాగరిక జాతులకు దీటుగా ఉద్ధరించాలంటే ఆ పనికి ఆరంభం ఇలాంటి ప్రచారం కాగలదని అతను ఊహించనయినా లేదు. మిల్లత్‌ను ఉద్ధరించాలంటే "భయబోధ చేయటం, శుభవార్త వినిపించటం"తో కార్యక్రమం ఆరంభించాలన్నది దైవప్రవక్త (స) అభిమతం. కాని అబూ లహబ్ విచారధార కలవారు ఈ రకమయిన మాటల్ని విని ''ఇది కూడా ఒక కార్యక్రమమేనా?" అని పెదవి విరుస్తారు.

సామూహిక కృషి జరుగుతున్నప్పుడు, కృషి ఎక్కడి నుండి ఆరంభించాలి? అన్న ప్రశ్న నిత్యం ఎదురవుతుంది. ఇస్లామ్ పునరుద్ధరణా కార్యంలో కూడా ఇదే ప్రశ్న ఎదురవుతుంది. ఈ సందర్భంగా 'మూలాన్ని' గట్టిగా పట్టుకోవలసిన ఆవశ్యకత ఉంది. మూలాన్ని పట్టుకుంటే ఇతరత్రా అంశాలన్నీ వాటంతటవే చేజిక్కుతాయి. మీరు ఏ మహత్కార్యం సాధించాలన్నా దాని ఆరంభస్థానం సందేశ ప్రదానం (దావత్) అని ఖుర్ఆన్‌లో ఇస్లామ్ అనుయాయులకు చాలా స్పష్టంగా చెప్పటం జరిగింది (వస్త్రం కప్పుకుని పడుకున్నవాడా! లే, లేచి హెచ్చరించు). దీని ప్రకారమే దైవప్రవక్త (స) తన జీవిత కాలంలో పనిచేశారు (నీవు హితబోధ చేసేవాడివి మాత్రమే. నీవు వారిపై కావలివాడవు కావు – అల్ గాషియహ్). ఇస్లామ్ చరిత్రలో ఎక్కడెక్కడ ఈ

విధానాన్ని అవలంబించినా, ఇస్లామ్ అనుయాయులకు శాశ్వత విజయం చేకూరింది. ఎక్కడ ఈ విధానానికి విరుద్ధంగా వ్యవహరించినా ఘోర పరాజయాన్ని ఎదుర్కొనవలసి వచ్చింది.

తరువాతి కాలంలో ఇస్లామ్ వ్యాప్తికి సంబంధించిన ఉదాహరణలను మూడు పెద్ద భాగాలుగా విభజించవచ్చు –

1. సందేశమార్గం నుంచి (ఉదాహరణకు ఈజిప్టు)
2. రాజకీయ పంథా నుంచి (భారత ఉపఖండం)
3. భౌతిక ప్రగతిబాట నుంచి (స్పెయిన్)

సందేశ మార్గం గుండా ఇస్లామ్ ఏ ఏ ప్రదేశాలలో ప్రవేశించిందో అక్కడల్లా ఇస్లామ్ ప్రాబల్యం స్థిరపడిపోయింది. అక్కడి జాతుల కేవలం విశ్వాసాలు, ఆచార సంప్రదాయాలు మాత్రమే మారలేదు, వారి భాష, సంస్కృతి, వారి సామాజిక సంస్థలు అన్నీ ఇస్లామ్ రంగులో రంగరించబడ్డాయి. సర్ ఆర్థర్ కీత్ (1866 – 1955) ఈజిప్టు చరిత్రను అధ్యయనం చేస్తూ ఇలా వ్రాశాడు :

> "ఈజిప్టు తరువాత చరిత్రలో బాజెంటైన్ ప్రభుత్వం అంతమై అరబ్బు ప్రభుత్వం (639 – 41) స్థాపితమయింది. అప్పుడు 15 వేలకన్నా తక్కువ సంఖ్యలో ఉన్న అరబ్బు సైనికులు మిలియన్లలో ఉన్న ఈజిప్షియన్ జనాభాపై విజయం సాధించారు. ఈజిప్షియన్లపై అరబ్బుల విజయం ఖడ్గం ద్వారా కాకుండా ఖుర్ఆన్ ద్వారా చేకూరింది. ఈజిప్షియన్లు ఖుర్ఆన్ చదవటం నేర్చుకున్నప్పుడు ఒక కొత్త భాషలో మాట్లాడటం కూడా నేర్చుకున్నారు. అంటే అరబీ భాషలో. ఖుర్ఆన్ ఈజిప్షియన్లను అరబీ మాట్లాడేవారుగా చేసింది – *(Sir Arthur Keith, A New Theory of Human Evolution, London, Watts & Co. 1950, p.303)*

ఇదే మాటను మూస్యూలు మూన్ ఈ విధంగా వ్రాశాడు : "నైలు లోయలో ఈరానీయులు, గ్రీకులు, రోమనులు కూడా రాజ్యమేలారు. కాని వారు అక్కడ ప్రాచీన ఫిరౌనీ సంస్కృతికి బదులు తమ సంస్కృతీ నాగరికతను ప్రవేశపెట్టలేక పోయారు. కాని అరబ్బులు ఈజిప్టును అరేబియాగా, ముస్లింగా మార్చివేశారు." ఇతర జాతుల వద్ద కేవలం ఖడ్గబలం ఉండేది. అందువల్ల వారు సైనిక ప్రాబల్యానికి మించి ప్రభావం వేయలేకపోయాయి. దీనికి ప్రతిగా అరబ్బుల వద్ద ఖుర్ఆన్ బలం

ఉండేది. ఈ శక్తి ఈజిప్షియన్ల మనసును జయించింది. కడకు వారి మతం, వారి సంస్కృతి, వారి భాష – అన్నిటినీ మార్చేసింది.

ముహమ్మద్ బిన్ ఖాసిమ్ క్రీ.శ. 712 లో ప్రస్తుత పాకిస్తాన్ భూభాగంలో అడుగుపెట్టాడు. అయితే చరిత్రకారుల దృష్టిలో భారత ఉపఖండంలో ముస్లిం యుగానికి నాంది పలికినవాడు షిహాబుద్దీన్ ముహమ్మద్ ఘోరీ. అతను 1175లో ముల్తాన్‌ను జయించాడు. క్రీ.శ. 1192 నాటికి ఉత్తర భారతదేశాన్నంతా తన స్వాధీనంలోకి తీసేసుకున్నాడు. ఆ తరువాత మొగల్ ప్రభుత్వం (1857) ముగిసేవరకూ సుదీర్ఘకాలం పాటు ముస్లింలు ఈ దేశంలో కరవాలం ద్వారా ప్రాబల్యం వహించే ప్రయత్నం చేస్తూ వచ్చారు. అయితే విప్లవం వచ్చినప్పుడు వారి వైభవ భవనం ఒక్కసారిగా నేలమట్టం అయిపోయింది.

స్పెయిన్ చరిత్ర ఇంతకన్నా బాధాకరమైనది. అక్కడ ముస్లింల పరిపాలన ఏడు వందల సంవత్సరాల (711 – 1492) వరకూ విస్తరించి ఉండేది. ముస్లింలు అక్కడ భౌతిక ప్రగతిలో అనితర సాధ్యమైన పాత్ర పోషించారు. ఈనాటి వరకూ మానవ చరిత్రలో అలాంటి దృష్టాంతం లభించదు. ఆఖరికి ముస్లింలను ఓడించి, వారికి స్పెయిన్ నుండి వెళ్ళగొట్టిన క్రైస్తవులు సయితం భౌతిక ప్రగతిలో ముస్లింలకన్నా ఎంతో వెనుకబడ్డారు. ముస్లింలు ఆ కాలంలో అంతరిక్షంపై అపూర్వమైన పరిశోధనలు చేసి, రాజ్యంలో ఎల్లెడలా నక్షత్రశాలలు నిర్మించారు. అష్బేరియా ప్లానిటోరియం గురించి డ్రీపర్ (1811 – 1182) ఇలా వ్రాశాడు : స్పెయిన్ నుండి ముస్లింలు తీసివేయబడిన తరువాత ఆ నక్షత్రశాలలు చర్చీ తరఫున గంట మ్రోగించే గృహాలుగా మార్చివేయబడ్డాయి. ఎందుకంటే స్పెయిన్ పౌరులకు ఆ నక్షత్రశాలలను ఉపయోగించుకోవటమే తెలీదు. ఇంతటి భౌతిక ప్రగతి సాధించినప్పటికీ స్పెయిన్‌లో ముస్లింల ఉనికి తుడిచిపెట్టుకుపోయింది. కొన్ని అవశేషాలు, పురావస్తు చిహ్నాలు తప్ప ఏమీ మిగల్లేదు.

ఈ చారిత్రక అనుభవం చాటిచెప్పేదేమిటంటే, ఇస్లామ్ యొక్క ఈ సూత్రం ఎంతో వివేచనతో కూడుకున్నది – 'కృషి'ని ఎక్కడి నుండి ఆరంభించాలి? ధర్మపరిచయ కార్యానికి ఇస్లామ్ ఆ స్థానం ఇచ్చి, ఏ మూలాన్ని పట్టుకుంటే సఫలీకృతం కాగలరో చెప్పింది. ఇది ఎటువంటి అస్త్రమంటే శత్రువును సయితం లొంగదీసుకుంటుంది. ఇది ఎటువంటి 'శక్తి' అంటే దీనిని సముద్రాలు, పర్వతాలు కూడా అడ్డుకోలేవు. ఆయుధాలు కూడా ఆపలేవు. నేటి ఆధునిక యుగంలో ఉద్భవించిన ఇస్లామీయ

ఉద్యమాలను మనం ఈ దృష్టికోణంతో చూస్తే, వాటిలో ఏ ఒక్కటీ ఈ ప్రమాణ నికషంపై నిగ్గుతేలదన్న సంగతి అర్థమవుతుంది. ఈ ఇస్లామీయ ఉద్యమాలు రాజకీయ ఉద్యమాలే గాని ఇస్లామీయ మైనవి కావు. దాదాపు ఉద్యమాలన్నీ రాజకీయ సమస్యలను తమ పోరాటానికి ప్రాతిపదికలుగా చేసుకున్నాయి. కాగా, సందేశ ప్రధానమైన ఉద్యమం అన్నప్పుడు అవి పరలోక సందేశాన్ని తమ కృషికి పునాదిగా చేసుకోవాల్సింది. ప్రయాణం ఆరంభంలోనే సరైన దిశలో లేనప్పుడు అది గమ్యాన్ని ఎలా చేరుకుంటుంది? ఈ రకమయిన ఉద్యమం వల్ల జరిగిన మరో నష్టం ఏమిటంటే, దీనిద్వారా ఇస్లామ్‌కు ప్రభావితులైన వారిలో, సాధారణ ప్రాపంచిక ఉద్యమాల్లాంటి స్వభావమే పొడసూపింది. అసలు నిజమైన ఇస్లామ్ ఏమిటంటే మనిషిలో పరలోక ప్రధానమైన గుణం జనించాలి. ఫలితం సుస్పష్టమే – ఈ ఉద్యమాల ద్వారా సామూహిక స్థాయిలో గానీ, వ్యక్తిగత స్థాయిలోగాని ఇస్లామ్ నిజరూపంలో ప్రస్ఫుటం కాలేకపోయింది.

## పంథా

రెండవది ఆలోచనా విధానానికి సంబంధించిన సమస్య. కొన్ని ప్రత్యేక కారణాల దృష్ట్యా ప్రతి వ్యక్తీ ప్రతి జాతీ తనదైన ఆలోచనా చట్రంలో బిగుసుకుపోవడం జరుగుతుంది. అతడు ఆ ఆలోచనాపరిధిలోనే ఉండి ఆలోచిస్తాడు. దాని ప్రకారమే ఏదేని వస్తువును సరైనదో కాదో నిర్ధారిస్తాడు. తన మనోమస్తిష్కాలలో తిష్టవేసివున్నది యథార్థం కాదనే విషయాన్ని అతడు తరచూ మరచిపోతుంటాడు. అసలు యథార్థం దేవుని జ్ఞానపరిధిలో ఉన్నదేనని, దానిని దేవుడు తన గ్రంథంలో విశదపరచాడన్న సంగతిని అతడు గ్రహించడు –

> ఇలా చెప్పు "ప్రతి ఒక్కడూ తన పద్ధతి ప్రకారం ఆచరిస్తూ పోతున్నాడు. మరయితే ఎవడు ఎక్కువగా సరైన మార్గంలో ఉన్నాడనేది నీ ప్రభువుకే బాగా తెలుసు." *(బనీ ఇస్రాయీల్ : 84)*

అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స)కు అరేబియాలో ఎదురైన "ఆలోచనా చట్రం" (షాకిలా) యూదుల మనస్తత్వం. దైవప్రవక్తలు బనీ ఇస్రాయీల్‌లో ప్రభవించటాన్ని యూదులు చూస్తూ వచ్చారు. అందువల్ల దైవదౌత్యం అనేది ఇస్రాయీలీ వంశీయుల సొత్తు అన్న విషయం వారి మస్తిష్కంలో నాటుకుపోయింది. అంతిమ దైవప్రవక్త (స) ఇబ్రాహీమ్ సంతతిలోని ఇస్మాయీలీ శాఖలో జన్మించి

నప్పుడు, వారి ఆలోచనా చట్రం ప్రకారం ఈ విషయం వారికి అనూహ్యం అయింది. అందుకే వారు 'ఇస్మాయీలీ ప్రవక్త'ను నమ్మ నిరాకరించారు. దైవదౌత్యం ఏదేని ఒక వంశం లేక గోత్రం మోనోపలి కాదన్న పరమ రహస్యాన్ని వారు అర్థం చేసుకోలేకపోయారు. ఇది దైవప్రసాదితమనీ, తాను కోరిన వారికి ఆయన దానిని ప్రసాదిస్తాడని వారు తెలుసుకోలేకపోయారు.

> "ఏమిటి, అల్లాహ్ తన అనుగ్రహం నుండి జనులకు (బనీ ఇస్మాయీల్‌కు) ప్రసాదించిన దానిపై వారు ఈర్ష్య చెందుతున్నారా? అలా అనుకుంటే మేము ఇబ్రాహీమ్ కుటుంబీకులకు గ్రంథాన్నీ, వివేకాన్నీ వొసగాము. మహా సామ్రాజ్యాన్ని కూడా ప్రసాదించాము."
> *(అన్ నిసా : 54)*

వారు ఈ విధంగా అనేవారు :

> "అగ్ని హరించి వేసేటటువంటి బలి (ఖుర్బానీ)ని మా ముందు సమర్పించేవరకూ మేము ఏ ప్రవక్తనూ నమ్మరాదని అల్లాహ్ మమ్మల్ని ఆదేశించాడు." *(ఆలి ఇమ్రాన్ : 183)*

యూదుల మస్తిష్కంలో ఉన్న ఈ ఆలోచనను పటాపంచలు చేసే ప్రయత్నం చేయటం జరిగింది. దివ్య ఖుర్‌ఆన్‌లోని ఆరంభ సూరాలలో ఆ విషయం వివరంగా ఉంది. ఇస్లామ్ ప్రవక్త నిరంతర కృషితో ప్రజలు ముందుగా ఏర్పరచుకున్న భావాలు, భావనలను తప్పయినవిగా రుజువు చేశారు. మక్కా విజయం నాడు (హిజ్రీ 8వ సంవత్సరం) కాబా గృహంలో ప్రతిష్ఠించబడిన అన్ని అరబ్బు తెగల విగ్రహాలు ప్రజల ముందే విరగ్గొట్టబడ్డాయి. తమ విగ్రహాలను అవమానపరచిన ముహమ్మద్ (స)పై దేవతల తరఫున దెబ్బ పడుతుందని వారు తలపోశారు. కాని వారి ఊహ తప్పు అని తేలిపోయింది. దాదాపు 400 విగ్రహాలు విరగ్గొట్టబడ్డాయి. కాని ఆకాశం బద్దలవటంగానీ, భూమి ప్రకంపించటం గానీ జరగలేదు. అప్పుడు ప్రజలకు అర్థమైపోయింది, ఈ విగ్రహారాధనలో యథార్థం లేదని. దాంతో ప్రజలు గుంపులు గుంపులుగా వచ్చి ఇస్లామ్‌లో చేరారు (నస్ర్).

ఈ విధంగా మానవజాతి చరిత్రలో ఓ నవయుగం ప్రారంభమయింది. అంతకుముందు షిర్క్‌తో కూడుకున్న ప్రపంచ ఆలోచనా సరళి తౌహీద్ భావజాలం క్రిందికి వచ్చేసింది. మనుషుల దాస్యం అంతమై దైవదాస్యపు యుగం ఆరంభమైంది.

అంతకు మునుపు జగతిలో కనిపించేవన్నీ దేవతలుగా భావించబడేవి. అవన్నీ ఒకే దేవునిచే సృష్టించబడిన సృష్టితాలుగా ఖరారయ్యాయి.

ఈ యుగం ఇస్లామ్ ఆరంభకాలం నుండి ఐరోపాలో సాంస్కృతిక పునరుజ్జీవనం వరకు – పూర్తిగా వెయ్యేళ్ళ వరకు – భాసిల్లింది. ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ (682 – 730) మొదలుకుని షేఖ్ అహ్మద్ సర్‌హందీ (1564 – 1625) వరకు ఉమ్మత్‌లో ప్రభవించిన యుగపురుషులంతా ఈ యుగంలోని వారే. వారి కాలంలోని ప్రజలలో మార్గవిహీనత ఉండేది గాని తిరుగుబాటు ధోరణులు లేవు. అందువల్ల ఈ యుగపురుషుల ప్రయత్నమంతా ఉపదేశం వరకే పరిమితం అయింది. వారు ప్రజలను ఇస్లామ్ వైపునకు "మరలండి" అని పిలుపు ఇచ్చినప్పుడు, వారు తమ సందేహాలు, సంశయాల నుండి బయటపడ్డారు.

ఒక హదీసులో ఇలా ఉంది :

> మహనీయ అబూ హురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ఇలా ప్రవచించారు : "జనులు ప్రశ్నలు వేస్తూనే ఉంటారు. ఆఖరికి, 'దేవుడు సృష్టితాలను సృష్టించాడు. మరైతే దైవాన్ని ఎవరు సృష్టించారు?' అని అంటారు. ఎవరిలోనయినా ఈ రకమయిన సందేహాలు జనిస్తే 'నేను అల్లాహ్‌ను విశ్వసించాను' అని పలకాలి?" *(సహీహ్ ముస్లిం – కితాబుల్ ఈమాన్)*

ఇది రానున్న కాలానికి సంబంధించిన భవిష్యవాణి. మార్గవిహీనత ఏ మేరకు చేరుకుందంటే ప్రజలు దైవానికి భాగస్వామ్యాన్ని కల్పించటం మాత్రమేగాక అసలు దైవాన్నే తిరస్కరించే వరకూ వెళతారు. అలాంటి సమయంలో విశ్వాసుల పనేమిటంటే వారు సృష్టికర్త పట్ల విశ్వాసాన్ని శాస్త్రీయ పద్ధతిలో బోధపరచేందుకు కృషిచేయాలి. నాస్తికత్వం సైద్ధాంతిక పునాదుల్ని పెకలించటానికి శాయశక్తులా యత్నించాలి. గతకాలంలో బహుదైవ భావన (షిర్క్) పునాదుల్ని పెకలించటానికి ఎలా ప్రయత్నించటం జరిగిందో అలాగే ప్రస్తుతం నాస్తికవాదాన్ని కూకటివ్రేళ్ళతో పెకలించాలి.

## వినూత్న విషయం

దేన్నయితే మనం "ఇస్లామ్ వినూత్న విషయం" అని అంటున్నామో, దాని ఆరంభం 5 శతాబ్దుల క్రితమే అయింది. అప్పట్లో – ఒకవైపున పోర్చుగల్‌కు చెందిన నావికుడు వాస్కోడిగామా (1460 – 1534) ప్రాక్ పశ్చిమాల మధ్య సముద్ర

మార్గాన్ని కనుగొన్నాడు. మరోవైపున ఇటలీకి చెందిన క్రిస్టఫర్ కొలంబస్ (1446 – 1506) అట్లాంటిక్‌ను దాటి ప్రాచీన జగతిని – ఆధునిక ప్రపంచాన్ని అనుసంధానం చేశాడు. ఈ పరిశోధనల తర్వాత సముద్రయానం కొత్త యుగంలోకి ప్రవేశించింది.

15వ శతాబ్ది వరకు యూరప్ నుండి భారతదేశానికి వచ్చేందుకు రెండు మార్గాలుండేవి. ఒకటి : నేలమార్గం. రెండవది : సిరియా, ఈజిప్టు దేశాల మీదుగా సముద్రమార్గం. ఇవి రెండూ అరబ్బుల హస్తగతమై ఉండేవి. ఆ కాలంలో అరబ్బు వర్తకులు దక్షిణభారత దేశపు సముద్రతీర ప్రాంతాల్లో ముమ్మరంగా రాకపోకలు సాగించేవారు. వారి వర్తకం ద్వారా ఆ ప్రాంతంలో ఇస్లామ్ వేగంగా వ్యాప్తిచెందింది. మలబార్‌లో ముస్లింల జనసంఖ్య ఎంతగా పెరిగిపోయిందంటే, అక్కడి హిందూ రాజు తరఫున వారి వ్యవహారాలను తీర్పు చేయడానికి ఒక ముస్లిం న్యాయాధిపతి నియమించబడ్డాడు. అతన్ని 'హునర్‌మన్' గా వ్యవహరించేవారు. అరబ్బు వర్తకులు పర్షియన్ జలసంధిలోని ఓడరేవుల మీదుగా సింధ్ ప్రాంతానికి వచ్చేవారు. అక్కడి నుండి సముద్ర తీరం వెంబడి కోకిన్, గుజరాత్‌లను దాటుకుంటూ మద్రాసుకు చేరుకునేవారు. మరి అక్కడి నుండి లంగరును ఎత్తి తూర్పు బెంగాల్, అస్సాంలను దాటి చైనా వరకు వెళ్ళేవారు. దారిలో మాల్దీవ్, సిలోన్, జావా, సుమిత్రా తదితర దీవులకు కూడా వెళ్ళేవారు. వీరి ఈ వాణిజ్య మజిలీలు ఇస్లామ్ పరిచయ కేంద్రాలుగా కూడా ఉండేవి.

కాని 15వ శతాబ్ది ముగిసేసరికి ఈ ప్రయత్నాలన్నీ ముగిసాయి. 1498లో వాస్కోడిగామా కేప్ మార్గం గుండా భారతదేశంలో దక్షిణ కోస్తా (కాలికట్)లో అడుగుపెట్టాడు. అల్ బూఖర్క్ 1511లో మల్కాపూర్‌ను వశపరచుకొని హిందూ మహా సముద్రంలో పోర్చుగీసుల సముద్ర ఆధిపత్యాన్ని స్థాపించాడు. గోవా పోర్చుగీసుల స్వాధీనంలోకి వచ్చేసింది. అక్బర్ (1543 – 1605) కాలం వరకు హిందూ మహాసముద్రంపై పోర్చుగీసులు ఎంతగా పట్టు బిగించారంటే భారతదేశం నుండి – సముద్రమార్గం ద్వారా – హజ్జ్ నిమిత్తం మక్కా వెళ్ళే యాత్రీకులను సయితం దోచుకునేవారు. దోచుకోబడిన వారిలో రాజవంశీయులు కూడా ఉండేవారు. ఒక చరిత్రకారుని మాటల్లో చెప్పాలంటే "భూభాగంపై అక్బర్ ది గ్రేట్ పతాకం రెపరెపలాడినా, సముద్రభాగంపై అధిపతులు మాత్రం పోర్చుగీసువారే."

పోర్చుగీసులు భారత సముద్ర భాగాన్ని ఆక్రమించుకుని అరబ్బుల నుండి భారత వాణిజ్యాన్ని లాక్కున్నారు. అరబ్బులు సముద్రమార్గం గుండా భారతదేశానికి

రావటం గగనమై పోయింది. దక్షిణ భారతంలో అరబ్బుల వాణిజ్య సంబంధం తెగిపోయిన తరువాత, ఆ ప్రాంతంలో ఇస్లామ్ పరిచయ కార్యం ఆగిపోయింది. ఒక చరిత్ర సృష్టించబడుతూ – మధ్యలోనే – ఆగిపోయింది. వాస్కోడిగామా మరణించిన 40 ఏళ్ళ తర్వాత షేఖ్ అహ్మద్ సర్‌హిందీ (1564 – 1625) జన్మించారు. పోర్చుగీసువారు భారతదేశ సముద్రతీర ప్రాంతాలపై పూర్తిగా పట్టుబిగించి పబ్బం గడుపుకునే ప్రయత్నాల్లో ఉన్న కాలమది. ఢిల్లీలో అధికార పీఠాన్ని అధిరోహించిన చక్రవర్తులు వారి ముందు నిస్సహాయులుగా ఉండిపోయే రోజులు దగ్గరవుతున్నాయి. కాని అహ్మద్ సర్‌హిందీ గారికి ఇదేమీ తెలీదు. ఆయన అక్బర్ దర్బారులో పుట్టి పెరుగుతున్న ఉపద్రవాలను చూసి, వాటిని సంస్కరించే ప్రయత్నంలో ఉండిపోయారు. కాని పోర్చుగీసుల ద్వారా పొంచివున్న ఉపద్రవాలను ఆయన పసిగట్టలేకపోయారు. పరిణామాల రీత్యా ఈ ఉపద్రవాలు చాలా భయంకరమైనవి. నౌకాదళం ప్రాముఖ్యతను గ్రహించిన మొట్టమొదటి వ్యక్తి టిప్పు సుల్తాన్ తండ్రి హైదర్ అలీ (1722 – 1782). అతను మాల్దీవ్ దీవిలో నౌకలను నిర్మించే కర్మాగారాన్ని నెలకొల్పే ప్రయత్నం కూడా చేశాడు. కాని అప్పటికే సమయం మించిపోయింది. అందువల్ల అతను ఆ ప్రయత్నంలో కృతకృత్యుడు కాలేకపోయాడు.

ఆధునిక యుగంలో శక్తి, ప్రాబల్యంలో కీలక పాత్ర పోషించిన వస్తువు 'యంత్రం'. యాంత్రిక విప్లవం 'ఆవిరి'ని కనుగొనడంతో మొదలయింది. ఆవిరితో నడిచే యంత్రం ఆధునిక పారిశ్రామికీకరణకు నాంది పలికింది. అంతకు ముందు మానవుడు తన శారీరక శక్తితో పని చేసేవాడు. లేదా పశువుల చేత పని చేయించుకునే వాడు లేదా నీటిని, గాలిని ఉపయోగించుకునేవాడు. కాని ఇప్పుడు ఒక యంత్రం వేలాది గుర్రాలు చేసే పనిని చేయసాగింది. అది కర్మాగారాలకు శక్తిని సమకూర్చింది. అది నేలపైనా, నీటిలోనూ మానవుని వస్తుసామగ్రిని వేగంగా తరలించసాగింది. ఈ యాంత్రిక శక్తే పాశ్చాత్యులకు కొండంత బలం ఇచ్చింది. తద్వారా వారు సాంప్రదాయిక జగతిని ఓడించి దానిపై తమ అధికారాన్ని సుస్థిరం చేసుకున్నారు.

ఆధునిక యుగంలో సంభవించిన మరో సంఘటన, ఇస్లామీయ దృక్పథం ప్రకారం ఎంతో ప్రాముఖ్యం కల సంఘటన ముద్రణాలయాన్ని (ప్రెస్‌ను) కనుగొనటం. మొదటి వ్యక్తి కొయ్య ద్వారా ప్రింటింగ్ ప్రెస్‌ని నిర్మించటంలో సఫలీకృతు

డయ్యాడని అనబడుతోంది. అతనే జర్మనీకి చెందిన గోటన్ బర్గ్ (1398 – 1468). లండన్‌కు చెందిన విలియమ్ నిక్సన్ మొట్టమొదటిసారి ఉక్కు ద్వారా నిర్మించబడిన ప్రింటింగ్ ప్రెస్‌ను సమర్పించాడు. ఇది 1790 నాటి మాట. ఆ కాలంలో ముహమ్మద్ బిన్ అబ్దుల్ వహాబ్ నజ్దీ (1703 – 1791) జీవించి ఉన్నారు. ఆయన ధర్మంలో కొంగ్రొత్త పోకడల (బిద్అత్)కు, దురాచారాలకు వ్యతిరేకంగా ఉద్యమించి ఎంత గొప్ప విజయం సాధించారంటే, నజ్ద్‌కు చెందిన ఒక పరిపాలకుడు (ముహమ్మద్ బిన్ సఊద్) సయితం ఆయన సిద్ధాంతాన్ని శిరసావహించాడు. స్టీమ్ ఇంజన్ ద్వారా నడిచే ప్రింటింగ్ ప్రెస్‌లో పత్రికను ముద్రించిన మొట్టమొదటి పత్రిక 'లండన్ టైమ్స్'. 1814 నవంబర్ 29వ తేదీన ఆ పత్రిక వెలవడింది. ఆ సమయంలో ప్రముఖ ముస్లిం నాయకులు ఎందరో ఉన్నారు. కాని ప్రపంచంలో ప్రింటింగ్ ప్రెస్ ఒక కొత్తగా శక్తిగా ఆవిర్భవించిందనీ, అది అతి త్వరలోనే యావత్ప్రపంచవాసులను మానసికంగా ప్రభావితం చేయబోతోందని ఏ ఒక్క ముస్లిం నాయకుడు కూడా పసిగట్టలేకపోయాడు. ఈజిప్టులో ప్రింటింగ్ ప్రెస్‌కు నాందిపలికిన మొదటి వ్యక్తి నెపోలియన్ (1769 – 1821). అక్కడి నుండి క్రమేణా ఈ టెక్నాలజీ అరబ్బు దేశాలకు చేరింది.

ఇస్లామీయ దృష్టికోణం నుంచి చూసినప్పుడు ఆధునిక యుగంలో అత్యంత ప్రాముఖ్యత గల అంశం 'ఆధునిక సైన్సు.' ఈ సైన్సు న్యూటన్ (1642 – 1729)తో పుంజుకుంది. భారతదేశంలో షాహ్ వలీయుల్లాహ్ దహెల్వీ (1703 – 1762) జన్మించేనాటికి న్యూటన్ బ్రతికే ఉన్నాడు. కాని ఇస్లామ్ ప్రత్యర్థి శక్తులు విజ్ఞానంలో సాంప్రదాయిక చట్రాన్ని బద్దలుగొట్టి ఓ వినూత్న ప్రక్రియకు శ్రీకారం చుడుతూ ఉండగా షాహ్ వలీయుల్లాహ్ లాంటి గొప్ప మేధావులు భవిష్యత్కాలంలో వైజ్ఞానికంగా సంభవించనున్న విప్లవాన్ని బేరీజు వేయలేకపోయారు. తత్ఫలితంగా ముస్లిం జగతికి తీరని నష్టం వాటిల్లింది.

ఆధునిక యుగంలో మిల్లత్ పునరుద్ధరణకై ధ్వజమెత్తిన వారికి, తమ కార్యక్షేత్రంలో అవకాశాలు మెండుగా లభించాయి. ఇండోనేషియాలో అబ్దుల్ ఖహ్హార్ ముజక్కిర్ (1902 – 1973) అధ్యక్షుడు సోయికార్నోకు ప్రగాఢ స్నేహితులు. ఆయన ఆ దేశాధ్యక్షుని సహకారంతో తన దేశాభివృద్ధికి, సుస్థిరతకి ఎన్నో కార్యక్రమాలు చేపట్టగలిగేవారు. కాని ఆయన అక్కడి రాజ్యాంగాన్ని ఇస్లామీయ రాజ్యాంగంగా చేసే అంశాన్ని తీసుకుని ప్రభుత్వంపై పోరాటం మొదలెట్టారు. కాని

ఫలితం శూన్యం. నిరాశతో, నిరసనలతో కాలం చేయటం తప్ప ఆయన వాటా క్రింద వచ్చిందేమీ లేదు.

ప్రస్తుతం ముస్లిం దేశాలన్నింటి పరిస్థితి ఇలాగే ఉంది. ఈజిప్టు, సిరియా ప్రదేశాలు కొన్ని ప్రత్యేక కారణాల దృష్ట్యా యావత్ప్రపంచంలో సైద్ధాంతికంగా నేతృత్వం వహించగల సత్తా కలిగి ఉన్నాయి. ప్రకృతి కూడా అక్కడ ఇలాంటి గొప్ప వ్యక్తుల్ని పుట్టించటంలో ఎంతో ఉదారంగా వ్యవహరించింది.

అక్కడ ప్రభవించిన ఈ గొప్ప వ్యక్తులు, అక్కడ అందుబాటులో ఉన్న ఒనరులను, అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉంటే, తమ కాలపు పరిపాలకులతో అనవసరంగా, ఘర్షణకు దిగకుండా ఉంటే, వారు ఇస్లామ్‌లో ఓ నూతన చరిత్రను సృష్టించగలిగి ఉండేవారు. అలాంటి ప్రముఖులలో కొందరు వీరు –

| | |
|---|---|
| హసనుల్ బన్నా మిస్రీ – | (1906 – 1948) |
| ముఫ్తీ ముహమ్మద్ అబ్దా మిస్రీ – | (1849 – 1905) |
| రషీద్ రజా షామీ – | (1886 – 1935) |
| అమీర్ సకీబ్ అర్సలాన్ షామీ – | (1869 – 1946) |
| సయ్యిద్ ముహమ్మద్ ఖుత్బ్ మిస్రీ – | (1906 – 1966) |

ఈ రకమయిన కొన్ని దజన్లమంది ప్రముఖులకు ఈ ప్రాంతంలో పనిచేసే అవకాశం లభించింది. వీరికి వందేళ్ళ గడువు కూడా లభించింది. వీరికి ప్రజా బాహుళ్యంలో స్వీకృతి లభించడంతో పాటు పాలకవర్గంలో కూడా చాలామంది వారిని ఆదరించేవారు ఉండేవారు. ధార్మిక సంస్కరణా కార్యక్రమాన్ని చేపట్టినట్లయితే వారికి సహకారం అందించడానికి సిద్ధంగా కూడా ఉన్నారు. ఈజిప్టు ప్రభుత్వంలో విద్యాశాఖామంత్రి ముస్తఫా రియాజ్ పాషా (1834 – 1911) విద్యారంగంలో, సంస్కరణా మైదానంలో పని చేసేందుకు జమాలుద్దీన్ అఫ్గానీకి సర్వవిధాలా తోడ్పడటానికి సిద్ధమయ్యారు. ఈజిప్టు ప్రధానమంత్రి సాద్ జగ్‌లూల్ పాషా (1860 – 1927) ముఫ్తీ ముహమ్మద్ అబ్దా వ్యక్తిత్వానికి అమితంగా ప్రభావితులై ఉన్నారు. ఈజిప్టు అధ్యక్షుడు జమాల్ అబ్దుల్ నాసిర్ (1918 – 1970) ఈజిప్టులో సయ్యద్ ఖుతుబ్‌కు విద్యాశాఖామంత్రి పదవి ఇస్తానని చెప్పారు. కాని వీరిలో ప్రతి ఒక్కరూ తమకు అందివచ్చిన అవకాశాలను కాదని అప్పటి వరకూ అందని వాటి వెనుక

బద్దారు. పరిపాలనాధికారులకు వ్యతిరేకంగా పోరుబాటను అనుసరించటమే సిసలయిన పని అని వీరు తలపోశారు. వారి చుట్టుప్రక్కల వారు చేయవలసిన పనులు చాలానే ఉండేవి – ముస్లింల నైతిక సంస్కరణ, ఆధునిక యుగం అవసరాల కనుగుణంగా ఇస్లామీయ సాహిత్యాన్ని రూపొందించటం, ముస్లిం రాజ్యాలను పారిశ్రామికంగా, వైజ్ఞానికంగా బలోపేతం చేయటం, అరబ్బు జగతిలో ఐకమత్యాన్ని పెంపొందించటం, పెట్రోల్ వంటి సహజ ఒనరుల ప్రాముఖ్యాన్ని విడమరచి చెప్పటం, వాటిని ఫలవంతంగా మలచటం మొదలగునవి. ఆఫ్రికాలోని ముస్లిమేతర తెగలలో ఇస్లామ్ పరిచయ కార్యాన్ని చేపట్టవలసిన ఆవశ్యకత కూడా ఎంతైనా ఉండేది. ఆఫ్రికాలో ముస్లిమేతర క్రైస్తవులు అల్పసంఖ్యలో ఉండి కూడా అక్కడి ముస్లింలపై పెత్తనం చెలాయించేవారు. అందువల్ల అక్కడి ముస్లిములను విద్యా విషయికంగా, ఆర్థికంగా సముద్ధరించవలసిన అవసరం ఉండింది. (కాని ఈ కార్యక్షేత్రాన్ని వారు పట్టించుకోలేదు).

వర్తమాన కాలంలో ముస్లిం సంస్కరణావాదుల ద్వారా జరిగిన మరో భావాన్వయ తప్పిదం (ఇజ్తెహాదీ గలతి) ఏమిటంటే, ముస్లింలు మెజారిటీ సంఖ్యలో ఉండి, అధికారంలో ఉన్న రాజ్యాలలో ఇస్లామీయ చట్టాలను ప్రవేశపెట్టే డిమాండుతో తమ పని మొదలెట్టాలని వారు భావించారు. వారి అంచనా తారుమారయింది. తత్ఫలితంగా వారు – క్రియాత్మకంగా – తమ తమ దేశాలలో ప్రతిపక్ష పాత్ర నిర్వహించటం తప్ప సాధించేదేమీ లేదు. వాస్తవమేమంటే ముస్లిమేతరులు అధిక సంఖ్యలో ఉన్న దేశాలలో ముస్లిం మైనారిటీలకు ఎటువంటి సమస్యలు ఎదురవుతున్నాయో, అటువంటి సమస్యల్నే ముస్లింలు మెజారిటీ సంఖ్యలో ఉన్న దేశాలు అంతర్జాతీయ పరిస్థితుల రీత్యా ఎదుర్కొంటున్నాయి. దానికి తోడు ముస్లిం రాజ్యాలలోని కీలక శాఖలలో పాశ్చాత్య తరహా విద్యనార్జించిన వారే అధికారులై కూర్చున్నారు. వారు స్వాభావికంగా ఇస్లామ్ పట్ల సానుభూతి కలవారే అయినప్పటికీ తమ దేశాల్లో ఇస్లామీయ వ్యవస్థను ప్రవేశపెట్టడానికి సిద్ధంగా లేరు. ఈజిప్టు, పాకిస్తాన్, ఇండోనేషియా దేశాలే దీనికి తార్కాణం. ఈ దేశాలలో 20వ శతాబ్ది మధ్యలో పెల్లుబికిన ఇస్లామీయ ఉద్యమాలు ప్రజాబాహుళ్యంలోనికి చొచ్చుకుపోయి, ఆదరణ పొందినప్పటికీ ఇస్లామీయ శాసనాంగాన్ని ప్రవేశపెట్టడంలో అవి సఫలీకృతం కాలేకపోయాయి. అయితే ఆ దేశాలు ముస్లిం దేశాలవటం వల్ల అక్కడ ఇస్లామీయ సందేశాన్ని చేరవేసే అవకాశాలు మాత్రం పుష్కలంగా ఉండేవి. కాని అవి కూడా

విభేదాల కారణంగా, నిరసన రాజకీయ ప్రదర్శనల మూలంగా నిర్వీర్యమైపోయాయి. రిజా బిన్ హుయూత ఉమవీ పరిపాలకుడైన సులైమాన్ బిన్ అబ్దుల్ మలిక్‌తో నెయ్యం చేసి, అతని తదనంతరం ఖిలాఫత్ బాధ్యతల్ని ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ (682 - 720)కు అప్పగించేలా ఒప్పించారు. ఖాజీ అబూ యూసుఫ్ (731 - 798) అబ్బాసీ ఖలీఫా హారూన్ రషీద్ ఆధ్వర్యంలో ప్రధాన న్యాయాధిపతి హోదాను స్వీకరించి, మారుతున్న పరిస్థితుల్లో ఇస్లామ్ ఏ విధంగా శాసనపరంగా మార్గదర్శకత్వం వహిస్తుందో చూపించారు. షేఖ్ అహ్మద్ సర్‌హిందీ (1564 - 1625) మొగల్ చక్రవర్తి జహాంగీర్‌తో కలసి, అక్బర్ కాలంలో ధార్మికంగా పొడసూపిన కొత్త పుంతలను, దురాచారాలను అరికట్టేందుకు యత్నించారు. పరిపాలకులతో సత్సంబంధాలను ఏర్పరచుకుని సంస్కరణలు తీసుకువచ్చే ఈ ప్రక్రియను అంతకు పూర్వం కూడా మహనీయులు కొనసాగించారు. ఈ కాలపు సంస్కర్తలు కూడా ఇస్లామ్ పునరుజ్జీవనం కోసం ఇదే విధానాన్ని అవలంబించి ఉంటే, ఇస్లామ్ ధర్మ సమున్నతి కార్యం విజయవంతం అయి ఉండేది.

 సంస

# మిల్లత్ నిర్మాణం

ఇస్లామీయ సందేశాన్ని చేరవేసే పని, ఒక్క సందేశదాత తప్ప జనులెవరూ అంగీకరించటానికి సిద్ధంగా లేని ప్రాంతంలో ఆరంభించినప్పుడు, అక్కడ కేవలం భయబోధ చేయటం, శుభవార్తలు వినిపించటంపైనే దృష్టిని కేంద్రీకరించాలి. అయితే ఇస్లామ్‌ను అవలంబించేవారు కూడా ఉన్న ప్రాంతంలో పనిచేస్తున్నప్పుడు సందేశదాత అవసరం మేరకు వారిని చక్కదిద్దే, సుస్థిరపరిచే పని కూడా చేయాల్సి ఉంటుంది. దైవప్రవక్త మూసా (అలైహిస్సలామ్) వృత్తాంతంలో ఇది కనిపిస్తుంది. రానున్న ఆ దినం గురించి ఫిరౌన్‌ను, ఖిబ్తీ జాతి వారిని హెచ్చరించు (తాహా – 43) అన్న ఆజ్ఞ ఒక వైపున మూసాకు అందటంతో పాటు, ముస్లింలను (బనీ ఇస్రాయీల్‌ను) ఫిరౌన్ చెర నుండి విడిపించు అన్న ఆదేశం కూడా మరోవైపున మూసా (అ)కు అందింది (తాహా – 47). బైబిల్ మాటల్లో "తన ఉమ్మత్‌ను ఆపద నుండి విముక్తి కల్పించటం (అపోస్తులుల కార్యములు 7 : 34).

'ఆధునిక యుగం' అనబడే దాని ప్రభావం అన్నిటికన్నా అధికంగా ముస్లింలపై పడింది. ఎందుకంటే నూతన శక్తుల ఆధారంగా పాశ్చాత్య జాతులు ప్రపంచంపై ఆధిపత్యం వహించినప్పుడు, ముస్లిం జగతిలో కూడా నవ నిర్మాణానికి సంబంధించిన ఉద్యమాలు భారీ ఎత్తున పెల్లుబకాల్సింది. రెండువందల ఏండ్లు గడిచినా ముస్లింలు, తాము కోల్పోయిన వైభవాన్ని తిరిగి పొందలేకపోయారు. కారణమేమంటే, ముస్లింలు అసలు సమస్యను అర్థం చేసుకోలేకపోయారు. స్థూల దృష్టితోనో, క్షణికావేశంతోనో తమ భవిష్యత్తును వెతుకుతూ ఉండిపోయారు. రష్యాలో కమ్యూనిస్టు విప్లవం (1917), టర్కీలో జాతీయ విప్లవం (1922) – రెండూ దాదాపు ఒకే కాలంలో వచ్చాయి. పైగా రష్యా విప్లవ మూల కారకుడు అయిన వ్లాదిమీర్ లెనిన్ (1870 – 1924) కన్నా టర్కీ విప్లవ ధ్వజవాహకుడైన ముస్తఫా కమాల్ అతా తుర్క్ (1881 – 1938)కు 14 ఏళ్లు ఎక్కువగా జీవించే, పనిచేసే అవకాశం లభించింది. కాని పరిస్థితి ఎలా ఉందంటే నేడు రష్యా అంతరిక్షంలో రాకెట్లు ప్రయోగిస్తుంటే, టర్కీ ఇప్పటికీ నేలపైన కూడా నిలదొక్కులేకపోయింది.

ఈ వ్యత్యాసానికి కారణం కేవలం కాకతాళీయం కాదు. దీని వెనుక బలమైన చారిత్రక కారణాలున్నాయి. కమాల్ అతాతుర్క్‌కు టర్కీలో అధికారం ప్రాప్తమైనప్పుడు, అతడు ప్రగతి రహస్యం పాశ్చాత్య నాగరికతను అనుకరించటంలోనే ఉందని భావించాడు. అతను "ప్రాచీన మతరాజ్యానికి" బదులు టర్కీని సెక్యులర్ స్టేట్‌గా చేశాడు. షరీఅత్ శాసనాలకు స్వస్తి పలికి స్విట్జర్‌లాండ్ సివిల్ చట్టాలను, ఇటలీ క్రిమినల్ చట్టాలను, జర్మనీ వాణిజ్య చట్టాలను టర్కీలో ప్రవేశపెట్టాడు. ధార్మిక విద్యనార్జించటాన్ని నిషేధించాడు. పరదాను చట్టవిరుద్ధంగా ఖరారు చేశాడు. కో ఎడ్యుకేషన్ ప్రవేశపెట్టబడింది. హజ్జ్ కొరకు మక్కా వెళ్ళటాన్ని నిషేధించాడు. టర్కీ భాష అరబీ అక్షరాల లిపిలో ఉండేది. దాని స్థానంలో నిర్దాక్షిణ్యంగా లాటిన్ అక్షరాలను తీసుకువచ్చాడు. అరబీలో అజాన్ ఇవ్వటం నిషేధించబడింది. టర్కీ జాతీయ వస్త్ర ధారణ మార్చివేయబడింది. పాశ్చాత్య తరహా టోపీ (హ్యాట్) ధరించటం చట్టపరంగా తప్పనిసరి చేయబడింది. అంతేకాదు, టర్కీయులకు హ్యాట్ తొడిగించే ప్రక్రియ ఒక యుద్ధ సన్నాహంలా సాగింది. ఆనవాయితీగా వచ్చే టోపీ (Cap) బదులు పాశ్చాత్య తరహా హ్యాట్ (HAT) ను తొడుక్కోవటానికి నిరాకరించిన ఎంతోమంది ఉరి తీయబడ్డారు. ప్రజలు అరెస్టు చేయబడేవారు. పాశ్చాత్య టోపీ (హ్యాట్)ని పరిహసించారన్న సాకుపై తుపాకీ గుళ్ళకు ఆహుతి చేసేవారు. ఎట్టకేలకు తీవ్రమయిన ప్రతిఘటన తరువాత హ్యాట్ తొడిగించే ఉద్యమం విజయవంతం అయినప్పుడు ముస్తఫా కమాల్ తన విజయాన్ని చాటి చెప్పడానికి, మక్కాలో జరిగిన 'మోతమర్ ఇస్లామీ సదస్సు' (1927)లో పాల్గొనేందుకు ఒక పార్లమెంట్ మెంబర్ అదీబ్ సర్వత్‌ను తన ప్రతినిధిగా పంపాడు. హ్యాట్ తొడిగి ఆ సదస్సులో పాల్గొన్న ఏకైక సభ్యుడు అదీబ్ సర్వత్. ఆ కాన్ఫరెన్సులోని ఇతర సభ్యులంతా అన్యమనస్కంగానే అతనికి స్వాగతం పలికారు.

Irfan orga Margarete

Ataturk,

Michael Joseph Ltd. London, 1967, P.265

మరో వైపున లెనిన్ రష్యాలో అధికారం చేజిక్కించుకున్న తరువాత చేసిందేమిటో చూడండి – 1922లో విదేశీ భాషల అనువాదాల నిమిత్తం ఒక కమిటీని నియమించాడు. దానిపేరు 'కమినోలిట్' (Cominolit). విదేశీ భాషల్లో ఉన్న వైజ్ఞానిక, సాంకేతిక పుస్తకాలను సేకరించి, వాటిని రష్యన్ భాషలో అనువదిం

చటం ఆ కమిటీ ముఖ్య విధి. లెనిన్ ఈ పనికి ఎంత ప్రాముఖ్యం ఇచ్చాడంటే, అనుదినం ఎన్నో వ్యాపకాల్లో మునిగి ఉన్నప్పటికీ, ఈ పనిని ప్రత్యేకంగా పర్యవేక్షించే వాడు. తత్ఫలితంగా సోవియట్ యూనియన్‌లో వైజ్ఞానిక, శాస్త్రీయ గ్రంథాల పెద్ద భాండాగారం ప్రోగయింది. ఈ పని నిరాఘాటంగా కొనసాగింది. నేడు పరిస్థితి ఎలా తయారయిందంటే, సోవియట్‌కు చెందిన ఒక జర్నల్ - Referative Zhurnal -117 దేశాల 70 భాషల్లో వెలువడుతుంది. అది 10 లక్షల వైజ్ఞానిక, సాంకేతిక వ్యాసాలను సమర్పిస్తుంది. ఈ పని చేయడానికి ఆ జర్నల్‌లో లక్షమంది అనువాద నిపుణులు నియమితులయ్యారు. "ఆల్ యూనియన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ సైంటిఫిక్ అండ్ టెక్నికల్ ఇన్ఫర్‌మేషన్" ఒక్కటే 2500 మంది అనువాదకుల పర్మనెంట్ స్టాఫ్‌ని కలిగి ఉంది. వీరుగాక మరో 22 వేలమంది అనువాద నిపుణులు వేరుగా ఉన్నారు. వారు ఆ సంస్థలో పార్ట్ టైం ఉద్యోగులుగా పనిచేస్తారు. ఈనాడు సోవియట్ యూనియన్ (USSR) లో 5 వేలకన్నా ఎక్కువ వైజ్ఞానిక సంస్థలున్నాయి. వాటిలో సుమారు 10 లక్షల మంది సైన్సు వర్కర్లుగా పనిచేస్తున్నారు. ఈనాడు రష్యన్ సైన్సు ప్రాముఖ్యత ఎంతగా పెరిగిపోయిందంటే, ఆ దేశానికి చెందిన 250 వైజ్ఞానిక జర్నల్‌లను అమెరికా తెప్పించి, మొదటి నుంచి చివరివరకు – ఒక్క వాక్యం కూడా తప్పకుండా – తర్జుమా చేయిస్తుంది. వాటిని ప్రచురిస్తుంది కూడా.

మిల్లత్ నిర్మాణం, సుస్థిరత అనేది దేనిపై ఆధారపడి ఉంది? దీనికి సంబంధించిన మూడు ప్రత్యేక సూత్రాలున్నాయి –

1. జీవనాధారం (ఖియామ్) పొందటం
2. సమైక్యత
3. బల (శక్తి) సమీకరణ

1. ఖుర్ఆన్‌లో ధనాన్ని, సంపదని 'జీవనాధారం'గా పేర్కొనటం జరిగింది. "మీరు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి దేవుడు మీకు 'ఆధారం'గా చేసిన సంపదలను మానసికంగా పరిపక్వతకు చేరని వారికి అప్పగించకండి" (అన్ నిసా : 5). ఖుర్ఆన్‌లో ఇక్కడ 'ఖియామ్' అనే పదం ప్రయోగించబడింది. ఖియామ్ అంటే సహారా (Support), ఆధారం, ఆశ్రయం, నిలదొక్కుకోవడం, స్థిరపడటం అన్న అర్థాలున్నాయి. ధనం లేక అర్థబలాన్ని (ఆర్థిక విషయాల్ని) అల్లాహ్ ఈ లోకంలో మనిషికి జీవనాధారంగా చేశాడు. దీనిద్వారానే అతడు తన జీవిత అవసరాలను తీర్చుకుంటాడు. దీనిద్వారానే అతను ప్రస్తుత ప్రపంచంలో ఏదైనా ఘనకార్యం

సాధించడానికి కావలసిన ఒనరులను సమకూర్చుకోగలుగుతాడు. మహాప్రవక్త ముహమ్మద్ (స) ఒకసారి దైవాన్ని వేడుకుంటున్నప్పుడు, "దేవా! నేను దారిద్ర్యం నుండి నీ శరణు వేడుతున్నాను" అన్న వాక్యం ఆయన నోట వెలువడింది. దీని గురించి హజ్రత్ ఆయిషా (ర.అ) ఆశ్చర్యంతో ప్రశ్నించగా, "అవును, ఆయిషా! ఎందుకంటే దారిద్ర్యం మనిషిని సత్యతిరస్కారం (కుఫ్ర్) వరకూ తీసుకుపోతుంది" అని దైవప్రవక్త (స) సమాధానమిచ్చారు.

5 శతాబ్దుల క్రితం ముస్లింలు ఆర్థిక రంగంపై తిరుగులేని ఆధిపత్యం సంపాదించి ఉండేవారు. కాని ఈనాడు వారు ఆర్థికంగా సుస్థిరతకు నోచుకోకుండా పోయారు. ఎందుకంటే వారు ఆధునిక యుగపు ఆర్థిక పోకడలను అర్థం చేసుకోలేకపోయారు. అందువల్ల వారు ఈ రంగంలో తమ చోటు సంపాదించటంలో విఫలమయ్యారు. ప్రాచీన కాలంలో ఆర్థిక రంగం వ్యవసాయ ఉత్పత్తుల (ఆహార ధాన్యాలు, పండ్లు)పై ఆధారపడి ఉండేది. కాని నేడు ఆర్థిక వ్యవహారాల అర్థమే పూర్తిగా మారిపోయింది. నేడు ఆర్థికంగా నిలదొక్కుకోవటానికి అతి పెద్ద సాధనం (కారకం) పరిశ్రమలు, వాణిజ్యం. ఆఖరికి వ్యవసాయ రంగం కూడా నేడు ఒక పరిశ్రమగా రూపుదాల్చింది. నేడు అన్ని రంగాలలోనూ ఆధునిక టెక్నాలజీ చోటు చేసుకుంది. టెక్నాలజీని ఉపయోగించుకున్న వారివద్దకే నేడు ధనం కేంద్రీకృతం అవుతోంది. నేడు ముస్లింల అసలు 'మిల్లీ సమస్య' ఏమిటంటే వారు సాంప్రదాయిక వ్యవసాయాన్ని, సాంప్రదాయిక వర్తకాన్ని దాటి ముందుకు పోలేకపోయారు. తత్కారణంగా వారు ప్రపంచమంతటా ఆర్థికంగా ద్వితీయశ్రేణి జాతిగా మిగిలి పోయారు. కేవలం సహజ ఒనరుల ఆధారంగా కష్టపడకపోయినా శ్రీమంతులుగా వెలుగొందుతున్న వారికి మాత్రమే దీని నుండి మినహాయింపు ఉంది. ఉదాహరణకు : గల్ఫ్‌దేశాలు, పెట్రోలు, గ్యాస్ కారణంగా అవి నిలదొక్కుకోగలిగాయి.

ముస్లింలు గనక ఆధునిక యుగంలో మనగలగాలంటే వారు ఆర్థిక రంగంలో వచ్చిన మార్పులను అర్థం చేసుకుని ఆ రంగంలో తమకంటూ ఒక స్థానాన్ని సంపాదించుకోవటం అవశ్యం. అన్యథా వారు ఇతర జాతులచే దోపిడీకి గురవుతూ ఉంటారు. చివరకు వారు నేటి ప్రపంచంలో ఆర్థికంగా అంటరానివారై పోతారు.

ఈ మధ్యకాలంలో ముస్లిం జగతిలో మొదలైన ఉద్యమాలన్నీ దాదాపు రాజకీయ రంగాన్నే తమ లక్ష్యంగా చేసుకున్నాయి. వాస్తవానికి నేడు ఆర్థికరంగం సంతరించుకున్న ప్రాముఖ్యత, విస్తృతి ఎటువంటిదంటే అది రాజకీయ రంగాన్ని

సయితం రెండవ స్థానంలోకి నెట్టివేసింది. నేడు ఆర్థికంగా బలపడిన వాని చేతిలోనే రాజకీయ దండం ఉంది. అర్థబలం లేని వానివద్ద ఎటువంటి రాజకీయం లేదు.

ఇటీవలి కాలంలో మనం రాజకీయపరంగా హిమాలయాల వంటి వ్యక్తిత్వాలను పుట్టించాము. అయినప్పటికీ ఆ ఉన్నత వ్యక్తిత్వాల నుండి మనం ఆశించినది పొందలేకపోయాం. దీనికి కారణం ఒక్కటే – మన ఈ గొప్ప వ్యక్తులు కాలంలోని వ్యత్యాసాన్ని అర్థం చేసుకోలేకపోయారు. మాజీని దృష్టిలో ఉంచుకుని వారు తమ శక్తి సామర్థ్యాలన్నింటినీ రాజకీయాల్లో ధారపోశారు. ముస్లింల ఆర్థికాభివృద్ధికై, సుస్థిరతకై వారు నిజమైన కృషి ఏదీ చేయలేదు.

తరువాత ఈ కాలంలో ఆర్థిక వ్యవహారాలకు ఆధునిక విద్యతో గట్టి సంబంధం ఏర్పడింది. సేద్యం మొదలుకుని యంత్రం నడపటం వరకు ప్రతి పనికోసం అధునాతన విద్య అవశ్యమైపోయింది. ఇక్కడా ముస్లింలు ఆశ్చర్యకరమైన రీతిలో అలసత్వం ప్రదర్శించారు. వారు విద్యకు – విత్తుకు మధ్య గల అవినాభావ సంబంధాన్ని గ్రహించలేకపోయారు. దాదాపు ఒక శతాబ్ది కాలం వరకు వారు సాంప్రదాయిక విద్యతోనే సరిబెట్టుకున్నారు. క్షంతవ్యం కాని ఈ అలసత్వం కారణంగా వారు మరీ వెనుకబడిపోయారు. వారి ఒక తరం 'పండితులై' ఉండి కూడా ఈ కాలపు అవసరాల రీత్యా 'పామరులు'గా మిగిలిపోవాల్సి వచ్చింది.

2. మిల్లత్ నిర్మాణం, పటిష్ఠత రీత్యా కావలసిన రెండవ వస్తువు ఐకమత్యం:

"పరస్పరం గొడవపడకండి. గొడవలకు తావిచ్చారంటే మీ శ్రేణుల్లో బలహీనత పొడసూపుతుంది. మీ గాలి తుస్సుమంటుంది."

*(అల్ అన్ఫాల్ : 46)*

తెలిసిందేమిటంటే విభేదాల మూలంగా పిరికితనం చోటుచేసుకుంటుంది. గంభీరత క్షీణిస్తుంది. దీనికి భిన్నంగా మిల్లత్‌లో పరస్పరం సంఘీభావం, ఐకమత్యం ఉన్నట్లయితే ఒక వ్యక్తి తనను కోట్లాదిమంది మనుషులతో సమానంగా ఊహించుకుంటాడు. తద్వారా ప్రజల్లో ఆత్మ విశ్వాసం పెంపొందుతుంది. అన్యజాతుల వారు ఇస్లామ్‌లోని ఈ సంఘీభావాన్ని చూసి జడుసుకుంటారు.

ధర్మం (దీన్)లో ఐకమత్యానికి గల ప్రాముఖ్యత ఎంతటిదంటే, మస్జిద్‌లో ధార్మిక విషయాలపై ఒకే సమయంలో రెండు బృందాలు విడివిడిగా చర్చించటం కూడా సహించరానిదే.

> హ|జత్ అబ్దుల్లాహ్ బిన్ మస్‌ఊద్ (రజి) కూఫాలోని ఒక మస్జిద్‌లో రెండు గ్రూపులు (వేర్వేరుగా) కూర్చుని ఉండటం గమనించి, ఆయన ఆ రెండు గ్రూపులకు మధ్యన నిలబడిపోయారు. రెండింటిలో మొదట సమావేశమైన గ్రూపు ఏది? అని అడిగారు. 'మేము' అని ఒక వ్యక్తి సమాధానమివ్వగానే, ఆయన రెండవ గ్రూపును ఉద్దేశించి 'లేవండి, మీరంతా ఆ మొదటి గ్రూపులో విలీనమవండి' అని ఉద్బోధించారు. ఆ విధంగా ఆయన ఆ రెండు గ్రూపులను కలిపేశారు.
>
> *(తిబ్రానీ ఫిల్ కబీర్)*

ఐకమత్యం, సంఘీభావం యొక్క ఈ ప్రాధాన్యత కారణంగానే ప్రవక్త ప్రియసహచరులు ఇస్లామ్ ప్రవక్త (స) పరమపదించినప్పుడు, ఆయన అంత్యక్రియల కంటే ముందే ఖలీఫాను ఎన్నుకోవటంపై దృష్టిని కేంద్రీకరించారు. ఒక ఉల్లేఖనంలో ఇలా ఉంది :

> ఉబాదా బిన్ సామిత్ కథనం : దైవప్రవక్త – సల్లల్లాహు అలైహి వ సల్లమ్ – ఒకరోజు షబేఖద్ర్ ఏ రాత్రియందు ఉందో మాకు తెలియపరచడానికి ఇంటి నుండి బయలుదేరారు. ఆ సమయంలో ఇద్దరు వ్యక్తులు (అప్పు వ్యవహారంలో) పరస్పరం గొడవపడుతున్నారు. అప్పుడు ఆయన (స) ఇలా అన్నారు : "నేను బయలుదేరినది ఎందుకో తెలుసా! షబేఖద్ర్ (ఎప్పుడుందో) తెలియపరచడానికి. కాని ఫలానా, ఫలానా వ్యక్తులు దారిలో ఘర్షణపడి ఉండటం వల్ల, ఆ 'జ్ఞానం' లేపుకోబడింది." *(సంక్షిప్త ఇబ్నె కసీర్ – సం. 3, పు. 662)*

ఇబ్నె కసీర్ ఈ ఉల్లేఖనాన్ని నకలు చేసిన తరువాత ఇలా అంటారు : "ఇస్లామ్ పరస్పర ఘర్షణలను ఎంత చెడ్డ విషయంగా పరిగణిస్తుందో ఈ హదీసు ద్వారా తేటతెల్లమవుతోంది. ఆఖరికి దీని మూలంగా గొప్ప శుభాలు కూడా లేపుకోబడతాయి."

ముహమ్మద్ అనుచర సమాజం 'సురక్షిత గ్రంథం' (కితాబె మహ్‌ఫూజ్) కలిగి ఉంది. అందువల్ల ఎవరూ దానిని తుదముట్టించలేరు. ఈ భువిపై ఖుర్‌ఆన్ ఉన్నంతకాలం అది మిగిలి ఉండవలసి ఉంది. అంటే బయటి శక్తి ఏదీ, ఎప్పుడూ దానికి నష్టం చేకూర్చజాలదు. దానికి ఎప్పుడు నష్టం వాటిల్లినా లోపలి

అలసత్వం మూలంగానే వాటిల్లుతుంది. ఈ అలసత్వంలో పరస్పర విభేదాలు ప్రప్రథమమైనవి. దైవప్రవక్త (స) హజ్జ్ యాత్ర సందర్భంగా ఇలా వక్కాణించారు :

> "జాగ్రత్త! నా తదనంతరం అవిశ్వాసులై ఒకరింకొకరి తల నరుక్కోకండి. వినండి, నమాజ్ చేసేవారు తనను ఆరాధిస్తారన్న దానిపై షైతాన్ ఆశ వదులుకున్నాడు. కాని వాడు మీ మధ్య కలతలు రేపి, ఒకరిపై మరొకరిని ఉసిగొల్పుతాడు."
>
> *(ముస్నద్ హ్మద్ - అబూహురైరా)*

చరిత్ర ఆశ్చర్యకరమైన రీతిలో ఈ భవిష్యవాణి సత్యమని ధ్రువీకరించింది. 13వ శతాబ్దిలో తాతారీల వెల్లువ ఇస్లామ్ జగతి మొత్తంలో విధ్వంసాన్ని, మారణకాండను సృష్టించింది. ఇది ఎలా సాధ్యమయింది? సుల్తాన్ సలాహుద్దీన్ అయ్యూబీ (1137 - 1193) క్రైస్తవ జాతులకు గుణపాఠంతో కూడిన ఓటమి రుచి చూపించిన కాలమది! ఈ సంఘటన తరువాత ముస్లిం సేనల శక్తిసామర్థ్యాలు ప్రపంచం నలుమూలలా మార్మోగినాయి. దూరదృష్టిగల రాజకీయవేత్త ఎవరూ ఇస్లామీయ ప్రభుత్వం వైపు కన్నెత్తి చూడటానికి కూడా సాహసించేవాడు కాదు. కాని సలాహుద్దీన్ అయ్యూబీ మరణించిన ఇరవైయేళ్ళ లోపే తాతారీలు ఇస్లామీయ ప్రభుత్వంపై దాడి చేసి సర్వనాశనం సృష్టించారు. కారణం ముస్లింల మధ్య గల పరస్పర విభేదాలే.

స్పెయిన్‌లో ముస్లింల ప్రభుత్వం (711 - 1492) ముగింపునకు కారణం కూడా పరస్పర విభేదాలే. స్పెయిన్ ముస్లింలు క్రైస్తవ జాతుల చేతుల్లో పరాజయం పాలైనప్పుడు వారు వైజ్ఞానికంగా, విద్యావిషయికంగా తమ ప్రత్యర్థులకన్నా ఎన్నో రెట్లు పైచేయిగా ఉన్నారు. అయినప్పటికీ ముస్లింలు ఎందుకు ఓడిపోయారంటే, అప్పుడు క్రైస్తవులు పరస్పరం ఏకమై ఉన్నారు. సామంతులు తమ ఖిలాఫత్ కేంద్రంపై తిరుగుబాటుచేసి చిన్న చిన్న స్వతంత్ర ప్రతిపత్తిగల ప్రభుత్వాలను స్థాపించుకున్నారు. చివరకు వారిలోని ఒకడు ముస్లింలకు వ్యతిరేకంగా పోరాడే క్రైస్తవులతో చేతులు కలపటానికి కూడా సిగ్గుపడేవాడు కాదు. స్పెయిన్‌లో ముస్లింల రాజకీయ పరాధీనత 15వ శతాబ్ది చివర్లో – గర్నాతా కోటను క్రైస్తవులు వశపరచుకున్నప్పుడు – జరిగింది. అయినప్పటికీ ఆ దేశం నుండి ముస్లింలను వెలికి తీయడానికి నూరేళ్ళ సమయం పట్టింది. ఒకే శతాబ్దిలో మూడుసార్లు నరమేధం జరిగినా ముస్లింల చివరి

పయనబృందం 1605లోగా స్పెయిన్‌ను ఖాళీ చేయలేదు. ఎందుకంటే ముస్లింలు ఆ కాలంలో ఆర్థికంగా, వైజ్ఞానికంగా తిరుగులేని ఆధిపత్యం కలిగి ఉన్నారు. అందువల్లనే రాజకీయాధికారం నుంచి తొలగించినప్పటికీ ముస్లింలను స్పెయిన్ నుండి వెళ్ళగొట్టడం – ఉన్నపళంగా – సాధ్యపడలేదు.

ముహమ్మద్ బిన్ ఖాసిమ్ 712లో ముల్తాన్ మార్గం గుండా ప్రస్తుత పాకిస్తాన్ భూభాగంలో ప్రవేశించాడు. ఇది ముహమ్మద్ గజనీ, బాబర్‌ల మాదిరిగా విధ్వంసకర ప్రవేశం కాదు. ఇది కారుణ్యంతో కూడిన ప్రవేశం. ఒక చరిత్రకారుని మాటల్లో, "అతడు నౌషేర్వాన్‌కన్నా ఎక్కువ న్యాయశీలుడు, నిస్వార్థ ప్రజాసేవకుడు." అందువల్ల కేవలం కొన్నేండ్లలోనే అరేబియా సముద్రతీరం మొదలుకుని కశ్మీర్ వరకు ఇస్లామ్ వ్యాపించింది. స్థానిక ప్రజలు అతన్ని తమపాలిట దేవతగా తలపోసేవారు. అతను తన దేశానికి తిరిగి వెళ్ళిన తరువాత అతని పేరున సంతాపం పాటించారు. అతని విగ్రహం కూడా తయారుచేశారు (బలాజరీ). కాని సులైమాన్ బిన్ అబ్దుల్ మలిక్ కేవలం వ్యక్తిగత అక్కసుతో ముహమ్మద్ బిన్ ఖాసిమ్‌ను పదవి నుండి తొలగించి డెమాస్కస్‌కు తిరిగి రప్పించాడు. అక్కడ అతన్ని కారాగారంలో బంధించాడు. అదే స్థితిలో అతను మరణించాడు. కారాగారంలో ఉన్నప్పుడు అతని నోట వెలువడిన కవితల సారాంశమిది :

"జనులు నన్ను పనికి రాకుండా చేశారు. ఎటువంటి యువకుణ్ణి వారు వృథా గావించారు!? కష్టకాలంలో పనికివచ్చిన వాణ్ణి! సరిహద్దులను కాపాడినవాణ్ణి!!"

ముహమ్మద్ బిన్ ఖాసిమ్ తరువాత ఇస్లామ్ పరివ్యాప్తి ఈ ఉపఖండంలో ఒక శతాబ్ది కాలం పాటు నిలిచిపోయింది. తరువాత అది మొదలైనా రాజ్యాధికారుల ద్వారా మొదలయింది. తరువాత వచ్చిన వారిలో ముహమ్మద్ బిన్ ఖాసిమ్ మాదిరిగా ఇస్లామ్‌ను వ్యాపింపజేయాలన్న చిత్తశుద్ధి లేదు. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఇలా వ్రాశారు :

> "సువిశాలమైన అరబ్బుల సామ్రాజ్యం, అరేబియా బయట వ్యాప్తి చెందటంలో ఎలాంటి అవరోధం ఎదురుకాలేదు. అయితే భారత దేశంలో అది సింధుప్రాంతాన్ని దాటి ముందుకు పోలేకపోయింది. ... సింధు విజయం పిదప–శతాబ్దాల తరువాత–ముస్లింలు ఉత్తర భారతదేశంపై దండెత్తారు – బహుశా ఈ విరామానికి ఒక కారణం అరబ్బుల అంతర్గత సంక్షోభం కావచ్చు. ఎందుకంటే సింధుప్రాంతం

(ముహమ్మద్ బిన్ ఖాసిమ్ తరువాత) బగ్దాద్ కేంద్రశక్తితో వేరై ఒక చిన్న స్వతంత్ర ముస్లిం రాజ్యం (Small Independent Muslim State) గా ఏర్పడింది.

*- Discovery of India, P.240*

ఆ తరువాత చరిత్రలో ముస్లింల వైఫల్యాలన్నింటి వెనుక ఈ రకమయిన అనైక్యతే కనిపిస్తుంది.

విశ్వాసులు పరస్పరం – ఒకరింకొకరి – సహాయకులు అని ఖుర్‌ఆన్‌లో ఉంది. అలాగే అవిశ్వాసులు పరస్పరం సహాయకులు అని కూడా ఖుర్‌ఆన్‌లో ఉంది. దీనిద్వారా అవగతమయ్యే దేమిటంటే మానవ స్వభావంలో సహజసిద్ధమైన విభేదించే గుణం ఉన్నప్పటికీ, ఒక వ్యక్తి సంకల్పశుద్ధి గలవాడైనప్పుడు, అతడు తన కోవకు చెందిన వారితో సర్దుబాటు చేసుకునే మార్గాన్ని వెతుక్కుంటాడు. ఎందుకంటే సంఘీభావం, సర్దుబాటు, కలసి పనిచేసే గుణం లేనంత వరకూ ఈ ప్రపంచంలో ఏ రకమయిన విజయం కూడా సాధ్యం కాలేదు. లక్ష్యం పట్ల చిత్తశుద్ధి గనక ఉంటే, విభేదాలను విస్మరించి తన వారితో కలసి పనిచేయాలని అది అతన్ని ప్రేరేపిస్తుంది. అవిశ్వాసులనే చూడండి, వారు తమ మధ్యన ఎన్ని విభేదాలున్నప్పటికీ, కలసి పనిచేసే ఏదో ఒక బిందువును వారు వెతికి పట్టుకుంటారు. అలాగే విశ్వాసులు, తమ మధ్యన సహజసిద్ధమైన అభిప్రాయ భేదాలున్నప్పటికీ సామూహిక జీవితంలో తమ సోదరులతో సహకరించుకునే స్థానాన్ని పొందుతారు. హృదయాలలో నుండి 'మంచి' అన్నది లేకుండా పోయినప్పుడే వ్యవహారం తద్భిన్నంగా ఉంటుంది (అల్ అన్‌ఫాల్ : 70).

3. ఈ సందర్భంగా మూడవ విషయాన్ని (బల సమీకరణ) క్రింది ఆయత్ నుండి సంగ్రహించవచ్చు :

మీరు వారిని ఎదుర్కొనేందుకు శాయశక్తులా మీ బలాన్ని సమకూర్చు కోండి. ముఖ్యంగా పోషించిన గుర్రాలను సిద్ధంగా ఉంచండి. తద్వారా దైవవిరోధులలో, మీ విరోధులలో, మీకు తెలియకుండా దైవానికి మాత్రమే తెలిసివున్న ఇతర విరోధులలో కూడా భయం ఉండటానికి.

*(అల్ అన్‌ఫాల్ : 60)*

మన ప్రపంచంలో ఈ 'బలసమీకరణ'కు గల ప్రాముఖ్యత ఎటువంటిది? దీనిని ఒక ఉదాహరణ ద్వారా అర్థం చేసుకోవచ్చు –

ఈజిప్టుకు చెందిన సుల్తాన్ సలాహుద్దీన్ అబ్యూబీ (1137 – 1193), భారత దేశానికి చెందిన టిప్పు సుల్తాన్ (1751 – 1799) – ఇద్దరూ విశ్వాసస్ఫూర్తి, ధైర్యసాహసాలు, యుద్ధసామర్థ్యం దృష్ట్యా ఒకే స్థాయికి చెందినవారు. ఇద్దరూ పాశ్చాత్య శక్తిని మార్కొనవలసి వచ్చింది. వీరిలో మొదటి వ్యక్తి పాలస్తీనా విజేతగా నిలబడగా, రెండవ వ్యక్తి పరాజితుడై అమరగతినొందాల్సి వచ్చింది. ఈ వ్యత్యాసం వెనుక ఏదో తాంత్రిక రహస్యం దాగి లేదు. ఇది ఎంతో సాదాసీదా యథార్థం. టిప్పు సుల్తాన్‌కు 18వ శతాబ్ది కాలం లభించింది. అప్పటికే యుద్ధపరికరాలను సమకూర్చు కోవటంలో పాశ్చాత్యులు తిరుగులేని పురోగతిని సాధించారు. వారు సాంప్రదాయిక ఆయుధాలకు బదులు దూరాన ఉన్న లక్ష్యాలను ఛేదించగలిగే ఆయుధాలను కనుగొన్నారు. దానికి తోడు నౌకాదళం ద్వారా సముద్ర మార్గంపై పట్టు బిగించారు. దీనికి చిహ్నంగా సుల్తాన్ సలాహుద్దీన్ అయ్యూబీకి క్రీ.శ. 12వ శతాబ్దిలో పనిచేసే అవకాశం లభించింది. ఆ కాలంలో ముస్లింలు యుద్ధపరికరాల తయారీలో ప్రపంచానికి సారథ్యం వహిస్తున్నారు. అప్పట్లో సిరియా, ఈజిప్టు, ఇరాక్‌లలో ఉన్న కర్మాగారాలలో అత్యంత నాణ్యమైన యుద్ధపరికరాలు తయారయ్యేవి. అబ్బాసీ యుగంలో రోమనుల దాడులను ప్రతిఘటించడంలోనైతేనేమీ, శిలువ యుద్ధాలలో యూరప్ జాతుల వెల్లువను నిలువరించటంలోనైతేనేమీ ఈ ఆయుధాలు ఎంతగానో ఉపకరించాయి. మరీ ముఖ్యంగా శిలువ యుద్ధాలు జరుగుతున్న కాలంలో ఆ ప్రాంతంలో యుద్ధపరిశ్రమ ఉచ్ఛస్థితికి చేరుకుంది. శిలువ యుద్ధాలలో తాత్కాలికంగా యుద్ధవిరమణ జరిగినప్పుడు ఐరోపా వాసులు ఆయుధాలు కొనుగోలు చేయడానికి సిరియా, ఈజిప్టు మార్కెట్లకు వచ్చేవారు. అందువల్ల ముస్లిం ధర్మవేత్తలకు ఫత్వా జారీచేయాల్సి వచ్చింది – క్రైస్తవులకు ఆయుధాలు అమ్మటం హరామ్ (అధర్మం) అని. ఎందుకంటే వారు మన నుండి కొనుగోలు చేసిన ఆయుధాలను మనకు వ్యతిరేకంగా వినియోగిస్తారు (డాక్టర్ ముస్తఫా సబాయి).

ఈ శక్తినే ఖుర్ఆన్ 'బలసమీకరణ'గా పేర్కొంది (అన్‌ఫాల్ : 60). ప్రత్యర్థుల గుండెల్లో దడ పుట్టించే విధంగా ఈ బలాన్ని కూడగట్టుకోమని చెప్పటం జరిగింది.

ఈ బలసమీకరణ రెండు విధాలు. ఒకటి : ముస్లింలందరికీ సంబంధించినది. అంటే ప్రతి ముస్లిం వర్గం శాయశక్తులా ఈ శక్తిని పొందడానికి ప్రయత్నించాలి. రెండు : ఇది ముస్లిం సముదాయానికి సంబంధించినది. అంటే అధికారంలో ఉన్న సముదాయం అన్నమాట.

నేటి యుగంలో ఈ సున్నత్‌పై ఆచరించవలసిన ఆవశ్యకత మునుపటికన్నా అధికంగా ఉంది. నేటి యుద్ధాలలో కండబలం స్థానంలో యంత్రబలం ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. సైనిక వంశాల ... పురాతన భావన ఇప్పుడు గతకాలపు విలసిత గాథగా మారిపోయింది. అలాగే ఆర్థిక ఒనరులు నేడు ఎనలేని ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. మానవ జీవితమంతా వాటికి లోబడిపోయింది. ప్రాచీన కాలంలో ఇస్లామ్ ధర్మపరిచయ కార్యానికి ఆర్థిక వ్యవహారాలతో ఎటువంటి సంబంధం ఉండేది కాదు. కాని నేటి పరిస్థితి వేరు. నేడు 'కలము'ను సందేశప్రదాన కార్యక్రమం కొరకు వినియోగించదలిస్తే ఆర్థిక ఒనరులు లేకుండా ప్రభావవంతమైన విధంగా దానిని వినియోగించలేము. మరి ఇతర జాతుల వారు విమానాల ద్వారా, రేడియో, టీ.వీ.ల కేంద్రాల ద్వారా తమ మత ప్రచారం చేస్తున్నారంటే ఈ ఆర్థిక ఒనరుల ఆవశ్యకత మరింతగా పెరిగిపోయిందన్న వాస్తవం అవగతమవుతుంది. నేడు మానవుని దైనందిన అవసరాలు ఎంతగా పెరిగిపోయాయంటే, ప్రాచీన తరహా నిరాడంబర పద్ధతిలో జీవితం గడపటం అసంభవం అయిపోయింది.

ముస్లింల గురుతర బాధ్యత ధర్మపరిచయ కార్యమేననడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే పైన పేర్కొనబడిన విషయాలు వాంఛించేదేమిటంటే ముస్లింలు ఆర్థిక వ్యవస్థలో కూడా కృషిచేసి, ధర్మబద్ధమైన తమ వాటాను పొందాలి – వ్యక్తిగత స్థాయిలో, జాతీయ స్థాయిలో కూడా.

# అల్లాహ్ వైపునకు పిలుపు

## సందేశకార్యం ప్రాముఖ్యత

చరిత్రలో సంభవించే ఏ దుర్ఘటన అయినా, అది ఎంత దారుణమైనదైనా మిల్లతె ఇస్లామియా ఉనికిని రూపుమాపజాలదు. ఎందుకంటే ప్రపంచంలో ఇస్లామీయ సముదాయం ఉనికి ఖుర్ఆన్‌ను పరిరక్షించే దైవ వాగ్దానంతో ముడివడి ఉంది (అల్ హిజ్ర్ : 9). ఏ విధంగానయితే దేవుని అంతిమ గ్రంథం ప్రళయం వరకూ మిగిలి ఉండవలసి ఉందో, అదేవిధంగా అంతిమ దైవగ్రంథవహులు కూడా భూమ్యాకాశాలున్నంత వరకూ, దేవుని న్యాయత్రాసు నెలకొనేవరకూ ఈ ధరిత్రిపై మిగిలి ఉంటారు.

అయితే దేవుని ఈ వాగ్దానం ఉమ్మతె ముహమ్మదీ ఉనికితో ఉంది గాని పరలోకంలో దాని మోక్షంతో మాత్రం కాదు. పరలోకంలో మోక్షం అనేది పూర్తిగా మనిషి ఆచరణపై ఆధారభూతమై ఉంది. ఈ విషయంలో దైవశాసనం ఎంత నిర్దిష్టమైనదంటే, దైవప్రవక్త అనుచరులు కాదు కదా, ప్రవక్త భార్యకు, ప్రవక్త సంతానానికి కూడా దాని నుండి మినహాయింపు లేదు.

"ఆచరణ" అంటే ఏమిటి? అంటే మనం రెండు విధాలుగా అది వాంఛించే వాటిని నెరవేర్చాలి. ఒకటి : మనం దేవుని దాసులం. రెండు : మనం అంతిమ దైవప్రవక్త అనుచర సమాజానికి చెందినవారం. మొదటిదాని ప్రకారం ప్రతి ముస్లిం వ్యక్తిగతంగా 'సజ్జనుడైన దాసుడు'గా మారాలి. అతను నికార్సయిన దైవదాసుణ్ణి అని క్రియాత్మకంగా నిరూపించుకోవాలి. కాని అంతిమ దైవప్రవక్త ఉమ్మతీ అయిన కారణంగా మనపై మరో గురుతర బాధ్యత కూడా మోపబడింది – అదేమిటంటే మనం లోకవాసులకు దైవ సందేశాన్ని చేరవేసే విషయంలో దైవప్రవక్త ప్రతినిధులం.

> అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : "నేను ప్రవక్తలపై, సందేశహరులపై విధించినటువంటి విధ్యుక్త ధర్మాలను ఉమ్మతె ముహమ్మదీపైన విధించాను." *(వహబ్ బిన్ మునబ్బా)*

మహాప్రవక్త ముహమ్మద్ (స) సమస్త లోకవాసుల కొరకు ప్రభవింపజేయ బడ్డారు. ఆయన్ని నమ్మినడుచుకునే అనుయాయులు, తాము పుట్టి పెరిగిన ప్రాంతాలలో అక్కడి వారికి ఈ సందేశాన్ని చేరవేసే బాధ్యతను కలిగి ఉన్నారు. మస్ఊద్ బిన్ మఖ్రమా కథనం ప్రకారం మహాప్రవక్త (స) ఇలా ప్రవచించారు:

> "నిశ్చయంగా అల్లాహ్ నన్ను ప్రజలందరి కోసం కారుణ్యంగా చేసి పంపాడు. కాబట్టి మీరు నా తరఫున ప్రజలకు చేరవేయండి."
>
> *(తహ్జీబ్ సీరత్ ఇబ్ను హిషామ్ - సం.2, పు.141)*

"మీరు మా రాజ్యంలోకి ఎందుకు వచ్చారు?" అని రుస్తుం, రబీయా బిన్ ఆమిర్ (రజి)ని అడిగినప్పుడు, ఆయన ఇలా బదులిచ్చారు :

> "అల్లాహ్ మమ్మల్ని ప్రభవింపజేశాడు. ఆయనే మమ్మల్ని తీసుకువచ్చాడు - తాను కోరినవిధంగా కోరిన వానిని దాసుల దాస్యం నుండి తీసి దేవుని దాస్యం వైపునకు తీసుకురావటానికి! ప్రపంచపు ఇరుకు నుండి అతన్ని సువిశాల క్షేత్రం వైపునకు రప్పించటానికి! మతాల దౌర్జన్యం నుండి ఇస్లామ్ చేసే న్యాయం వైపునకు తీసుకురావటానికి!" *(తారీఖె తబ్రీ - సం.3, పు.33)*

సందేశాన్ని చేరవేసే ఈ కార్యం ఎంత ప్రాధాన్యత కలదంటే దీనికొరకు ప్రతి రెండవ ప్రయోజనాన్ని బలి ఇవ్వవచ్చు. హిజ్రీ 6వ సంవత్సరం దైవప్రవక్త (స) మక్కావారితో హుదైబియా ఒడంబడిక చేసుకున్నారు. ఆ ఒడంబడికలోని షరతులలో ఒక షరతు, మక్కావారిలో ఎవరయినాసరే వ్యాపారం నిమిత్తం ఈజిప్టు, సిరియా, ఇరాక్ ప్రదేశాలకు వెళుతూ మదీనా గుండా సాగిపోతే అలాంటివారి ధన ప్రాణాలకు పూర్తి రక్షణ ఉంటుంది (బుఖారీ, ముస్లిమ్). అంటే ఆయన (స) ఇస్లామ్ శత్రువులకు స్వయంగా ఇస్లామ్ రాజ్యపరిధిలో వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు స్వేచ్ఛ కల్పించారు. ఇదీ, ఇలాంటివే మరికొన్ని అధికరణలు ఎందుకు చేర్చబడ్డాయంటే, ప్రత్యర్థి వర్గానికి ఆర్థిక, రాజకీయ రాయితీలను ఇచ్చి తమ సందేశ కార్యక్రమాలను సుగమం చేసుకుందామని.

మనం గనక మన చుట్టుప్రక్కల నివసించే వారికి రానున్న దినం గురించి సావధానపరచకపోతే, ఒక ఉమ్మత్‌గా మనం నిలదీతకు గురయ్యే అవకాశం ఉంది. ఒక ప్రవక్త, తాను పంపబడిన జాతివారికి భయబోధ చేయకపోతే ఏ

విధంగా నిలదీతకు గురవుతాడో అదేవిధంగా మనం పట్టుబడతాము. తన జాతివారిని షిర్క్, కుఫ్రలలో వదలిపెట్టి, అతను చేసే 'నమాజ్ రోజాలు' కూడా దైవసన్నిధిలో స్వీకార యోగ్యం కాలేకపోయేవి. మన పరిసరాలలో నివసించే వారికి జీవిత సత్యం ఏమిటో తెలియపరచనప్పుడు, సాఫల్యం కొరకు వారు ఏం చేయాలో ఎరుకపరచనప్పుడు మనం మనవరకు సదాచరణ చేసుకుంటే ఎలా సరిపోతుంది?

దైవప్రవక్త గనక ప్రపంచంలో తనపై మోపబడిన బాధ్యతను నెరవేర్చకపోతే దేవుని తరఫున రెట్టింపు శిక్ష విధించబడే ప్రమాదం ఉంది (బనీ ఇస్రాయీల్ - 75). ఎందుకంటే దైవప్రవక్తపై ఒకే సమయంలో రెండు బాధ్యతలుండేవి–ఒకటి: తాను స్వయంగా విశ్వాసిగా, ముస్లింగా జీవించటం (యూనుస్ - 72), రెండు : లోకవాసులకు దైవ సందేశాన్ని చేరవేయటం (అల్ మాయిదా : 67). దైవదౌత్యం పరిసమాప్తం అయిన తరువాత ఇప్పుడు ఆ బాధ్యత ఉమ్మతె ముహమ్మదీ పైన ఉంది. అందువల్ల ఈ ఉమ్మత్ పైన కూడా అల్లాహ్ తరఫున రెండు బాధ్యతలు మోపబడ్డాయి - ఒకటి : విశ్వాసులుగా జీవించటం. రెండు : మానవాళి సమక్షంలో సత్య సాక్ష్యమివ్వటం (అల్ హజ్జ్ : చివరి వాక్యాలు). ఎందుకంటే అల్లాహ్ మనల్ని తన కార్యం కొరకు ఎన్నుకున్నానని చెప్పాడు (ఇజ్తబా). కాబట్టి ఇప్పుడు ముస్లింల ఒక బాధ్యత ఏమిటంటే వారు దైవాన్ని నమ్మి నడుచుకోవాలి, ప్రజలు కూడా తమను నమ్మేవిధంగా ప్రవర్తించాలి. దాంతోపాటు వారిపై గల మరో బాధ్యత ఏమిటంటే, వారు జనుల మధ్యన సత్యానికి సాక్షులుగా నిలబడాలి. దేవుని వైపునకు పిలవటం ఏ విధంగా ఒక ప్రవక్త బాధ్యతో అదేవిధంగా ప్రవక్త అనుయాయులపై కూడా ఆ బాధ్యత ఉంటుంది (యూసుఫ్ : 108). హదీసులలో ఈ విధంగా ఉపదేశించబడింది:

"మీరు ప్రపంచంలో దేవుని సాక్షులు."

మనిషి చనిపోయిన తరువాత అంతమైపోడు, పైగా అతను శాశ్వతమైన జీవితంలోనికి ప్రవేశిస్తాడు. అక్కడ శాశ్వతమైన స్వర్గమో లేక నరకమో ఉంది. ఇది ఎంతో సంక్లిష్టమైన పరిస్థితి. ఎవరయినా ఒక వ్యక్తి గనక ప్రస్తుత జీవితంలో దైవేచ్ఛ ఏమిటో తెలియకుండా ఉంటే, దేవుడు కోరినవిధంగా నడుచుకోకుండా చనిపోతే, అతను మరణానంతరం అనంతమైన దైవశిక్షకు గురయ్యాడన్నమాటే. దాని నుండి అతను బయటపడే దారి ఏదీ ఉండదు. లోకవాసుల దృష్టికోణం నుంచి ఏ విషయానికి ఎలాంటి ప్రాముఖ్యత ఉన్నా దేవుని దృష్టిలో మాత్రం అత్యంత ముఖ్యమైన విషయం, మానవునికి సత్యం తెలియాలన్నదే.

మానవుణ్ణి ఈ భయంకర ప్రమాదం నుండి రక్షించటానికి, అల్లాహ్ అతన్ని పుట్టించిన తరువాత, అతని మార్గబోధన కోసం ప్రవక్తలను పంపే పరంపరను కూడా మొదలెట్టాడు. ఈ ప్రవక్తలు "ప్రతి జాతి"లో ప్రభవింపజేయబడ్డారు.

దైవ సందేశాన్ని మానవాళికి చేరవేసే గురుతర బాధ్యతను దైవప్రవక్త పూర్తిగా నిర్వర్తించారు (అల్ మాయిదా – 67). అందుచేత ప్రవక్త అనుయాయులుగా ఆ బాధ్యతను నిర్వర్తించవలసిన బాధ్యత మనపైన ఉంది. వ్యత్యాసమల్లా ఒక్కటే. దైవప్రవక్త ఒక వ్యక్తిగా – తానొక్కడే – ఈ కార్యానికి బాధ్యునిగా ఉంటాడు. కాగా, ఉమ్మత్ సాముదాయికంగా బాధ్యత వహిస్తుంది. దైవప్రవక్త వ్యక్తిగతంగా సందేశ బాధ్యతను మోయవలసి ఉంటుంది. కాని ఉమ్మత్‌లోని ప్రతి వ్యక్తికి ఇది తప్పనిసరి కాదు. ఉమ్మత్‌లోని ఒక జమాఅత్ ముందుకు వచ్చి సత్య సందేశాన్ని చేరవేసే గురుతర బాధ్యతను నిర్వర్తిస్తే, మిగతా ప్రజలపై నుండి ఈ విధ్యుక్త ధర్మం తొలగిపోతుంది.

> విశ్వాసులంతా కట్టకట్టుకుని – ఒకేసారి – బయలుదేరటం సాధ్యం కాదు. కనుక వారి ప్రతివర్గం నుండి కొంతమంది బయలుదేరి ధర్మావగాహనను పెంపొందించుకుని, తిరిగి వెళ్ళి తమ వర్గం వారికి భయబోధ చేయాల్సింది. అలాచేస్తే బహుశా వారు కూడా ధర్మనిష్ఠను అలవరచుకునేవారు. *(అత్ తౌబా : 122)*

ప్రపంచ జాతుల సమక్షంలో సత్యసాక్ష్యం ఇచ్చే ఈ బాధ్యత 'మూలం' ద్వారానే రుజువవుతోంది –

> ఈ విధంగా మేము మిమ్మల్ని ఒక మధ్యస్థ సముదాయంగా చేశాము – మీరు మానవాళిపై సాక్షులుగా ఉండాలని! ప్రవక్త (స) మీపై సాక్షిగా ఉండాలని! *(అల్ బఖరా : 143)*

ప్రళయదినాన మానవులంతా దేవుని న్యాయస్థానంలో హాజరైనప్పుడు, ప్రపంచంలో దైవ సందేశం అందించబడిన వారంతా సాక్షులుగా నిలబడతారు. ఆ మాటే బైబిల్‌లో ఈ విధంగా అనబడింది :

> సర్వజనులారా! గుంపుకూడి రండి. జనములు కూర్చబడవలెను. వారిలో ఎవరు ఇట్టి సంగతులు తెలియజేయుదురు? పూర్వకాలమున జరిగిన వాటిని ఎవరు మాకు వినిపించుదురు? తాము నిర్దోషులమని

> తీర్పు పొందునట్లు తమ సాక్షులను తేవలెను. లేదా, విని సత్యమేయని ఒప్పుకోవలెను. మీరు తెలుసుకుని నన్ను నమ్మి నేనే ఆయనని గ్రహించునట్లు మీరును నేను ఏర్పరచుకొనిన నా సేవకుడును నాకు సాక్షులు. నాకు ముందుగా ఏ దేవుడును నిర్మింపబడలేదు. నా తరువాత ఏ దేవుడు నుండడు. నేను నేనే యహోవాను; నేను తప్ప వేరొక రక్షకుడు లేడు. *(యెషయా : 43వ అధ్యాయం : 9 – 12)*

సత్యసాక్ష్యానికి సంబంధించిన ఈ బాధ్యతను నిర్వర్తించే విషయంలో దైవప్రవక్త (సఅసమ్) ఎంతగా నిమగ్నులై ఉండేవారంటే, ఎంతగా ఆవేదన చెందేవారంటే, దానిని గమనించి అల్లాహ్ స్వయంగా ఈ విధంగా సెలవీయాల్సి వచ్చింది –

> "(ప్రవక్తా!) వారు విశ్వసించటం లేదన్న బాధతో నీవు నీ ప్రాణాలకే ముప్పు కొనితెచ్చుకునేలా ఉన్నావు." *(అష్ షుఅరా : 3)*

అంతిమ దైవప్రవక్త (స)ను ఏ స్థానంలో నిలబెట్టడం జరిగిందో, అదే స్థానంలో – దైవదౌత్య పరిసమాప్తం అయిన తరువాత – తమను నిలబెట్టడం జరిగిందన్న భావన ముస్లిములకు గనక కలిగినట్లయితే వారికి రాత్రిపూట నిద్రపట్టదు. పగటిపూట ప్రశాంతత ఉండదు. ఎందుకంటే ఈ 'నియుక్తి' కీలకమైనది. దీని తరువాత వారు ప్రపంచ జాతుల సమక్షంలో సత్యసాక్ష్యం ఇచ్చి విముక్తి పొందనయినా పొందుతారు. లేదా ఈ బాధ్యత పట్ల అశ్రద్ధ వహించినందుకు పట్టుబడటమైనా జరుగుతుంది. పూర్వపు గ్రంథవహుల విషయంలో అవతరించిన ఈ ఆయత్ ఈ సందర్భంగా గమనార్హం –

> మేము గ్రంథంలో మానవుల కొరకు వాస్తవాలను క్షుణ్ణంగా విశదీకరించిన తరువాత కూడా మేము అవతరింపజేసిన నిదర్శనాలను, మార్గదర్శనాన్ని దాచిపెట్టేవారిని దేవుడు శపిస్తాడు. శపించేవారు కూడా వారిని శపిస్తారు. అయితే పశ్చాత్తాపం చెంది, తమ వైఖరిని సరిదిద్దుకుని, ఉన్నదున్నట్టు విషయాన్ని వెల్లడించే వారికి నేను క్షమాభిక్ష పెడతాను. నేనున్నదే క్షమించటానికి, దయదలచటానికి!
> *(అల్ బఖరా – 159, 160)*

దేవుడు తన గ్రంథంలో స్పష్టంగా ప్రకటించినదే ఆయన ఇచ్ఛ అయినప్పుడు ఒక విషయాన్ని నిష్కర్షగా చెప్పవచ్చు – అదేమిటంటే ముస్లింలు వ్యక్తిగతంగా

పశ్చాత్తాపంచెంది, సంస్కరణా ప్రియులుగా రూపొంది, దైవధర్మాన్ని ముస్లిమేతరుల వరకు చేరవేసే కృషి చేయనంతవరకూ, దేశస్థాయిలో తమ సోదరులకు, అంతర్జాతీయ స్థాయిలో సమస్త మానవులకు సత్యధర్మాన్ని పరిచయం చేయనంతవరకూ ఎట్టి పరిస్థితిలోనూ దేవుని పట్టునుండి తప్పించుకోలేరు – వారు ఎన్ని చిల్లాలు చేసినా, ఎన్ని ఇష్రాఖ్, చాష్త్ నమాజులు చేసుకున్నా ఈ గురుతర బాధ్యత వారి నుండి తొలగిపోదు. స్వర్గబాట దైవదాసులు ఉండేచోట కాకుండా అంతరిక్షంలో ఆధ్యాత్మిక సైర్ల ద్వారా పొందవచ్చని ఎవరయినా అనుకుంటే వారు తీవ్రమైన అపోహకు గురైనట్లే. మనం మన చుట్టూ నివసించే కోట్లాదిమంది ముస్లిమేతరులకై నరక ద్వారాన్ని మూసివేసే కృషి చేయనంత వరకూ మన కొరకు స్వర్గద్వారం తెరచుకోదు. ఈ విషయాన్ని మనం బాగా అర్థం చేసుకోవాలి.

> "ఏమిటి, మీరు స్వర్గంలో ఇట్టే ప్రవేశించగలమని భావిస్తున్నారా? యథార్థానికి మీ పూర్వీకులకు ఎదురైన పరిస్థితులు మీకింకా ఎదురవనే లేదు. వారెన్నో కష్టాలకు ఓర్చుకున్నారు. బాధలు భరించారు. తీవ్రంగా కుదిపివేయబడ్డారు. చివరికి (ఆ బాధలకు తాళలేక) ప్రవక్తలు, వారితో పాటు విశ్వసించినవారు, 'ఇంతకీ దైవ సహాయం ఎప్పుడొస్తుంది?' అనేవారు. తెలుసుకోండి! దైవ సహాయం అతి చేరువలోనే ఉంది."
> *(అల్ బఖరా : 214)*

ఖుర్ఆన్‌లో దైవప్రవక్త (స) నోట ఇలా పలికించటం జరిగింది –

> "ఈ ఖుర్ఆన్ నా వద్దకు 'వహీ' ద్వారా పంపబడింది – దీనిద్వారా నేను మిమ్మల్నీ, ఇంకా ఈ ఖుర్ఆన్ ఎవరెవరికి చేరుతుందో వారందరినీ సావధానపరచాలని." *(అల్ అన్ఆమ్ : 19)*

ప్రాపంచిక జీవితంలో ఎవరయితే జాతులను రానున్న దినం గురించి సావధానపరుస్తారో, వారు ప్రళయదినాన వారికి వ్యతిరేకంగా దేవుని సాక్షులుగా నిలబెట్టబడతారు *(మూ'మిన్ : 51)*

మరయితే నేడు ప్రపంచ జాతుల సమక్షంలో సాక్షులుగా నిలబడినవారెవరు, అంతిమ దైవప్రవక్త (స) అనుసరణలో దేవుని న్యాయస్థానంలో, ఆ జాతులన్నింటికీ జీవిత వాస్తవికతను తెలియపరచిన వారెవరు? అన్నది ప్రశ్న. ఈ పని చేశానని చెప్పగలిగే ఏ ఒక్క వర్గమయినా ఉందా? ఒకవేళ లేదనుకుంటే అంతిమ దైవప్రవక్త (స) వారి ప్రవక్తా బాధ్యత పూర్తయిపోయింది (దైవం మన్నించుగాక!).

మస్జిదుల మీనార్ల నుండి ప్రతిధ్వనించే అజాన్ పిలుపు కూడా బాధ్యత నిర్వహించామనడానికి సరిపోతుందని కొంతమంది భావిస్తారు. ఇది పరమ నీచమైన అపోహ మాత్రమే కాదు, ఈ రకమయిన సమాధానాల పట్ల సంతృప్తి చెందడమంటే తమపై బరువును పెంచుకోవటమే. తాను ఏ ప్రవక్తను పంపినా, అతని జాతివారు మాట్లాడే భాషలోనే (సంభాషించేవానిగా) పంపానని దేవుడంటున్నాడు (ఇబ్రాహీమ్ : 4). అతను తన సందేశాన్ని ఎంతగా విడమరచి చెబుతాడంటే, నీవు ఎక్కడో చదివి వచ్చి, మాకు అప్పజెపుతున్నావని జనులు అంటారు (అల్ అన్ఆమ్ : 105). కాని మన పరిస్థితి ఎలా ఉందంటే, మన జాతి వారి భాష ఏదయినా కేవలం కొన్ని అజాన్ పలుకులు వినిపించి, మన బాధ్యత తీరిపోయిందని అనుకుంటున్నాము. కడు శోచనీయం!

## సందేశ విషయం

మనం జనుల వరకూ చేరవేయవలసిన సందేశం ఏది? ఒక్క పదంలో దానికి సమాధానం తౌహీద్. అంటే ఏక దైవభావన. అంటే ఒక్కడైన దైవాన్ని నమ్మి నడుచుకోవాలి. ఆయన యందే మనసును లగ్నం చేయాలి. మక్కా విజయం తరువాత ముహమ్మద్ ప్రవక్త (స) ప్రజల నుండి విధేయతా ప్రమాణం (బైఅత్) తీసుకోసాగారు. స్త్రీలు పురుషులు ఆయన సన్నిధికి వచ్చారు. ఆయన (స) రెండు విషయాలపై అంటే ఇస్లామ్, షహాదత్‌పై ప్రమాణం చేయించారు. (బైహఖీ)

> హజ్రత్ అస్వద్ తెలిపారు – మక్కా విజయం నాడు నేను, దైవప్రవక్త (స) జనులచేత ప్రమాణం చేయించుకోవటం గమనించాను. ఆయన (స) ఖర్న్ పర్వతం వైపు తిరిగి ప్రజల నుండి ఇస్లామ్ మరియు షహాదత్‌పై ప్రమాణ స్వీకారం చేయిస్తున్నారు. 'షహాదత్' అంటే ఏమిటి? అని నేనడిగాను. ఉల్లేఖకుడు ఏమన్నాడంటే; ఆయన (స) ప్రజల నుండి అల్లాహ్‌ను విశ్వసించటం, ముహమ్మద్ (స)ను దైవదాసునిగా, దైవప్రవక్తగా నమ్మటంపై ప్రమాణం చేయించారు.

తౌహీద్ (దేవుని ఏకత్వం) విశ్వాసం ఏదో తాత్విక అంశం కాదు. అది మనిషి పాలిట పరీక్షాపత్రం. ఆ రకంగా పరలోకం కూడా తౌహీద్ సందేశంలో ఒక అనివార్య అంశం అయిపోతుంది. సందేశదాత ప్రజలకు తౌహీద్ వాస్తవికత గురించి వివరించి చెప్పేటప్పుడు పరలోకాన్ని కూడా తప్పక ప్రస్తావిస్తాడు. నేడు

మన కంటికి కనిపించని దేవుడు ఎల్లప్పుడూ కనిపించకుండా ఉండడనీ, మరణానంతరం మనం ఆయన సమక్షంలో నిలబడి మన జీవితంలోని పనుల గురించి లెక్క ఇచ్చుకోవలసి ఉందనీ, ఆ పనుల ఆధారంగానే శాశ్వత స్వర్గమో, శాశ్వత నరకమో తథ్యమని విశదపరుస్తాడు. నిజ దైవం ప్రస్ఫుటం కాగానే, దైవాన్ని కాదని వేరితరుల సహారాను వెతికేవారంతా నిరాశ్రయులైపోతారు. ఈ ప్రాపంచిక జీవితంలో నిజదైవాన్ని ఆశ్రయించినవారు మాత్రమే పరలోకంలో దేవుని ఆశ్రయానికి నోచుకుంటారు – సందేశదాత ఈ విషయాలన్నింటినీ ప్రజలకు విడమరచి చెబుతాడు.

మరి ఈ విషయాలు కేవలం బౌద్ధికంగా ఊహించనవి కావు. అవి 'వహీ' అనే పటిష్టమైన జ్ఞానం ద్వారా మనిషికి తెలుపబడ్డాయి. అందువల్ల సందేశదాత అందజేసే సందేశంలో 'రిసాలత్' (దైవదౌత్యపు) విశ్వాసం కూడా అవశ్యంగా ఉంటుంది. మనిషి తన ప్రభువు వాస్తవిక జ్ఞానాన్ని పొందడానికి 'రిసాలత్'ను మార్గదర్శిగా చేసుకోవలసిన ఆవశ్యకత ఉందని కూడా అతడు ప్రజలకు స్పష్టపరుస్తాడు. రిసాలత్ లేకపోతే మనిషి అంధకారంలో తచ్చాడుతూ ఉంటాడనీ, రుజుమార్గాన్ని పొందలేడని నిర్ద్వంద్వంగా చెబుతాడు.

సత్య సందేశంలోని మౌలిక బిందువు ఇదే. కాని మానవుడు రాతి ముక్కలా నిశ్చలమైన వస్తువు కాదు. అతనికి ఒక మనసనేది ఉంది. స్పందన ఉంది. అతనొక సామాజిక ఉనికి.

సత్యధర్మాన్ని పరిచయం చేసేటప్పుడు మనం దాని భాగాల పరస్పరం సంబంధాన్ని కూడా దృష్టిలో ఉంచుకోవాలి. అన్యధా మనం ఈ కార్యానికి న్యాయం చేకూర్చలేము.

సాధారణ పరిస్థితుల్లో నేరుగా ఇస్లామ్ వైపునకు పిలవటం యుక్తికి విరుద్ధం అనిపిస్తుంది. అందువల్ల ఈ రంగంలో పనిచేయదలచిన వారి ఆలోచనలు పరిపరి విధాలుగా ఉంటాయి. అంటే సందేశం ఏ తీరులో ఇవ్వాలి? అన్న విషయం వారి మదిని తొలచివేస్తూ ఉంటుంది. 'సమాజ సంస్కరణ' పేరుతోనో లేదా సువ్యవస్థ పేరుతోనో ఈ కార్యక్రమం ప్రారంభించాలని కొందరు తలపోస్తారు. ఇస్లామ్ విశ్వజనీన సత్యాల ధ్వజవాహకురాలనీ, అది అన్ని మతాలలోని ఉమ్మడి విషయమనీ మరి కొంతమంది భావిస్తున్నారు. మరికొందరు దీనికి తాత్విక రంగునిచ్చారు. మనిషిలోని నైతిక స్పృహను ప్రాతిపదికగా చేసుకుని దేవుని షరీఅత్ ఆవశ్యకతను నిరూపించాలని వారంటారు. కాని ఈ విధానాలన్నింటిలో గల ఒక ఉమ్మడి లోపం

మనల్ని సత్యసాక్ష్యానికి సంబంధించిన సిసలయిన కార్యం నెరవేర్చేవానిగా నిలబెట్టదు. ఎందుకంటే సత్యసాక్ష్యానికి సంబంధించిన కార్యంలోని అత్యంత కీలకమైన అంశం 'రానున్న దినం' గురించి సావధానపరచటం.

మక్కాలో మహాప్రవక్త (స) సందేశకార్యం ఈ రకమయిన వాక్యాలతో మొదలవుతుంది –

> "ప్రజలారా! లా ఇలాహ ఇల్లల్లాహ్ అని పలకండి. మీరు సాఫల్యం పొందుతారు. రాబోయే (జీవితంలో) కఠినమైన శిక్ష గురించి నేను మిమ్మల్ని హెచ్చరిస్తున్నాను."

ఆయన (స) గారు మక్కాలో ఉన్నప్పుడు చేసిన ప్రసంగాలలో "అస్లిమ్, తుస్లిమ్" (ఇస్లామ్ స్వీకరించండి, సాఫల్యభాగ్యం పొందుతారు) అనే పదాలు విరివిగా లభిస్తాయి. మక్కా జీవితంలో ఆయన (స) అబూబక్ర్ ముందు ఇస్లామ్ పరిచయం చేసినప్పుడు ఆయన ఇలా అన్నారు : "నేను దైవ సందేశహరుణ్ణి. నేను మిమ్మల్ని దేవుని వైపునకు పిలుస్తున్నాను". అయితే మక్కా విజయం తరువాత ఆయన (స) అబూబక్ర్ తండ్రి అబూ ఖహాఫాకు ఇస్లామ్ పిలుపు ఇచ్చినప్పుడు ఇలా అన్నారు : **"యా అబా ఖహాఫా! అస్లిమ్ తుస్లిమ్",** మరోవిధంగా చెప్పాలంటే ఒక సుసంఘటిత మైన మత ధర్మంలో ప్రవేశించే పిలుపు మదీనాలో మొదలయింది. అప్పటికి సత్యం సర్వసామాన్యంగా పరిచయం అయింది. ఇస్లామ్ క్రియాత్మకంగా పటిష్టమైన పునాదులపై నెలకొన్నది. అంతకు మునుపు 'పటిష్టమైన మతానికి' బదులు 'మతం వాస్తవికత' ఆయన సందేశంలోని ముఖ్యాంశం అయివుండేది.

ప్రసంగించే తీరుకు సంబంధించి ఈ మౌలిక అంశాన్ని దృష్టిలో పెట్టుకున్న ట్లయితే సందేహాలన్నీ నివృత్తి అవుతాయి. ఆహూతుని తరఫు నుండి ఎదురయ్యే ఎటువంటి మానసిక చిక్కుల గురించి కూడా భయపడకుండా – సూత్రప్రాయంగా – 'భయబోధ'ను సందేశకార్యం యొక్క ప్రధానాంశంగా చేసుకోవచ్చు. దానినే ఖుర్ఆన్‌లో "అందరూ సమావేశమయ్యే రోజు" (షూరా – 7)గా, "యౌముత్తలాఖ్" (మూ'మిన్ – 15)గా, "తొందరగా రానున్న గడ్డుదినం" (మూ'మిన్ – 18)గా పేర్కొనటం జరిగింది. అప్పుడు మనిషి వ్యక్తం చేసినదాని, గోప్యంగా ఉంచినదాని లెక్క తీసుకోబడుతుంది (అల్ బఖరా – 284). అప్పుడు భయంతో గుండెలు గొంతుదాకా వచ్చి ఉంటాయి (గాఫిర్ – 18). ఈ ముఖ్యాంశమే మక్కీ సూరాలలో దాగివుంది –

ఇక్కడ మేము కొన్ని ఉదాహరణలు ఇస్తున్నాము - తద్వారా 'పటిష్టమైన మతధర్మం'లో ప్రవేశించటానికి బదులు 'మతం వాస్తవికత' వైపునకు పిలువటంలోని అర్థం ఏమిటో విశదమవుతుంది :

1. దివ్య ఖుర్‌ఆన్‌లోని ఒక మక్కీ సూరా యిది :

> వీలైనంత ఎక్కువగా ఒకరిని మించి ఒకరు ప్రపంచాన్ని పొందాలనే ధ్యాస మిమ్మల్ని ఏమరుపాటులో పడవేసింది. చివరకు మీరు (ఈ వ్యామోహంలోనే) శ్మశానికి చేరుకుంటారు. (మీరనుకునేది) ఎంత మాత్రం కాదు, త్వరలోనే మీకు తెలిసిపోతుంది. మరొకసారి (వినండి, మీరనుకునేది) ఎంతమాత్రం నిజం కాదు, అతి త్వరలోనే మీకు తెలిసిపోతుంది. ఎంతమాత్రం కాదు, మీరు గనక నిశ్చయజ్ఞానంతో (మీ ఈ వైఖరి పర్యవసానాన్ని) తెలుసుకుంటే, (మీ నడవడిక ఇలా ఉండదు). మీరు నరకాన్ని చూసితీరుతారు. మరొకసారి (వినండి) మీరు పూర్తి నమ్మకంతో దాన్ని చూస్తారు. తరువాత ఆ రోజున మీరు తప్పనిసరిగా ఈ సౌఖ్యాలను గురించి ప్రశ్నించబడతారు.
>
> *(102. అత్ తకాసుర్ : 1-8)*

జర్మన్ న్యూ ముస్లిం ముహమ్మద్ అసద్‌ను ఇస్లామ్‌కు పూర్వం ప్రభావితం చేసిన సూరా యిదే.

2. దైవప్రవక్త ముహమ్మద్ (స)కు బహిరంగంగా ఇస్లామ్ సందేశం ఇవ్వమని ఆదేశించబడినప్పుడు, ఆయన అరబ్బు ఆనవాయితీ ప్రకారం సఫా గుట్టపైకెక్కి జనులను సమావేశపరచి ప్రసంగించారు. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) ఉల్లేఖనం ప్రకారం ఆ ప్రసంగం ఇలా సాగింది :

> "చెప్పండి, ఈ పర్వతం వెనుక ఒక సైనిక దళం విధ్వంసం సృష్టించటానికి సిద్ధంగా ఉందని నేను గనక మీకు చెబితే మీరు నా మాటను నమ్ముతారా?" అని అడిగినప్పుడు, అందరూ ముక్తకంఠంతో 'అవున'న్నారు. అప్పుడాయన (స), "నేను మిమ్మల్ని రానున్న ఆ భయంకరమయిన శిక్ష గురించి భయపెడుతున్నాను" అన్నారు.
>
> *(అల్ బిదాయ వన్నిహాయ - సం. 1; పు. 38)*

అబూ సుఫ్యాన్ బిన్ హరబ్, హింద్ బిన్తె ఉతబాల ముందు ఆయన (స) ఒకసారి ఈ విధమైన పదజాలంతో తన సందేశం వినిపించారు –

> "దైవసాక్షి! మీరు తప్పక మరణించవలసి ఉంది. ఆ తరువాత మీరు తిరిగి లేపబడతారు. పిదప మంచివాడుగా తేలినవాడు స్వర్గానికి పోతాడు. దుర్మార్గుడుగా తేలినవాడు నరకాగ్నికి ఆహుతి అవుతాడు. నేను చెప్పింది నిజం. నేను భయబోధ చేసిన మొదటి ఇద్దరు వ్యక్తులు మీరే." *(ఇబ్నె అసాకిర్ – ముఆవియా)*

> 3. హజ్రత్ ఉమర్ ఫారూఖ్ (రజి) ఒకసారి ఇలా అన్నారు :
>
> "నేలపైనున్న ఆ పరిపాలకుడు నింగినున్న సార్వభౌమాధికారిని కలుసుకున్నప్పుడు అతనికి వినాశం ఖాయం – అయితే న్యాయం చేయమని ఆజ్ఞాపించేవాడు, న్యాయబద్ధంగా తీర్పు ఇచ్చేవాడు, ఆశ్రిత పక్షపాతం బంధుప్రీతి ఆధారంగా తీర్పుచేయనివాడు, భయానికి, ప్రలోభానికి లొంగి న్యాయనిర్ణయం గైకొననివాడు, దైవగ్రంథాన్ని తన రెండు కళ్ళ ముందు దర్పణంగా చేసి ఉంచుకున్నవాడు ఈ వినాశనం (యాతన) నుండి తప్పించుకుంటాడు."

అదృష్టవశాత్తు ప్రస్తుత యుగంలో ఈ విషయం నూతన ప్రాధాన్యతను సంతరించుకుంది. నేడు మరణశాస్త్రం (Thanatalogy) పేరుతో ఓ శాశ్వత విజ్ఞాన విభాగం ఉనికిలోనికి వచ్చింది. మరణ వ్యవహారాన్ని వైజ్ఞానిక దృష్టి కోణంతో అధ్యయనం చేయటం దీని ముఖ్య ఉద్దేశం. మరణానికి సంబంధించి కొన్ని ప్రత్యేక మతధర్మాల గ్రంథాలు చర్చనీయాంశంగా మారే రోజు దగ్గరలోనే ఉందనిపిస్తోంది. ...

డాక్టర్ బెల్లిగ్రాహమ్ ఇలా వ్రాశాడు : నాకు ఒక వ్యక్తి విందుకు ఆహ్వానించాడు. అతను ప్రపంచంలోని అతి కొద్దిమంది గొప్ప ధనవంతులలో ఒకడు. ఆహ్వానపత్రికను చూశాక, నేను ఆ విందుకు హాజరవవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అనిపించింది. రాత్రి భోజనానంతరం అతను నన్ను వేరే గదిలోనికి తీసుకెళ్ళి ఇలా అన్నాడు :

> While I am now in good health, my age tells me that I have n't long to live. I've never thought much about death before - but now I find my mind preoccupied with it, and the idea frightens me. I need help.

(ప్రస్తుతం నా ఆరోగ్యం బాగానే ఉన్నప్పటికీ, నేను ఎక్కువ కాలం బ్రతికి ఉండనని నా వయసు చెబుతోంది. నేను ఇంతకు ముందు ఎన్నడూ మరణం గురించి ఆలోచించనేలేదు. కాని ప్రస్తుతం నా మస్తిష్కం చావు గురించిన ఆలోచనలతో నిండి ఉన్నది. నేను తొందరగానే చచ్చిపోతానేమోననే భావన నాలో వణుకు పుట్టిస్తోంది. నాకు ఇప్పుడు సహాయం అవసరం)

*(రీడర్స్ డైజెస్ట్ : డిసెంబర్ 1972)*

ఈ వ్యవహారం ప్రతి ఒక్కరికీ సంబంధించినది. ఎందుకంటే ప్రతి ఒక్కరూ మృత్యువాతన పడవలసి ఉంది. వేనవేల సంవత్సరాల అనుభవంలో ఈ వ్యవహారంలో ఎక్కడా ఎలాంటి వినాయింపు లభించలేదు. ఈ ప్రపంచంలో ఎవడు ఎంత గొప్ప ధనికుడైనా, చావు గురించిన ఆలోచన రాగానే భయంతో వణికిపోతాడు. ఎందుకంటే మరణాన్ని వాయిదాలేదన్న సంగతి అతనికి తెలుసు. తన దగ్గర ఉన్న డబ్బుతో తదనంతర జీవితంలో సాఫల్యాన్ని కొనుగోలు చేయలేనన్న యధార్థం కూడా అతనికి తెలుసు – మానవ నైజంలో అణగారి ఉన్న ఈ అంశం చాలా ముఖ్యమైనది. మీరిచ్చే సత్య సందేశం దీనిద్వారానే అతని మనోక్షేత్రంలో మీరు నాటగలరు. ఈ ద్వారంపై ఏ కాపలాదారు కూడా ఉండదు. మీరు ఎప్పుడు ఒకరి హృదయ ద్వారాన్ని తట్టినా, అది తెరుచుకుంటుంది. ఈ ద్వారం ఎప్పుడూ ఎవరి వద్ద కూడా మూయబడి ఉండదు.

## ఇస్లామీయ కేంద్రం

నేడు యావత్ప్రపంచ ముస్లిముల అతి ముఖ్యమయిన బాధ్యత ఏమిటంటే, వారు ప్రపంచజాతుల సమక్షంలో సత్యసాక్షులుగా నిలబడాలి. వారి ఏ ఇతర పని కూడా ఈ గురుతర బాధ్యత నుండి తప్పించజాలదు. ఇది దైవకార్యం. దీని కొరకు ఆయన విశ్వాసుల ధన ప్రాణాలను కొనుగోలు చేశాడు (తౌబా : 111).

ఈ కార్యాన్ని ఎలా ప్రారంభించాలి? దీనికి సమాధానం ఖుర్ఆన్‌లో ఉంది. ఖుర్ఆన్ ద్వారా మనకు అవగతమయ్యేదేమిటంటే, ముస్లింలకు ఒక కేంద్రం ఉండాలి. అక్కడి నుండి సందేశ పరిచయ కార్యక్రమంతో పాటు, ధార్మిక శిక్షణా ఏర్పాట్లు జరగాలి. అక్కడి నుంచి ఒకవైపున ముస్లిమేతరులకు దైవవాక్కును వినిపించటంతో పాటు (తౌబా – 6) మరోవైపున వివిధ ప్రాంతాలలోని ముస్లింలు తమ బస్తీల నుండి బయలుదేరి ఆ కేంద్రంలో ధర్మపరిచయ కార్యానికి సంబంధించిన

శిక్షణ పొందాలి. వారు అక్కడి నుంచి తమ తమ బస్తీలకు తిరిగివెళ్ళి, తమ జాతుల వారిని సావధానపరచాలి (తౌబా – 122).

ఈ రకమయిన ఒక కేంద్రాన్ని నెలకొల్పటం ముస్లింల గురుతర బాధ్యత. ఆ కేంద్రాన్ని నేటి ప్రపంచ ప్రమాణాలకు దీటుగా తీర్చిదిద్దాలి. క్రైస్తవ మత ప్రచారకులు తమ మత ప్రచారం కోసం నేడు స్థాపిస్తున్న కేంద్రాలలో ఒక్కొక్కటి కొన్ని చదరపు మైళ్ళ వైశాల్యంలో విస్తరించి ఉంది. దాని ఆధ్వర్యంలో రేడియో స్టేషన్లు, వైమానిక దళాలు, యూనివర్సిటీలు ఉన్నాయి. మనం ఆ రకమయిన కేంద్రాలను లేదా అంతకన్నా ఉన్నతమైన కేంద్రాలను స్థాపించనంత వరకూ, మనం సత్యసందేశ కార్యాన్ని నెరవేర్చే విషయంలో దైవసన్నిధిలో క్షంతవ్యులంగా పరిగణించబడలేము. మన వద్ద సువిశాలమైన స్థలంలో ఒక పరిపూర్ణమైన సంస్థ ఉండాలి. అది ప్రచారరంగానికి సంబంధించిన అన్ని రకాల ఒనరులను కలిగి ఉండాలి. దానికంటూ ఒక విశ్వవిద్యాలయం ఉండాలి. ఒక సమగ్రమైన గ్రంథాలయం ఉండాలి. పరిశోధన, రచనలకు సంబంధించిన అత్యున్నత శ్రేణి సంస్థలుండాలి. ముఖ్యమైన భాషలన్నింటిలో ప్రచురణలు రావాలి. రేడియో స్టేషన్లు, వైమానిక దళాలు ఉండాలి. ఒక్క మాటలో చెప్పాలంటే నేడు దేవుని భూమి మీద ఉన్న వాటన్నింటినీ ధర్మపరివ్యాప్తికై ఉపయోగించుకోవాలి.

దైవదాసులందరికీ దైవ సందేశం అందాలి. దేవుడు కోరుకునేది యిదే. ఈ కారణంగానే దేవుడు ఖడ్గబలం ఉపయోగపడే కాలంలో ముస్లింల చేతికి ఖడ్గబలం ప్రసాదించాడు. తద్వారా వారు ఆ కాలంలో తమకు తెలిసిన లోకాన్ని జయించారు. ప్రతిచోటా ఇస్లామ్ ధ్వని ప్రతిధ్వనించేలా చేశారు. అలాగే యంత్రం ప్రాధాన్యతను సంతరించుకున్న కాలంలో వారికి – ఆశ్చర్యకరమైన రీతిలో – చమురు (ఇంధన) శక్తి ఇవ్వబడింది. ప్రపంచబ్యాంకు నివేదిక – 477 ప్రకారం (1974) నేడు పెట్రోలియంను ఉత్పత్తి చేసే దేశాల (OPEC) చేతుల్లో ప్రపంచస్థాయిలో పెట్రోలు వాణిజ్యం వాటా 85 శాతం ఉంది. ఈ విధంగా వారు ఆధునిక ప్రపంచంలో కీలక ఆర్థిక శక్తి (Economic Leverage) గా రూపొందారు. ఈ అవకాశాలు వారికి ఎందుకు ఇవ్వబడినట్లు? ఇస్లామ్ నిజధ్యేయం కొరకు వారు దీనిని వెచ్చిస్తారని.

నేల నుండి చమురును వెలికితీసే పని 1859లో మొదలయింది. అమెరికాకు చెందిన ఎడ్విన్ ఎల్. డెరేక్ పెన్‌సెల్వానియాలో 70 అడుగుల లోతు నుండి చమురును త్రవ్వి తీయటంలో సఫలీకృతుడయ్యాడు. మిడిల్ ఈస్ట్‌లో మొట్టమొదటిసారి 1908లో

మస్జిదె సులైమాన్‌లో పెట్రోలు కనుగొనబడింది. ఆ కాలంలో అరబ్బు జగతిపై తుర్కీల అధికారం ఉండేది. పాశ్చాత్య కంపెనీలు ఉస్మానీ సామ్రాజ్యం నుండి పెట్రోలు తీయడానికి ప్రత్యేక రాయితీలు పొందాయి.

ఆధునిక పారిశ్రామిక ప్రపంచ అభివృద్ధి వెనుకవున్న రహస్యం ఈ పెట్రోలే. వ్యవసాయం కొరకు నీరు ఎంత అవసరమో, మానవ శరీరం కొరకు రక్తం ఎంత అవసరమో పారిశ్రామికాభివృద్ధికి పెట్రోలు అంతే అవసరం. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ఈ సహజ సంపద యొక్క అతి పెద్ద భాగం మిడిల్ ఈస్ట్ లేక సింధుశాఖ అనబడే దేశాలలోని నేల క్రిందనే ఉంది. 20వ శతాబ్ది ఆరంభం మొదలుకుని ఇప్పటి వరకు ఈ సంపద అంతా పాశ్చాత్య పరిశ్రమల స్వాధీనంలో ముఖ్యంగా అమెరికా చెప్పుచేతల్లో ఉంది. ముస్లిం రాజ్యాలలోని పెట్రోలు ద్వారా బలపడి వారు ముస్లిం దేశాలనే లొంగదీసుకుంటూ వచ్చారు. ఈలోగా మన నాట ఎన్నో ఉద్యమాలు ఉద్భవించాయి. పెద్ద పెద్ద నాయకులు ప్రభవించారు. కాని ఏ ఒక్కరూ ఈ రహస్యాన్ని తెలుసుకోలేకపోయారు. 1973 యుద్ధంలో ప్రప్రథమంగా పెట్రోలు ఆయుధాన్ని ఉపయోగించారు. అదైనా పథకం ప్రకారం కాదు, 'గత్యంతరం' లేని పరిస్థితిలో. దాంతో పెట్రోలు ఒక శక్తి అన్న సంగతి ప్రజలకు మొదటిసారి తెలిసివచ్చింది. ఈ ఆయుధాన్ని పాక్షికంగా ఉపయోగించినాసరే అది యావత్ పారిశ్రామిక రంగాన్ని కుదిపివేస్తుందని తెలిసివచ్చింది. నేడు మిడిల్ ఈస్ట్ నుండి తీయబడే చమురు విలువ 1974 నివేదిక ప్రకారం – ప్రతి రోజు 20 కోట్ల డాలర్లు. ఈ పెట్రో డాలర్లు మిడిల్ ఈస్ట్ దేశాలను అకస్మాత్తుగా సుసంపన్నం చేశాయి. ఈ సంపదను ఏం చేసుకోవాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. ప్రపంచ బ్యాంకు అంచనా ప్రకారం 1985 వరకు పెట్రోలు దేశాల వద్ద – సాధ్యమైనన్ని పద్దుల్లో ఖర్చుపెట్టుకున్న తర్వాత కూడా – ట్రిలియన్ డాలర్లకు సమానంగా మిగులు సంపద ఉంటుంది.

ఇక్కడ మేము ఇస్లామ్ ప్రవక్త (స) భవిష్యవాణిని గుర్తు చేయదలిచాము. అరబ్బు జగతిలో కేవలం ఇసుక రేణువులు ఎగిరే ఆ కటిక కొండలు కానవచ్చే కాలంలో చేసిన భవిష్యవాణి అది. ఈ భవిష్యవాణి హదీసు పుస్తకాల్లో వివిధ రకాలుగా పొందుపరచబడి ఉంది. బుఖారీ, ముస్లిమ్‌లలోని ఒక ఉల్లేఖనం ఇలా ఉంది :

"త్వరలోనే ఫరాత్ నుండి బంగారు ఖజానాలు వెలువడతాయి.
ఆ కాలంలో ఉన్నవారు వాటిలో నుండి ఏమీ గ్రహించరాదు."

*(ముత్తఫఖున్ అలై)*

"మీరు దాని నుండి ఏమీ తీసుకోరాద"న్న ఆయన (స) ఉపదేశం ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉంది. అంటే అక్కడ పెల్లుబికే స్వర్ణద్రవాన్ని (Liquid Gold) స్వంత అవసరాల కోసం, విలాసాల కోసం ఖర్చుపెట్టుకోరాదని దీని భావం. పైగా దైవప్రసాదితమయిన ఈ ధనం దైవకార్యం కొరకు వెచ్చించబడాలి. ఏ ఏ రాజ్యాలలో చమురు సంపద బయల్పడిందో ఆయారాజ్యాల పాలిట అది పెద్ద పరీక్ష. దీనిద్వారా వారు సాఫల్యం పొందేమార్గం ఒక్కటే – వారు ఈ సంపదలో నుండి నిత్యావసరాల ఖర్చు వరకు తీసుకుని, మిగతాది ఇస్లామ్ సందేశ పరివ్యాప్తికై, ఇస్లామ్ పునరుద్ధరణకై వెచ్చించాలి. వారు గనక అలా చేయకపోతే ఆ 'నిధి' ప్రళయదినాన వారి పాలిట ప్రాణాంతకంగా పరిణమిస్తుంది. ఖుర్ఆన్‌లోని 9వ సూరాలో ఆ హెచ్చరిక చేయబడింది (తౌబా : 34). పెట్రోలు ఉత్పత్తి చేసే దేశాలు ఈనాడు దైవమార్గంలో ఖర్చుపెట్టదలచినప్పుడు, వారి కొరకు అత్యంత ముఖ్యమైన పద్దు వారు ఉమ్మడిగా ఒక పెద్ద నిధిని ప్రోగుచేసి, ఆధునిక యుగానికి అవసరమైన అత్యున్నత ప్రమాణాలతో కూడిన ఒక ఇస్లామీయ కేంద్రాన్ని నిర్మించాలి. సాధారణ సంస్థలు నేటి ప్రపంచంలో సత్యసాక్ష్యం ఇచ్చే పనిని సజావుగా నిర్వర్తించాలి. ఇది ప్రమాణాలతో కూడుకున్న (Standardization) యుగం. ప్రమాణాల కనుగుణంగా ఉన్నప్పుడే నేటి ప్రపంచంలో ఏ వస్తువైనా ప్రభావవంతం కాగలుగుతుంది.

దైవప్రవక్తల విషయంలో దైవ సంప్రదాయం ఏమిటో అధ్యయనం చేసినప్పుడు అవగతమయ్యేదేమిటంటే, దైవ సందేశానికి ప్రాచుర్యం ఎక్కడ లభించినా దేవుని ఘనత్వాన్ని, వైభవాన్ని చాటిచెప్పటం ద్వారానే లభించింది. పూర్వం ఒకప్పుడు మానవ మనో మస్తిష్కాలలో ఏ వస్తువుకు ప్రాముఖ్యం ఉండేదో దానికనుగుణంగానే ప్రవక్తలకు 'అద్భుతాలు' వొసగబడ్డాయి. మానవుడు తాను నిర్ధారించుకున్న ప్రమాణాల వెలుగులో దైవధర్మం యొక్క ఆధిపత్యాన్ని కానగలగాలన్నది దాని ఉద్దేశం. కాని అంతిమ దైవప్రవక్త (స)కు ఈ రకమయిన 'అద్భుతాలు' ఇవ్వబడలేదు. ఆహూతుల తరఫున వీటికి సంబంధించి తీవ్రమయిన ఒత్తిడి వచ్చినప్పుడు, మీపై అవతరించబడిన ఈ ఖుర్ఆన్ గ్రంథమే మీ పాలిట అద్భుతం (అన్ కబూత్ – 51) అని అనబడింది.

రానున్న కాలపు అవసరాల దృష్ట్యా ఇలా చేయటం జరిగింది. అంతిమ దైవప్రవక్త (స) తదనంతరం మనుజజాతి చరిత్రలో వచ్చిన యుగం శాస్త్రీయ, వైజ్ఞానిక యుగం. రానున్న ఈ యుగంలో 'అద్భుతాలు, చమత్కారాల' స్థానంలో బౌద్ధిక ఆధారాలు, హేతుబద్ధమైన నిదర్శనాలు ప్రాధాన్యతను సంతరించుకోనున్నాయి.

అందుకే పరమ పవిత్రుడగు అల్లాహ్ చివరి యుగంలో తన అభీష్టాన్ని అభివ్యక్తం చేయడానికి 'కలము' (అల్ అలఖ్ : 4)ను సాధనంగా చేసుకున్నాడు. ఖుర్ఆన్ రూపంలో మహోత్కృష్టమైన గ్రంథాన్ని అవతరింపజేశాడు. దానికి దీటైన జవాబివ్వటం మానవుల, జిన్నుల వశంలో లేదు (ఇస్రా : 88).

నేటి యుగంలో మనవల్ల జరిగిన అతి పెద్ద పొరపాటు ఏమిటంటే, వర్తమాన ఆలోచనల కనుగుణంగా – ప్రమాణబద్ధంగా – ఖుర్ఆన్ అభివ్యక్తి జరగలేదు. వర్తమాన కాలంలో మన వైఫల్యాలన్నింటికీ మూల కారణం ఈ పొరపాటులోనే దాగి ఉంది. అందుకే ప్రతిపాదిత ఇస్లామీయ మర్కజ్ చేయవలసిన ప్రప్రథమ పనేమిటంటే, అది అత్యున్నతమైన పరిశోధనా సాధనాలను ఉపయోగించుకుని, ఇస్లామీయ ప్రబోధనలను ఈ కాలపు వైజ్ఞానిక ప్రమాణాలకు దీటుగా సమర్పించాలి, దాని ఆధ్వర్యంలో ఉండే విభాగాలన్నింటి లక్ష్యం దీనిపైనే కేంద్రీకృతం అయి ఉండాలి.

వైజ్ఞానిక కృషికి సంబంధించిన రెండు కోణాలున్నాయి – అవి ఈ క్రింది ఆయత్ ద్వారా సంగ్రహించబడతాయి –

> (ప్రవక్తా!) వారిని అడుగు : అల్లాహ్‌ను కాదని మీరు మొరపెట్టుకునే వాటిని గురించి ఎన్నడయినా ఆలోచించారా? వారు భువిలో చేసిందేమిటో నాకు చూపండి? పోనీ గగన సీమల్లో వారికేదన్నా భాగస్వామ్యం ఉన్నదా? మీరు చెప్పేదే నిజమైతే, దీనికి పూర్వం ఉన్న ఏదన్నా గ్రంథంగానీ, చెలామణిలో ఉన్న ఏదయినా జ్ఞాన విశేషంగానీ నా వద్దకు తీసుకురండి. *(అల్ అహ్ఖాఫ్ : 4)*

ఈ ఆయత్ ద్వారా తెలిసేదేమిటంటే, అల్లాహ్ దృష్టిలో ఏదయినా విషయాన్ని నిజమని నిరూపించటానికి రెండు నిదర్శనాలు అవసరం. ఒకటి : ప్రామాణికమైన ఆకాశగ్రంథం. రెండు : కాలపు విజ్ఞుల దృష్టిలో గుర్తింపు పొందిన విజ్ఞానం. ఈ రెండు వస్తువులనే మనం సత్యసందేశ కార్యం కొరకు సమకూర్చుకోవలసి ఉంది. ఒకవైపున ఖుర్ఆన్ ప్రబోధనలను హెచ్చుతగ్గులు లేకుండా విడమరచి చెప్పాలి. రెండవ వైపున చెలామణిలో ఉన్న వైజ్ఞానిక, శాస్త్రీయ ప్రమాణాలపై ఇస్లాంను సమర్పించాలి. ధార్మిక ప్రబోధనలను సత్యమని నిరూపించే ఎన్నో రచనలు, పుస్తకాలు మన తరఫున ప్రాచుర్యంలోనికి వచ్చాయి. కాని ఇవన్నీ చాలావరకు సంప్రదాయ

శైలిలో ఉన్నాయి. ఆధునిక ఆలోచనల కనుగుణంగా, అవసరాల కనుగుణంగా వాటిని మలచవలసిన ఆవశ్యకత ఇంకా మిగిలి ఉంది.

ఈ సందర్భంగా మొట్టమొదటి వస్తువు ఖుర్ఆన్. ఇస్లామీయ సందేశకార్యం విషయంలో అన్నిటికన్నా ప్రభావవంతమైన వస్తువు స్వయంగా ఖుర్ఆనే అన్నది నిజం. ఏ పుస్తకంగానీ, ప్రసంగం గానీ, చర్చగానీ ఈ దైవవాక్కుకు ప్రత్యామ్నాయం కాజాలదు. కాని ఖుర్ఆన్ భాష ఎరిగినవాని కొరకే ఖుర్ఆన్ ప్రభావవంతం కాగలదు. ఇస్లామ్ తొలికాలపు సందేశ ప్రదాతలకు ఈ సంగతి బాగా తెలుసు. అందుకే వారు అరేబియా ఎల్లలు దాటి బయటికి వచ్చినప్పుడు, ఇతర జాతుల వారికి అరబీ భాష నేర్పటంపైనే దృష్టిని కేంద్రీకరించారు. ఆనాడు అరేబియా ద్వీపం బయట నివసించే జాతుల్లో విభిన్న భాషలు ప్రాచుర్యంలో ఉండేవి. ఇరాక్, సిరియా దేశాలలో ఆరామిక్ భాష ఉండేది. ఈజిప్టులో ఖిబ్తీల భాష ఉండేది. ఆఫ్రికాలో బర్బరీ భాష మాట్లాడేవారు. అరబ్బుల కృషి ఫలితంగా నూరేళ్ళలోపే ఈ భాషలన్నీ అంతరించి, ఆ ప్రాంతమంతా అరబీ మాట్లాడేవారి ప్రాంతంగా మారిపోయింది. తరువాతి కాలంలో ముస్లిం జాతులలో స్తబ్ధత ఆవరించినప్పుడు సిసలయిన లక్ష్యం తెరమరుగు అయింది. కాకపోతే పనికిరాని వాటిపై చర్చ మొదలయింది – ఉదాహరణకు– ఇతర భాషలలో ఖుర్ఆన్‌ను అనువదించటం ధర్మసమ్మతమేనా? కాదా? అరబ్బేతర భాషల్లో జుమా ప్రసంగం ఇవ్వవచ్చునా? లేదా? మొదలగునవి.

అదృష్టవశాత్తు నేడు వివిధ కారణాల వల్ల అరబీ భాష ప్రాముఖ్యత పెరుగుతోంది. పెట్రోలు రాజకీయం ఎంతగా పెరిగిందంటే, దాని మూలంగా ఐక్యరాజ్య సమితిలో అరబీ భాషను ఐదవ అంతర్జాతీయ భాషగా స్వీకరించటం జరిగింది. ప్రాచీన చరిత్రలో దాని మూల భాష ద్వారా సంగ్రహించే ధోరణి వల్లనూ, మత ధర్మాలను సరికొత్తగా శోధించి విశ్లేషించాలనే మనస్తత్వం వల్లనూ ప్రజలు అరబీ భాష వైపునకు ఆకర్షితులవుతున్నారు. 10 కోట్లమంది మాట్లాడే అరబీ భాష 21 దేశాల అధికార భాషగా ఉంది. అన్ని దేశాల విదేశాంగ శాఖలో అరబీ భాష తన ప్రాధాన్యతను ఇప్పటికే చాటుకుంది. అదలావుంచితే అరబ్బు సంపద అన్ని జాతుల వారికి అరబీ భాష పట్ల ఆసక్తిని జనింపజేసింది.

ఈ కొత్త అవకాశాలను మనం అరబీ భాషాభివృద్ధికై పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలి. ఇక్కడి అధునాతన పద్ధతులు మనకు మరింత సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నాయి. నేడు ఏదయినా కొత్త భాషను నేర్చుకోవడానికి క్రోడీకరించబడిన

పద్ధతులు అద్భుతం. అవి కేవలం కొన్ని వారాలలోనే ఒక వ్యక్తికి కొత్త భాష నేర్పగలవు. మనం ఆ పద్ధతులను అవలంబించి అరబీ భాషాభివృద్ధికి పాటుపడాలి. ప్రాచీన పద్ధతులకు స్వస్తి పలకాలి.

ఈ సందర్భంగా మరో ఆవశ్యకత ఏమిటంటే ఖుర్ఆన్ ప్రబోధనలు, సీరత్, ఇస్లామీయ చరిత్ర, ప్రవక్త సహచరమాన్యుల స్థితిగతులు మొదలగు సబ్జెక్టులపై వివిధ భాషలలో ముక్కుసూటిగా విషయాన్ని వివరించే పుస్తకాలు రచించాలి. ఈ సాహిత్యంలో ఎలాంటి వర్ణనలు, అధిక ప్రసంగాలు, పాక్షిక సాపేక్షిక అంశాలు ఉండకూడదు. ఈ రంగంలో శిక్షణ పొందినవారు, సాహిత్యంలో ఆధునిక పోకడలపై పట్టున్నవారు ఈ పని చేయాలి.

2. ఆ తరువాత రెండవ ముఖ్యాంశం ఇస్లామ్ జ్ఞానానికి సంబంధించిన అభివ్యక్తి. దీని అర్థం ఏదో చేతికి దొరికిన పుస్తకాల ఆధారంగా పుస్తకాలు రాసి ప్రచురించటం కాదు. ఇది చాలా ముఖ్యమైన పని. వాస్తవానికి ఇది వర్తమాన కాలంలో దైవప్రవక్తలు ఆవిష్కరించిన దానికి ప్రత్యామ్నాయం వంటిది. కాబట్టి మిడి మిడి జ్ఞానంతో నామకా ఈ పని చేయకూడదు.

ఖుర్ఆన్ ద్వారా మనకు బోధపడేదేమంటే, అల్లాహ్ హెచ్చరిక చేసే వారెందరిని పంపించినా ఆయా జాతుల ప్రజలు మాట్లాడే భాషలో సంభాషించేవారిగానే చేసి పంపాడు (ఇబ్రాహీమ్ : 4). జాతుల వారు మాట్లాడే భాష అంటే అర్థం కేవలం భాష మాత్రమే కాదు, వారి జానపదాలు, లోకోక్తులు, సంస్కృతి కూడా ఇందులోకి వచ్చేస్తాయి. కాబట్టి ఏదేని భాషలో ఇస్లామ్ సందేశాన్ని పరిచయం చేస్తున్నప్పుడు, ఆ భాష ప్రజల వాడుక భాషలో ఉండాలి. దాని మాండలికాలను, యాసను, ప్రసంగాలను కూడా దృష్టిలో ఉంచుకోవాలి. విషయాన్ని సమర్పిస్తున్నప్పుడు ఆయా ప్రజల అభిరుచిని, అభివ్యక్తిని, ఆలోచనా సరళిని కూడా పసిగట్టి తదనుగుణంగా సాహిత్యాన్ని తయారుచేయాలి. ఉదాహరణకు : ఈ కాలం విశ్లేషణ ద్వారా విషయాన్ని తరచిచూసే కాలం. ఎవరయినా ఒక వ్యక్తి విషయాన్ని తరచి చూడకుండా కేవలం భావోద్వేగంతో ఊకదంపుడు ఉపన్యాసాలిస్తే, పద్యరూపంలో మనోభావాన్ని అభివ్యక్తం చేస్తే అది ఒక విధంగా కాలానికి వ్యతిరేకమైన పోకడ (Anarchronism) అవుతుంది. అది ఖుర్ఆన్ బోధనా శైలికి అనుగుణంగా ఉండదు.

ఇస్లామీ మర్కజ్ రెండవ అతి ముఖ్యమైన లక్ష్యం ఆధునిక కాలపు అవసరాల కనుగుణంగా వ్యక్తులను తయారుచేయటం. ఈ పని కేవలం శిక్షణా శిబిరాల ద్వారా

సాధ్యమవదు. దీనికోసం అధునాతన, ప్రమాణబద్ధమైన యూనివర్సిటీ అవసరం. రాబోయే కాలంలో ఇస్లామ్‌కు ఎదురుకానున్న సవాళ్ళ దృష్ట్యా అనుభవజ్ఞులైన వారి సారథ్యంలో ఉత్తమ శ్రేణి కార్యకర్తలను తయారు చేయాల్సిన ఆవశ్యకత ఉంది.

ఖుర్‌ఆన్‌లో మహనీయ మూసా (అలైహిస్సలామ్) గురించి ఏమనబడిందో చూడండి. ఆయన్ని ఫిరౌన్ దర్బారు నుండి వెలికితీసి, ఎడారి ప్రదేశాలలో, అడవుల్లో వివిధ అనుభవాలను చవిచూసేలా చేయటం జరిగింది. వీటన్నింటిలో రాటుదేలిన మీదట – దైవ సంప్రదాయం ప్రకారం ఆయనకు ప్రవక్తా పదవిపై నియుక్తం చేయటం జరిగింది. ఆయన ఆ కార్యాన్ని సజావుగా నిర్వర్తించడానికి గాను దేవుడు ఆయన్ని పరికించాడు (తాహా – 40). అల్లాహ్ ఇదే విధానాన్ని తన ప్రవక్తలందరి విషయంలో కూడా అనుసరించాడు.

తరువాతి కాలపు సందేశ ప్రదాతలు (దాయీలు), ప్రచారకులు కూడా ఈ సూత్రాన్ననుసరించి తమ్ము తాము సన్నద్ధుల్ని చేసుకోవాలి. వారు ఏ జాతుల మధ్య పనిచేయగోరుతున్నారో, వారి భాషలను నేర్చుకోవాలి. జైద్ బిన్ సాబిత్ అన్సారీ (రజి)కి ఆరు భాషల్లో ప్రవేశం ఉండేది – అరబీ, పారసీకం, రూమీ, ఖిబ్తీ, హబషీ, సిరియానీ. ఇతర మతాల తులనాత్మక అధ్యయనం చేయదలచిన వారికి, ఇతర మతాలకు దీటుగా ఇస్లామ్‌ను ఎలా విడమరచి చెప్పాలో తెలియాలి. ఆ మేరకు ప్రావీణ్యం పొందాలి. అన్ని విధాలుగా శిక్షణ పొంది, ప్రావీణ్యం సంపాదించినప్పుడే అతను ఇతరుల సమక్షంలో 'ధర్మసందేశ దాత' కాగలడు.

క్రైస్తవ మిషనరీలు తమ సందేశ ప్రచారకుల శిక్షణ కోసం చేసిన ఏర్పాట్లు ఆశ్చర్యచకితుల్ని చేస్తాయి. ఉదాహరణకు : సోవియట్ యూనియన్‌లో క్రైస్తవ మత పరిస్థితి ఎలా ఉందో తెలుసుకోవాలన్న ఆలోచన వారికి కలిగింది. దాని కొరకు వారు అమెరికాలో జనావాసాలకు బహుదూరంగా ఒక టౌన్‌ను నిర్మించారు. ఆ టౌన్ పూర్తిగా సోవియట్ రష్యా పట్టణాన్ని పోలి ఉంది. అక్కడ కేవలం రష్యన్ భాష మాట్లాడేవారు తినటం, త్రాగటం, కూర్చోవటం, లేవటం – అన్నీ రష్యన్ తరహాలోనే. ఈ విధంగా ఎంతోమంది పాదరీలకు క్రియాత్మకంగా ఎటువంటి శిక్షణ ఇచ్చారంటే, వారు తమ రూపురేఖలు మొదలుకుని అలవాట్లు, అభిరుచుల వరకు అచ్చం రష్యన్‌ల మాదిరిగానే కనిపించేవారు. ఆ తరువాత వారికి విమానాలు నడిపే, పారాచూట్ ద్వారా క్రిందికి దిగే శిక్షణ ఇచ్చారు. ఆ విధంగా వారు ఒక నిర్ణీత కాలం వరకు రష్యన్ పౌరుల మాదిరిగా జీవించారు. రిస్కుతో కూడిన ఈ పనితోపాటు వారికి

రష్యా భౌగోళిక పరిస్థితుల పట్ల కూడా క్షుణ్ణంగా అవగాహన కల్పించటం జరిగింది. ఈ ప్రక్రియ అంతా విజయవంతంగా పూర్తయిన పిదప, సుదూర ప్రాంతంలో విమానాన్ని ల్యాండింగ్ చేయటం జరిగింది – నిర్ధారిత కార్యక్రమం ప్రకారం వారు అక్కడ ఉండి, మళ్లీ విమానంలో కూర్చుని తమ కేంద్రానికి తిరిగి వచ్చారు.

ఆధునిక యుగంలో మతధర్మాల ప్రచారకులు నెలకొల్పిన శిక్షణా ప్రమాణాలకు ఇదొక మచ్చుతునక. నేడు మనం ఈ ప్రమాణాలను లేదా ఇంతకన్నా ఉన్నత ప్రమాణాలను నెలకొల్పుతూ కార్యకర్తలకు శిక్షణ ఇవ్వకపోతే ఇస్లామ్ పరిచయకార్యం విజయవంతంగా నెరవేరదు.

పైన పేర్కొనబడిన సన్నాహాలతో పాటు ఇస్లామీయ కేంద్రం ఆధ్వర్యంలో ప్రజల్లో పనిచేయటం కూడా అవసరమే. ఖుర్ఆన్ సున్నత్‌ల వెలుగులో దానికి సంబంధించిన కొన్ని కోణాలు ఇవి :

1. అన్నిటికన్నా మొదటి పనేమిటంటే, సాధారణ ముస్లింలలో చైతన్యాన్ని మేల్కొలపాలి – వారు సాధారణ మనుషుల్లాంటివారు కారు. పైగా వారు ఉమ్మతె ముహమ్మదీకి చెందిన సభ్యులు. అందువల్ల వారిని ఒకే సమయంలో రెండు విషయాలకు బాధ్యులుగా ఖరారు చేయటం జరిగింది – ఒకటి : వారు తమ వ్యక్తిగత జీవితంలో ఈమాన్, ఇస్లామ్‌లు వాంఛించే వాటికి కట్టుబడి ఉండాలి. రెండు : వారు ఈ ప్రపంచంలో సత్యసాక్షులం అన్న ధ్యాసతో జీవితం గడపాలి.

> "విశ్వసించిన వారలారా! న్యాయానికి గట్టిగా నిలబడేవారు, దైవం కొరకు సాక్ష్యమిచ్చేవారు అవండి." *(అన్ నిసా : 135)*

ఒక వ్యక్తి ఇస్లామ్‌ను స్వీకరించగానే, అతను తన జీవితపు సమస్త వ్యవహారాలలో, దేవుడు నిర్ధారించిన 'సమతూకం'తో కూడిన మార్గంపై నడవటానికి బద్ధుడైపోతాడు. అయితే అతను, ఇస్లామ్ స్వీకరించని వ్యక్తికి తారసపడినప్పుడు అతని బాధ్యత మరింతగా పెరిగిపోతుంది. ఇప్పుడతను ముస్లిమ్‌గా మసలుకోవటంతో పాటు 'సాక్షి'గా కూడా వ్యవహరించవలసి ఉంటుంది. అంటే అతను ఈ ప్రపంచంలో ఇతరులతో వ్యవహారం చేసేటప్పుడు దేవుని ప్రతినిధిగా వ్యవహరించవలసి ఉంటుంది. ఎందుకంటే అతని ఒక్కొక్కమాట ద్వారా, ఒక్కొక్క ఆచరణ ద్వారా దైవేచ్ఛ ఏమిటో, ఏ వైఖరి ద్వారా మనిషి దైవసన్నిధిలో సఫలీకృతుడవుతాడో జనులు తెలుసుకోవలసి ఉంటుంది. రోడ్డు ప్రక్కన పాతబడిన సైన్‌పోస్ట్ (Sign Post) ఎంతో వినయంగా

వెళ్ళవలసిన మార్గాన్ని సూచిస్తుంది. ఒకవేళ ఆ సైన్‌పోస్ట్ అలా చేయకపోతే పురపాలక వ్యవస్థలో దానికెలాంటి విలువ ఉండదు. అలాగే ముస్లింలు ఈ ప్రపంచంలో సత్యానికి ప్రాతినిధ్యం వహించే స్థానంలో నిలబెట్టబడ్డారు. సాధారణ పరిస్థితుల్లో ఒక ముస్లిం వల్ల జరిగిన లోటు క్షమార్హం కాగలదు. కాని అది ఒక ముస్లిమేతరునికి ఎదురుగా ఉన్నప్పుడు, అతనెంతో జాగ్రత్తగా వ్యవహరించవలసి ఉంటుంది. ఎందుకంటే, అతని వల్ల జరిగిన పొరపాటు ముస్లిమేతర వ్యక్తిపై తప్పుడు ప్రాతినిధ్యంగా పరిణమించవచ్చు. ఒక ముస్లిం కొరకు సాధారణ జీవితంలో చిన్న చిన్న తప్పులు (అన్ నజ్మ్ : 22) క్షమార్హమే. కాని వ్యవహారం ముస్లిమేతరులతో జరుగుతున్నప్పుడు, సత్యానికి విముఖత చూపటం అసత్యానికి సాక్ష్యం (ఫుర్ఖాన్ : 72)గా పరిణమిస్తుంది. అసత్యానికి సాక్షులుగా ఉండటం దేవుని దృష్టిలో ఘోరమైన అపరాధం.

2. అరేబియాలో ఏడాది కాలంలో వివిధ ప్రదేశాలలో జాతీయస్థాయి సంతలు, తిరునాళ్ళు నిర్వహించబడేవి. అక్కడ వివిధ తెగలవారు ప్రోగయ్యేవారు. అక్కడ వ్యాపారం జరిగేది. వినోద కార్యక్రమాలు ఉండేవి. ఈ రోజుల్లో కూడా ఇలాంటి మేలాలు నిర్వహించబడుతున్నాయి. సీరత్ గ్రంథాలలో ఉకాజ్, జుల్‌మజాజ్, మినా, ముజన్నా తదితర మేలాల ప్రస్తావన వస్తుంది. ఇస్లామ్ ప్రవక్త (స) తన సందేశ ప్రచారం కొరకు ఈ మేలాలకు వెళ్ళి జనులను సత్యం వైపునకు ఆహ్వానించేవారు. ఆయన సహచరమాన్యులొకరు, తన తొలి కాలపు సంఘటన గురించి ఇలా అంటారు : నేను మొట్టమొదటిసారి ఆయన్ని జుల్‌మజాజ్ సంతలో చూశాను. ఆయన (స) ఎర్రని శాలువా కప్పుకుని, మార్కెట్ మీదుగా సాగిపోతూ ఇలా ప్రకటిస్తున్నారు –

> "ప్రజలారా! అల్లాహ్ తప్ప వేరొక నిజ ఆరాధ్యదైవం లేదని చెప్పండి,
> మీరు సాఫల్యం పొందుతారు."

ఈ పద్ధతిని నేడు – స్వల్పమైన మార్పులతో – అవలంబించవచ్చు. వివిధ రకాల సదస్సులు, సమ్మేళనాలు, ఎగ్జిబిషన్‌లు, మేలాలు జరుగుతున్నప్పుడు స్టాల్స్ పెట్టవచ్చు. ఆ స్టాళ్ళలో వివిధ భాషల్లో చిన్న చిన్న ఇస్లామీయ పుస్తకాలు, కరపత్రాలు, ఛార్టులు పెట్టి ఉచితంగా పంపిణీ చేయవచ్చు. లౌడ్ స్పీకర్ల ద్వారా ఉత్తమ రీతిలో దైవ సందేశాన్ని వినిపించవచ్చు. సంచార గ్రంథాలయాలను నెలకొల్పవచ్చు. కార్నర్ మీటింగుల ద్వారా విషయాన్ని చేరవేయవచ్చు.

3. దైవప్రవక్త (సఅసమ్) మహనీయ ఖాలిద్ (రజి)ను బనీ హారిస్ ముస్లిమేతర

తెగ వద్దకు పంపించారని చరిత్ర చెబుతోంది. ఆ తెగ వారికి ఇస్లామ్ సందేశం చేరవేయటం దీని ఉద్దేశం. హజ్రత్ ఖాలిద్ తన సహచర బృందంతో కలసి బనీ హారిస్ నివసించే నజరాన్ ప్రాంతానికి చేరుకున్నారు. వారు ఒంటెలపై కూర్చుని నజరాన్‌లోని వీధి వీధినా, వాడవాడనా గస్తీచేసి ఇస్లామ్ సందేశం వినిపించారు. వారు బిగ్గరగా ఇలా ప్రకటించేవారు –

"ప్రజలారా! ఇస్లామ్ స్వీకరించండి, సాఫల్యం పొందుతారు."

*(అల్ బిదాయ వన్నిహాయ – సం.5; పు.98)*

ఈ రకమయిన బృందాన్ని ఇస్లామీయ పరిభాషలో 'సరియ్యా' అంటారు. హిజ్రత్ అనంతరం ఈ రకమయిన బృందాలు ముస్లిమేతర జనావాసాలకు నిరంతరం పంపబడ్డాయి. వారు జమాఅత్ రూపంలో వెళ్ళి సాదాసీదా పద్ధతిలో ఇస్లామ్ సందేశాన్ని చేరవేసేవారు. ఈ పద్ధతిని ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా మలచి ఇస్లామ్ పరిచయం కొరకు అవలంబించవచ్చు.

ఉదాహరణకు ఏదయినా ముస్లిమేతర వీధిని లేక వాడను ఎంపిక చేసుకుని అక్కడి పరిస్థితులను అధ్యయనం చేయాలి. తదనుగుణంగా ఒక బృందాన్ని తయారుచేయాలి. ఈ బృందం అమిర్‌కు లోబడి ఉండాలి. ఆ అమీర్ అనుమతితోనే ఎవరయినా ప్రసంగించాలి (లేదా సంభాషించాలి). మిగిలిన వారంతా నిశ్శబ్దంగా ఉండి, దుఆ చేసుకుంటూ ఉండాలి. ఈ బృందంలోని సభ్యులు నిర్ణీత బస్తీకి చేరుకుని అన్నిటికన్నా ముందు రెండు రకతుల నమాజ్ చేసుకోవాలి. ఈ కార్యంలో తమకు తోడ్పడమని అందరూ దైవాన్ని వేడుకోవాలి, ఆ తరువాత వారు ఆ వీధిలో లేదా వాడలో గస్తీ కొరకు బయలుదేరాలి. వారి చేతిలో ఒక అందమైన కార్డు ఉండాలి. ఈ రోజు ఫలానా చోట, ఫలానా సమయంలో సమావేశం ఉందనీ, అందరూ సపరివార సమేతంగా హాజరు కావాలని ఆ కార్డుపై ముద్రించబడి ఉండాలి – స్త్రీ పురుషులందరినీ ఆహ్వానించాలి. వారు ప్రజల చేతికి ఇచ్చే కార్డుపై ఒక వైపు దివ్య ఖుర్ఆన్‌లోని ఒక చిన్న ఆయత్‌కు తర్జుమా ఉండాలి. ఉదాహరణకు : "దేవుడు మిమ్మల్ని శాంతి నిలయం వైపునకు పిలుస్తున్నాడు" (యూనుస్ : 25).

And God calls to the home of peace.

ఆ బృందానికి నాయకుడుగా ఉన్న వ్యక్తి (అమీర్) ఇంటి యజమానికి

ఆ కార్డు అందజేయాలి. అతనితో క్లుప్తంగా మాట్లాడి ఫలానా చోట కండక్ట్ చేయబడిన సమావేశానికి విచ్చేయమని ఆహ్వానించాలి.

ఈ విధంగా ఆ బస్తీ అంతా గస్తీ చేసి ఇంటింటికీ సందేశం చేరవేయాలి. ఆ తరువాత బృందంలోని సభ్యులంతా నిర్ణీత స్థలానికి చేరుకుని నమాజ్ చేయాలి. దైవనామాన్ని స్మరించాలి. దుఆ చేయాలి. గ్రంథ పారాయణం చేయాలి. అనవసరమైన మాటలతో, వృథా కాలక్షేపం చేయకూడదు. ఆరాధనలు, వేడుకోళ్ళు, గ్రంథ పారాయణం, దైవధ్యానం వల్ల ఆ స్థలం జ్యోతిర్మయం అవుతుంది. చెప్పేవారి మాటలు ప్రభావవంతం అవుతాయి. మనోక్షేత్రంలో మాట నాటుకునేలా మాట్లాడటమంటే ఇదే (అన్ నిసా : 63). వక్త అక్కడ ప్రసంగించటానికి ముందు రిహార్సల్ చేసుకుని వెళ్ళటం మంచిది.

4. నేటి కాలంలో సభలు, సమావేశాల కోసం మైదానాలు, పార్కులు, ఆడిటోరియంలు ఉన్నట్లే ప్రాచీన అరేబియా (మక్కా)లో సఫా కొండ ఉండేది. అది వాస్తవానికి ఒక గుట్ట. దానిపై నిలబడి మనిషి కేకవేసేవాడు. జనులు గుమిగూడిన తరువాత తాను చెప్పదలచిన విషయాన్ని చెప్పేవాడు –

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి) ఇలా అంటున్నారు :

''నీ సమీప బంధువులను భయపెట్టు'' అనే ఆయత్ అవతరించినప్పుడు, దైవప్రవక్త (స) సఫా కొండపైకెక్కి, 'ప్రజలారా! అయ్యో, ఉదయకాలపు విపత్తు గురించి పట్టించుకోండి' అని బిగ్గరగా పిలుపు ఇచ్చారు. ఈ పిలుపు వినగానే జనులు ఆయన (స) దగ్గర గుమిగూడారు. కొంతమంది స్వయంగా లేచివస్తే, మరికొందరు తమ బదులు ఇతరులను పంపించారు. ఆయన (స) వారినుద్దేశించి, 'ప్రజలారా! ఈ పర్వతం వెనుక ఒక సైనిక దళం మిమ్మల్ని దోచుకోవడానికి మోహరించి ఉందని నేను చెబితే, మీరు నా మాటను నమ్ముతారా?' అని అడిగారు. దానికి వారు 'అవున'న్నారు. అప్పుడు ఆయన (స), 'పరలోకపు భయంకరమయిన శిక్ష గురించి మీకు భయబోధ చేస్తున్నాను. అది మీ ముందుంది' అని చెప్పారు.

ఇదేవిధంగా మనం నేటి 'సఫా'ను వేదికగా చేసుకుని దేవుడు చేసిన మనుషులకు సత్యసందేశం వినిపించాలి.

5. ఇస్లామీ మర్కజ్ (కేంద్రం)లో ఒక ఇస్లామిక్ మ్యూజియంను కూడా నెలకొల్పాలి. అందులో ఇస్లామీయ చారిత్రక చిహ్నాలను సేకరించాలి. గత కాలపు చారిత్రక సంఘటనలను పరిశోధనాత్మక దృష్టితో చూసే అభిరుచి నేడు బాగా పెరిగింది. ఉదాహరణకు : మహనీయ మసీహ్ (ఏసుక్రీస్తు) వృత్తాంతంగానీ, అంతకు పూర్వం ఉన్న దైవప్రవక్తల ప్రస్తావనగానీ, చారిత్రక రికార్డులలో లభ్యం కాదు. అందుకే ఈ ప్రవక్తలను పూర్వపు గాథలుగా ఖరారు చేయటం జరిగింది. వారిని చారిత్రక ప్రముఖులుగా పేర్కొనటం జరగలేదు. కేవలం చిట్టచివరి ప్రవక్త (స) జీవితం మాత్రమే 'చరిత్ర'గా రికార్డయింది. ఈ మ్యూజియంలో ఆయన (స) కాలం నాటి చరిత్రకారుల గ్రంథాలను సేకరించాలి. అవి ఆరామిక్ భాషలోనూ, ఇతర భాషల్లోనూ ఉన్నాయి. ఆ గ్రంథాలలో "ఇస్మాయీలీ ప్రవక్త" ప్రస్తావన చాలా వివరంగా ఉంది. అదేవిధంగా ఆయన (స) వివిధ చక్రవర్తులకు తన హయాంలో వ్రాసిన లేఖలను కూడా సేకరించాలి. ఆ లేఖల ఫోటోలను తీసి మ్యూజియంలో భద్రపరచవచ్చు. హజ్రత్ ఉస్మాన్ (రజి) పారాయణం చేసిన ఖుర్ఆన్ మొట్టమొదటి ప్రతి తాష్కెంట్ లైబ్రరీలో సురక్షితంగా ఉంది. దాని ఫోటోను కూడా గ్రహించి భద్రపరచాలి. ఇస్లామ్ ప్రవక్త, ఆయన ప్రియ సహచరులు నివసించిన ప్రదేశాలు నేటికీ సురక్షితంగా ఉన్నాయి. కడకు ఆయన (స) క్లేశాలు, దుస్తులు, ఆయన ఉపయోగించిన పనిముట్లు నేటికీ ఉన్నాయి. ఈ విధంగా అసంఖ్యాకమయిన పురావస్తు చిహ్నాలను, కనీసం వాటి ఫోటోలను తీసి భద్రపరచవచ్చు. ఈ రకమయిన మ్యూజియంను గనక నెలకొల్పి, దానిని నిర్వహించినట్లయితే అది ఇస్లామ్ సాక్ష్యాధారాల కేంద్రంగా రూపొందుతుంది. దానిని సందర్శించటానికి దూర ప్రదేశాల నుంచి ప్రజలు వస్తారు.

6. పైన ప్రస్తావించబడిన విభాగాలతో కూడిన ఈ రకమయిన ఇస్లామీయ కేంద్రం గనక స్థాపించబడినట్లయితే, అక్కడ నమాజ్ మొదలుకుని ఇస్లామీయ గ్రంథాలయం వరకు, ఇస్లామీయ మ్యూజియం వరకు – అన్నీ ఒకచోట కానవచ్చినట్లయితే దివ్య ఖుర్ఆన్‌లోని క్రింది ఆయత్‌లో పేర్కొనబడిన ప్రయోజనాలన్నీ ఒకగూడుతాయి –

> ఒకవేళ బహుదైవారాధకులలోని ఏ వ్యక్తి అయినా నీ శరణు కోరితే, అతను దైవవాక్కును వినగలందులకు అతనికి ఆశ్రయం కల్పించు. ఆ తరువాత అతన్ని సురక్షితంగా అతని గమ్యస్థానానికి చేర్చాలి. ఎందుకంటే వారు తెలియనివారు. *(అత్ తౌబా : 6)*

7. తొలికాలంలో అరబ్బులలోని స్వాభావిక స్థితి ఇస్లామ్ కొరకు ఒక సారవంతమైన భూమికను తయారుచేసింది. ప్రస్తుత కాలంలో దానికి ప్రత్యామ్నాయం సైంటిఫిక్ సొసైటీ. అమెరికాలోని సుప్రసిద్ధ వాటర్ గేట్ ఉదంతం (1972), ఆ తరువాత ప్రపంచంలోని అత్యంత శక్తిమంతమైన పరిపాలకుడు రిచర్డ్ నిక్సన్ అధ్యక్ష పదవిపై ఉంటూ కూడా కఠినాతి కఠినమైన నిలదీత (అభిశంసన)కు గురవటం, ఆనక అతను 1974లో పదవికి రాజీనామా చేయటం – ఒక అద్భుతమైన సంఘటన. ఇటువంటి ఉపమానం ఇస్లామీయ సమాజంలో లభించగలదు లేదా సైంటిఫిక్ సొసైటీలో లభించగలదు. ఏ ఏ దేశాలలో వైజ్ఞానిక శిక్షణ ఫలితంగా ఇలాంటి సొసైటీ ఏర్పడిందో అక్కడ గనక సత్యధర్మాన్ని ఆ స్థాయిలో పరిచయం చేసినట్లయితే ప్రజల హృదయ కవాటాలు తప్పకుండా తెరచుకునే అవకాశం ఉంది.

మీ ముందున్న ఈ పుస్తకానికి తుదిమెరుగులు దిద్దుతున్న కాలం 1974 జులై 13, 14 తేదీల మధ్య రాత్రి నేనొక కల గన్నాను. కలలో నేను కొంతమంది ముస్లిమేతర సోదరుల మధ్యన ఉన్నాను. వారికి ఇస్లామ్ గురించి వివరిస్తూ ఉన్నాను. ఆధునిక విద్యనభ్యసించిన ఈ జనులు తమ సైంటిఫిక్ మనస్తత్వం కారణంగా ఇస్లామ్‌లోని సత్యనిబద్ధతను అనుభవపూర్వకంగా తెలుసుకోగోరుతున్నారు. నేను పూర్తి ఆత్మ విశ్వాసంతో వారికి సమాధానమిచ్చాను. “ఇది సంభవమే. దీనిని మీరు ఇస్లామ్ ప్రధానాంశాలలో ఒకటైన నమాజ్ ద్వారా అనుభవపూర్వకంగా తెలుసుకోండి.” ఈ సంభాషణ ఇంగ్లీషులో కొనసాగుతోంది. నేను మేల్కొనేటప్పటికి ఈ వాక్యంలోని ఒక్కొక్క పదం నాకు జ్ఞాపకం ఉంది :

Without being a Muslim you can experience Namaz.

ఆ తరువాత నేను నా సహవాసులతో, వీరికి వజూ చేయించండి, నేను వీరికి నమాజ్ చేయిస్తాను. వీరు నాతోపాటు నిలబడి నమాజ్ చేస్తారని అన్నాను.

ఈ స్వప్నం తరువాత నేను ఆలోచించగా నాకు బోధపడినదేమంటే, నమాజ్

ద్వారా సూత్రప్రాయంగానే కాకుండా ఆచరణాత్మకంగా కూడా ఈ ప్రయోజనాలు చరిత్రలో పదే పదే ప్రాప్తమైనాయి. హజ్రత్ హమ్జా (రజి) పచ్చి కాలేయాన్ని కసితీరా నమలిన కఠినాత్మురాలు హింద్ ఇస్లామ్‌కు ప్రభావితం కావటానికి కారణం నమాజేనని ఉల్లేఖనాల ద్వారా తెలుస్తోంది.

ఆఫ్రికా చరిత్రకారుల్లోని ఒక సభ్యుడు ఇలా వ్రాస్తున్నాడు :

> "మధ్య ఆసియాలో ఇస్లామ్ పరివ్యాప్తి చాలా వరకు పర్యాటకుల, వర్తకుల ద్వారా జరిగింది. ముఖ్యంగా నమాజ్ అక్కడి ప్రజలను అమితంగా ప్రభావితం చేసింది. జనులు ఒక ఇమామ్ (నాయకుని) వెనుక వరుసలు తీరి నిలబడి ఉన్నారు. వారి ముఖాలపై దైవభీతి ప్రస్ఫుటం అవుతుండగా, వీక్షకులు నిలువెల్లా కరిగిపోయారు. జనులు ఒక వైపున అల్పమైన విగ్రహారాధన పట్ల సిగ్గుతో కుంచించుకు పోయారు. మరోవైపున ఇస్లామీయ ఆరాధనలు వారిని ఆకర్షించాయి. తత్ఫలితంగా కేవలం ఒక్క నమాజ్ మధ్య ఆఫ్రికాలోని అత్యధిక జనాభాను ఇస్లామ్ ఒడిలోనికి చేర్చింది."

*Winwood Reade, Martyredom of Man, P.32*

ముహమ్మద్ హస్‌నైన్ హైకల్ ('అల్ ఇహ్రామ్' మాజీ ఎడిటర్) ఇలా వ్రాశారు:

జమాల్ అబ్దుల్ నాసిర్ మొట్టమొదటిసారి రష్యా వెళ్ళినప్పుడు – 1958 ఏప్రిల్ 29న – రష్యా ప్రధాని నకీతా కృశ్చేవ్‌ను కలుసుకున్నారు. ఆ సందర్భంగా కృశ్చేవ్ నమాజ్ పట్ల ఎంతో ఆసక్తిని కనబరిచాడు :

> "ముస్లింలు నమాజ్ చేసే దృశ్యాన్ని చూడాలన్న ఆసక్తి కృశ్చేవ్‌కు ఎంతో ఉండేది. కృశ్చేవ్ ఇంట మధ్యాహ్న భోజనం తరువాత నాసిర్ జుహ్ర్ నమాజ్ చేయడానికి మాస్కోలోని మస్జిద్‌కు వెళుతున్నప్పుడు కృశ్చేవ్ ప్రశ్నల వర్షం కురిపించాడు. నాసిర్ వజూ చేస్తున్నంత సేపు కృశ్చేవ్ స్వయంగా టవల్ పట్టుకుని నిలబడ్డాడు. ఆ సందర్భంగా అతను భక్తిశ్రద్ధలను కనబరిచాడు."

*- The Cairo Documents*

ఒక అరబ్బు దేశం అమెరికాలోని సముద్రతీర ప్రాంతంలో ఒక ద్వీపాన్ని కొనుగోలు చేసి, దానిని పర్యాటక స్థలంగా తీర్చిదిద్దింది. కాని ఏదయినా ముస్లిం దేశం పాశ్చాత్య ప్రపంచంలో ఒక పెద్ద భూభాగాన్ని కొనుగోలు చేసి, అక్కడ అత్యున్నత ప్రమాణాలతో కూడిన ఒక ఇస్లామీయ కేంద్రాన్ని నెలకొల్పితే, అందులో ఇతరత్రా విభాగాలతో పాటు ఒక పెద్ద మస్జిద్‌ను కూడా నిర్మిస్తే ఎంత బాగుండేది! ... పాశ్చాత్య జగతిపై ప్రాబల్యం వహించే రహస్యాన్ని మన నాయకులు నూరేళ్ళుగా రాజకీయ జగత్తులో అన్వేషిస్తున్నారు. ఆ విజయ రహస్యం 'నమాజ్'లో దాగి ఉందని అంటే అందులో తప్పు లేదేమో!

# సరికొత్త అవకాశాలు

బ్రెడ్ లే (1846 – 1924) ఇలా అంటాడు :

"ప్రపంచానికి ఓ కొత్తమతం (New Religion) ఆవశ్యకత ఉంది. మానవులందరి ప్రయోజనాలను నిర్ధారించి, తగు నిష్పత్తిలో దాని ఔచిత్యానికి ప్రాతిపదిక కాగల నమ్మకం మనకు అవసరం. దాంతోపాటు మనిషి దానిపై భరోసాతో నిలబడగలిగే స్పృహ కూడా అది కలిగించగలగాలి."

*Essays on Truth and Reality - P.446*

ఆంగ్లేయ తాత్వికుడు 20వ శతాబ్ది మొదట్లో కొత్తమతం ఆవశ్యకత గురించి వక్కాణించగా, ఫ్రెంచి శాస్త్రవేత్త డొన్వాయ్ (1883 – 1947) నాస్తికత్వం పట్ల పశ్చాత్తాపపడి, మతం వైపునకు తిరిగి మరలుతున్నట్లు ప్రకటించాడు. అతడు తన ప్రఖ్యాత గ్రంథం "హ్యూమన్ డెస్టినీ" ప్రచురించటం గమనార్హం. మానవుడు మతం వైపునకు మరలివచ్చే ప్రక్రియ మొదలైందనడానికి ఇది తార్కాణం. 20వ శతాబ్ది ఆఖరికల్లా ఈ పరిస్థితుల స్వరూపం మరింత స్పష్టమయింది. పదార్థ పూజతో కూడిన జీవితం గడిపిన మీదట మనిషిలో ఈ భావన (ఆధ్యాత్మికత) పెరుగుతూ పోతోంది. మానవ కల్పిత శాసనాల, ఉపాయాల ద్వారా సమాజాన్ని సంస్కరించే ప్రయత్నాలు విఫలమైన తరువాత మేధావుల్లో మతం పట్ల గల వ్యతిరేక వైఖరి కాస్త మెత్తబడింది. ఒకవిధంగా నేడు ప్రపంచమంతటా ధార్మిక స్పందన మొదలైపోయింది. అమెరికా యువకులు డార్విన్, ఫ్రాయిడ్ సిద్ధాంతాలపై నమ్మకం పెంచుకోగా, ఇప్పుడు వారి నవతరం ఏసుక్రీస్తు విప్లవం (Jesus Revolution) లో, కృష్ణ స్పృహ (Krishna Consciousness) లో మనశ్శాంతిని వెతుకుతోంది. జపాన్ యువత భౌతికంగా కీర్తి శిఖరాలను అధిరోహించిన మీదట, ఆధ్యాత్మికంగా శూన్యంలో ఉన్నామని భావిస్తోంది. మన సంస్కృతి వాణిజ్య సంస్కృతిగా రూపుదాల్చింది, ఇది మనకు వాణిజ్య విలువలు ... తప్ప మరేమీ ఇవ్వజాలదని వారు అంటున్నారు. కడకు రష్యా

యువకుల్లో కూడా మతభావన ప్రబలింది. మరి చూడబోతే వారంతా పూర్తిగా నాస్తిక సమాజంలో శిక్షణ పొందినవారే.

19వ శతాబ్దిలో మతానికి వ్యతిరేకంగా ఆవిష్కరించబడిన సిద్ధాంతాలన్నీ ఆశ్చర్యకరమైన రీతిలో సందేహాస్పదంగా మారాయి. పరిణామ సిద్ధాంతం ఒకప్పుడు సృష్టికర్తకు ప్రత్యామ్నాయంగా భావించబడేది. ఇప్పుడది నిరాధారమైనదిగా కనిపిస్తోంది.

వర్తమాన కాలంలో వైజ్ఞానిక విభాగాల్లో కనుగొనబడిన ఎన్నో విషయాలు – ఆశ్చర్యకరమైన రీతిలో – ఇస్లామీయ విశ్వాసాల సత్యతను రూఢీ చేస్తున్నాయి. అవి మానవ మేధను కుదిపివేస్తున్నాయి. అరేబియాలోని ప్రాచీన ఇస్లామ్ వ్యతిరేకులు దేవుని ఏకత్వపు (తౌహీద్) వచనం పలికిన వారిపట్ల ఎంత అమానుషంగా ప్రవర్తించేవారంటే సరిగ్గా కూర్చోవటం కూడా వారికి కష్టమైపోయేది. “అల్లాహ్‌ను వదలి లాత్ ఉజ్జా దేవతలను మా ఆరాధ్య దైవాలుగా చేసుకుంటాము” అని వారిచేత బలవంతంగా చెప్పించేవారు. అయితే నేడు విజ్ఞానరంగంలో జరిగిన అభివృద్ధి ఈ విషయాలన్నింటినీ నిరాధారమైనవిగా నిరూపించింది. విశ్వంలో అనేక దైవాలను కొలవటం అర్థంలేని విషయమని ఆధునిక సైన్సు చెబుతోంది. వైజ్ఞానిక జగతిలో షిర్క్ (బహుదైవభావన)కు ఎలాంటి అవకాశం లేదు. నిస్సంకోచమైన వైఖరి, లోతైన జ్ఞానం గనక ఉంటే సత్యధర్మాన్ని అత్యున్నత స్థాయిలో నిరూపించవచ్చు – దాని ముందు కాలపు కాల్పనిక సిద్ధాంతాలు మరుగుజ్జులా కనిపిస్తాయి.

ఆధునిక సైన్సు ఏ ఏ విషయాలను అంగీకరించిందో, వాటి వివరాల్లోకి పోవడానికి ఇన్‌సైక్లోపీడియా అవసరమవుతుంది. దృష్టాంతానికి మేము కొన్నింటిని చూచాయగా ప్రస్తావిస్తాము –

♦ జగతిలోని రహస్యాలను ఛేదించే ప్రయత్నంలో సైన్సు కనుగొన్న విషయాలు ఆశ్చర్యచకితుల్ని చేస్తున్నాయి. అదేమంటుందంటే, ఈ జగతి వెనుక ఒక మేధాశక్తి ఉంది. అదే దీనిని సృష్టించి, కంట్రోల్ చేస్తోంది. సైన్సు కనుగొన్న ఈ విషయాల ప్రకారం ఒక సృష్టికర్తను, ఆయన సార్వభౌమత్వాన్ని అంగీకరించక తప్పదు.

♦ ఇస్లామ్‌తో ఇతర మతాలకు ఉన్న జగడానికి అతి పెద్ద కారనం షిర్క్, తౌహీద్‌లే. రంగు రంగుల ఈ జగతిలో ఒకే దేవుడు ఉంటాడంటే జనులకు

జీర్ణం అయ్యేది కాదు. కాని సైన్సు శోధన ఈ వ్యవహారంలో తన తుది తీర్పును ఇస్లామ్ పక్షాన ఇచ్చేసింది. అదేమని చెప్పిందంటే, ఈ జగతి ఒక్కటే. ఇది ఒకే సర్వతోముఖమైన శాసనానికి కట్టుబడి నడుస్తోంది. దీని మూలపదార్థం కూడా ఒక్కటే. అంటే ఆటమ్ లేదా కంటికి కానిరాని విద్యుల్లతలు.

- సైన్సు తన తుది దశకు చేరుకుని తిరుగులేని విధంగా నిరూపించిన మరో విషయం ఏమిటంటే, మన విజ్ఞాన సాధనాలు మనకు లోకంలోని సంఘటనల పాక్షిక పరిజ్ఞానం మాత్రమే ఇస్తాయి. అవి వాటిని పూర్తిగా పరివేష్టించలేవు. దీనిద్వారా విదితమయ్యేదేమిటంటే వాస్తవాల జ్ఞానాన్ని గ్రహించడానికి మనిషి తన పరిమితిలో ఉన్న విద్యతో పాటు వేరొక విజ్ఞానసాధనం కొరకు అర్రులు చాస్తున్నాడు.
- 'యథార్థం' తన అంతిమ రూపంలో గోచరించటం సంభవం కాదని, మనం దానిని కేవలం దాని వల్ల ప్రస్ఫుటమయ్యే దృశ్యాల వల్ల మాత్రమే గ్రహించగలమని సైన్సు తేల్చి చెప్పింది. ఇస్లామ్ చెప్పేది కూడా అదే. అదేమంటుందంటే మానవుడు దైవాన్ని గానీ, పరలోకాన్ని గానీ ఇహలోకంలో చూడలేడు. అయితే జగతిలో కనిపించే వస్తువులపై చింతన చేసినట్లయితే, నిశ్చయంగా అతను దాని సత్యాన్ని గ్రహించగలుగుతాడు.
- మానవ సంబంధాల విషయంలో దైవశాసనం మానవునిచే క్రోడీకరించబడిన శాసనాలకన్నా గొప్పదని సైన్సు నిరూపించింది. ఉదాహరణకు : ఇస్లామ్ పురుషుల్ని స్త్రీల సంరక్షకులు (నిసా : 34) గా చేసింది. మానవ శాసనం తద్భిన్నంగా స్త్రీ – పురుష సమానత్వానికి ప్రాధాన్యత నిచ్చింది. దీనినిబట్టి రూఢీ అయినదేమంటే జన్మతః స్త్రీ పురుషునికన్నా బలహీనురాలు. పురుషుడు ఆమెకన్నా ప్రాబల్యం (Dominant Sex) కలిగి ఉన్నాడు. ప్రాచీన తత్వశాస్త్రం దృష్టిలో మతానికి వ్యతిరేకంగా ఉన్న అతి పెద్ద సమస్య సృష్టికి సంబంధించినది. అంటే ఈ జగతి ఆది నుంచి ఉంది. మరి ఇది ఆది నుంచి ఉన్నప్పుడు ఎవరినయినా సృష్టికర్తగా నమ్మవలసిన అవసరం ఏముంది? అయితే ఆధునిక సైన్సు, ఈ జగతి ఆయుషు పరిమితమైనదని నిరూపించి ఈ వివాదానికి శాశ్వతంగా ముగింపు నిచ్చింది. ఆ తరువాతి మానవుడు పరిణామ సిద్ధాంతాన్ని ఆశ్రయించాడు. కాని అక్కడ కూడా

తేలిపోయిన విషయం ఏమిటంటే పరిమిత వ్యవధితో కూడిన ఈ భూమిలో పరిణామ ప్రక్రియననుసరించి మానవుడి సృష్టి సంభవం కాదు.

- ఇస్లామ్ రాజకీయ రంగంలో సలహా సంప్రతింపుల ఖిలాఫత్ దృక్పథాన్ని ప్రవేశపెట్టింది. ప్రాచీన కాలంలో ప్రజల మనోమస్తిష్కాలపై అనువంశిక రాజరికం ఆవరించి ఉండేది. అందువల్ల ఇస్లామీయ దృక్పథం వారికి మింగుడుపడేది కాదు. కాని ఆధునిక ప్రజాస్వామిక విప్లవం నేటి మనిషి కొరకు ఇస్లామ్ ప్రతిపాదించిన సలహా సంప్రతింపుల వ్యవస్థ సుబోధకం అయ్యేలా చేసింది.
- మనిషి ఆర్జించే సంపాదన (ఆదాయం)లో అతని బలహీనులైన సహవాసుల హక్కు ఉందని ఇస్లామ్ ప్రకటించింది. అందుకే 'జకాత్' శాసనాన్ని ప్రవేశపెట్టింది. కాని ఈ రకమయిన ఆర్థిక వ్యవస్థ ప్రాచీన కాలపు మనిషికి అనూహ్యం అనిపించింది. ఇస్లామ్ ప్రవక్త (స) మరణానంతరం అరేబియాలో పొడసూపిన మార్గభ్రష్టతా (ఇర్తెదాద్) ధోరణికి మూలకారణం కూడా యిదే. ఆధునిక యుగంలో వచ్చిన సోషలిస్టు విప్లవం దీనిని అందరికీ అర్థమయ్యేలా చేసింది. ఒకరి సంపాదనలో వేరొకరి హక్కు ఉండాలని అది నొక్కి వక్కాణించింది. కాకపోతే సోషలిజంలో జరిగిన ఒక తప్పు ఏమిటంటే అది 'యాజమాన్యం'లో హక్కును నిరూపించటం మొదలెట్టింది. కాని ఇది సరైనది కాదు. మనిషి 'ఆదాయం'లో హక్కును నిరూపించటం సరైనది.

ఒక విషయాన్ని ఇంతవరకు ఎవరూ అర్థం చేసుకోలేదు. అదేమిటంటే 'సైన్సుయుగం' వాస్తవానికి 'ఇస్లామ్ యుగం'. దానిని కొన్ని యాదృచ్ఛిక పొరపాట్ల మూలంగా – ముఖ్యంగా పెడత్రోవపట్టిన మతం (క్రైస్తవం)తో దానికి ఏర్పడిన 'వ్యాఘాతం' కారణంగా, అది దానిని 'నాస్తికత్వం' వరకు చేర్చింది. సైన్సు అంటే ఏమిటి? ప్రకృతిపై అధ్యయనం! సహజత్వంపై శోధన! ప్రకృతి – ప్రకృతి ధర్మం ఇస్లామ్ రెండూ ఒకే యథార్థం యొక్క రెండు వైపులు. అందుకే ఖుర్ఆన్‌లో భవిష్యవాణి చెప్పటం జరిగింది – సైన్సు యుగం ఇస్లామ్ కొరకు ప్రమాదకరం కాదని, అది సత్యశోధనకు దోహదకారి అని!

> త్వరలోనే మేము వారికి మా సూచనలను చూపిస్తాము – వారి చుట్టూవున్న జగతిలోనూ, స్వయంగా వారిలోనూ! కడకు ఇదే (ఈ

ఖుర్ఆన్ (గ్రంథమే) సత్యమన్న విషయం వారికి విశదమైపోతుంది.

*(ఫుస్సిలత్ – 53)*

సైన్సు యుగం మొదలయినది ఐరోపాలో కాదు, అది 9, 10, 11వ శతాబ్దులలో స్పెయిన్‌లో ఆరంభమయింది. ఆ కాలంలో సైన్సుకి – మతానికి మధ్య ఎలాంటి ఘర్షణ ఉండేది కాదని చరిత్ర చెబుతోంది. ఆ కాలంలో సైన్సు మతానికి సేవకురాలిగా సహాయపడేది. కాని 15వ శతాబ్దిలో తుర్కీలు కాన్‌స్టాంటి నోపిల్ నుండి బాజంటైన్ శాస్త్రవేత్తలను వెళ్ళగొట్టిన తరువాత, వారు ఇటలీ చేరుకుని పరిశోధనలు కొనసాగించారు. ఆ విధంగా ఈ పరిశోధనా ప్రక్రియ ముస్లిం జగతి నుండి ఐరోపాకు బదిలీ అయిపోయింది. దాంతో సైన్సు చరిత్ర కొత్త మలుపు తిరిగింది.

కాని ...

'టైమ్' (1971 జనవరి 18) తన వ్యాసం 'A Voyage to Utopia' లో ఇలా అభిప్రాయపడింది:

"1840లో ప్రతి అమెరికా పౌరుని జేబులో భవిష్యత్తుకు సంబంధించిన ఒక శాశ్వత ప్రణాళి ఉండేది. ప్రతి వ్యక్తి జేబులో కర్చీఫ్ ఉన్నట్లే అది ఉండేది. కాని ఈనాడు అమెరికన్ల జేబుల్లో ఈ రకమయిన ఆకర్షనీయమైన పథకాలు, ప్రణాళికలు లేవు. ప్రజలు సామాజిక స్థితిగతులపట్ల నిరాశకు లోనయ్యారు. ఉన్నత సమాజాన్ని నిర్మించే భావనలు అంతమైపోయాయి. భూతలంపై స్వర్గం నిర్మించే స్వప్నం ఇప్పుడు తన కొరకు స్వర్గాన్ని అన్వేషించే ప్రయత్నంలో ఉంది. నేటి వినాశకర ప్రపంచంలో తత్వవేత్తల్లోని ఓ పెద్ద సంఖ్య ఆదర్శవాదపు ఆఖరి శరణాలయంగా తమ ఆశల, నమ్మకాల ఆత్మపైన మనసును లగ్నం చేసింది. భౌతికత బదులు ఆధ్యాత్మికత పట్ల శ్రద్ధ వహించబడుతోంది. కొంతమంది ఏమంటున్నారంటే, పరిణామక్రియ నాగరికతను చైతన్యానికి సంబంధించిన ఒక ఉన్నత దశ వైపునకు తీసుకుపోతోంది. కడకు అది మనిషిని అత్యున్నత యథార్థంతో అనుసంధానం చేస్తుంది. అంటే దైవంతో.

పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన తరువాత అమెరికన్లు, తాము టెక్నాలజీలో విముక్తి పొందగలమని అనుకున్నారు. రచయితలు బ్రహ్మాండమైన ప్రణాళికలను రచించారు. కాని టెక్నాలజీ మానవాళికి సంతోషాన్నివ్వటంలో సఫలీకృతం కాలేదని తేలింది. దాని సాధనాలు అత్యంత సులువుగా మానవ పురోభివృద్ధికి బదులు మానవ

వినాశంలో వినియోగం కాసాగాయి. యాంత్రిక స్వర్గపు ఆఖరి దశకు చేరుకుని, ఆశ్చర్యజనకమైన రీతిలో సమస్యలు పుట్టుకు రావటం కేవలం కాకతాళీయం కాదు, ఇది దైవ సంప్రదాయం ప్రకారం జరిగింది. ఆయన అలసత్వానికి, ఏమరుపాటుకు గురైన మానవుల జీవితాల్లో ప్రశార్థకం కాగల పరిస్థితుల్ని ఉత్పన్నం చేస్తాడు :

> జనులు తమ చేజేతులా చేసుకున్న దాని ఫలితంగా నేలపైనా, నీటిలోనూ అరాచకం ప్రబలిపోయింది – తద్వారా దేవుడు వారి కొన్ని చేష్టల రుచి వారికి చూపించటానికి! బహుశా వారు (ఆ విధంగానయినా) తమ ధోరణిని మానుకుంటారని.
>
> *(అర్ రూమ్ : 41)*

దేవుడు తాను చేయవలసిన పని చేసేశాడు. ఇప్పుడు అంతిమ దైవప్రవక్త వారసులు చేయవలసిన పనేమిటంటే, వారు ఈ భూమి నుండి లబ్ధిపొందుతూ ఆధునిక మానవుని కొరకు సత్యధర్మాన్ని (దీనె హఖ్‌ను) స్వీకారయోగ్యంగా మలిచే ప్రయత్నం చేయాల్సింది. కాని మన సంస్కరణా ప్రియులకు ఇక్కడ ఏ పనీ కానరాలేదు. దీనికి భిన్నంగా వారు మూర్ఖత్వంలో తమ సంబోధిత జాతులతో పనికిమాలిన రాజకీయ మల్లయుద్ధం చేయటంలో నిమగ్నులైపోయారు.

ఆధునిక యుగంలో ముస్లిం రాజ్యాలపై పాశ్చాత్య జాతుల కన్నుపడినప్పుడు, ముస్లిం జగతి ముందు ఒక ప్రశ్న ఎదురయింది : "దీనిని ఎదుర్కోవడానికి ఏం చేయాలి?" ఆ సమయంలో వారు ధార్మిక ప్రబోధనల, ప్రవక్త సున్నత్‌ల వెలుగులో సకారాత్మక పథకాన్ని రూపొందించి, దానిని ఆచరణలో పెట్టాల్సింది. కాని దానికి బదులు మన ముజాహిదీన్ పయనబృందం నకారాత్మక ప్రతిక్రియా మార్గంలో సాగిపోయింది.

ఈ ప్రతిక్రియలో రెండు విచారధారలున్నాయి. ఒకటి : ఆత్మ రక్షణా మనస్తత్వంతో ఉనికిలోనికి వచ్చింది. వారు తమదైన పద్ధతిలో ముస్లింలలో ధార్మిక స్ఫూర్తిని నింపే ప్రయత్నంలో నిమగ్నులైపోయారు. ఉదాహరణకు : ధార్మిక విద్య కొరకు మదర్సాల స్థాపన. ప్రజలకు ఇస్లామీయ విశ్వాసాలు బోధించడానికి, ఆరాధనా రీతులు నేర్పడానికి సభలు సమావేశాలు కండక్ట్ చేయటం, ముస్లింల ప్రత్యేక ప్రయోజనాల పరిరక్షణకు ప్రయత్నించటం మొదలగునవి. ఇక రెండవ వర్గం చాలావరకు విప్లవ భావాలు గలది. అది ఎంతసేపటికీ 'చర్య' గురించే ఆలోచించేది.

20వ శతాబ్ది ప్రథమార్ధంలోనూ, అంతకు పూర్వం కూడా ముస్లిం జగతిపై దృష్టిని సారిస్తే, తమ జాతి ప్రజలలో విప్లవ శంఖం ఊదిన విద్వాంసులు, తత్వవేత్తలు పెద్ద సంఖ్యలో కనిపిస్తారు. కొన్ని పేర్లు ఇవి :

| | |
|---|---|
| ముహమ్మద్ బిన్ ఇస్మాయీల్ అల్ అమీర్ (యమన్) | 1688 – 1768 |
| షాహ్ వలీయుల్లాహ్ దహెల్వీ (ఇండియా) | 1703 – 1762 |
| ముహమ్మద్ బిన్ అబ్దుల్ వహాబ్ నజ్దీ (సఊదీ అరేబియా) | 1703 – 1791 |
| షాహ్ ఇస్మాయీల్ షహీద్ (ఇండియా) | 1779 – 1831 |
| ముహమ్మద్ బిన్ అలీ అస్సనూసీ (ఐరోపా) | 1787 – 1860 |
| సయ్యిద్ అహ్మద్ షహీద్ బరేల్వీ (ఇండియా) | 1786 – 1831 |
| అమీర్ అబ్దుల్ ఖాదిర్ (అల్జీరియా) | 1807 – 1883 |
| జమాలుద్దీన్ అఫ్గానీ (ఈరాన్, అఫ్గానిస్తాన్) | 1838 – 1897 |
| అబ్దుర్రహ్మాన్ కవాకబీ | 1849 – 1902 |
| ముఫ్తీ ముహమ్మద్ అబ్దా (ఈజిప్టు) | 1849 – 1905 |
| రషీద్ రజా (ఈజిప్టు) | 1865 – 1933 |
| సకీబ్ అర్సలాన్ (సిరియా) | 1869 – 1946 |
| డాక్టర్ ముహమ్మద్ ఇక్బాల్ (భారత ఉపఖండం) | 1877 – 1938 |
| హసనుల్ బన్నా (ఈజిప్టు) | 1906 – 1948 |

ఈ రకమయిన తత్వవేత్తల ఉపన్యాసాల, రచనల ద్వారా యావత్ ఇస్లామీయ జగత్తులో కదలిక వచ్చింది. 20వ శతాబ్ది ఆరంభంలో ఉద్భవించిన ఉద్యమాలు ముస్లిం జగతి అంతటినీ ప్రభావితం చేశాయి. ఉదాహరణకు : ఖిలాఫత్ కమిటి, ఇండియా (1914), ఈజిప్టుకు చెందిన ఇఖ్వానుల్ ముస్లిమీన్ (1928), జమాఅతె ఇస్లామీ, పాకిస్తాన్ (1941), మజ్లిసె షూరా ముస్లిమీ, ఇండోనేషియా (1948) మొదలగునవి.

ఈ ఉద్యమాలన్నింటి ప్రధాన లక్ష్యం ఇస్లామీయ రాజ్యస్థాపన. ఈ ఉద్యమాలలో ప్రతి ఒక్కదానికీ అసాధారణమైన ప్రజాదరణ లభించింది. కాని అవన్నీ తమ లక్ష్య

సాధనలో విఫలమయ్యాయి. ఈ వైఫల్యానికి గల ఏకైక కారణం, వారు రాజకీయాన్ని తమ కార్యక్షేత్రంగా చేసుకోవటమే. అవి సైద్ధాంతికంగా ఇస్లామ్ మూలాల నుండి వైదొలగి ఉండటం వల్ల అవి దైవ సహాయానికి నోచుకోలేక పోయాయి.

బౌద్ధికంగానూ, సైద్ధాంతికంగానూ – రెండు కోణాల నుంచి కూడా వారు “సందేశ ప్రదానము”ను తమ కార్యరంగంగా ఎంపిక చేసుకోవాల్సింది. ఈ రంగంలో గనక పని చేసినట్లయితే వారు అవతలివారిపై నిశ్చయంగా ఆధిపత్యం వహించగలిగేవారు. కాని వారు తమ పరిసరాల స్థితిగతుల నుండి పైకి వచ్చి ఆలోచించలేకపోయారు. ఒక వైపున పాశ్చాత్య సామ్రాజ్యవాదుల విస్తీరణా కాంక్ష, మరోవైపున ప్రజాస్వామ్యం, సోషలిజం ఆధారంగా ఉద్భవించిన ఉద్యమాలు యావత్ప్రపంచంలో రాజకీయ దృక్కోణం నుంచి ఆలోచించే స్వభావాన్ని సృజించిన కాలమది. ఈ బాహ్య ప్రేరకాలు ఇస్లామీయ ఉద్యమాన్ని కూడా ప్రభావితం చేసి, వాటిని రాజకీయ ఉద్యమంగా చేసేశాయి. వారు ఇస్లామ్‌ను, దాని శాశ్వతమైన రుజుమార్గంపై నడిపించేబదులు దానిని తత్కాల ప్రేరేపిత కాలిబాటలపై పరుగెత్తించసాగారు.

సయ్యిద్ జమాలుద్దీన్ అఫ్గానీ నేటికి వందేళ్ళ క్రితమే సందేశ రంగంలో ఇస్లామ్‌కు గొప్ప విజయావకాశాలున్నాయన్న యథార్థాన్ని గ్రహించారు. ఆయన ఇలా అన్నారు :

> “ఉత్తమ రీతిలో ఇస్లామ్‌ను పరిచయం చేసే మాటైతే ఐరోపావారు ఇస్లామ్‌ను స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నారు. వారు ఇస్లామ్ మరియు ఇతర మతాల తులనాత్మక అధ్యయనం చేసినప్పుడు, విశ్వాసాల సాదాదనం, సులభమైన ఆచరణ రీత్యా వాటి మధ్య ఎంతో వ్యత్యాసం ఉన్నట్లు కనుగొన్నారు. పాశ్చాత్య జాతుల వారిలో ఇస్లామ్ స్వీకరణపై అందరికన్నా చేరువలో ఉన్నవారు అమెరికన్లు. ఎందుకంటే వారికీ – ముస్లిం జాతులకు మధ్య యూరోపియన్ల మాదిరిగా సాంప్రదాయిక శత్రుత్వం, వైషమ్యం లేదు.” *(కైరో – 1966, పు. 213)*

సయ్యిద్ జమాలుద్దీన్ అఫ్గానీ గారి ప్రియతమ శిష్యుడు ముఫ్తీ ముహమ్మద్ అబ్దూ ఇలా వ్రాశారు : నేను ఆయన వెంట పారిస్ (1884)లో ఉన్నప్పుడు ఆయన

ముందు ఒక ప్రతిపాదన పెట్టాను – 'మనం రాజకీయాలను వదిలేద్దాం. ప్రభుత్వ దృష్టికి ఆనకుండా దూరం వెళ్ళి ధర్మప్రచారం చేసుకుందాం. మనం ఈ విధంగా కృషి చేసినట్లయితే పదేళ్ళలోపే సత్ఫలితాలను సాధించగలం. ప్రస్తుతం రాజకీయ కార్యకలాపాలలో మన అత్యుత్తమ శక్తి సామర్థ్యాలు వృథా అవుతున్నాయి' – దీనికి సమాధానంగా జమాలుద్దీన్ అఫ్గానీ ఇలా అన్నారు :

"అరె, నువ్వు పిరికివానిలా మాట్లాడుతున్నావు." (పుట : 50)

... ఈ విధంగా ముస్లింలు రాజకీయ మరుభూమిలో బలిదానాలు ఇస్తూ పోవటమే ఇస్లామ్ గొప్పతనంగా భావించారు.

ఇలా ఎన్నో పొరపాట్లు జరిగినప్పటికీ – నేటికీ దైవధర్మం పరివ్యాప్తి చెందే అవకాశాలు మెండుగా ఉన్నాయి. 1973లో గాబూన్ అధ్యక్షుడు బాంగ్వా, 1976లో మధ్య ఆఫ్రికా అధ్యక్షుడు బొకాసా, 1977లో సరాదిక్ రాజు దాతూక్ ఇస్లామ్ స్వీకరించటం – ఇలాంటి మరికొన్ని ఉదాహరణలు ఇస్లామ్ ధర్మప్రచార పరివ్యాప్తికి తార్కాణాలు. మనం కోల్పోయిన స్థానాన్ని తిరిగి పొందడానికి – సందేశ రంగంలో – నిరంతర కృషి సలపవలసిన అవసరం ఉందని ఈ సంఘటనలు చాటి చెబుతున్నాయి.

"భౌతిక మూల్యాన్ని ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నవారికే సైద్ధాంతిక నాయకత్వం లభిస్తుంది." ఇదొక చారిత్రక విషయం. కారణమేమంటే సైద్ధాంతిక నాయకత్వం సదా భౌతిక నేతృత్వపు వెలుగులో నడుస్తుంది. 8వ శతాబ్ది మొదలుకుని 16వ శతాబ్ది వరకు ప్రపంచపు సైద్ధాంతిక నేతృత్వం ముస్లింల చేతుల్లో ఉంది. ఎందుకంటే వారు తమ వాణిజ్య శక్తి, రాజకీయ ఆధిపత్యం కారణంగా దాని మూల్యాన్ని ఇవ్వగలిగేవారు. ఆ కాలంలో విజ్ఞానం అంటే ముస్లింలదే. ఖుర్తుబాకు చెందిన బిషప్ అల్వారో (Alvaro) స్పెయిన్‌లోని మొజారబస్ (Mozarabes) గురించి విమర్శిస్తూ ఇలా అన్నాడు : "అతను క్రైస్తవ భాష (లాటిన్)ను మరచిపోయాడు. గొప్ప ప్రతిభావంతులైన క్రైస్తవ యువకులంతా అరబీ సాహిత్యం తప్ప మరే సాహిత్యం పట్ల కూడా మక్కువ కనబరచటం లేదు". ఆ తరువాత ఐరోపా యంత్రశక్తిని కనుగొన్న మీదట పారిశ్రామిక ఆధిపత్యం పొందింది. దాంతో సైద్ధాంతిక సారథ్యం ముస్లింల నుండి చేజారిపోయి పాశ్చాత్య జాతుల హస్తగతమైంది.

17వ శతాబ్ది మొదలుకుని రెండవ ప్రపంచ యుద్ధం (1939 – 45) వరకు ఈ సారథ్యం పశ్చిమ ఐరోపా, ముఖ్యంగా బ్రిటన్ చేతుల్లో ఉంది. ఈ కాలంలో ఈ జాతులు ప్రపంచంలోని విద్యార్థులందరినీ ఆకర్షించాయి. రెండవ ప్రపంచ యుద్ధం ఈ భౌతిక సారథ్యాన్ని పశ్చిమ ఐరోపా నుండి లాక్కుని అమెరికాకు అప్పగించింది. ఆనాటి నుంచీ అమెరికా యావత్ప్రపంచానికి సైద్ధాంతిక నేత అయి కూర్చుంది. నేడు ఎవరు ఏ శాస్త్రంలో పరిశోధన జరపాలనుకున్నా అమెరికన్లు రచించిన గ్రంథాలను చదువుతున్నారు.

... సమీప భవిష్యత్తుల్లో అమెరికా పతనం ఖాయం. ఆ తరువాత యావత్ప్రపంచం సైద్ధాంతిక శూన్యాన్ని ఎదుర్కొంటుంది. ఆ వెలితిని పూరించడానికి ఆ సమయంలో మరే జాతి కూడా ఉండదు. చైనా, రష్యాలు రెండు పెద్ద శక్తులుగా ఎదిగినప్పటికీ ఈ శూన్యాన్ని పూరించలేవు. కారణం వారిలోని అంతర్గత వైరుధ్యమే. కమ్యూనిస్టు నియంతృత్వం, తన కూటమికి చెందిన దేశాలకు ఒకింత స్వేచ్ఛ ఇచ్చి, అవి తమ ఒనరులను ప్రత్యేక రంగాలలో కేంద్రీకృతం చేసి బలోపేతంగా తయారవమని సూచించింది. కాని ఇది సాధ్యమా? ఏకసత్తాక వ్యవస్థ క్రింద సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందగలదు. అయితే సైద్ధాంతిక విద్యల అభివృద్ధి కొరకు స్వేచ్ఛాయుత వాతావరణం తప్పనిసరిగా అవసరం. కాని అది కమ్యూనిస్టు వ్యవస్థలో లేదు. ఈ కారణంగానే చైనా రష్యాల శాస్త్రీయ అభివృద్ధి అంతా సాంకేతిక విద్యలకే పరిమితం. సైద్ధాంతిక విద్యల్లో వాటి ఘనకార్యం చెప్పుకోదగ్గ విధంగా లేదు.

ఇకపోతే జపాన్, నిశ్చయంగా జపాన్ పారిశ్రామిక రంగంలో అద్భుతాలు చేసింది. అయితే జపాన్ మౌలికంగా ఒక సాంకేతిక సమాజం. సైద్ధాంతికంగా అది రాబోయే కాలంలో కీలకపాత్ర పోషించే అవకాశాలు లేవు. ప్రస్తుత జర్మనీ పరిస్థితి కూడా ఇంతే.

పాశ్చాత్య జాతుల పతనం, పారిశ్రామిక సంస్కృతి పట్ల నిరాశ, సైద్ధాంతిక మాంద్యం – ఇవన్నీ సత్యధర్మాన్ని అవలంబించే వారికి కలసివచ్చిన అదృష్టం వంటివి. వారు గనక ఇప్పటికయినా మేల్కొన్నట్లయితే మళ్ళీ మానవజాతికి సారథ్యం వహించగల స్థానానికి చేరుకోగలరు. ఈ ఉన్నత లక్ష్య సాధనలో ఒకే ఒక వస్తువు అడ్డంకిగా మారగలదు – అది ఆధునిక పారిశ్రామిక యుగంలో ఒనరుల పరంగా

వారి వెనుకబాటుతనం. అయితే ప్రకృతిపరంగా వారికి లభించిన వరప్రసాదం ఏమిటంటే వారి కాళ్ల క్రింద–ఆశ్చర్యకరమైన రీతిలో–చమురు నిల్వలు ఉన్నాయి. అవి వారిలోని ఈ వెనుకబాటుతనాన్ని (వెలితిని) పూడ్చగలవు. అరబ్బులకు – ఇస్రాయీల్‌కు మధ్య నాల్గవసారి యుద్ధం జరిగినప్పుడు (1973) పెట్రోలుకు గల ఎనలేని ప్రాధాన్యత అంతర్జాతీయ స్థాయిలో గుర్తించబడింది. కాబట్టి అరబ్బులు గనక ఏకమై – సుసంఘటితంగా – పని చేసినట్లయితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థను నియంత్రించగలిగే స్థాయికి చేరుకోగలరు. భవిష్యత్తు వారి కోసం ఎదురుచూస్తోంది.

ఇప్పుడు ఈ అధ్యాయాన్ని నేను మాంట్‌గోమరీ వాట్ వ్రాసిన ఈ వాక్యాలతో ముగించదలిచాను –

"ప్రపంచం అత్యంత వేగంగా ఒక్కటైపోతోంది. ఈ ఒకే ప్రపంచంలో ఐకమత్యం, సమానత్వం ఉండాలన్న ధోరణి కూడా ప్రబలుతోంది. ఈ ధోరణి కారణంగా ఖచ్చితంగా ఇక్కడ నైతిక సూత్రాల ఒక వ్యవస్థ ఏర్పడుతుంది. దానికి అంతర్జాతీయ గుర్తింపు లభించటమే కాదు, యావత్ప్రపంచం దానిని ఆమోదించే రోజు వస్తుంది. ముహమ్మద్ (స) సమస్త మానవుల కోసం క్రియాత్మకంగా, నైతికంగా ఆదర్శం అని ముస్లింలు అంటున్నారు. ఇలా చెప్పి వారు ప్రపంచాన్ని ఆహ్వానిస్తున్నారు. కాని ఇప్పటివరకు ఈ వ్యవహారం బహుకొద్దిగానే ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. అయితే ఇస్లామ్‌లోని శక్తి కారణంగా అది చివరకు ప్రాధాన్యతను పొందగలదు. అయితే మన ముందున్న ప్రశ్న ఒక్కటే – ముహమ్మద్ (స) జీవితంలో, ప్రబోధనలలో నేర్చుకోదగ్గ నియమాలేమైనా ఉన్నాయా? అవి భావి ప్రపంచానికి ఏకైక నైతిక వ్యవస్థను ప్రసాదించగలవా?

"ఈ ప్రశ్నకు చివరి సమాధానం ఇప్పటి వరకు ప్రపంచానికి ఇవ్వబడలేదు. ముస్లింలు ఇప్పటి వరకు ముహమ్మద్ (స) గురించి చెప్పుకుంటూ వచ్చినదంతా కేవలం ఒక ప్రాథమిక ప్రకటన స్థాయిని కలిగి ఉంది. బహుకొద్దిమంది ముస్లిమేతరులు మాత్రమే దీనిపై సంతృప్తి చెందారు. అయితే దీనిపై ఇంకా చర్చకు ఆస్కారం ఉంది. ముహమ్మద్ (స) గురించి ప్రపంచం ప్రతిస్పందన ఎలా ఉంటుంది? నేటి ముస్లింలు దీనికొరకు ఏం చేస్తారన్న దానిపైనే అది ఆధారభూతమై ఉంటుంది. మిగతా ప్రపంచం ముందు తమ మాటను మంచి పద్ధతిలో, సమగ్రంగా సమర్పించే

అవకాశాలు ఇప్పటికీ వారికి ఉన్నాయి. ఐక్య ప్రపంచపు నైతికత కొరకు ముహమ్మద్ (స) జీవితం ఆదర్శప్రాయం అని ఘంటాపథంగా ముస్లింలు చెప్పగలిగే స్థితిలో ఉన్నారా? ఒకవేళ ముస్లింలు గనక తమ ఉపోద్ఘాతాన్ని ఉత్తమ రీతిలో సమర్పించగలిగితే, దానిని వినేవారు క్రైస్తవుల్లో ఉన్నారన్న సంగతిని వారు తెలుసుకో గలుగుతారు."

*-- Montgomery Watt*

*"Mohammed as Model for Universal Morality" - P.323*

# చివరి మాట

మనిషిని దేవుడు స్వేచ్ఛాజీవిగా పుట్టించాడు. అయితే ఈ స్వేచ్ఛ అపరిమితమైనదీ కాదు, నిరవధికమైనదీ కాదు. మరణంతో పాటే వ్యక్తి స్వేచ్ఛ కూడా అంతమైపోతుంది. ఇక మొత్తమ్మీద సమస్త మనుజజాతి స్వేచ్ఛ ప్రళయదినాన అంతమైపోతుంది. ఈ ప్రాపంచిక జీవితం అంతమవటంతోనే పరలోక జీవితం మొదలవుతుంది. అక్కడ మనిషిని రెండు వర్గాలుగా విభజించటం జరుగుతుంది. ఒకరు : తమ ప్రాపంచిక జీవితపు స్వేచ్ఛను దైవేచ్ఛకు లోబరచి ఉంచినవారు. ఇలాంటివారు స్వర్గవనాలలో ప్రవేశింపచేయబడతారు. రెండవ వారు : స్వేచ్ఛతో కూడిన ఈ క్షణాలను దైవానికి భయపడకుండా విచ్చలవిడిగా గడిపినవారు. ఇలాంటి వారు నరకంలోనికి నెట్టివేయబడతారు. ఈ విభజన శాశ్వతమైనది. నరకవాసులు సదా శాశ్వతంగా అగ్నిలో కాలుతూ ఉంటారు. స్వర్గవాసులు సదా శాశ్వతంగా సంతోషంగా, సుఖంగా ఉంటారు.

అంటే సుమారు నూరేళ్ళ ప్రాపంచిక జీవితం ఒక శాశ్వతమైన పరిణామంపై ముగియనుంది. మరి ఆ పరిణామం కూడా ఎటువంటిది? కఠినాతి కఠినమైన శిక్ష లేదా అత్యంత విలువైన పురస్కారం! – పరిస్థితుల ఈ స్వరూపం జీవిత సమస్యను ఎంతో సంక్లిష్టం చేసేసింది. ఇది అత్యంత సంక్లిష్టమైనవైనప్పటికీ ప్రపంచంలో ఈ యథార్థాలన్నీ మనిషికి కనుమరుగై ఉంటాయి. దేవుడు, దైవదూతలు, స్వర్గం, నరకం – దేనినీ మనిషి తన కళ్లతో చూడలేదు. అందువల్ల ప్రళయదినాన ఈ యథార్థాలన్నీ ప్రస్ఫుటమైనప్పుడు, మనిషి, 'దేవా! ప్రాపంచిక జీవితం ఈ విధంగా పరిణమిస్తుందన్న సంగతి మాకు తెలియదుకదా! ఒకవేళ యథార్థం ఇదే అయినట్లయితే నీవు మాకు ఎందుకు తెలుపలేదు?' అని అడిగేందుకు ఆస్కారం ఉంటుంది.

వ్యవహారం ఇంత జటిలమైనది గనకనే దేవుడు మనిషిని పుట్టించడంతో పాటే తన ప్రవక్తలను పంపటం కూడా ప్రారంభించాడు. ప్రతి బస్తీలో, ప్రతి జాతిలో దైవప్రవక్తలను ప్రభవింపజేశాడు. వారిపై దైవవాణిని అవతరింపజేశాడు. గ్రంథాన్ని

అవతరింపజేశాడు. ప్రవక్తలు జీవిత సత్యాన్ని బాగా విడమరచి చెప్పేందుకుగాను దేవుడు ఈ ఏర్పాటు చేశాడు. ఈ దైవదౌత్య పరంపర ఆదమ్ మొదలుకుని ఈసా (ఏసుక్రీస్తు) వరకు కొనసాగింది. చివరకు దేవుడు తన కట్టకడపటి ప్రవక్తను పంపి, అతనిపై తన గ్రంథాన్ని కూడా అవతరింపజేసి, దానిని శాశ్వతంగా సురక్షితం గావించాలని నిర్ణయించాడు. ఆ విధంగా 7వ శతాబ్ది నుండి మానవజాతి చరిత్రలో నవయుగం ప్రారంభమయింది. ఇప్పుడు దైవగ్రంథం (ఖుర్ఆన్) సురక్షితంగా ఉంది. అయితే ఆ గ్రంథాన్ని విశదీకరించేందుకు ఇప్పుడు ప్రవక్తలు రారు.

దైవదౌత్య పరిసమాప్తం (ఖత్మె నుబువ్వత్) తరువాత ఏ మనుషులు జన్మిస్తున్నారో, చనిపోతున్నారో వారిని సావధానపరిచేందుకు దేవుడు చేసిన ఏర్పాటు ఏమిటి? దీనికి సమాధానం ఉమ్మతె ముహమ్మదియ. దేవుని అంతిమ ప్రవక్త (స) తన అనుచర సమాజం సమక్షంలో దీన్ (ధర్మం) సాక్ష్యమిచ్చారు. ఆ తరువాత ఉమ్మతె ముహమ్మదియను శాశ్వత ప్రాతిపదికపై దీనికి బాధ్యులుగా చేశారు. అంటే ప్రళయం వరకు పుట్టబోయే జనుల సమక్షంలో వారు సత్యసాక్ష్యం ఇస్తూ ఉండాలి. ప్రళయదినాన వివిధ జాతుల కేసు విచారించబడినప్పుడు, వారు అక్కడ నిలబడి, 'మేము వీళ్ళకు సత్యసందేశాన్ని చేరవేశాము. అయినప్పటికీ ఎవరయినా దానిని అవలంబించకపోతే, వారు తమ కర్మలకు తామే బాధ్యులు' అని చెప్పగలిగే స్థితిలో ఉండాలి.

ఈ పనినే ఖుర్ఆన్‌లో **'అల్లాహ్ వైపునకు పిలుపు'** అని అనటం జరిగింది. ఈ కార్యం కొరకు నడుం బిగించటం ముస్లిం సముదాయానికి అనివార్యం. ఎట్టి పరిస్థితిలోనూ వారు ఈ బాధ్యత నుండి తప్పించుకోలేరు. కడకు వారి వ్యక్తిగత ఆరాధనలు కూడా – అవి ఎంత అధికంగా ఉన్నాసరే – వారిని దేవుని పట్టు నుండి తప్పించలేవు. వారు గనక ఈ పని చేయకపోతే, ప్రపంచ జాతులకు రానున్న ఆ దినం గురించి భయబోధ చేయకపోతే, వారు కూడా ఇతర జాతుల మాదిరిగానే పరలోకంలో నిలదీతకు గురవుతారు.

యూదులు ఏ అపరాధానికిగాను పట్టుబడ్డారో ఆలోచించండి! వారి వద్ద దేవుని అమానతు ఉండేది. కాని వారు దానిని దాచిపెట్టారు. దానిని ప్రజల ముందుకు తేలేదు. తౌరాతు గ్రంథం కలవారు చేసిన నేరమే ఒకవేళ ఖుర్ఆన్ గ్రంథవహులు కూడా చేస్తే వారిపట్ల మరోవిధంగా వ్యవహరించటం జరుగుతుందా? అలా జరగనేరదు. లోగడ ఇతర జాతులను పట్టుకున్నట్లే వీరిని కూడా దైవశాసనం

పట్టుకుంటుంది. దేవునికి ఏ జాతితో కూడా ప్రత్యేక బంధుత్వం లేదు. ఎవరయినా తమకు దేవునితో అనుబంధం ఆత్మీయత ఉందని అంటే అంతకన్నా పెద్ద అలసత్వం మరొకటి లేదు.

దైవప్రవక్త తన కాలంలో నిర్వర్తించినటువంటి బాధ్యతనే నేడు ముస్లింలు ప్రపంచ మానవాళి సమక్షంలో నిర్వర్తించవలసి ఉంది. అంటే ఖుర్‌ఆన్ సందేశాన్ని ప్రజల వరకు చేరవేయటం. ఏ విధంగానయితే జకాత్ విధిని నెరవేర్చకపోవటం వల్ల మనిషి సంపద మొత్తం అతని కొరకు ధర్మసమ్మతం (హలాల్) కాదో, అదేవిధంగా ఈ విధ్యుక్త బాధ్యతను నెరవేర్చక ముందు మన జీవితంలోని మరే భాగాన్నయినా అనుభవించే హక్కు మనకు లేదు. మనం సందేశాన్ని చేరవేసే ఈ ప్రయత్నంలో నిమగ్నులమై ఉండనంత వరకూ ఇక్కడి ఏ సంతోషమూ మన కొరకు సంతోషం కాదు, ఇక్కడి ఏ క్షేమమూ మన కొరకు క్షేమం కాదు.

- ❖ మనం ప్రపంచ భాషలన్నింటిలో ఖుర్‌ఆన్‌ను ప్రామాణికంగా అనువదించాలి.
- ❖ దైవప్రవక్తపై, ప్రవక్త ప్రియ సహచరుల జీవితాలపై నూతన శైలిలో పుస్తకాలను సంకలనం చేసి, వాటిని ప్రపంచ ప్రజలందరికీ అందజేయాలి.
- ❖ ప్రవక్త ప్రవచనాల (హదీసుల) తర్జుమాలు ప్రపంచంలోని అన్ని భాషలలో తయారుచేయాలి.
- ❖ ఇస్లామ్ చరిత్రను (విజయాల చరిత్ర కాదు) సంకలనం చేసి ప్రచురించాలి.
- ❖ వాడుక భాషలో, వ్యవహార శైలిలో ఇస్లామ్‌ను ప్రమాణబద్ధంగా ప్రజెంట్ చేయాలి.
- ❖ దైవసందేశాన్ని ప్రభావవంతమైన రీతిలో ప్రజలకు చేరవేసే ప్రక్రియలో అవసరమయిన క్రియాత్మక ఉపాయాలను అనుసరించాలి.

మరి ఈ కార్యం సాధారణ పరిభాషలో కేవలం ప్రసంగాల, వ్యాస రచనల కార్యం కాదు. పైగా ఇది దేవుని పక్షాన ప్రాతినిధ్యం వహించే కార్యం. అది ఒక దాయి నుంచి వాంఛించే వాటన్నింటినీ పుణికిపుచ్చుకోవాలి. ఒక సర్కారీ ఫర్మానాను చేయడానికి ప్రభుత్వ ప్రతినిధి ఎలా గంభీరంగా ఉంటాడో, సీరియస్‌గా ఉంటాడో అలాగే మనం సిన్సియర్‌గా, గంభీరంగా ఉండాలి. మనం సందేశం చేరవేస్తున్నప్పుడు మన మాటల్లో, హావభావాల్లో ఎదుటివారి పట్ల శ్రేయోభిలాష ఉట్టిపడుతూ ఉండాలి. నరకం గురించి మనం ఇతరులకు భయపెడుతున్నప్పుడు ఆ భయంకర సన్నివేశానికి

మనం నిలువెల్లా భీతితో కంపిస్తూ ఉండాలి. ఎదుటివారికి స్వర్గలోక శుభవార్తను వినిపిస్తున్నప్పుడు, మనం స్వయంగా దానిని ఎంతగా ఆశిస్తున్నామో మన మాటల ద్వారా వ్యక్తం కావాలి. ఇది గనక లేకపోతే మీ సందేశ పరిచయ కార్యం హాస్యాస్పదం అయిపోతుంది. వినేవారెవ్వరూ దీనిపై గంభీరంగా ఆలోచించరు.

మన ఆధునిక చరిత్ర (గతం)ను తరచిచూస్తే ... గత రెండు వందల ఏండ్ల వ్యవధిలో యావత్ప్రపంచంలో పెద్ద పెద్ద ఉద్యమాలు ఉద్భవించాయి. పనిచేసే అవకాశాలు కూడా వాటికి విరివిగా లభించాయి. కాని వారి కృషి ఏ మేరకు ఫలించిందని ప్రశ్నించుకుంటే సమాధానం శూన్యమే. వారికి తమ కార్యక్రమాలను అమలుపరచడానికి ఎన్నో అవకాశాలు, ఒనరులు లభ్యమయ్యాయి. వారి ప్రతిభా సామర్థ్యాలు, చిత్తశుద్ధి, వ్యక్తిత్వాలు, త్యాగాలు, వారి కేడర్, అర్థబలం – ఇలా ఏ విధంగా చూసినా వారికి ఏ లోటూ లేదు. కాని వారు అహోరాత్రులు సాధన చేసినప్పటికీ మిల్లత్ పయన బృందాన్ని వెనక్కి నెట్టడం తప్ప పురోగతి ఏమీ కనిపించదు.

ఎవరయితే దైవాన్ని నమ్మరో, ఆయన్ని నిత్య సజీవునిగా అంగీకరించరో, వారు ఈ వ్యవహారానికి తమ కాల్పనిక వివరణలు ఇచ్చుకుంటారు. కాని, దైవంపై గల విశ్వాసం (ఈమాన్) వాంఛించేదేమిటంటే, ఈ వ్యవహారాన్నంతటినీ దైవ సంప్రదాయానికి కట్టుబడి ఆలోచించాలి, అర్థం చేసుకోవాలి. దీనిని ప్రత్యక్షంగా దైవ వ్యవహారంగా ఖరారు చేయాలి.

ఈ రకంగా ఆలోచిస్తే, ఈ విషయంలో ఖుర్ఆన్‌ను మార్గదర్శకంగా చేసుకుంటే అవగతమయ్యేదేమిటంటే, మన ఉద్యమాల వైఫల్యానికి మూల కారణం దైవ సహాయానికి నోచుకోగల దిశలో పనిచేయకపోవటమే. తన సహాయం కొరకు దేవుడు ఏ సామూహిక కార్యంతో షరతు విధించాడో దానిని మన ఉద్యమాల సారథులు విస్మరించారు. మనం ఆయనకు సహాయపడినట్లయితే మనకు సహాయపడతానని దేవుడు షరతు పెట్టాడు. అంటే దేవుని సృష్టి ప్రణాళిక గురించి దైవదాసులకు సావధానపరచాలి. ఈ పనిలో మనం దైవప్రణాళికలో మమేకం కావాలి. మన ఉద్యమం ప్రాపంచిక హక్కుల, నిరసనల కొరకు కాకుండా భయబోధకు ఉద్దేశించిన ఉద్యమం అయి ఉండాలి. మనం ఇతరులకు ప్రతిగా సందేశ ప్రధానమైన ఉద్యమం లేవనెత్తాలి, రాజకీయ ఆర్థిక ప్రధానమైన ఉద్యమం కాదు.


ఈ విషయమే ప్రస్తుత కాలంలో మన ప్రయత్నాలన్నింటినీ **'హబితత్**


**ఆమాలుహుమ్'** (కర్మలు నిష్ఫలం అయ్యాయి) అన్న వాక్యాన్ని సార్థకం చేశాయి. మనం ప్రపంచ రాజకీయాల కోసం ఉద్యమించాము. అందుకే మనకు ఊర్ధ్వలోకాల నుండి సహాయం అందలేకపోయింది. ఇప్పటికయినా మనల్ని మనం వినాశనం నుండి కాపాడదలచుకుంటే ప్రపంచజాతుల సమక్షంలో సందేశదాతలుగా నిలబడాలి. రాజకీయ ఆర్థిక సంఘర్షణలను పరిత్యజించి స్వర్గ – నరకాలను అసలు సమస్యలుగా చేసుకోవాలి. వాటి గురించి ప్రజలకు సావధానపరచాలి. దైవ సహాయానికి నోచుకోగలిగే ఏకైక మార్గం ఇదే. దైవ సహాయం అందనంత వరకూ మనకు ఎటువంటి విజయం లభించదు – ఇహలోకంలో గానీ, పరలోకంలోగాని.


ఖుర్ఆన్ చెప్పే దాని ప్రకారం ఇస్లామ్ అనుయాయుల ఉన్నతి ఒక దైవకానుక. కానుక లేక పురస్కారం అనేది ఏదేని కార్యానికి గాను ప్రదానం చేయబడుతుంది. మరి ముస్లిములను ఈ పురస్కారానికి అర్హులుగా చేసే వస్తువు ఏది? అంటే ముస్లిమ్ సముదాయం ప్రభవింపజేయటం వెనుక ఉన్న ఉద్దేశ్యమే. అంటే ప్రపంచ ప్రజల సమక్షంలో సత్యసాక్ష్యం ఇవ్వటం! దైవ ప్రసన్నత ఎందులో ఉందో మానవాళికి ఎరుకపరచటం!! మనం గనక చేయవలసిన ఈ పనిని చేయకపోతే, మరే ఇతర కార్యం కూడా మనల్ని పురస్కారానికి పాత్రులుగా నిలబెట్టదు. ఇతరత్రా కార్యాలు (లేక గొడవలు) శిక్షకు పాత్రులుగా చేస్తాయే తప్ప బహుమతికి అర్హులుగా చేయవు.


*–ః సమాప్తం ః–*

ఒక్క మాటలో చెప్పాలంటే మీ ముందున్న ఈ పుస్తకంలోని ప్రధానాంశం ఆదునిక శైలిలో ఇస్లామ్ పరిచయం. ఇస్లామ్ ఒక శాశ్వత యథార్థం. ఇందులో ఎప్పటికీ ఎలాంటి మార్పు ఉండబోదు. కాని కాలం మారుతూ ఉంటుంది. కాలపు వ్యవహార శైలిలో ఇస్లామ్ శాశ్వత యథార్థలను విశదీకరించవలసిన ఆవశ్యకత అన్ని కాలాల్లో ఉంటుంది. ప్రజలను ఆలోచింపజేయడానికి ఇది అవసరం. ఇస్లామీయ సందేశ పరిచయం, మిల్లత్ నిర్మాణం విషయం కూడా ఇంతే. నేడు ఇస్లామ్ పరిచయ కార్యం ఏ రీతిలో జరగాలి, మిల్లత్ నిర్మాణ కార్యం ఎలా విజయవంతం అవుతుంది అనే విషయాన్ని ఈ పుస్తకంలో వివరించే ప్రయత్నం చేయటం జరిగింది.










GOODWORD
info@goodwordbooks.com
www.goodwordbooks.com

CPS International
centre for peace & spirituality
info@cpsglobal.org
www.cpsglobal.org